# ఇంటర్మీడియట్ - రెండవ సంవత్సరం

ద్వితీయ భాష : భాగం - II

# తెలుగు

## జ్ఞానపీఠం

పాఠ్యపుస్తకం

## నందిని

ఉపవాచకం

ఇంటర్మీడియట్ విద్యామండలి, ఆంధ్రప్రదేశ్
తెలుగు & సంస్కృత అకాడమి, ఆంధ్రప్రదేశ్

**Intermediate**
Second Year Text Book

**తెలుగు**

**Pages : xviii + 158 + iv**
© Board of Intermediate
**Andhra Pradesh.**
**Reprint**
2023

**Copies : 5,000**

- Published by Telugu and Sanskrit Akademi, Andhra Pradesh under the Centrally Sponsored Scheme of Production of Books and Literature in Regional Languages at the University level of the Government of India in the Ministry of Human Resource Development, New Delhi.
- All rights whatsoever in this book are strictly reserved and no portion of it may be reproduced by any process for any purpose without the written permission and prescribed by Board of Intermediate Education A.P. Vijayawada of the Copyright Owners.
Published, Printed & Distributed by
**Telugu and Sanskrit Akademi, A.P.**

Rate **: 87.00**

---

Printed in India

Laser Typeset by : **P.V. Ramana Murthy,** Rajamahendravaram

*Published and Printed by*

**GBR Offset Printers and Publishers**
Surampalli, Krishna Dist.

on behalf of **Telugu and Sanskrit Akademi**, Andhra Pradesh



**Y.S. JAGAN MOHAN REDDY**

**AMARAVATI**

**CHIEF MINISTER**
**ANDHRA PRADESH**

**తెలుగు & సంస్కృత అకాడమికి అభినందనలు...**

చదువే నిజమైన ఆస్తి. చదువు ఎవరూ ఎత్తుకుపోలేని సంపద. ఇప్పుడు బడుల్లో, కాలేజీల్లో చదువుతున్న పిల్లలు ఆ చదువుల పునాదులమీదే తమ భవిష్యత్తును నిర్మించుకుంటారు. ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిపోతున్న ఈ రోజుల్లో, ఈ తరం పిల్లలు ఎదిగాక ఏకంగా ప్రపంచంతోనే పోటీపడాల్సి ఉంటుంది. ఈ తరం పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మంచి చదువు, మంచి గురువులు, మంచి విద్యా విధానం ఎంతో ముఖ్యం.

ఈ విషయాలన్నింటి మీదా శ్రద్ధ పెట్టిన మనందరి ప్రభుత్వం విద్యా విధానంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చింది. మరెన్నో మార్పులకు శ్రీకారం చుట్టింది. పిల్లల్ని చదివించే అమ్మలకు ప్రోత్సాహకంగా అమ్మ ఒడి, పెద్ద చదువులు చదువుకుంటున్న పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చే జగనన్న విద్యా దీవెన, పెద్ద చదువులు చదువుకుంటున్న పిల్లల బోర్డింగ్ లాడ్జింగ్ ఖర్చుల కోసం జగనన్న వసతి దీవెన, బడి పిల్లలకు కుట్టుకూలితో సహా మూడు జతల యూనిఫాంలు. స్కూల్ బ్యాగ్. టెక్స్ట్ పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, బెల్టు, షూస్, సాక్సులు ఇచ్చే జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం పథకం మెనూ మార్చి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలతో జగనన్న గోరుముద్ద; ఆరేళ్ళ లోపు పిల్లలకు పోషకాహారం అందిస్తూ, ఇంగ్లీష్ మీడియం ప్రీ ప్రైమరీ విద్య చెప్పించే విధంగా అంగన్‌వాడీల ఏర్పాటు; మొత్తంగా ప్రభుత్వ బడుల స్వరూపాన్నే మార్చేసే మనబడి నాడు–నేడు.... బడి పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్ తో కూడిన ఇంగ్లీష్ మీడియం చదువులు, తప్పనిసరి సబ్జెక్టుగా తెలుగులో విద్యా బోధన... ఇలా అనేక కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటితోపాటు అకాడమిని మళ్ళీ పునరుద్ధరించటం కూడా మనందరి ప్రభుత్వ హయాంలోనే జరిగింది.

అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 06.08.1968న తెలుగు అకాడమిని ప్రారంభించారు. తక్కువ కాలంలోనే అకాడమి ఆధ్వర్యంలో విస్తృతంగా పాఠ్య పుస్తకాలను, గ్రంథాలను ప్రచురించటం ద్వారా తెలుగు భాషాభివృద్ధికి, పోటీపరీక్షలకు, మానసిక–వ్యక్తిత్వ వికాసానికి అకాడమి ఎంతగానో కృషి చేసింది.

రాష్ట్ర విభజన తరవాత, అకాడమి నిర్లక్ష్యానికి గురి కావటంతో సంస్థ కార్యకలాపాలు మన రాష్ట్రంలో దాదాపు నిలిచిపోయాయి. మనందరి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యార్థులకు, ఉద్యోగార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తేవాలని సంస్కృత భాషను కూడా చేర్చి తిరుపతి ప్రధాన కేంద్రంగా తెలుగు & సంస్కృత అకాడమిని ఏర్పరచడం జరిగింది.

ఈ పరిణామాలన్నింటి తరవాత, 2021–22 విద్యా సంవత్సరం నుండి పాఠ్యపుస్తకాల ముద్రణతో మన అకాడమి కార్యకలాపాలను ప్రారంభిస్తున్నందుకు నా హృదయపూర్వక అభినందనలు. త్వరలోనే అకాడమి తన పూర్వవైభవాన్ని సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేస్తున్నాను.

వై.యస్. జగన్.

(వై.యస్.జగన్‌మోహన్ రెడ్డి)

## డా|| నందమూరి లక్ష్మీపార్వతి

ఎమ్.ఎ., ఎమ్.ఫిల్., పి.హెచ్.డి.

అధ్యక్షులు (కేబినెట్ మంత్రి హోదా)

**తెలుగు & సంస్కృత అకాడమి**

# తెలుగు & సంస్కృత అకాడమి అధ్యక్షుల వారి సందేశం

ఇంటర్మీడియట్ విద్యామండలి, ఉన్నత విద్యామండలి, ఎస్.సి.ఇ.ఆర్.టి. వారు రూపొందించే సిలబస్ ఆధారంగా వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి ఉన్నత ప్రమాణాలు కలిగిన ఆచార్యులను (Professors), శాఖాధిపతులను, అధ్యాపకులను రచయితలుగా, సంపాదకులుగా నియమించి వారిచే అత్యంత నాణ్యత ప్రమాణాలతో కూడిన పాఠ్యపుస్తకాలు రూపొందించి, అవసరమైన సంఖ్యలో, సకాలంలో ముద్రించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగాగల అకాడమి ప్రాంతీయ కేంద్రాల ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టడం జరుగుతోంది.

పైన తెలిపిన పాఠ్యపుస్తకాలతోపాటు మోనోగ్రాఫ్‌లు, నిఘంటువులు, మాండలికాలు, ప్రశ్నల నిధులు, సంప్రదింపు గ్రంథాలు, జనరంజక గ్రంథాలు, వ్యాసావళులు, భాషాశాస్త్ర గ్రంథాలు, పాఠశాలస్థాయి నిఘంటువులు, పదకోశాలు, పారిభాషిక పదకోశాలు వంటి పాఠ్యేతర గ్రంథాలు కూడా ఎప్పటికప్పుడు ఆధునికీకరించి, ముద్రించి విద్యార్థులకు అందుబాటులో ఉంచుతుంది.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారు నిర్వహించే పోటీ పరీక్షలకు, వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు అకాడమి ప్రచురణలలో ఉండే అంశాలనే ప్రామాణికమైన అంశాలుగా నిర్ణయిస్తారు. కాబట్టి విద్యార్థులంతా ఉన్నత ప్రమాణాలు కలిగిన అకాడమి పాఠ్యపుస్తకాలు వినియోగించుకొని మీ భవిష్యత్తు స్వర్ణమయం చేసుకోవాలని తెలుగు & సంస్కృత అకాడమి అధ్యక్షురాలిగా నేను కోరుకుంటున్నాను.

నందమూరి లక్ష్మీపార్వతి

నందమూరి లక్ష్మీపార్వతి

అధ్యక్షురాలు, తెలుగు & సంస్కృత అకాడమి, ఎ.పి.

**జె. శ్యామలరావు,** ఐ.ఎ.ఎస్.,
ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి

ఉన్నత విద్యాశాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

## సందేశం

తెలుగు మరియు సంస్కృత అకాడమి స్థాపించిన అతి తక్కువ కాలంలోనే విద్యార్థులకు కావలసిన పుస్తకాలు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో సకాలంలో ముద్రించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నందుకు మొదట తెలుగు మరియు సంస్కృత అకాడమికి శుభాభినందనలు తెలుపుతున్నాను.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని విద్యార్థులు మరియు పరీక్షార్థుల కోసం తెలుగు మరియు సంస్కృత అకాడమి ప్రశ్నలనిధులు, పాఠ్యపుస్తకాలు, పోటీ పరీక్షల గ్రంథాలు, సంప్రదింపు గ్రంథాలు, మోనోగ్రాఫులు, వ్యాసావళులు, అనువాదాలు సరళమైన భాషలో రూపొందించి అందుబాటులోకి తేవడం జరుగుతోంది.

తెలుగు మరియు సంస్కృత అకాడమి పాఠ్యపుస్తకాలలో పొందుపరచే సమాచారం అత్యంత ప్రామాణికమైంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యనభ్యసించే విద్యార్థులంతా తెలుగు మరియు సంస్కృత అకాడమి పుస్తకాలను వినియోగించుకొని తమ భవిష్యత్తును ఉజ్జ్వలంగా తీర్చిదిద్దుకోవలసిందిగా ఆకాంక్షిస్తున్నాను.

శ్యామలరావు
(శ్యామలరావు)

# భారత రాజ్యాంగ ప్రవేశిక

**భారతదేశ ప్రజలమైన మేముభారతదేశాన్ని**
**సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర**
రాజ్యముగ నిర్మించుకోవడానికి పౌరులందరికి
సాంఘిక, ఆర్థిక, రాజకీయ **న్యాయాన్ని**
ఆలోచన, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధనలలో **స్వేచ్ఛను**
అంతస్తు (హెూదా)లోను,అవకాశములోను **సమానత్వమును**
చేకూర్చుటకు మరియు వారందరిలో
వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను మరియు
అఖండతను తప్పక సంరక్షిస్తూ **సౌభ్రాతృత్వాన్ని**
పెంపొందించుటకు సత్యనిష్టాపూర్వకముగ తీర్మానించుకొని
**26 నవంబరు 1949న**
మన రాజ్యాంగపరిషత్తులో పరిగ్రహించి
శాసనంగా రూపొందించుకొన్న
ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము.

## ప్రధాన సంపాదకులు

**ఆచార్య మేడిపల్లి రవికుమార్**

శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

## సంపాదకులు

**డా॥ మన్యం నరసింహులు**

అసిస్టెంటు ప్రొఫెసరు, శాఖాధ్యక్షులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి

చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## సంపాదక సభ్యులు/రచయితలు

**డా॥ గోదావరి వెంకట మురళీమోహన్**

తెలుగు శాఖాధ్యక్షులు

ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)

శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్

**డా॥ అరవ సుబ్రమణ్యం రెడ్డి**

ఉపన్యాసకులు

ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)

చంద్రగిరి, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

## ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి సమన్వయ సంఘం

**శ్రీ ఎం. వి. శేషగిరిబాబు,** ఐ.ఏ.ఎస్.

**కార్యదర్శి**

ఇంటర్మీడియట్ విద్యామండలి, ఆంధ్రప్రదేశ్

## విద్యా విషయక పరిశోధన, శిక్షణ విభాగం (పాఠ్యపుస్తకాలు)

**డా. ఎ. శ్రీనివాసులు**

ప్రొఫెసర్

**శ్రీ ఎం. రవిశంకర్ నాయక్**

అసిస్టెంట్ ప్రొఫెసర్

**డా. ఎం. రమణారెడ్డి**

అసిస్టెంట్ ప్రొఫెసర్

**శ్రీ జె.వి. రమణ గుప్త**

అసిస్టెంట్ ప్రొఫెసర్

## తెలుగు & సంస్కృత అకాడమి సమన్వయ సంఘం

**శ్రీ వి.రామకృష్ణ,** ఐ.ఆర్.ఎస్.

సంచాలకులు

**డా॥ ఎం. కోటేశ్వరమ్మ,** ఎం.కాం. పిహెచ్.డి.

రీసెర్చ్ ఆఫీసర్

**డా॥ ఎస్.ఎ.టి. రాజ్యలక్ష్మి,** ఎం.ఎస్‌సి., బి.ఎడ్., ఎం.ఎ., పిహెచ్.డి

రీసెర్చ్ అసిస్టెంట్

**డా॥ కె.గ్లోరి సత్యవాణి,** ఎం.ఎస్‌సి., పిహెచ్.డి., ఎం.ఎడ్.

రీసెర్చ్ అసిస్టెంట్

# భూమిక

ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా మాతృభాష అయిన 'తెలుగు'ను ఎంపిక చేసుకున్న విద్యార్థులకు నా అభినందనలు.

మానవ పరిణామ క్రమంలో భాష పుట్టుక ఒక కీలకమైన ఘట్టం. ఒక మనిషి మరొక మనిషికి అర్థమయింది ఈ భాష మూలంగానే. భాష నుంచే సాహిత్యం అభివృద్ధి చెందింది. సమాజం సంస్కారవంతం కావడానికి ఈ సాహిత్యం గొప్ప ఉత్ప్రేరకంగా పని చేస్తుంది. సంస్కారం మూలంగా మానవ సంబంధాలు మెరుగుపడతాయి. ప్రపంచీకరణ పవనాలు నలుదిశలా అలుముకుంటున్న వర్తమాన కాలంలో మానవ సంబంధాల మనుగడ ప్రశ్నార్థకమౌతూ ఉంది. ఈ పరిస్థితుల్లో ఉత్తమ సాహిత్యాన్ని విద్యార్థి దశ నుంచే అధ్యయనం చేయవలసిన అవసరం పెరిగింది.

ఇందులోని పాఠ్యాంశాలన్నీ వైవిధ్యభరితమైనవి. అయినప్పటికీ మొత్తంగా చూసినప్పుడు ఒక సంపూర్ణత్వాన్ని కలిగి ఉంటాయి. ఇంటర్మీడియట్ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులు వేరువేరు కోర్సుల్లో చేరతారు. వేరువేరు విభాగాలలో స్థిరపడతారు. ఆయా రంగాలలో విజయాలు సాధించాలంటే సమాజం పట్ల మనిషికి సహానుభూతి కావాలి. అందుకు అనుగుణమైన పాఠ్యాంశాలను ఎంపికచేసి, శాస్త్రీయ పద్ధతులతో ఈ పాఠ్యపుస్తకాన్ని రూపొందించిన సంపాదక మండలిని అభినందిస్తున్నాను.

2021-22 విద్యాసంవత్సరం నుండి తెలుగు అకాడమి ద్వారా ఇంటర్మీడియట్ పుస్తకాలు ముద్రించడం అభినందనీయం. ఎంతో పేరున్న ఈ సంస్థకు సంచాలకులుగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను.


**శ్రీ వి. రామకృష్ణ,** ఐ.ఆర్.యస్.

సంచాలకులు, తెలుగు & సంస్కృత అకాడమి

ఆంధ్రప్రదేశ్

# విషయసూచిక

## పద్యభాగం


| | | | |
|---|---|---|---|
| 1. | సత్య ప్రాశస్త్యము | నన్నయ | 1-8 |
| 2. | శాంతి కాంక్ష | శ్రీనాథుడు | 9 - 15 |
| 3. | హనుమత్సందేశము | మొల్ల | 16 - 23 |
| 4. | కన్యక | గురజాడ వెంకట అప్పారావు | 24 - 31 |
| 5. | కర్మభూమిలో పూసిన ఓ పువ్వా...! | కలేకూరి ప్రసాద్ | 32 - 35 |
| 6. | ఈ దారి ఎక్కడికి పోతుంది? | అద్దేపల్లి రామ మోహనరావు | 36 - 40 |


## గద్యభాగం


| | | | |
|---|---|---|---|
| 1. | మన ఆటలు | మల్లంపల్లి సోమశేఖర శర్మ | 43 - 50 |
| 2. | అర్థ విపరిణామం | స్మార్తశ్రీ | 51 - 55 |
| 3. | చాటువులు | సి. నారాయణ రెడ్డి | 56 - 62 |
| 4. | వేమన కవిత్వం | రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ | 63 - 69 |
| 5. | నా జీవిత యాత్ర | రావూరి భరద్వాజ | 70 - 77 |
| 6. | జాతీయోద్యమ కవిత్వం | త్రిపురనేని మధుసూదనరావు | 78 - 86 |

## వ్యాకరణాంశాలు - నైపుణ్యాలు


| | | | |
|---|---|---|---|
| 1. | భాషా భాగాలు | | 89 - 91 |
| 2. | వాక్య విజ్ఞానం | | 92 - 94 |
| 3. | ఛందస్సు | | 95 - 103 |
| 4. | అలంకారాలు | | 104 - 110 |
| 5. | సంక్షిప్తీకరణ | | 111 - 113 |


## ఉపవాచకం - నందిని


| | | | |
|---|---|---|---|
| పరిచయం | | | 115 - 116 |
| 1. | గవేషణ | శ్రీ శ్రీ | 117 - 127 |
| 2. | తెరచిన కళ్ళు | ఆత్రేయ | 128 - 139 |
| 3. | ఆశ ఖరీదు అణా | గోరాశాస్త్రి | 140 - 155 |

మాదిరి ప్రశ్న పత్రం 156 - 158

# 1 సత్య ప్రాశస్త్యము



**- నన్నయ**

## కవి పరిచయం

ప్రస్తుత పాఠ్యభాగం కవిత్రయంలో ప్రథముడైన నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం చతుర్థాశ్వాసం నుండి గ్రహింపబడింది.

నన్నయ క్రీ.శ. 11వ శతాబ్దికి చెందిన కవి. చాళుక్య ప్రభువైన రాజ రాజ నరేంద్రుని ఆస్థాన కవి. ఆంధ్ర మహా భారతంలో ఆదిపర్వాన్ని, సభాపర్వాన్ని, అరణ్య పర్వంలో చతుర్థాశ్వాసంలో 142 పద్యాల వరకూ నన్నయ తెలుగులోకి అనుసృజన చేశాడు. మిగిలిన పర్వాలను తిక్కన, ఎర్రన పూర్తి చేశారు. ఈ ముప్వురినీ కలిపి కవిత్రయంగా వ్యవహరిస్తారు. ఆంధ్ర శబ్ద చింతామణి (తెలుగు వ్యాకరణ గ్రంథము), చాముండికా విలాసము, ఇంద్ర విజయము, లక్షణ సారము, రాఘవాభ్యుదయము అనేవి నన్నయ ఇతర గ్రంథాలు. నన్నయకు ఆదికవి, శబ్దశాసనుడు (వాగనుశాసనుడు) అనే బిరుదులు ఉన్నాయి.

భారతాన్ని తెనిగించడంలో నైతిక దృష్టి, కావ్య కళా దృష్టి కనిపిస్తాయి. వర్ణనా విధానంలో, రసపోషణలో, పాత్ర చిత్రణలో నన్నయ బాణీ ప్రత్యేకంగా కనిపిస్తుంది. తెలుగువారి సంప్రదాయం, తెలుగు వారి మనస్తత్వం ఉట్టిపడే విధంగా ప్రతిపాత్రనూ తీర్చిదిద్దాడు నన్నయ. కావ్య నిర్మాణ విషయంలో ఆదికవిగా నన్నయ ప్రదర్శించిన 'అధిక ధీయుక్తి' మొత్తం వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంపై ప్రభాత కిరణమై ప్రసరించింది.

## పాఠ్యభాగ సందర్భం

వైశంపాయన మహర్షి పరీక్షిత్తు కుమారుడైన జనమేజయునికి మహా భారత కథను సవిస్తరంగా చెప్పాడు. ఆ సందర్భంలో యయాతి మహారాజు కుమారుడైన పూరుని వంశక్రమాన్ని వివరించాడు. ఆ వంశానికి చెందిన మహారాజు ఇలిలుడు. ఇతని కుమారుడు దుష్యంతుడు. దుష్యంతుడి తల్లి రథంతరి. దుష్యంతుడు చిన్నతనం నుండి బల పరాక్రమాలు కలిగినవాడు. పులులు, సింహాలు, శరభ మృగాల వంటి అనేక క్రూర మృగాలను వేటాడేవాడు. ఒకనాడు ఒక దుర్గమ అరణ్యానికి వేటకు బయలుదేరాడు. కొంతసేపటికి మాలిని అనే పవిత్రమైన నది ఒడ్డుకు చేరుకున్నాడు. ఆ నదికి ఆవలివైపు ఒక ప్రశాంతమైన తపోవనం ఉంది. అక్కడ ఒక అద్భుతమైన ఋష్యాశ్రమాన్ని చూశాడు. ఆ ఆశ్రమం కణ్వ మహర్షిదని తెలిసికొన్నాడు. కశ్యప ప్రజాపతి వంశజుడు, భూత

భవిష్యత్ వర్తమానాలను తెలియగల మహర్షి కణ్వుడు. ఆ మహర్షికి నమస్కరించి వస్తానని తమతో వచ్చిన భటులకు చెప్పి ముందుకు సాగాడు. అక్కడ శకుంతలను చూశాడు. ఆమె తన వివరాలు చెప్పింది.

శకుంతలా దుష్యంతులు ఒకరిపట్ల ఒకరు అనురాగగ్రస్తులయ్యారు. దుష్యంతుడు ఆమెను వివాహమాడాలనే కోరిక వెలిబుచ్చాడు. శకుంతల అంగీకారం మేరకు ఆమెను దుష్యంతుడు గాంధర్వ వివాహం చేసుకున్నాడు. ఆమెతో ఇష్ట సుఖాలు అనుభవించి, 'నిన్ను నా రాజ్యానికి తీసుకురావడానికి మంత్రులను పంపుతాను' అని చెప్పి, ఆమెను సమాధాన పరచి, తనరాజ్యానికి వెళ్ళిపోయాడు.

జరిగిన విషయాన్ని గ్రహించిన కణ్వమహర్షి ఆమెను దీవించాడు. కొంతకాలానికి శకుంతల భరతునికి జన్మనిచ్చింది. స్త్రీలు సుదీర్ఘకాలం పుట్టినింట్లో ఉండడం తగదనీ, ఇల్లాళ్ళు భర్తల దగ్గరే ఉండడం ధర్మమనీ చెప్పి; తన శిష్యులను తోడిచ్చి, శకుంతలను దుష్యంతుని వద్దకు పంపించాడు కణ్వుడు.

శకుంతల దుష్యంతుని సముఖానికి చేరింది. తానెవరో తెలియనట్టుగా ప్రవర్తిస్తున్న దుష్యంతునికి గతాన్ని గుర్తు చేసింది. 'నీవెవరివో తెలియదనీ, ఎక్కడినుండి వచ్చావో అక్కడికే వెళ్ళమనీ' దుష్యంతుడు పలికాడు. అతని మాటలకు శకుంతల తెల్లబోయింది. దుఃఖంతో, కోపంతో ఎర్రబారిన ఆమె కన్నులనుండి కన్నీరు స్రవించింది. తన మనోవేదనను అణచుకొంది. తిరిగి తనభర్త అయిన దుష్యంతునితో మాట్లాడటానికి ఉపక్రమిస్తుంది. ఆ సందర్భంలో ఈ పాఠ్యభాగం ప్రారంభమౌతుంది.

## పాఠ్యభాగ సంగ్రహం

శకుంతల దుష్యంతునితో ఇలా అంటున్నది: 'ఓ రాజా! అన్నీ తెలిసికూడా ఏమీ తెలియని వాడిలాగా ఎందుకు మాట్లాడుతావు? ధర్మాత్ములైనవారు అబద్ధాలు ఆడవచ్చా? మానవుడు చేసే పనులను పంచ భూతాల వంటివన్నీ చూస్తూ ఉంటాయి. గుణవంతురాలైన భార్యను తిరస్కరిస్తే ఇహ పరాలు రెండూ ఉండవు. గృహస్థ ధర్మం చాలా గొప్పది. ఆ ధర్మానికి కేంద్రబిందువైన గృహిణి గొప్పతనాన్ని తెలుసుకో. పుత్రుడు పురుషునికి ప్రతిబింబమే. లోకంలో జీవులకు హాయినిచ్చేది పుత్రుని ఆలింగన సౌఖ్యమే. సత్యవాక్య ప్రాధాన్యం, ఫలితం చాలా గొప్పవి. పుట్టిననాడే తల్లిదండ్రులకు దూరమయ్యాను. ఇప్పుడు భర్తచేత తిరస్కరించబడ్డాను. ఇటువంటి కొరనోములే నోచాను కాబోలు' అంటూ శకుంతల బాధపడి వెనుతిరుగుతున్న సమయంలో దివ్యవాణి 'ఈ సాధ్వియైన శకుంతల చెప్పింది సత్యమే! ఈ కుమారుడు నీకు పుట్టినవాడే. వారిని స్వీకరించు' అని పలికింది. దివ్యవాణి మాటలువిని దుష్యంతుడు శకుంతలనూ, భరతుణ్ణీ స్వీకరించాడు. తదనంతరం భరతుడు అపారమైన సామ్రాజ్య భారాన్ని వహించాడు. దుష్యంతుడు చాలాకాలం రాజ్యసుఖాలను అనుభవించిన తర్వాత తపోభూమికి వెళ్లాడు.

మానవ జీవితంలో సత్యం యొక్క ప్రాశస్త్యం, గృహస్థ ధర్మ ప్రాధాన్యం, ఆ ధర్మానికి కేంద్రమైన గృహిణి ప్రాముఖ్యం, తండ్రీకొడుకుల అనుబంధం, స్త్రీ చైతన్యం విద్యార్థులకు తెలియజేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

ఆ. ఏల యెఱుక లేని యితరులయట్ల నీ
వెఱుఁగ ననుచుఁబలికె దెఱిఁగి యెఱిఁగి
యేన కాని దీని నెఱుఁగ రిందొరు లని
తప్పఁ బలుక నగునె ధార్మికులకు 1

*చ. విమలయశోనిధీ! పురుషవృత్త మెఱుంగుచునుండుఁ జూవె వే
దములును బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా
ర్థములివి యుండఁగా నరుఁడు దక్కొననేర్చునె తన్ను ముచ్చిలన్ 2

క. నా యెఱిఁగినట్ల యన్నియు
నీ యిచ్చినవరము ధారుణీవర! యెఱుఁగున్
నా యందుఁ దొంటియట్టుల
చేయు మనుగ్రహ మవజ్ఞ సేయందగునే 3

*క. సతియును గుణవతియుఁ బ్రజా
వతియు ననువ్రతయునైన వనిత నవజ్ఞా
న్వితదృష్టిఁ జూచునతి **దు**
**ర్మతి కిహముం బరముఁ గలదె మతిఁబరికింపన్** 4

క. సంతత గృహమేధిఫలం
బంతయుఁ బడయంగనోపు ననుగుణ భార్యా
వంతుండగువాఁడు క్రియా
వంతుఁడుఁ దాంతుండు బుత్త్రవంతుండు నగున్ 5

వ. మఱియును 6

సీ. ధర్మార్థకామసాధన కుపకరణంబు
గృహనీతివిద్యకు గృహము విమల
చారిత్రశిక్ష కాచార్యకం బన్వయ
స్థితికి మూలంబు సద్గతికి నూఁత
గౌరవంబున కేకకారణం బున్నత
స్థిరగుణమణుల కాకరము హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ
చూవెభర్తకు నొండ్లుగావు ప్రియము

ఆ. లెట్టి ఘట్టములను నెట్టి యాపదలను
నెట్టి తీఱములను ముట్టఁబడిన
వంతలెల్లఁ బాయు నింతులఁ బ్రజలను
నొనరఁజూడఁగనిన జనుల కెందు 7

వ. మఱియు భార్య పురుషునం దర్ధం బగుటంజేసి పురుషునకు మున్న పరేత యైన పతివ్రత పరలోకంబునం దన పురుషుం గూడఁ దదాగమనంబు ప్రతీక్షించుచుండు బురుషుండు మున్న పరేతుండైనఁ బదంపడి తానును బరేతయై తన పురుషుంగూడ నరుగునట్టి భార్య నవమానించుట ధర్మవిరోధంబు, మఱియునుం బురుషుండు భార్యయందుఁ బ్రవేశించి గర్భంబునఁ బుత్త్రుండై తాన యుద్భవిల్లుఁ గావున 'నజ్గా దజ్గా త్సమ్భవసి' యనునిది యాదిగాఁగల వేదవచనంబుల యందును జనకుండును బుత్త్రుండును ననుభేదంబు లేదు. 8

క. విను గార్హపత్యమను న
య్యనలము విహరింపఁబడి తదాహవనీయం
బున వెలుఁగునట్ల వెలుఁగును
జనకుఁడు దాఁబుత్త్రుఁడై నిజద్యుతితోడన్ 9

క. తాన తననీడ నీళ్లల
లో నేర్పడఁ జూచునట్లు లోకస్తుత! త
త్సూను జనకుండు సూచి మ
హానందముఁ బొందు నతిశయ ప్రీతిమెయిన్ 10

వ. 'పున్నామ్నో నరకాత్త్రాయత ఇతిపుత్త్ర' యను వేద వచనంబు గలదుఁ గావునఁ
బుణ్యాచారుండయిన పుత్త్రుండుభయపక్షంబులవారి నుద్ధరించుఁ; గావున 11

క. నీ పుణ్య తనువువలనన
యీ పుత్త్రకుఁడుద్భవిల్లి యెంతయు నొప్పున్
దీపంబు వలన నొండొక
దీపము ప్రభవించినట్లు తేజం బెసఁగన్ 12

*మ. విపరీత ప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీ పుత్త్ర గా
త్ర పరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్ర పరాగప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం బుత్త్ర గా
త్ర పరిష్వంగమునట్లు **జీవులకు హృద్యంబే కడున్ శీతమే** 13

క. అనఘుఁడు వంశకరుండై
పెనుపున నీసుతుఁడు వాజపేయంబులు నూ
ఱొనరించు నని సరస్వతి
వినిచె మునులు వినఁగ నాకు వినువీథి దెసన్ 14

క. భూరిగుణ నిట్టి కుల వి
స్తారకు దారకు నుదార ధర్మప్రియ ని
ష్కారణమ తప్పఁ జూడఁగ
సారమతీ! చనునె నాఁటిసత్యము గలుగన్ 15

*చ. నుతజలపూరితంబులగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలు; మఱి బావులు నూఱిటికంటె నొక్క స
త్క్రతువది మేలు; తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబుకంటె **నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్** 16

*క. వెలయంగ నశ్వమేధం
బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం
దుల నిడి తూఁపఁగ సత్యము
వలనన ములు సూపు గౌరవంబున పేర్మిన్ 17

తే. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుఁ గావు
ఎఱుఁగు మెల్లధర్మంబుల కెందుఁ బెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు 18

క. కావున సత్యము మిక్కిలి
గా విమల ప్రతిభఁ దలఁచి కణ్వాశ్రమ సం
భావిత సమయస్థితి దయఁ
గావింపుము; గొడుకుఁజూడు కరుణాదృష్టిన్ 19

క. క్షత్త్రవరుఁడైన విశ్వా
మిత్త్రునకుఁ బవిత్రయైన మేనకకున్ స
త్పుత్త్రినయి బొంకువలుకఁగ
ధాత్త్రీతల నాథ! యంత ధర్మేతరనే? 20

వ. అనిన శకుంతల పలుకులు సేకొన నొల్లక దుష్యంతుం డిట్లనియె 21

క. ఏ నెట? నీ వెట? సుతుఁడెట?
యే నెన్నఁడుఁ దొల్లి చూచియెఱుఁగను నిన్నున్;
మానినులసత్య వచనలు
నా **నిట్టు లసత్యభాషణం బుచితంబే?** 22

క. పొడువునఁ బ్రాయంబునఁ గడుఁ,
గడిఁది బలంబునను జూడఁగా నసదృశు నీ
కొడుకని యీతని నెంతయు
నెడమడుగుగఁ జూపఁ దెత్తె యిందఱు నగఁగన్ 23

వ. 'ఇట్టి లోకవిరుద్ధంబుల కే మోడుదు' మయుక్తంబు లయిన పలుకులు పలుకక నీ
యాశ్రమంబునకుం బొమ్మనిన శకుంతుల యత్యంత సంతాపితాంతః కరణయై. 24

*మధ్యా. 'తడయక పుట్టిననాఁడ తల్లిచేఁ దండ్రిచే విడువఁ
బడితి; నిప్పుడు పతిచేతను విడువఁబడియెదనొక్కొ!
నుడువులు వేయు నింకేల? యిప్పాటి నోములు దొల్లి
కడఁగి నోఁచితిని గాకేమి' యనుచును గందె డెందమున' 25

వ. ఇట్లు దద్దయు దుఃఖించి విగతాశయై బోరనఁ దొరఁగు బాష్పజలంబు లందంద యొత్తికొనుచు 'నింక దైవంబకాని యొండు శరణంబులే' దని యప్పరమ పతివ్రత తనయుం దోడ్కొని క్రమ్మఱి పోవనున్న యవసరంబున 26

*చ 'గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు సే
కొని భరియింపు మీతని శకుంతల సత్యము వల్కె సాధ్వి స
ద్వినుత మహాపతివ్రత వివేకముతో" నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయమందఁగఁ దత్సభాసదుల్ 27

వ. ఇట్లెల్లవారలకు నతిహర్షంబుగా శకుంతల పతివ్రతాత్వంబును సత్యంబును భరతోత్పత్తియుఁ బ్రశంసించు వేలుపుల పలుకులతివ్యక్తంబులయి యాకాశంబు వలన వీతెంచిన విని దుష్యంతుండు సభాసదులు విన నిట్లనియె 28

తే. ఏను నీ యింతియును గాని యెఱుఁగ రన్యు
లర్థిఁ గణ్వమహాముని యాశ్రమంబు
నందు గాంధర్వవిధి వివాహమునఁ గరము
నెమ్మిఁ జేసితి దీనిఁ బాణిగ్రహణము 29

తే. అన్యు లెఱుఁగమిఁ జేసి లోకాపవాద
భీతి నెఱిఁగియు నిత్తన్విఁ బ్రీతి దప్పి
యెఱుఁగ నంటిని నిందఱ కిప్పు డెఱుఁగఁ
జెప్పె నాకాశవాణి యచ్చెరువుగాఁగ 30

వ. అని మహానురాగంబునం గొడుకు నెత్తికొని, హర్షపులక లెసఁగ నాలింగనంబు సేసి, శకుంతలా మహాదేవి నతిప్రణయగౌరవంబున సంభావించి, యౌవరాజ్యంబునకు భరతు నభిషిక్తుంజేసి, పెద్దకాలంబు రాజ్య సుఖంబు లనుభవించి, తన రాజ్యభారంబంతయు భరతుం బూన్చి దుష్యంతుండు తపోవనంబున కరిగె. 31

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. గృహస్థ ధర్మం గొప్పతనాన్ని, గృహిణి ప్రాధాన్యాన్ని గురించి శకుంతల తెలిపిన తీరును వివరించండి.
2. సత్య ప్రాశస్త్యాన్ని గురించి శకుంతల ఏమని పలికింది ?

## II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. పురుషుని కార్యాలను ఎల్లప్పుడు చూసేవి ఏవి?
2. భార్యను ఎలా గౌరవించాలని శకుంతల పేర్కొంది?
3. సత్యవాక్యం వేటికంటే గొప్పది?
4. శకుంతల బాధపడిన విధమెట్టిది?

## III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. నన్నయకు గల బిరుదులేవి?
2. నన్నయ ఎవరి ఆస్థానకవి?
3. శకుంతలను పెంచిన తండ్రి ఎవరు?
4. శకుంతలను దుష్యంతుడు ఏ పద్ధతిలో వివాహం చేసుకున్నాడు?
5. శకుంతలకు,దుష్యంతునికీ జన్మించినదెవరు?
6. నన్నయ రచించిన వ్యాకరణ గ్రంథం పేరేమిటి?

## IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. దుర్మతి కిహముం బరముఁ గలదె
2. జీవులకు హృద్యంబె కదున్ శీతమే
3. ఒక సూనృత వాక్యము మేలు సూడఁగన్
4. ఇట్టులసత్య భాషణం బుచితంబె

## V. అలంకారాలు

1. 'దీపము వలన నొండొక దీపము ప్రభవించినట్లు...' అనే పద్యంలో ఉపమాలంకారం ఉంది.
2. 'సతియును గుణవతియుఁ...' అనే పద్యంలో వృత్త్యనుప్రాసాలంకారం ఉంది.

**కార్యాచరణ:** కవిత్రయం గురించి, మహాభారతము ప్రాముఖ్యం గురించి విద్యార్థులకు వివరించాలి.

**సూచన:** ప్రతిపదార్థ, తాత్పర్యాల కోసం వృత్తాలే కాకుండా, దేశీయ ఛందస్సుకు చెందినవి కూడా ఎంపిక చేయడమైంది. దేశీయ ఛందస్సు పట్ల కూడా విద్యార్థులకు అవగాహన పెంచడం, దేశీయ ఛందస్సుకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం ఈ మార్పు ఉద్దేశం.

* కార్యాచరణలు, సూచనల నుండి పరీక్షలలో ప్రశ్నలు ఉండవు.

❖ ❖ ❖

# 2 శాంతి కాంక్ష

- శ్రీనాథుడు



## కవి పరిచయం

ప్రస్తుత పాఠ్యభాగం శ్రీనాథుడు రచించిన 'పల్నాటి వీరచరిత్ర' అనే ద్విపద కావ్యం నుండి గ్రహించబడింది.

తెలుగులో పురాణ ప్రబంధ యుగాలకు వారధిగా నిలచిన మహాకవి శ్రీనాథుడు. ఇతడు క్రీ.శ. 15వ శతాబ్దికి చెందిన కవి. భీమాంబికా మారయల పుత్రుడు. చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడే 'మరుత్తరాట్చరిత్ర'ను రచించాడు. శాలివాహన సప్తశతి, శృంగార నైషధము, కాశీఖండము, భీమఖండము, హరవిలాసము, శివరాత్రి మాహాత్మ్యము, పల్నాటి వీరచరిత్ర మొదలైన కావ్యాలను రచించాడు.

శ్రీనాథుడు సకల విద్యా సనాథుడు. బ్రాహ్మీదత్త వరప్రసాదుడు. నిరంతర ఈశ్వరార్చనకళాశీలుడు. కొండవీటి రెడ్డిరాజుల ఆస్థాన కవి, విద్యాధికారి. ప్రౌఢ దేవరాయల సభలోని గౌడ డిండిమ భట్టును ఓడించి, కంచుఢక్కను పగులగొట్టించి, ముత్యాలశాలలో కనకాభిషేకం పొందిన మహాకవి. చరమ దశలో శ్రీనాథుని ఆదరించే రాజులు లేకపోవడం వలన కృష్ణాతీరంలో బొడ్డుపల్లె అనే గ్రామంలో పొలాన్ని కౌలుకు తీసుకొని జీవనం సాగిద్దామనుకున్నాడు. అయితే, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయాడు. శిస్తు కూడా చెల్లించలేక అనేక బాధలు అనుభవించినట్లు తెలుస్తుంది. శాశ్వతమైన సద్గ్రంథం రాయాలనే సంకల్పంతో శ్రీనాథుడు 'పల్నాటి వీరచరిత్ర' అనే ద్విపద కావ్యాన్ని రచిస్తున్నట్లు చెప్పుకున్నాడు. ఈ కావ్యాన్ని మాచెర్ల చెన్నకేశవస్వామికి అంకితమిచ్చాడు.

## పాఠ్యభాగ సందర్భం

12 వ శతాబ్దంలో తెలుగునాట పల్నాటిసీమలో జరిగిన చారిత్రకగాథ ఇది. మహా భారత కథతో సామ్యం ఉండటం వల్ల ఆంధ్ర భారతం అనీ, పల్నాటి వీర భారతం అనీ పల్నాటి వీర చరిత్రను అభివర్ణిస్తారు.

నాగమ్మ నలగామరాజు మంత్రి. నాయకురాలుగా ప్రసిద్ధి పొందింది. బ్రహ్మనాయుడు మలిదేవాదుల మంత్రి. బ్రహ్మనాయుడికి, నాగమ్మకు మధ్య పుట్టిన ఈర్ష్య, అసూయలే పల్నాటి మతద్వేషానికీ, యుద్ధానికీ దారితీశాయి. నాగమ్మకూ బ్రహ్మనాయుడికీ మధ్య జరిగిన కోడిపందెంలో బ్రహ్మనాయుడి కోడి ఓడిపోయింది. పందెం ఓడిపోయిన వారు ఐదు సంవత్సరాలు వనవాసం చేయాలి. ఒప్పందం ప్రకారం మలిదేవాదులు ఐదు

సంవత్సరాలు వనవాసానికి వెళ్ళారు. ఇక రెండేళ్ళలో వనవాసం పూర్తికావస్తోంది. కాబట్టి, మలిదేవాదులు రాజ్యభాగం కోసం అలరాజును నలగాముని దగ్గరకు రాయబారం పంపారు. రాయబారిగా వెళ్ళిన అలరాజు చంపబడ్డాడు. ఇది తెలిసి మలిదేవాదులు యుద్ధానికి సిద్ధమయ్యారు. కార్యమపూడి (కారెంపూడి) యుద్ధ భూమికి చేరుకున్నారు. చివరగా భట్టును నలగామరాజు దగ్గరకు రాయబారం పంపారు. భట్టు నలగామరాజు కొలువులో ప్రవేశించడంతో ఈ పాఠ్యభాగం ప్రారంభమౌతుంది.

## పాఠ్యభాగ సంగ్రహం

భట్టు గుర్రం మీద వచ్చి నలగామరాజు కొలువులో ప్రవేశించాడు. రాజును అనేక విధాలుగా కీర్తించాడు. తరువాత ఇలా అన్నాడు. "నా కంటే ముందు రాయబారిగా వచ్చిన అలరాజును అల్లుడని కూడా చూడకుండా చంపించారు. దీనితో కోపోద్రిక్తులైన మలిదేవాదులు సైన్యంతో కారెంపూడి చేరుకున్నారు. యుద్ధ సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ భూమి మీద పగను వృద్ధి పొందించే వారేకాని, అణచివేసేవారు లేరు. నరసింగరాజును తమ్ముడైన మలిదేవుని దగ్గరకు శాంతి దూతగా పంపండి. ఇరువురు ఏకమై రాజ్యపాలన చేయండి. పోరు మంచిది కాదు. పగ ఎక్కువైతే దేశం నాశనమవుతుంది. ప్రజలు నశిస్తారు. భాండాగారం ఖాళీ అవుతుంది. సైన్యం బలహీన పడుతుంది. జీతగాళ్ళు కోపించి, రావలసిన మొత్తం జీతాన్ని ఇవ్వమంటారు. రాజు, బంటు అనే హద్దులు నశిస్తాయి. ఇది ఎరిగిన శత్రువులు ధైర్యంతో దండెత్తి వస్తారు. పర తంత్ర జీవనం కష్టాలు వర్ణించడానికి శివునికైనా తరంకాదు. పంజరంలోని పక్షుల లాగా, పాములవాడు బుట్టలో బంధించిన పాములు లాగా, గంగిరెద్దులవాడు ముకుతాడు కుట్టి లొంగదీసుకొన్న పోటెద్దు లాగా, బోనులో బంధించబడిన పులుల లాగా స్వాతంత్ర్య హీనులు పడిఉండాలి.

మనో వాక్కాయాల్లో మనసు మొదటిది. మనసులో పుట్టిన మంచి తలపును ఆచరించకపోతే ఈ జీవితానికి సార్థకత లేదు. దానికంటే చావడం ఉత్తమం. ఎన్నో హీన జన్మల తర్వాత, చాలా వాటికి దుర్లభమైన మానవ జన్మ మనకు లభించింది. పగవారికి కూడా పారతంత్ర్యం రాకూడదు. మీరు ఉభయులు ఒక్కటై ఉంటే సకల కార్యాలు సమకూర్చుకోవచ్చు. కలహించుకొని కౌరవులంతా నాశనమయ్యారు కదా! కాబట్టి నేను మీకు ఈ విషయాలు తెలియజేశాను" అని భట్టు నలగామరాజుతో శాంతిని కాంక్షిస్తూ పలికాడు.

యుద్ధం మానవ జాతిని భక్షిస్తుందనీ, శాంతి సర్వమానవాళినీ రక్షిస్తుందనీ ఈ పాఠ్యభాగం ప్రబోధిస్తుంది. ఈ సార్వకాలీన సత్యాన్ని విద్యార్థులకు ఉద్బోధించడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

తురగంబుపైనెక్కి దుమికించికొనుచు
వచ్చికొల్వును జేరి వాజిని డిగ్గి
భూమీశునెదుటను బొందుగా నిలిచి
రాజాధిరాజ విరాజితకీర్తి
రాజవేశ్యావిట ప్రాభవప్రకట
గండరగండాంక ఘనదానచతుర
ధైర్యనిర్జిత మేరు ధరణీధరేంద్ర
శౌర్యవిక్రమకళా సంపూర్ణ చంద్ర
భాస్కర సమతేజ ప్రౌఢగుణాఢ్య
మానదుర్యోధన మైలమ్మసుతుడ
అనుగుభూపతిపుత్ర అంచితగాత్ర
వీరకామ నరేంద్ర విభవ దేవేంద్ర
రాయబారమునకు రాజుపంపించ
వచ్చిన అల్లుని వధియించినారు
మనసునక్రోధించి మలిదేవరాజు
తమ్ములుతానును దన బంధుజనులు
వీరనాయకతతి విఖ్యాతి మెరసి
ఖరదూషణాదులు గతమైనచోటు
శ్రీశైలభూమిలో శ్రేష్ఠమైనట్టి
కార్యమపురిభూమి ఘనపుణ్యరాశి
పటుతర విక్రమ వైభవంబలర
ధాటిమైనిల్చిరి దండుతో గూడ
అలరాజుతోడనే హతమౌదుమంచు
చలమున కోపంబు సంవృద్ధినొంద

వీరనాయకులును వేగిరపడగ
మలిదేవభూపతి మన్నించి యిటకు
నన్నుబుత్తెంచెను నరనాథ వినుము
పగవృద్ధిబొందించు భ్రష్టులెకాని
అడగించునేర్పరు లవనిలో లేరు
నరసింగభూమీశు నమ్మికమీరు
తమ్ముడామలిదేవధరణీశు కడకు
పంపుడి యేకమై పగలను నణచి
పలనాడు మొదలైన బహుభూములెల్ల
ఎదురెవ్వరునులేక యేలుడి సుఖిత
శృంగారయుతు నరసింగుభూమీశు
పంపుము మలిదేవపతి గలయంగ
**పోరుమంచిదిగాదు భూమి నెక్కడను**
పాడౌను దేశంబు పగమించెనేని
ప్రజలెల్ల నశియించి పారిపోవుదురు
బండారమునకును పైకంబులేదు
రాణువ అందుచే రహి చెడియుండు
చేజీతగాండ్లెల్ల జెలగికోపించి
యీగల జీతంబు లిమ్మందురపుడు
పతిబంటుమేరలు పరిహృతమగును
పంపినపని చేయ పాలుమాలుదురు
తెలిసినశాత్రవుల్ ధీరతతోడ
భూమిని గొనుటకు బుద్ధిపెట్టుదురు
పగవారి వార్తలు పరికింపలేరు
మేకొని మీలోనమీరు పోరాడ

చూచెడువారికి జులకనయౌను
కోరిశాత్రవులు మీగుట్టెఱుంగుదురు
పలువలు మిముజేరి పగజావనీక
చెప్పుచునుందురు చెనటివాక్యముల
ఐకమత్యముచెడు నద్దానితోడ
చెడును బలంబును చెడును భాగ్యంబు
చెడును యశంబును చెడును శౌర్యంబు
చెడును రాజ్యంబులు చెడ్డ పిమ్మటను
దేశంబు పరనృపాధీనమౌ సుమ్ము
పారతంత్ర్యంబు మీపై బడగలదు
పరతంత్రజనముల పాలికష్టములు
**చెప్పంగనలవియే శివునకునైన**
పంజరంబుననున్న పక్షులరీతి
బంధించిబుట్టలో పాములవాడు
వదలక పెట్టిన ఫణుల చందమున
గంగిరెద్దులవాఁడు కావరమణచి
ముకుదాడు పొడిచిన పోతెద్దులట్లు
బోనులోనుంచిన పులుల విధంబు
స్వాతంత్ర్యహీనతఁ బడియుండవలయు
పరికింపఁగా మనోవాక్కాయములను
ప్రథమమ్ముపట్టఁ గారానిదిగాన
వాక్కాయములురెండు బంధింపఁబడును
మనసులోఁబుట్టిన మంచి తలంపు
లాచరణమునందు అలవికాకున్న
జన్మఫలంబేమి చచ్చుటే మేలు

అవ్యక్తకీట తిర్యగనేక హీన
యోనులలో నెన్నియోమార్లు పుట్టి
పడయక పడయక పడసినయట్టి
దుర్లభ నరజన్మ దూషితంబగును
పార్థివా యిటువంటి పారతంత్ర్యంబు
కటకటా పగవారికైననువలదు
కుందబృందసితాబ్జ కుముదాప్తతార
హారడిండీర నీహార పటీర
ఘన మరాళంబుల కాంతినిమించు
సత్కీర్తివేగమే సరవినశించు
అపకీర్తి జగముల నధికమైయుండు
ఉభయవాదులు మీరలొక్కటైయున్న
**సకల కార్యంబుల సమకూర్పవచ్చు**
ప్రజలకు సుఖమౌను పంటలు పండు
ధనము సంపాదింప దగియుండునపుడు
సంపూర్ణకాములై సకల సేవకులు
కాపాడుదురుమిమ్ము కనిపెట్టియుండి
పరరాజులను గెల్వ పైకొనిపోయి
అమితమ్ముగాగ ధనాదులనెల్ల
కొనవచ్చు ధర్మముల్ కూర్పంగవచ్చు
సత్కీర్తిజగముల సాంద్రమైనిల్చు
కలహించి వెనుకటి **కౌరవులెల్ల**
**గతిచెడి పడినట్టి కష్టముల్ వినమె**
పగ పెరిగించుట భావ్యంబుగాదు
ఉభయవాదులు మీరలొక్కటికనుక
నయమొప్ప జెప్పితి నామాట వినుడి

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. భట్టు రాయబారానికి వచ్చిన కారణాన్ని వివరించండి.
2. 'శాంతి కాంక్ష' పాఠ్యభాగం సారాంశాన్ని వివరించండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. శ్రీనాథుని గురించి రాయండి.
2. భట్టు నలగామరాజును ఏమని స్తుతించాడు ?
3. స్వాతంత్ర్యహీనులు ఎలా ఉంటారని భట్టు తెలిపాడు ?
4. జన్మఫలం గురించి భట్టు ఏమని చెప్పాడు ?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'శాంతి కాంక్ష' పాఠ్యభాగం రచయిత ఎవరు?
2. శ్రీనాథునికి కనకాభిషేకం చేసిందెవరు?
3. నలగామ రాజు తల్లి పేరేమిటి?
4. రాయబారానికి వచ్చి వధించబడింది ఎవరు?
5. ఖరదూషణాదులు హతమైన చోటేది?
6. బ్రహ్మనాయుడు ఎవరి మంత్రి?
7. నాయకురాలుగా ప్రసిద్ధి పొందింది ఎవరు?
8. అన్ని జన్మలలో దుర్లభమైంది ఏది?

### IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. పోరు మంచిదిగాదు భూమినెక్కడను
2. చెప్పంగనలవియే శివునకునైన
3. సకల కార్యంబుల సమకూర్చవచ్చు
4. కౌరవులెల్ల గతిచెడి పడినట్టి కష్టముల్ వినమె

❖ ❖ ❖

3

# హనుమత్సందేశము



- మొల్ల

## కవయిత్రి పరిచయం

ప్రస్తుత పాఠ్యభాగం మొల్ల రచించిన 'రామాయణం'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

"తేనెసోఁక నోరు తీయనగు రీతితోడ నర్థమెల్ల" తోచేటట్టు తేట తెలుగు మాటలతో కూర్చిన రామాయణం ఇది. తెలుగు రామాయణాలన్నింటిలోకి బహుళజనాదరణ పొందేటట్లు తీర్చిన గొప్ప కవయిత్రి మొల్ల. ఈ కవయిత్రి పూర్తి పేరు ఆతుకూరి మొల్ల. ఈమె క్రీ.శ. 16వ శతాబ్దికి చెందినది. ఆతుకూరి కేసన ఈమె తండ్రి. మొల్ల గోపవరపు శ్రీకంఠమల్లేశు వరంచేత కవిత్వం చెప్పడం నేర్చుకుంది.

పోతనలాగ ఈమె కూడా 'పలికించెడివాడు రామభద్రుడే' అని చెప్పి, తన రామాయణాన్ని శ్రీరామ చంద్రునికే అంకితం చేసింది. అవతారికతో కలిసి యుద్ధకాండ వరకూ మొత్తం 869 గద్య పద్యాలు ఈ రామాయణంలో ఉన్నాయి. మొల్ల రామాయణం రాశిలో చిన్నదైనా వాసిలో మిన్న అయినది.

## పాఠ్యభాగ సందర్భం

సీతాదేవి, లక్ష్మణులతో కలసి శ్రీరామచంద్రుడు వనవాసం చేస్తున్నపుడు రావణుడు సీతను అపహరించాడు. రామునితో మిత్రత్వం నెరపిన సుగ్రీవుడు సీతాన్వేషణకై వానర వీరులను నలుదెసలకు పంపించాడు. దక్షిణ భాగాన్ని వెతుకుతున్న హనుమంతునికి, మిగిలిన కపివీరులకు జటాయువు మరియు అతని అన్న సంపాతి కనిపించి, సీత ఉనికిని తెలిపారు. హనుమ సాగరాన్ని లంఘించి, లంకలో సీతకోసం వెతుకుతున్నాడు. అప్పుడు రావణుడు సీత దగ్గరకు వచ్చి, దుష్ట సంభాషణ లాడాడు. సీతాదేవి వానిని దూషించి, రాముని గుణగణాలను ప్రశంసించింది. రావణుడు కుపితుడయ్యాడు. సీతకు గడువునిచ్చి వెళ్ళిపోయాడు. అక్కడ ఒకచెట్టుపై ఉన్న హనుమంతుడు సీతాదేవి ముందుకు వచ్చాడు. ఆమెకు రాముని క్షేమ సమాచారం చెప్పడంలో పాఠ్యభాగం ప్రారంభమవుతుంది.

## పాఠ్యభాగ సంగ్రహం

"ఓ భూమి పుత్రికా! శ్రీరాముడు కుశలంగా ఉన్నాడు. నిన్ను తీసుకొని పోవడానికి వానరులతో కలసి త్వరగా రానున్నాడు." అని హనుమంతుడు చెప్పాడు. సీతాదేవి ఇదికూడా దనుజ మాయేమోనని సంశయించింది.

దాన్ని గ్రహించిన హనుమ క్రిందకు దిగాడు. భక్తితో నమస్కరించి ఇంకా ఇలా పలికాడు. "తమ్మునితో కలసి శ్రీరాముడు మిమ్ములను వెతకడానికి వానరసైన్యాన్ని పంపించాడు. మమ్మల్ని దక్షిణ భాగం చూడుమని ఆదేశించాడు" అని పలికి, శ్రీరాముని ఉంగరాన్ని ఇచ్చాడు. ఆ ముద్రికను చూసి సీత సంతోషించింది. అయినా "నిన్ను విశ్వసించను. నీ గురించి, విభుని గురించి ఇంకా స్పష్టంగా తెలియ జెప్పు" అని హనుమతో అన్నది.

హనుమ వినయంగా అంత వరకూ జరిగిన విషయాలను సీతా దేవికి వివరించాడు. ఆమెకోరిక మేరకు శ్రీరాముని రూపగుణ వర్ణన చేశాడు. తాను దూతననీ, రిక్తహస్తాలతో తిరిగి వెళ్ళడం దూతకు ఉచితం కాదనీ, శిరోరత్నాన్ని దయచేయుమనీ ప్రార్థించాడు. 'నీ నిజరూపం చూడకుండా నేనారత్నాన్ని నీ కివ్వను' అని సీతాదేవి అనగానే హనుమంతుడు ఆకాశమంత ఎత్తుకు తన రూపాన్ని పెంచాడు. తిరిగి సూక్ష్మరూపానికి వచ్చేశాడు. సీతాదేవి సంతోషించి, తన శిరోరత్నాన్ని హనుమకు ఇచ్చింది. చిరంజీవిగా ఉండుమని దీవించింది. తన అవస్థలను శ్రీరామునికి తెలియజేయమని చెప్పింది. తాను గతంలో నిందించిన మాటలను మనసులో పెట్టుకోవద్దనీ, తనను కాపాడమని లక్ష్మణునికి చెప్పమన్నది.

శ్రీరాముని సందేశాన్ని హనుమ సీతాదేవితో చెప్పిన సందర్భంలో సమయస్ఫూర్తీ, సీత తన సందేశాన్ని హనుమతో చెప్పిన సందర్భంలో సీతారాముల పరస్పరానురాగం వ్యక్తమవుతాయి. హనుమంతుని సంభాషణలో అభివ్యక్తీకరణ నైపుణ్యం గొప్పగా ఆవిష్కరించబడింది. ఈ అభివ్యక్తీకరణ నైపుణ్యంతో పాటు; పరస్త్రీలతో పురుషులు, పరపురుషులతో స్త్రీలు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో వంటి నైతిక విలువలను విద్యార్థులకు తెలియ చేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

*క. ఉన్నాఁడు లెస్స రాఘవుఁ
దున్నాఁ డిదె కపులఁ గూడి, యురుగతి రానై
యున్నాఁడు, నిన్నుఁ గొని పో
నున్నాఁడిది నిజము నమ్ము ముర్వీ తనయా! 1

సీ. ఆ మాట లాలించి భూమిజ తనలోన
వెఱఁ గంది, శింశుపావృక్ష మరసి
చూడంగ, నప్పుడు సూక్ష్మరూపంబున
నొడికమౌ శాఖల నడుమ నున్న
కపి కుమారుని రూప మపురూపముగఁ జేసి

స్వాంతంబులోన హర్షంబు నొంది,
దనుజ మాయలచేతఁ దఱచు వేఁగుటఁ జేసి
మాఱాడ నేరక యూర కున్న

తే. భావ మూహించి, తన్ను నా దేవి యాత్మ
నమ్మకుండుట దెలిసి, యా కొమ్మమీఁది
నుండి క్రిందికి లంఘించి, నిండు భక్తి
మ్రొక్కి నిలుచుండి కరములు మోడ్చి పలికె 2

*ఉ. తమ్ముని గూడి పుణ్య గుణ ధాముఁడు, రాముఁడు వచ్చి మాల్యవం
తమ్మున సైన్య సంఘము ముదంబునఁ గొల్వఁగ నుండి, భూమిపై
మిమ్ములఁజూచి రండనుచు మేటి కపీంద్రులఁ బుచ్చి, యందు మొ
త్తమ్ముగ మమ్ముఁ గొందఱను దక్షిణ భాగము చూడఁ బంపుచున్ 3

క. అంగనఁ బొడఁగన నీ వి
య్యంగను గడుఁజాలువాఁడ వంచును, నాచే
నుంగర మంపెను శ్రీ రఘు
పుంగవుఁ, డిదె కొమ్మటంచు భూమిజకిచ్చెన్ 4

ఉ. ఇచ్చినఁ జూచి, రామ ధరణీశ్వరు ముద్రికగా నెఱిఁగి తా
నిచ్చను మెచ్చి యా కువలయేక్షణ యాత్మ గతంబునందు నీ
వచ్చినదాని భావమును, వల్లభు చందము నేర్పడంగ, నేఁ
జెచ్చెర నంతయుం దెలియఁ జెప్పుము నమ్మిక పుట్టునట్లుగన్ 5

వ. అని విచారించి యిట్లనియె: 6

క. నిను విశ్వసింపఁ జాలను,
వినుపింపుము నీ తెఱంగు, విభుని తెఱంగు
న్ననవుడుఁ బావని తెలియఁగ
వినయంబున విన్నవించె విస్ఫుట ఫణితిన్ 7

*ఉ. రాముని డాఁగురించి, నిను రావణుఁ డెత్తుక వచ్చువేళ, నీ
హేమ విభూష ణావళుల నేర్పడ ఋశ్య మహాద్రి వైచినన్
మే మవి తీసి దాఁచితిమి, మీ పతి యచ్చటి కేఁగుదేరఁగాఁ
దామరసాప్త నందనుఁడు తా నవి సూపినఁ జూచి మెచ్చుచున్ 8

సీ. అర్క సంభవునకు నభయంబు దయచేసి,
దుందుభి కాయమ్ముఁ దూలఁ దన్ని,
యేడు తాడుల సర్వ మేకమ్ముగాఁ ద్రుంచి,
వాలి నద్భుత శక్తిఁ గూల నేసి,
సుగ్రీవునకుఁ దార సుదతిగా నిప్పించి,
యంగదు యువరా జనంగ నిలిపి,
వారలతోడను వానర సైన్యంబు
లెన్నేని గొలువంగ నేఁగుదెంచి,

తే. మాల్యవంతంబునందుండి, మనుజ విభుఁడు
నిన్ను వెదకంగ నందఱ నన్ని దిశలఁ
బనుచునప్పుడు, దక్షిణ భాగ మరయ
నంగదునితోడఁ గొందఱ మరుగుదేర 9

తే. వారి పంపున నవలీల వార్ధి దాఁటి
వచ్చి సకలంబుఁ జూచి యీ వంకఁ గంటి
రావణుఁడు వచ్చి నిన్ను నుగ్రంబుగాఁగఁ
బలుకునప్పుడు నున్నాఁడఁ బాదపమున 10

వ. ఇవ్విధంబునఁ బలుకుచుండినను నమ్మక యతనిం గనుంగొని రాముఁడే రీతివాఁడో యతని
చందం బెఱింగింపు మనవుడావాయు నందనుండు, రఘునందనునకు వందనం బాచరించి,
భూమినందన కిట్లని చెప్పుచున్నాఁడు; 11

సీ. నీల మేఘచ్ఛాయఁ బోలు దేహమువాఁడు
ధవళాబ్జ పత్ర నేత్రములవాఁడు
కంబు సన్నిభమైన కంఠంబు గలఁవాఁడు
చక్కని పీన వక్షంబువాఁడు
తిన్ననై కనుపట్టు దీర్ఘ బాహులవాఁడు
ఘనమైన దుందుభి స్వనమువాఁడు
పద్మ రేఖలు గల్గు పద యుగంబులవాఁడు
బాగైన యట్టి గుల్ఫములవాఁడు

తే. కపట మెఱుఁగని సత్య వాక్యములవాఁడు
రమణి! రాముండు శుభ లక్షణములవాఁడు
ఇన్ని గుణముల రూపింప నెసఁగువాఁడు
**వరుస సౌమిత్రి బంగారు వన్నె వాఁడు** 12

*తే. ఉరుతరాటవిలోన మహోగ్రతపము
వాయు దేవుని గుఱియించి వరుసఁ జేసి
యంజనా దేవి గనియె నన్నర్థితోడ
నర్కజుని మంత్రి, హనుమంతుఁ డనెడువాఁడ, 13

వ. అని యిట్లు తాత్పర్యంబు పుట్టునట్లుగా విన్నవించి దేవీ! నీ దేవుండయిన శ్రీరాముండు నాచేతికిచ్చి యంపిన నూత్న రత్నాంగుళీయకంబు నీకు సమర్పించితి, నింక రిక్త హస్తంబులతోఁ జనుట దూతల కుచితమైన కార్యంబు గాదు. కావున నిన్ను దర్శించినందులకు శ్రీరామునకును నమ్మిక పుట్టునట్టులుగా నీ శిరోరత్నంబు నాకు దయ చేయవలయు ననుటయు నా కుశేశయనయన యిట్లనియె: 14

క. నా నాథు క్షేమ మంతయు
ధీనిధి! నీచేత వింటిఁ దెలియఁగ, నైనన్
నీ నిజ రూపము చూడక
నే నా రత్నంబు నమ్మి నీ కీయఁ జుమీ! 15

వ. అనుటయు నా హనుమంతుండు, 16

క. చుక్కలు తల పూవులుగా
నక్కజముగా మేను వెంచి యంబర వీథిన్
వెక్కసమై చూపట్టిన
నక్కోమలి ముదము నొందె నాత్మస్థితికిన్ 17

వ. ఇట్లు తన మహోన్నత రూపంబు చూపి యెప్పటియట్ల మరల సూక్ష్మ రూపంబు గైకొని నమస్కరించిన, నా హనుమంతునకు నద్దేవి తన శిరోరత్నంబు ననుగ్రహించి యిట్లనియె: 18

చ. రవి కుల వార్ధి చంద్రుఁడగు రాముని సేమము చాల వింటి, నా
వివిధము లైనపాట్లు పృథివీ పతికిం దగఁ జెప్పఁగల్గె నేఁ
దవిరళ భంగి నీ వలన, నచ్చుగ నే నుపకార మేమియుం
దవిలి మొనర్ప లేను **వసుధాస్థలి వర్ధిలు బ్రహ్మ కల్పముల్** 19

వ. ఇట్లు దీవించి, మఱియును, 20

క. ఏ యెడఁ జూచిన ధరణీ
నాయకు శ్రీపాద యుగము నా చిత్తములోఁ
బాయదని విన్న వింపుము
వాయు తనూభవుఁడ పుణ్యవంతుఁడ! తెలియన్ 21

తే. ఇపుడు రావణుఁ డేఁతెంచి కపట బుద్ధి
గర్వమునఁజేసి నన్నెన్ని కాఱులాడె
నన్నియును నీవు చెవులార విన్న తెఱఁగు
పతికి దయ పుట్టఁగా విన్నపంబు సేయు 22

సీ. నిడుద పెన్నెఱి వేణి జడలుగా సవరించి
మలిన జీర్ణాంబరం బొలియఁ గట్టి,
భూమి రజంబు విభూతి పూఁతగఁ బూసి
తన పతి మూర్తిఁ జిత్తమున నిల్పి,
నిరశన స్థితితోడ నిలిచి భూ శయ్యను
బవళించి నిదుర యేర్పడఁగ విడిచి
తారక బ్రహ్మ మంత్రంబుఁ బఠింపుచుఁ
గఠిన రాక్షస దుర్మృగములలోన

తే. సహిత లంకా మహా ద్వీప గహన సీమఁ
దపము సేయుచున్నాను తన్నుఁ గూర్చి,
నాకుఁ బ్రత్యక్ష మగు మని నాథునకును
**విన్నవింపుము సత్త్వ సంపన్న! నీవు** 23

వ. అని చెప్పి, మఱియును, 24

*చ. జనకుని భంగి రామ నృపచంద్రుని, నన్నును దల్లిమాఱుగాఁ
గని, కొలువంగ నేర్చు గుణ గణ్యుని, లక్ష్మణు నీతి పారగున్
వినఁ గన రాని పల్కు లవివేకముచేతను బల్కినట్టి యా
వినుత మహాఫలం బనుభవించితి నంచును జాటి చెప్పుమా 25

క. ఆ మాటలు మది నుంచక
నా మానముఁ గావు మనుచు నయ వినయ గుణో
ద్ధాముఁడు, రాముని తమ్ముఁడు
**సౌమిత్రికిఁ జెప్పవయ్య సాహసివర్యా!** 26

వ. అని యిట్లు జనకరాజ తనయ పలికిన పలుకు లాలకించి హనుమంతుడా
జననితో నిట్లనియె: 27

క. ఇనుఁ డుదయింపక మున్నే
వననిధి లంఘించి, మనుజ వల్లభుకడకున్
నినుఁ గొనిపోయెద, వీఁపున
జననీ విచ్చేయు మనిన, సంతోషమునన్ 28

క. నీ వంతవాఁడ వగుదువు,
నీ వెంటనే వత్తునేని నెగడవు కీర్తుల్
రావణుకంటెను మిక్కిలి
భూ వరుఁడే దొంగ యండ్రు బుధ నుత చరితా! 29

వ. అదియునుం గాక రామచంద్రునిం దప్ప నితరుల నంటుదానంగాను, గావున నీతో
రాఁదగదు మఱియును 30

క. దొంగిలి తెచ్చిన దైత్యుని
సంగడులగు వారి వారి సాహస మొప్పన్
సంగర ముఖమునఁ జంపక
**దొంగిలి కొనిపోవ దగునె దొరలకు నెందున్?** 31

వ. మఱియు రామచంద్రుండు త్రిజగదేక వీరుండును, గోదండ దీక్షా గురుండును, రాక్షస కులాంతకుండును నగుటం జేసి రాణివాస ద్రోహి యగు రావణుని సంగరంబునఁ బ్రఖ్యాతంబుగాఁ జంపి కొనిపోవుట ధర్మంబు; నీవు రామచంద్రునకుఁ బరమ భృత్యుండవును, బుత్ర సముండవును నగుటం జేసి, నీ వెంట నరుగు దెంచుట తప్పుగాక పోయినను, బగ తీర్పక వచ్చు టుచితంబు గాదు. కావున రాఘవేశ్వరుల కిన్నియుం దెలియ విన్నపంబు సేసి తడయక తోడ్కొని రమ్మనిన నద్దేవికి నమస్కరించి హనుమంతుండిట్లనియె; 32

ఉ. నీ విభుఁ డబ్ధి దాఁటి, ధరణీతల నాథులు సన్నుతింప, సు
గ్రీవ సుషేణ ముఖ్య బల బృందముతో నరుదెంచి, నీచునిన్
రావణు నాజిలోఁ దునిమి, రాజస మొప్పఁగ నిన్నుఁ గొంచు, సే
నావళి తోడ నీ పురికి నారయ నేఁగు నిజంబు నమ్ముమా! 33

వ. అని విన్నవించి నమ్రుండై యద్దేవిచేత దీవెనలు పొంది, మరలి చనుచున్నవాఁడై
తనరాక రావణున కెఱుంగఁ జేయవలయునని తలంచె. 34

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. సీతాదేవితో హనుమ ఏమని పలికాడు?
2. సీతాదేవి తన సందేశాన్ని హనుమతో ఏమని వివరించింది?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. శ్రీరాముని రూపాన్ని హనుమ ఏ విధంగా వర్ణించాడు?
2. శ్రీరాముని ముద్రికను చూసి సీత హనుమతో ఏమన్నది?
3. సీతాదేవి హనుమంతుని ఏమని దీవించింది?
4. మొల్లను గురించి రాయండి.
5. శ్రీరాముని వీరత్వాన్ని తెల్పండి.

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. మొల్ల తన రామాయణాన్ని ఎవరికి అంకితమిచ్చింది?
2. 'హనుమత్సందేశము' అనే పాఠ్యభాగం దేని నుండి గ్రహించబడింది?
3. 'అర్క సంభవుడు' అంటే ఎవరు?
4. రాముని గుర్తుగా సీతాదేవికివ్వడానికి హనుమంతుడు ఏమి తెచ్చాడు?
5. తన గుర్తుగా సీతాదేవి హనుమకు ఏమి ఇచ్చింది?
6. శ్రీరాముడు ఉన్న పర్వతం పేరేమిటి?
7. హనుమంతుని తల్లి పేరేమిటి?

### IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. వరుస సౌమిత్రి బంగారు వన్నెవాడు
2. వసుధాస్థలి వర్ధిలు బ్రహ్మకల్పముల్
3. విన్న వింపుము సత్వ సంపన్న! నీవు
4. సౌమిత్రికిఁ జెప్పవయ్య సాహసి వర్యా!
5. దొంగిలి కొనిపోవదగునె దొరలకు నెందున్?

### V. అలంకారాలు

1. 'నీలమేఘచ్ఛాయ బోలుదేహమువాడు' అనే పద్యంలో ... – స్వభావోక్తి అలంకారం ఉంది.
2. చుక్కలు తల పూవులుగా నక్కజముగ మేను వెంచి యంబర వీథిన్ – అతిశయోక్తి

❖ ❖ ❖

4

# కన్యక

**- గురజాడ వెంకట అప్పారావు**



## కవి పరిచయం

**న**వయుగ వైతాళికుడు, నవ్య కవిత్వానికి వేగుచుక్క గురజాడ వెంకట అప్పారావు. 'ఆధునిక మహిళలు చరిత్రను తిరిగి రచిస్తారు' అన్న దార్శనికుడు గురజాడ. ఈయన 21-09-1862 న జన్మించారు. తల్లిదండ్రులు కౌసల్యమ్మ, వెంకటరామదాసు. జన్మస్థలం విశాఖ జిల్లా, ఎలమంచిలి దగ్గరున్న రాయవరం. చీపురుపల్లి గ్రాంట్ స్కూల్‌లోనూ, విజయనగరం మాధ్యమిక పాఠశాలలోనూ గురజాడ విద్యనభ్యసించారు. 1882లో మెట్రిక్, ఆ తర్వాత ఎఫ్.ఎ చదివారు. 1884- 86 లో బి.ఎ. పూర్తి చేశారు. కాలేజీలో కొన్నాళ్ళు ఉద్యోగం చేసి, డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్ గుమస్తాగాను విజయనగరం ఆనందగజపతి సంస్థానంలో కొన్నాళ్ళు పరిశోధకుడిగానూ రాజావారి కళాశాలలో అధ్యాపకుడుగానూ పనిచేశారు. మద్రాసు యూనివర్శిటీ 'ఫెలో'గా కూడా గురజాడ నియమించబడ్డారు.

ఆధునిక తెలుగు సాహిత్యానికి గురుజాడగా నిలిచిన గురజాడ అనేక రచనలు చేశారు. భావ కవిత్వం ఒరవడిలో మాటల మబ్బులు, పుష్పలావికలు, మెరుపులు అనే ఖండకావ్యాలనూ; సుభద్ర అనే అసంపూర్ణ కావ్యాన్ని రాశారు. ఋతుశతకం, నీలగిరి పాటలు రచించారు. కన్యాశుల్కం, బిల్హణీయం, కొండుభట్టీయం అనేవి గురజాడ నాటకాలు. వీటిలో 'కన్యాశుల్కం' సుప్రసిద్ధం. దిద్దుబాటు, మీపేరేమిటి?, మెటిల్డా, పెద్ద మసీదు, సంస్కర్త హృదయం అనేవి గురజాడ కథానికలు. ఆధునికతను సంతరించుకొన్న కథానికగా గురజాడ 'దిద్దుబాటు'కు గొప్ప గుర్తింపు ఉంది. వాడుకభాషను అందలమెక్కించడానికి ప్రయత్నించిన గురజాడ 30-11-1915 న మరణించారు.

కర్ణాటక భాషలోని ఒక షట్పది, పారసీ భాషలోని ఒక గజల్, వృషభగతి రగడ మొదలైనవి గురజాడలో ఒక కొత్తలయకు స్ఫూర్తినిచ్చాయి. ఫలితంగా ముత్యాలసరాలు అనే మాత్రా ఛందస్సులో, కొత్త పాతల మేలుకలయికతో 'ముత్యాల సరాలు' కావ్యాన్ని కూర్చాడు. ముత్యాలసరాల సంపుటిలో దేశభక్తి, ముత్యాలసరాలు, కాసులు, లవణరాజుకల, పూర్ణమ్మ, కన్యక, మనిషి, దేశభక్తి వంటి ప్రసిద్ధ గేయ ఖండికలున్నాయి.

ప్రస్తుత పాఠ్యభాగం 'కన్యక' ముత్యాల సరాలు ఛందస్సులో తీర్చిదిద్దబడిందే. 1912 లో 'ఆంధ్ర భారతి' లో తొలిసారిగా ప్రచురించబడింది.

## పాఠ్యభాగ సంగ్రహం

కన్యక ఒక అవివాహిత. బాగా అలంకరించుకొని, చెలికత్తెలతో కలసి గుడికి బయలు దేరింది. వీధిలో పట్నమేలే రాజు చూసి ఆమె అందానికి మోహితుడయ్యాడు. చెరపట్టడానికి ప్రయత్నించాడు. అపుడు కన్యక దైవం మీద భారం వేసి, ధైర్యంతో 'దైవకార్యం తీర్చివస్తాను' అని రాజుతో చెప్పింది. ఇంతలో కన్యక తండ్రి రాజు ముందు కొచ్చి చేతులు జోడించి "నీవు బలవంతంగా తీసుకొని వెళ్ళనవసరం లేదు. కన్నె నీ సొత్తే. నీవు కోరుకోవడం కంటే మాకు అదృష్టం ఏముంది? అగ్ని సాక్షిగా పెండ్లాడి స్వీకరించుము" అని పలికాడు. అందుకు రాజు "పట్నమేలే రాచబిడ్డకు సెట్టి ధర్మ మార్గం చెప్పడమా! రాజు తలచిందే ధర్మం, రాజు చెప్పిందే చట్టం. ఆలస్యం చేయకుండా కన్నెనివ్వు ఇవ్వనన్నా నేను వదలను" అని అన్నాడు. గుడిలో వీరభద్రుడికి మొక్కు చెల్లించి వస్తామన్న కన్యక తండ్రితో 'సరే! పద. నేనూ వస్తాను. అక్కడే అగ్ని సాక్షిగ కన్యకను అందుకుంటాను' అన్నాడు రాజు.

గుడిలో కెళ్ళిన రాజుకు ఆకాశాన్ని తాకుతున్న అగ్ని గుండాన్ని చూడగానే భయం వేసింది. కన్యక భక్తి పరవశమైన మనసుతో తనవారికి హితబోధచేసింది. రాజును సమీపించింది. "పట్టపగలు, నడివీధిలో జార, చోరుల్లాగా నన్ను బలాత్కరించ బోయావు, నువ్వా ఒక రాజువేనా? నీవు ఈ దుండగం తలపెట్టినందుకు దైవం నిన్ను తప్పక శిక్షిస్తుంది" అని ఆక్రోశించింది. "పట్నమేలే రాజువైతే పట్టునన్నిప్పుడు" అంటూ చుట్టుముట్టిన మంటల్లోకి దూకింది. పట్నమేలే రాజు గర్వం మట్టిగలిసింది. కోట పేటలు కూలి నక్కలకు ఆలవాలమయ్యాయి. ఎక్కడైతే కన్యక మంట కలిసిందో అక్కడ ఆకాశాన్ని తాకే సౌధం వెలసింది. పట్నమేలే రాజు మరణించాడు. కోటపేటలు మట్టిలో కలిసి పోయాయి. కన్యక కీర్తిని, రాజు అపకీర్తిని మూట గట్టుకున్నారు.

విద్యార్థుల్లో ఆత్మాభిమానాన్నీ, చైతన్య స్వభావాన్నీ, సమస్యలెదురైనప్పుడు వాటిని ఎదుర్కొనే ధైర్యాన్నీ పెంపొందింప చేయడం ఈ పాఠ్య భాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

తగటు బంగరు చీరెకట్టీ
కురుల పువ్వుల సరులు జుట్టీ
నుదుట కుంకుమ బొట్టు పెట్టీ
సొంపు పెంపారన్;

తొగల కాంతులు కనులు పరపగ
మించు తళుకులు నగలు నెరపగ
నడక లంచకు నడలు కరపగ
కన్నె పరతెంచెన్
రాజవీథిని.

పసిడి కడవల పాలు పెరుగులు
పళ్ళెరమ్ముల పళ్ళు పువ్వులు
మోము లందున మొలక నవ్వులు
చెలగ **చెలికత్తెల్**
**వెంట నడిచిరి.**

అంత పట్టపు రాజు యెదురై
కన్నె సొగసుకు కన్ను చెదురై
మరుని వాడికి గుండె బెదురై
యిట్లు తలపోసెన్.

"ఔర! చుక్కల నడుమ చందురు
నట్లు వెలిగెడు కన్నె ముందర
వన్నె కాంచిన నగరి సుందరు
లంద రొక్క లెక్కా!"

"పట్టవలెరా దీని బలిమిని
కొట్టవలెరా మరుని రాజ్యం
కట్టవలెరా గండపెండెం
రసిక మండలిలో."

నాల నడుమను నట్టి వీథిని
దుష్ట మంత్రులు తాను పెండెం
కట్టి కన్నెను చుట్టి నరపతి
పట్ట నుంకించెన్.

మట్టి వచ్చిన దైవగతి కిక
దైవమే గతి యని తలంచుక
దిట్టతనమును బూని కన్నియ
నెట్ట నిటు పలికెన్.

"ముట్టబోకుడు, దేవకార్యం
తీర్చి వచ్చెద, నీవు పట్ణం
యేలు రాజువు, సెట్టి కూతుర,
నెటకు పోనేర్తున్."

చుట్టములు తన చుట్టు నిలవగ
భృత్య వర్గం కాచి కొలవగ
సెట్టి కరములు మోడ్చి రాజుకు
ఇట్లు వినిపించెన్.

"పట్టమేలే రాజు! బలిమిని
పట్టవలెనా? నీదు సొమ్మే
కాద కన్నియ? నీవు కోరుట
కన్న మరి కలదా
వైశ్య జాతికి వన్నె?"

గాని మన్నన జేసి మమ్ముల
బంధువర్గం, కులం పెద్దల
ధర్మమన్నది అరసి కొంచెం
దారి కనబడితే,

అగ్నిసాక్షిగ కన్నె గైకొని
ఆదరించుము మమ్ము, కానుక
లందు కొమ్మెంతెంత వలసిన,
మనుచు మా జాతిన్."

నవ్వి హేళన నవ్వు, నరపతి
పల్కె, "నోహో! ధర్మ మార్గం
పట్టమేలే రాచబిడ్డకు
సెట్టి కరపడమా?

రాజు తలచిందేను ధర్మం
రాజు చెప్పిందెల్ల శాస్త్రం
రాజులకు పేరైన పద్ధతి
కాద, గాంధర్వం?

తడవు చెయ్యక తల్లడిల్లక
నేడు రేపని గడువు పెట్టక,
నెమ్మి గోరితివేని, కన్నియ
నిమ్ము!
లేకుంటే, పొమ్ము!

దేగ, పిట్టను పట్టి విడుచున?
కన్నె, యింటికి మరలి నడుచున,
తెమ్ము కానుక లిమ్ము, నీవిటు
వచ్చినందాకన్

కదల" ; నంతట సెట్టి పలికెను,
"దేవకార్యం ముందు, ఆవల
రాచకార్యం కాద, రాజా!
శలవు నీవిస్తే

యింటి దైవం వీరభద్రుడి
దేవళానికి పోయి యిప్పుడె
పళ్ళెరం సాగించి వత్తును,
పైని తమ చిత్తం!"

"మంచిదే, మరి నడువు, మేమును
తోడ వత్తుము, దేవళంలో
అగ్ని సాక్షిగ కన్యకను మే
మందుకొనగలము."

నాడు గుడిలో మండె గుండం
మంట మింటిని ముట్టి యాడగ,
కన్న నరపతి గుండె దిగులై
పట్టు విడజొచ్చెన్.

భక్తి పరవశ మైన మనసున
దుర్గ నప్పుడు కొలిచి, కన్యక
ముక్తి వేడుచు వూడ్చి నగలను
శక్తి కర్పించెన్.

దుర్గ కొలనున గ్రుంకి పిమ్మట
రక్త గంధం రక్తమాల్యం
దాల్చి, గుండం చుట్టు నిలిచిన,
జనుల కిట్లనియెన్

"అన్నలారా తండ్రులారా
ఆలకించడం డొక్క విన్నప
మాలు బిడ్డల కాసు కొనుటకు
ఆశలే దొక్కొ
కులము లోపల?

పట్ణమేలే రాజు అయితే
**రాజు నేలే దైవ ముండడొ?**
పరువు నిలపను పౌరుషము మీ
కేల కలగదొకో?

విద్య నేర్పినవాడు విప్రుడు
వీర్యముండిన వాడు క్షత్రియు
డన్న పెద్దల ధర్మ పద్ధతి
మరచి, పదవులకై

ఆశ చేయక, కాసు వీసం
కలిగి వుంటే చాలు ననుకొని,
వీర్య మెరుగక, విద్య నేర్చక,
బుద్ధి మాలినచో,

కలగవా యిక్కట్లు ? మేల్కొని,
బుద్ధి బలమును బాహు బలమును
పెంచి, దైవము నందు భారం
వుంచి, రాజులలో

రాజులై మనుడయ్య!" ఇట్లని
కన్య నరపతి కప్పుడెదురై
నాలుగడుగులు నడిచి ముందుకు
పలికె నీ రీతిన్.

"పట్టపగలే, నట్టి వీధిని
పట్టబోరే జార చోరులు
పట్టదలచితి వింక **నీవొక**
**పట్టమేలే రాజువట!**

కండకావర మెక్కి నీవీ
దుండగము తలపెట్టినందుకు
వుండదా వొక దైవమంటూ,
వుండి వూర్కొనునా?

కులం పెద్దలు కూడి రదుగో!
అగ్ని సాక్షికి అగ్ని అదుగో!
కన్ను కోరిన కన్నె యిదిగో!
జాల మేలొక్కో ?

పట్టమేలే రాజువైతే
పట్టు నన్నిపు" డనుచు కన్యక
చుట్టి ముట్టిన మంట లోనికి
మట్టి తా జనియెన్.

పట్టమేలే రాజు గర్వం
మట్టి గలిసెను, కోట పేటలు
కూలి, నక్కల కాట పట్టై
అమరె.

యెక్కడైతే కన్య, మానం
కాచుకొనుటకు మంట గలిసెనొ,
అక్కడొక్కటి లేచె సౌధము
ఆకసము పొడుగై.

పట్టమేలే రాజు పోయెను,
మట్టి కలిసెను కోట పేటలు,
**పదం పద్యం పట్టి నిలిచెను**
**కీర్తులపకీర్తుల్.**

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. రాజు కన్యకను చెరపట్టడానికి ఎలా ప్రయత్నించాడు?
2. రాజును కన్యక ప్రతిఘటించిన విధానాన్ని వివరించండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. గురజాడ రచనలను పేర్కొనండి.
2. కన్యక ప్రజల కిచ్చిన సందేశమేమిటి?
3. రాజు గర్వం ఏమైంది?
4. కన్యక తండ్రికీ, రాజుకూ మధ్య జరిగిన సంభాషణను తెల్పండి.

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'ఆధునిక మహిళలు చరిత్రను తిరిగి రచిస్తారు' అన్న కవి ఎవరు ?
2. గురజాడ రాసిన కొత్త ఛందస్సు పేరేమిటి?
3. కన్యకను అగ్నిసాక్షిగా వివాహం చేసుకోమన్నదెవరు?
4. పట్టమేలే రాజు గర్వం ఏమైంది?
5. గురజాడ రచించిన ప్రసిద్ధ నాటకం పేరేమిటి?

### IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. చెలికత్తెల్ వెంట నడిచిరి
2. రాజునేలే దైవముండడొ?
3. నీవొక పట్టమేలే రాజువట!
4. పదం పద్యం పట్టి నిలిచెను కీర్తులపకీర్తుల్

❖ ❖ ❖

# 5 కర్మ భూమిలో పూసిన ఓ పువ్వా!



**- కలేకూరి ప్రసాద్**

## కవి పరిచయం

**పి**డికెడు ఆత్మగౌరవం కోసం, ఆత్మగౌరవ నినాదమై, డర్బన్‌లోని అంతర్జాతీయ వేదికపై సింహగర్జన చేసిన కవి – కలేకూరి ప్రసాద్. కృష్ణా జిల్లా, కంచికచర్లలో 25.10.1964 న కలేకూరి జన్మించారు. లలిత సరోజిని, శ్రీనివాసరావు వీరి తల్లిదండ్రులు.

తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులు. కలేకూరి ప్రసాద్‌కి చిన్ననాడు విద్యబాగానే అబ్బింది. ఏలూరులో ప్రాథమిక విద్యను పూర్తిచేశారు. గుంటూరు ఎ.సి.కాలేజిలో ఇంటర్మీడియట్‌లో చేరారు. ఆ రోజుల్లో వివిధ సామాజిక, రాజకీయ ఉద్యమాలకు ఆకర్షితుడయ్యారు. విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఎ.సి. కాలేజీలో చదువుతున్నప్పటి ఈ ఉద్యమాల అనుభవాలు, నేర్పిన పాఠాలు కలేకూరి ప్రసాద్‌ను విలక్షణంగా నిలబెట్టాయి.

మహబూబ్‌నగర్ పరిధిలోని బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రాజెక్టుకు కలేకూరి కొంత కాలం చైర్మన్‌గా పనిచేశారు. సాక్షి హ్యూమన్‌రైట్స్ వాచ్ (ఎన్.జి.ఒ) సంచాలకులుగా మరికొంతకాలం బాధ్యతలు నిర్వహించారు. మరెన్నో స్వచ్ఛంద సంస్థలకు సలహాదారుగా వ్యవహరించారు.

తన స్వగ్రామంలో కంచికచర్ల కోటేశును అగ్రవర్ణ భూస్వాములు సజీవదహనం చేశారు. ఈ సంఘటనను విన్న కలేకూరి చలించి పోయారు. తానుచూసిన సన్నివేశాలు, కళ్ళెదుట జరిగిన సంఘటనలు కలేకూరిని కలిచి వేశాయి. కవిగా మలిచాయి. అణగారిన ప్రజానీకంపై నరమేధం జరిగిన ప్రతి ఘటనలోనూ కలేకూరి ప్రతిఘటనాత్మక రచన చేశారు. యువక, శబరి, సంఘమిత్ర, నవత వంటి కలంపేర్లతో వివిధ పత్రికలలో అవి ప్రచురించబడ్డాయి. దళిత సాహిత్యం, దళిత సాహిత్యోద్యమం, పిడికెడు ఆత్మగౌరవం కోసం, అంటరాని ప్రేమ వంటివి కలేకూరి రచనల్లో ప్రముఖమైనవి.

వచన కవిత్వంలోనేకాక పాటల రచనలోనూ కలేకూరి గొప్ప పట్టును సాధించారు. ప్రజల బాణీలో అనేక పాటలు కట్టారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న నేపథ్యంలో “భూమికి పచ్చాని రంగేసినట్టు...” అనే పాట పుట్టింది. ప్రస్తుత పాఠ్య భాగం 'కర్మభూమిలో పూసిన ఓపువ్వా...” పాట మహిళలపై జరుగుతున్న గృహహింసలు, స్త్రీల వరకట్న చావుల నేపథ్యంలో కట్టింది. ప్రకాశంజిల్లా టంగుటూరులో ఇందిర అనే నవవధువు వరకట్న హత్యకు బలైన ఘటన ఈ పాట పుట్టుకకు ప్రేరణ. మూడుదశాబ్దాలుగా ఈ పాట మహిళాఉద్యమాలకు ఊపిరిలూదుతూ మారుమ్రోగుతూ ఉంది. ఇటీవలి కాలంలో ఒక సినిమాలోనూ కలేకూరి పాటలు చిన్న చిన్న మార్పులతో చిత్రీకరించబడ్డాయి.

కలేకూరి ప్రసాద్ కేవలం కవి మాత్రమే కాదు, గొప్ప విమర్శకులు. అంతకంటే గొప్ప అనువాదకులుకూడా. తెలుగు రచయితల్లో సరళంగా, సాధికారికంగా అనువాదాలు చేసిన అతికొద్దిమందిలో కలేకూరి ప్రసాద్ ఒకరు. వీరు ప్రకటించిన అనువాద గ్రంథాలు, వ్యాసాలు సుమారు 70 దాకా ఉంటాయి. మహాశ్వేతాదేవి, అరుంధతి రాయ్, స్వామి ధర్మతీర్థ, పాబ్లో నెరూడా, గెయిల్ ఆమ్‌వెట్, నామ్‌దేవ్ ధసాల్ వంటి ప్రపంచ ప్రసిద్ధ రచయితలను కలేకూరి తెలుగు వారికి పరిచయం చేశారు.

జాతి వివక్షపై దర్బన్‌లో జరిగిన అంతర్జాతీయ సభలో పాల్గొని కలేకూరి ఆత్మగౌరవ నినాదాన్ని ఎలుగెత్తి చాటారు. ఆ సదస్సులో పాల్గొన్న క్యూబా అధ్యక్షుడు ఫైడల్ క్యాస్ట్రో తన ఉపన్యాసాన్ని చాలా ఆసక్తిగా విన్నాడని కలేకూరి తరుచూ ప్రస్తావించేవాడు. అదొక చారిత్రక ఘటన.

“నా శవాన్ని ఈ దేశం ముఖచిత్రంగా ముద్రించండి! చరిత్ర పుటల్లోకి సుందర భవిష్యత్తునై పరివ్యాపిస్తాను! మళ్ళీ మళ్ళీ ఈ దేశంలోనే ప్రభవిస్తాను” అని ఒక సందర్భంలో ప్రకటించిన కలేకూరి ప్రసాద్ 07.05.2011 తేదీన తెరమరుగయ్యారు.

సాంకేతికంగా దేశం ఎంత ముందుకు పోతున్నా; మానవీయ విలువల్లో మనం నానాటికీ వెనుకబడి పోతున్నాం. ఈ నాటి స్త్రీ ఒక పక్క అందనంత ఎత్తులో అంతరిక్షంలో విహరిస్తున్నా; మరోపక్క ఇంటా, బైటా అనేక దాడులకు గురవుతూ, కానరాని లోకాలకు చేరుకుంటూ ఉంది. ప్రస్తుత పాఠ్యభాగం ‘కర్మభూమిలో...’ పాట మూడుదశాబ్దాల కిందట రాయబడిందే అయినా; దాని ప్రాసంగికత, ప్రాయోజికత ఈనాడు మరీ ఎక్కువగా ఉంది. అందుకే ఆకాశంలో సగంగా ఉన్న మహిళను మనిషిగా గుర్తించేలా ఈనాటి విద్యార్థి లోకాన్ని జాగృతం చేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

కర్మ భూమిలో పూసిన ఓ పువ్వా !
విరిసీ విరియని ఓ చిరునవ్వా
కన్నుల ఆశలు నీరై కారగ
కట్నపు జ్వాలలో సమిధై పోయావా ! ॥కర్మ॥

పారాణింకా ఆరనె లేదు
తోరణాల కళ వాడనె లేదు
పెండ్లి పందిరీ తీయనె లేదు
బంధువు లిండ్లకు చేరనె లేదు
మంగళనాదాలాగనె లేదు
అప్పగింతలు అవ్వనెలేదు
... గల గల పారే ఓ సెల యేరా

పెళ్ళికూతురుగ ముస్తాబయ్యి
శ్మశానానికే కాపురమెళ్ళావా...! ।।కర్మ।।

**మానవత్వమే మంటగలిసెనా**
మమతల కర్థం లేక పోయెనా
వేద ఘోష ఎగతాళి చేసెనా
ప్రమాణాలు పరిహాస మాడెనా
ప్రేమ బంధముగ కట్టిన తాళి
ఉరితాడయ్యి కాటు వేసెనా
...పున్నమి రువ్విన వెన్నెల నవ్వా
కారు మేఘములు కమ్మేశాయా
చీకటి చితిలో శవానివైనావా...! ।।కర్మ।।

రాక్షస విలువలు రాజ్యమేలెడి
నరకప్రాయపు సంఘంలోన
మనిషికి మనిషికి బంధాలన్నీ
**మార్కెట్లోన సరుకు లాయెనే**
ఆడపడుచులే శత్రువులైరా
అత్త కన్నులె నిప్పులు చెరిగెనా
...కళ కళాలాడిన ఓ నవ వధువా
శిశిరం నిన్ను కబళించిందా
మలమల మాడిన బొగ్గయి పోయావా...! ।।కర్మ।।

ఆడది కన్నా అడవి మానుకె
విలువిచ్చేటి దేశంలోన
ఆరడి పెట్టిన ఆడపడుచుకూ
అత్తారింట తప్పని స్థితి యిది
బ్రతుకున నిప్పులు పోసిన అత్తకూ
గర్భ శోకమూ తప్పకున్నది
పిశాచ గణాల ఆనందానికి
మారణ హోమం జరుగుతున్నది
...లేళ్ళను చంపే పులుల సీమలో
**కోకిల మేధం సాగుతున్నది**
జీవనరాగం ఆర్తనాదమాయె ।।కర్మ।।

అక్కలార ఓ చెల్లెల్లారా
వ్యవస్థ మలచిన అబలల్లార
కాలే గుండెల కమురు వాసనకు
కన్నులు ఏరులు పారుతున్నవా
దారి పొడవునా శవాల గుట్టలు
గుండెను గాయం కెలుకుతున్నయా
**... రాక్షస పీడన నెదిరించాలె**
స్త్రీలు పురుషులు మనుషులందరూ
సమానమన్న సమాజ ముండాలీ... ॥కర్మ॥

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్న

1. 'కర్మభూమిలో పూసిన ఓ పువ్వా!' పాట ద్వారా కలేకూరి ప్రసాద్ వర్ణించిన స్త్రీల దుస్థితిని వివరించండి.
2. 'కర్మభూమిలో'...పాఠం ద్వారా కవి వివరించిన వరకట్న దురాచారాన్ని విశ్లేషించండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. కలేకూరి ప్రసాద్ గురించి రాయండి.
2. కలేకూరి ప్రసాద్ స్త్రీలలో ఆశించిన చైతన్యం ఏమిటి?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. కర్మభూమిలో పూసిన ఓ పువ్వా... పాట రచయిత ఎవరు?
2. కలేకూరి ప్రసాద్ కలం పేర్లేమిటి?
3 మనిషికీ, మనిషికీ మధ్య సంబంధాలు ఏమైనాయి?

### IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. మానవత్వమే మంటగలిసెనా!
2. మార్కెట్లోన సరకులాయెనే
3. కోకిల మేధం సాగుతున్నది
4. రాక్షస పీడన నెదిరించాలె

❖ ❖ ❖

# 6 ఈ దారి ఎక్కడికి పోతుంది?



**- అద్దేపల్లి రామమోహనరావు**

## కవి పరిచయం

**కా**లంతో పాటు కదిలిన కలం యోధుడు అద్దేపల్లి రామమోహనరావు. 06.09.1936న అద్దేపల్లి మచిలీపట్నంలో జన్మించారు. రాజరాజేశ్వరి, సుందరరావు అద్దేపల్లి తల్లిదండ్రులు. ప్రాథమిక విద్యనుండి, కళాశాల విద్య వరకూ మచిలీపట్నంలోనే అభ్యసించారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు స్నాతకోత్తర విద్యను పూర్తి చేశారు.

బందరులోని హిందూ కళాశాలలో ట్యూటర్‌గా అద్దేపల్లి ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. తరువాత కొంతకాలం నందిగామలోని ఎన్.టి.ఆర్.కళాశాల (ఇప్పుడు దాని పేరు కె.వి.ఆర్. కళాశాల) లో పని చేసి; చివరకు కాకినాడ లోని ఎం.ఎస్.ఎన్. ఛారిటీస్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకునిగా సేవలందించారు. అక్కడే పదవీ విరమణ పొందారు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు ఉన్నత పాఠశాల విద్యను అభ్యసిస్తున్న రోజుల్లోనే అద్దేపల్లిలో సాహిత్య బీజాలు నాటుకున్నాయి. తనచుట్టూ ఉన్న సాహిత్య, సామాజిక, రాజకీయ వాతావరణం అద్దేపల్లిని ఒక అభ్యుదయ కవిగా తీర్చిదిద్దాయి. తొలిరోజుల్లో అద్దేపల్లి 'మధుజ్వాల' అనే పద్యకావ్యాన్ని రచించారు. తరువాత అన్నీ వచనకవితా సంపుటాలనే ప్రకటించారు. అంతర్జ్వాల, రక్తసంధ్య, గోదావరి నా ప్రతిబింబం, మెరుపు పువ్వు, సంఘం శరణం గచ్ఛామి, అయినా ధైర్యంగానే, పొగచూరిన ఆకాశం,ఆకుపచ్చని సజీవ సముద్రం నా నేల, తెరలు, కాలం మీద సంతకం, అల్లూరి సీతారామరాజు వంటివి అద్దేపల్లి వచనకావ్యాలు.

అద్దేపల్లి కేవలం కవి మాత్రమే కాదు. గొప్ప విమర్శకుడు కూడా. 'శ్రీశ్రీ కవితా ప్రస్థానం' (1968) అనేది అద్దేపల్లి తొలి విమర్శనా గ్రంథం. అంతేకాదు, మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానంపై వెలువడిన తొలి విమర్శనా గ్రంథం కూడా ఇదే. విమర్శ వేదిక, కుందుర్తి కవితా వైభవం, మహాకవి జాషువా కవితా సమీక్ష, దృష్టి పథం, గీటురాయి వంటివి అద్దేపల్లి ఇతర విమర్శనా గ్రంథాలు. 'అభ్యుదయ విప్లవ కవిత్వాలు సిద్ధాంతాలు – శిల్పరీతులు' అనేది అద్దేపల్లి పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం.

వందలాది యువకవులను నిరంతరం ప్రోత్సహించిన అద్దేపల్లి సుమారు 600 కవితా సంపుటాలకు పీఠికలూ, సమీక్షలూ రచించారు. అక్షరాన్ని ఆయుధంగా మలిచి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణపై విరుచుకు పడిన తెలుగు

కవుల్లో అద్దేపల్లి అగ్రతాంబూలాన్ని అందుకుంటారు. పొగచూరిన ఆకాశం, కాలం మీద సంతకం వంటి కవితా సంపుటాలు అందుకు నిలువుటద్దాలు. సాహిత్య సంచార యోధుడుగా ముద్రపడిన అద్దేపల్లి 13.01.2016 తేదీన మరణించారు. ప్రస్తుత పాఠ్యభాగం 'ఈ దారి ఎక్కడికి పోతుంది' ఖండిక 'పొగచూరిన ఆకాశం' కవితా సంపుటిలోనిదే.

ప్రపంచీకరణ విషబీజ ప్రభావాలను అడ్డుకోకపోతే సమాజం స్వరూపస్వభావాలు ఎలా ఉంటాయో ఈ పాఠ్యభాగం తెలియచేస్తుంది. మాతృభాష ప్రాధాన్యాన్నీ, సాంస్కృతిక విలువలనూ గుర్తింపచేసి, వాటిని కాపాడుకోవడంలో విద్యార్థులను జాగృతం చేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

ఎవరో నన్ను ఈ దారిలోకి విసిరేశారు
నడిచిపోతున్నాను
నా భావాలు పట్టని ఈ యిరుకు సందులో
వేకువ తొలి నక్షత్రాన్ని కనుపాపతో పట్టుకుని
నడిచిన కొద్దీ దూరంగా జరిగే గమ్యం కోసం
కలల కాళ్ళు మట్టిలో తడుముకుంటూ
నడిచిపోతున్నాను
నాలాంటి జనమే నాకు తోడుగా –
తలలమీద నిన్నటి కిరీటాలు
కళ్ళనిండా రేపటి దీపాలు
ఒంటినిండా కాలం కాల్చిన మచ్చలు
నడుస్తున్న అడుగుల్లో మునుగుతున్న మూలుగులు
సమూహాలు, సమూహాలు
నాతో నడుస్తూ, నాకెదురౌస్తూ
మహా జనసమూహాలు ...
దారినిండా కనిపించే దృశ్యాలు
వినోదాలు, విషాదాలు
క్రిక్కిరిసిన ముఖాల ప్రతిబింబాలు –
బియ్యంలో రాళ్ళలా
తెలుగులో ఇంగ్లీషు కలిపి ప్రాణాలు నములుతున్న

నాయకులు, మేధావులు
సినిమా స్టార్లు, తెలుగు సార్లు –
ఇంగ్లీషు రైముల కుప్పిగంతుల కింద
**తెలుగు పాటల ఊపిరి తొక్కుతున్న**
**వ్యాపార విద్యాలయాలు –**
చెవుల్ని పగిల్చే రొదచేస్తూ వచ్చి
నిశ్శబ్దంగా ధన సముద్రంలో కలిసిపోతున్న
విభిన్న భావధారలు –
నిషిద్ధమైన కాబరే డాన్సులే
కసితీరా చట్టబద్ధమైన పాప్ డాన్సులు –
సంప్రదాయం, ఆధునికత, సంస్కారం
మూడింటినీ మిక్సీలో వేసి తిప్పితే వచ్చే
పంచకోళ్ళ కషాయం తాగుతున్న మాటలతో
అస్తిత్వ బాష్పాలు సముద్రాలైన కళ్ళతో
**నా ముందు నిలబడ్డాడు కొత్త మానవుడు –**
అంతర్జాతీయ వ్యాపార తుఫానులో
సొంతముద్ర చెరిగిపోయిన వింత వస్తువును నేను
మనిషి స్థానంలో వస్తువునారాధిస్తున్న
కొనుగోలుదారుణ్ణి నేను
నిన్న నేను నా అవసరానికే వస్తువులు కొన్నాను
**నేడు నేను నా స్థాయికోసం వస్తువులు కొంటున్నాను**
రేపు నేను ఒక వస్తువుని కావడం కోసం
జీవితాన్ని అమ్ముకుంటాను –
ఇవ్వాళ అనుభూతుల్ని ధారపోసి
ప్రకృతి చెట్టును పెంచి
హైకూల హరిత పత్రాలుగా ఊగిపోతున్నాను
రేపు నాకు అనుభూతుల అలసట లేదు
గదిలో కూర్చుని కంప్యూటర్లోకి ప్రకృతిని లాక్కొచ్చి
సహజమైన ఆకుకంటే ఇంకా పచ్చనైన హైకూల్ని
ప్రపంచంమీద విసిరికొడతాను

కత్తిపడవలు, నెమలి కన్నులు
ఇసకగూళ్ళు, బువ్వాలాటలు
కొమ్మఉయ్యాలలు, కోతికొమ్మచ్చులు
**అన్నీ నేను వీడియో గేమ్స్‌గా మార్చుకుంటాను**
కాలు కదపకుండా ప్రపంచమంతా తిరిగొస్తాను –
తూర్పుమీద పడమటి నీడ పడుతుంటే
రక్తసంధ్య చేస్తున్న అరుణారుణ వ్యాఖ్యానం
నా ఆకాశాల్ని వణికించి వేసింది –
బహుళ జాతుల కరచాలనాల్లో
నా జాతి చెయ్యి జారిపోతుంది
ప్రపంచ వ్యాపార వైకుంఠపాళీలో
నా దేశపటాన్ని పాము కాటేస్తుంది
అనుబంధాలు, విమానాల రెక్కల మీదుగా
సముద్రంలోకి జారిపోతై
అనుభవాలు, యంత్రాల అద్దాలముందు నిలబడి
బట్టతలలు దువ్వుకుంటై
ప్రేమ, కామ దేవతముందు
శిరః ఖండనం చేసుకుంటుంది
జీవితం పసిపాప, దేశం మార్కెటులో
అమ్మానాన్నల నుండి తప్పిపోతుంది –
భావాలు కన్నీటి కత్తులై దిగబడుతుంటే
పాదాల కింది మట్టిలోంచి
పెల్లుబికిన విద్యుద్రాగం
నా శరీరమంతటా మెరుపుతీగలు పాకించింది
మనసుల్లోని మట్టితనం
మేల్కొనే సమయం వచ్చింది
**అమ్మతనం ముందు అమ్మకం తనం ఓడిపోతుంది**
మన శ్రమతో మన దారిలోని ముళ్ళనూ రాళ్ళనూ
మనమే తొలగించుకుని
కొత్తదారి వేసుకున్నాక

దేశం తల ఎత్తితే ఆకాశం తగలాలి
దేశం చెయ్యి చాస్తే
సూర్యబింబం వచ్చి అరచేతిలో నిలవాలి!
ఇప్పుడు దారిమోస్తున్న గమ్యం
దేహం మీది శిరస్సులా కనిపించింది
దేశమే ఒక జండాగా
నా గుప్పిట్లో నిలబడింది ...

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. సమాజంలో వచ్చిన మార్పుల పట్ల అద్దేపల్లికి కలిగిన ఆవేదనను తెల్పండి.
2. మనిషిలో ఏ విధంగా చైతన్యం వస్తుందని అద్దేపల్లి చెప్పారు?

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. అద్దేపల్లి దర్శించిన కొత్త మానవుడు ఎలా ఉన్నాడు ?
2. మనిషి జీవితం వస్తువులా ఎలా మారిపోతూ ఉంది?
3. మనిషి జీవితం గురించి అద్దేపల్లి భావనను తెలియచేయండి.
4. మనుషుల అనుబంధాలు ఎందుకు నాశనమౌతున్నాయి?
5. అద్దేపల్లి రామమోహన రావు గురించి రాయండి.

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'ఈ దారి ఎక్కడికి పోతుంది'? పాఠ్యభాగ రచయిత ఎవరు?
2. బియ్యంలో రాళ్ళులా కనిపించినవేవి?
3. నిషిద్ధమైన కాబరే డాన్సులు ఏ పేరుతో చట్టబద్ధమైనాయి?
4. సగటు మనిషి దేనికోసం వస్తువులు కొంటున్నాడు?
5. అమ్మతనం ముందు ఏది ఓడి పోతుంది?

### IV. సందర్భ సహిత వ్యాఖ్యలు

1. తెలుగు పాటల ఊపిరి తొక్కుతున్న – వ్యాపార విద్యాలయాలు.
2. నా ముందు నిలబడ్డాడు కొత్త మానవుడు.
3. నేడు నేను నా స్థాయికోసం వస్తువులు కొంటున్నాను.
4. అన్నీ నేను వీడియోగేమ్స్‌గా మార్చుకుంటాను.
5. అమ్మతనం ముందు అమ్మకం తనం ఓడిపోతుంది.

❖ ❖ ❖

# గద్య భాగం


| | | |
|---|---|---|
| 1. | మన ఆటలు | 43 - 50 |
| 2. | అర్థ విపరిణామం | 51 - 55 |
| 3. | చాటువులు | 56 - 62 |
| 4. | వేమన కవిత్వము | 63 - 69 |
| 5. | నా జీవిత యాత్ర | 70 - 77 |
| 6. | జాతీయోద్యమ కవిత్వం | 78 - 86 |

# 1 మన ఆటలు



**- మల్లంపల్లి సోమశేఖరశర్మ**

## రచయిత పరిచయం

**తొ**లితరం చారిత్రక పరిశోధకుల్లో ప్రముఖులు మల్లంపల్లి సోమశేఖర శర్మ. వీరు 24.12.1891 తేదీన జన్మించారు. పశ్చిమగోదావరి జిల్లా మినుమించిలిపాడు వీరి స్వగ్రామం. నాగమ్మ, భద్రయ్య వీరి తల్లిదండ్రులు. ప్రాథమిక విద్యను స్వగ్రామంలో, రాజమండ్రిలో మెట్రిక్యులేషన్ విద్యనూ పూర్తి చేసుకున్నారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు నిర్వహిస్తున్న 'దేశమాత' పత్రికలో సహాయసంపాదకునిగా మల్లంపల్లి ఉద్యోగంలో చేరారు. నెలకు 12 రూపాయిలే జీతం అయినా, వీరి జీవితానికి సరిపడా అనుభవాన్ని ఆ 'దేశమాత' అందించింది. కేవలం చరిత్ర మీదనే కాక; సంస్కృతి, శాసన పరిశోధన వంటి అంశాల మీదకి దృష్టిని మళ్ళించింది. తగిన విద్యార్హతలు లేకపోయినా ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విద్యార్థులకు చరిత్ర పాఠాలను బోధించగలిగేంత పునాదిని కల్పించింది. మల్లంపల్లి రచనా వ్యాసంగానికి అక్కడే బీజంపడింది

మల్లంపల్లి రచనలు తెలుగు జాతికి గొప్ప విలువైన కానుకలు. ఆంధ్రాంగ్లాలలోనూ వీరు రచనలు చేశారు. చారిత్రక వ్యాసాలు, అమరావతి స్తూపం, ఆంధ్ర వీరులు, దేశోద్ధారకులు, ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహం, రేడియో నాటకాలు, రోహిణీ చంద్రగుప్తం, హిందూదేశ చరిత్ర, ఫర్‌గాటెన్ చాప్టర్ ఆఫ్ ఆంధ్ర హిస్టరి, హిస్టరీ ఆఫ్ ది రెడ్డి కింగ్‌డమ్స్ వంటివి మల్లంపల్లి రచనల్లో ప్రముఖమైనవి. ఇవి కాక, కొమర్రాజు లక్ష్మణరావు గారితో కలిసి 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం' కూర్పులో మల్లంపల్లి భాగస్వామి అయ్యారు. నేలటూరి వెంకట రమణయ్య గారితో కలిసి 'కాకతీయ చరిత్ర' రచనను పూర్తి చేశారు. కొన్నాళ్ళు భారతి మాస పత్రికకు సంపాదకత్వం వహించారు. తెలుగు భాషా సమితి ప్రచురించిన 'తెలుగు సంస్కృతి' సంపుటానికి సంపాదక వర్గ సభ్యులుగా కూడా బాధ్యతలు నిర్వహించడం సంస్కృతి పరిశోధనలో మల్లంపల్లి సుదీర్ఘ అనుభవానికి నిదర్శనం. చరిత్ర గర్భంలోంచి విలువైన సాంస్కృతిక సంపదను వెలికి తీసిన సోమశేఖర శర్మ 07.01.1963 తేదీన కన్నుమూశారు.

ప్రస్తుత పాఠ్యభాగం "తెలుగు సంస్కృతి" విజ్ఞానసర్వస్వ సంపుటం నుండి గ్రహించబడింది. తెలుగు సంస్కృతిలో ఒక భాగమైన వివిధ రకాలైన ఆటలు, వేడుకల విశిష్టతకు ఈ వ్యాసం అద్దం పడుతుంది. ప్రపంచీకరణ ప్రభావం

వల్ల ఈనాడు వివిధ సంస్కృతుల అస్తిత్వాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సుదీర్ఘ సాంస్కృతిక అస్తిత్వం కలిగిన తెలుగు జాతి క్రమ క్రమంగా ఏమేమి కోల్పోతున్నదో విద్యార్థులకు తెలియచేసి, వాటి పరిరక్షణకు పూనిక వహింప చేయడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

ఆంగ్లేయులకు క్రికెట్టు మొదలైన ఆటలు వున్నట్లు తెలుగు వారికి ప్రసిద్ధములైన జాతీయ క్రీడలు తక్కువ; లేవన్నను అది సత్యదూరము కాదు. వయసు వచ్చిన యువజను లాడునట్టి ఆటలరుదు. అట్లని ఆటలు మొదలే లేవని కాదు. మన ప్రబంధములలో బాల బాలికలాడు క్రీడలనేకము వర్ణితములైనవి. అట్టి వానిలో ఇప్పటికిని చాల క్రీడలు వాడుకలో నున్నవి. సాధారణముగా పూర్వము ఏడెనిమిదేండ్లు, పదేండ్లు వచ్చువరకు మనదేశములో బాలురును బాలికలును కలిసియే ఆడుకొనువారు. ఇటీవల బ్రిటీషు యుగములో ఇంగ్లీషువిద్య వ్యాప్తమయిన కొద్ది బాల బాలికలు వేరువేరు పాఠశాలలకు పోయి చదువుకొన్న కొద్ది, పూర్వపు ఆటలమీదను, ఆచారములమీదను అభిరుచి క్రమముగా సన్నగిల్లినది. ఆ యాటలు కూడ చాలవరకు ఆటలనిపించక మూలబడినవి. ఇందువలన ప్రబంధములలో వర్ణితములై ఒక శతాబ్దము క్రిందటివరకు వాడుకలో నుండిన ఆటలలో అనేకము ఎట్లాడుదురో ఎవరికిని తెలియదు. అట్టి ఒక్కొక్కయాటలను అయ్యలరాజు నారాయణామాత్యుడు తన 'హంసవింశతి' కావ్యములో విడివిడిగా అక్కడక్కడ ఉటంకించుటయే కాక ప్రత్యేక మొక కథలో సీసమాలికలో ఒక జాబితానిచ్చి యున్నాడు. ఇందువలన మనకాయాటల పేర్లు మాత్రమే తెలియును. కాని వానినాడుకొను విధము తెలియుట లేదు. వీనిలో కొన్ని ఇంటిలో ఆడుకొనునవి; మరికొన్ని ఇంటి వెలుపల ఆరుబయట ఆడుకొనునవి. బాలబాలికలు కలిసి ఆడుకొనుచుండినను ప్రత్యేకముగ బాలికలు మాత్రమే ఆడునట్టివియు, ప్రత్యేకముగ బాలురాడునట్టివియు లేకపోలేదు. అచ్చనగండ్లు సాధారణముగా బాలిక లాడునాటయే; కోతికొమ్మచ్చులు కేవలము బాలకులాడు ఆట. కుందికట్టు, కంబాలాట, పుట్లచెండ్లు, దాగిలిమూతలు మొదలైనవి బాలబాలికలు ఉభయులును ఆడుదురు. ఈ యాటలలో చాలవానికి పాటలుకూడ నుండును. పాటలు పాడుచు, ఆటలాడుట పూర్వపు పద్ధతి. పూర్వపు ఆటలతోపాటు చాల పాటలును అంతరించినవి. ఒకటే యాట కొక ప్రాంతమున ఒక పేరును, మరొక ప్రాంతమున ఇంచుక వ్యత్యాసముతో మరొకపేరును ఉండుటకూడ కలదు. కోతి కొమ్మచ్చికి కోలక్రోతులని, కుందికట్టుకు కుంది కాళ్ళు, కుందెనగిరి, కుందెన గుడి అని; ఇట్లే కొన్ని కొన్ని ఆటలకు నామాంతరములు కలవు.

తెలుగువారికి జాతీయమైన ప్రసిద్ధ క్రీడలు లేకపోయినను వ్యాయామకృషి లేకపోలేదు. ప్రతినగరములోను, పురములోను, తుదకు పెద్ద గ్రామములోకూడ సాము గరిడీశాల లుండెడివి. ముఖ్యములైన పురములలోను,

గ్రామములలోను ఎక్కట్లు ఉండుటచేత గరిడీశాల లుండుట తప్పని సరియైనది. ఎక్కటీడు అనుపదము వాడుకలో ఎక్కటియైనది. ఈ యెక్కట్లందరు ఏకాంగవీరులు. వీరికి తరువాత ఒంటరులు (వంటర్లు) అనిపేరు కలిగినది. వీరు చతుర్థవర్ణములో ఒక కులముగ ఏర్పడినారు. గరిడి కూటములలో మల్లవిద్య, కత్తిసాము, బాణావిద్య, లోడీలు త్రిప్పుట, దండెములు తీయుట మొదలైనవి సాధన చేయువారు. సాధారణముగా మల్లవిద్యలో అత్యంత ప్రావీణ్యము సంపాదించిన ప్రథమ శ్రేణి విద్యావంతులకు జ్యేష్ఠికులని పేరు. వీరికి జెట్టి మల్లులని వ్యవహారము. జ్యేష్ఠికశబ్ద భవము జెట్టి. తిక్కన భారతము విరాటపర్వములో 'జెట్టి మల్లు' లనియే ప్రయోగించెను. తుదకు, ఉత్తమ, మధ్యమ, అధమ విభేదము లేక జెట్టి పదమే 'మల్ల' పర్యాయపదమైనది. చిన్నదైనను పెద్దదైనను ప్రతి రాజాస్థానమును ఇటువంటి మల్లులను కొందరిని పోషించుచుండెడిది. మల్లయుద్ధము విజయనగర సామ్రాజ్యము కూలిపోవువరకు దక్షిణ హిందూదేశమందంతట విరివిగా ప్రచారములో నుండిన క్రీడ. మార్కో పోలో, డ్వార్టి బార్బోసా, న్యూనిజ్, కెప్టెన్ హెడా మొదలైన అయిరోపియను విదేశ యాత్రికులు – హిందూదేశమునకు వచ్చినవారు – మల్ల యుద్ధమును తమ వృత్తాంతములలో ప్రస్తావించి, అభివర్ణించి యున్నారు.

ధనుర్విద్య, కత్తిసాము, బాణావిద్య, గుర్రపుస్వారి – వీనిని సర్వసామాన్యముగా అందరును, అందు ముఖ్యముగ క్షత్రియులును, శూద్రులును అభ్యసించువారు. క్షత్రియులైనను క్షత్రియేతరులైనను పరిపాలక వంశములోని వారును, ఆయుధోపజీవులును విలువిద్య, కుంతాయుధ ప్రయోగము, కత్తిసాము, గుర్రపుస్వారి మొదలైనవానిని నేర్చుకొనుచుండిరి. చతుర్థకులజులే కాక బ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు, వైశ్యులుకూడ గజాశ్వ విద్యలలోను, సమర తంత్రములోను ప్రజ్ఞ సంపాదించి ఆయా దేశాధిపతులయొద్ద దండనాథులుగ నుండినట్లు శాసనములవలన తెలియుచున్నది. పూర్వోక్త విద్యలను స్త్రీలుకూడ అభ్యసించు చుండిరనుటకు ఆధారములు కలవు. కాకతి రుద్రమదేవి, కోట గణపమదేవి రాజ్యపాలన మొనరించిన రాణులు. వీరు అశ్వ, గజ శిక్షలయందును, సమరతంత్రము నందును నిపుణులు. విజయనగరాధీశ్వరుడైన శ్రీకృష్ణదేవరాయల రాజ్యకాలములో విజయనగరమునకు వచ్చిన పేయస్ అను విదేశయాత్రికుడు రాయల అంతఃపురమున మల్లవిద్యలోను, కత్తిసాములోను, డాలును వాడుటలోను నేర్పరులైన స్త్రీలు పండ్రెండువేలమంది ఉండినట్లు వ్రాసియున్నాడు. అట్టిచో ఇక పురుషులమాట వేర చెప్పవలెనా? గుర్రపుస్వారిలో అందెవేసిన రౌతులు అనేకులు. రాజమహేంద్రవర రాజ్యమును పరిపాలించిన వీరభద్రారెడ్డి సోదరుడు దొడ్డారెడ్డి గుర్రపుస్వారిలో ఉద్దండుడట. అతడొకమారు పురోపకంఠమున వాహ్యాళి ప్రదేశము నందు తన గుర్రమును ఇరువైనాలుగు మూళ్ల మేర దాటించెనట. కత్తిసాములో గొప్ప ప్రజ్ఞ సంపాదించిన వారు వ్రేటుకు ఆరు తునుకలుగా నరకగల సమర్థులు. ఆశ్వికులకు రౌతులని, రావుతులని పేరు. కళింగదేశ రాజకుమారులు గొప్ప రౌతురాయలు; గజ సాధనికులు. శస్త్రవిద్య, ధనుర్విద్య నేర్పువారు పూర్వము నుండియు బ్రాహ్మణులుగా

తెలియవచ్చుచున్నారు. పూర్వ చాళుక్య శాసనములవల్ల ద్రోణునివంటి ధనుర్వేద పారంగతులైన రాజగురువులు తెలియవత్తురు. వీరు రాజకుమారులకు ఇతర విద్యలు కాక సంగ్రామ తంత్రమును, నీతిశాస్త్రమును గూడ కరపుచుండిరి. పూర్వము ప్రసిద్ధులైన సేనానులు, భూధవులు, రాజకుమారులు, మంత్రులు అందరును పూర్వపు గరిడీశాలలో తయారైనవారే. వేకువజామున నే లేచి సాధకులు సాధన చేయువారు. ఇట్టి సాముకూటములు దేశీయ ప్రభువుల పరిపాలనము సాగినంతకాలము వర్ధిల్లినవి. బ్రిటీషు ప్రభుత్వ కాలములో, ముఖ్యముగా ఆ ప్రభుత్వమువారు ఆయుధశాసనమును అమలులో పెట్టి నప్పటినుండి, అవి క్రమముగా క్షీణించినవి. అయినను ఇప్పటికిని తెలుగుదేశములో అక్కడక్కడ మల్లవిద్య నేర్పు కూటములు లేకపోలేదు; కాని, చాల అరుదు.

ఒక వేళ ఇప్పుడు జాతీయక్రీడలని చెప్పవలెనన్న చిడుగుడు, ఉప్పనబట్లు మాత్రమే చెప్పుకొనవలెను. ఇటీవలనే దేశీయములైన ఈ యాటలకు జాతీయతాముద్ర వేసి వీనికి ఆటలపందెములు ఏర్పాటుచేసి వీనిని పాశ్చాత్య జాతీయక్రీడలతో సాటిగ చేయుటకు ప్రయత్నము జరుగుచున్నది. ఉప్పన బట్టెలు (ఉప్పట్లు), చిడుగుడాట, బొంగరాలయాట, గాలిపటము ఎగురవేయుట, అచ్చనగండ్లయాట, ఓమన గుంటలు, జూదము, పులిజూదము, చదరంగము (చతురంగము) మొదలైనవి ఆరేడువందల సంవత్సరములకు పూర్వమునుండి ఉన్నయాటలు. వీనిలో కొన్ని ఇంటి వెలుపల ఆరుబయట ఆడునాటలు; మరికొన్ని ఇంటిలోపలను ఆడుకొను ఆటలు; ఇక కొన్ని ఇంటిలోపలను వెలుపలను ఆడునట్టివి. పూర్వోక్త క్రీడలలో జూదమును, మల్ల విద్యను, విలువిద్యను, గజాశ్వశిక్షణ విద్యలను పూర్వులు కొందరు చతుష్షష్టి విద్యలలో చేర్చియున్నారు.

పైనచెప్పిన ఆటలలో చదరంగము నిజముగా జాతీయ క్రీడయని చెప్పుకొనదగినది. మానవజాతికి చదరంగము అను ఆటను ప్రసాదించినది భారతదేశము. ఈ యాట నాడు పలకకు అష్టాపదమని పేరు. ఈయాట హిందూదేశము నుండి పడమట పెర్షియా, అరేబియా దేశములకును, తూర్పున చీనాదేశమునకును వెళ్లినది. దీనిని అరబ్బులు ప్రాయికముగా పదవ శతాబ్దము చివర అయిరోపాలోని స్పెయిను దేశమునకు తీసికొని వెళ్లిరి. పదునొకండవ శతాబ్దాంతమునకు అది అయిరోపాలో ఎల్లరకు సుపరిచితమైన ఆటయైనది. మన దేశములో ఈయాటను పూర్వము ఉన్నత కులములవారు – అందు ముఖ్యముగా భూమీశులు – ఎక్కువగ ఆడుచుండిరి. విజయనగరాధీశ్వరుడయిన కృష్ణదేవరాయలకు చతురంగ క్రీడ యన్న అమితప్రీతి. రాయలవారు తరచుగా నందవరవంశ్యుడును, కౌశిక గోత్రుడును, కవీశ్వరుడును అయిన కొప్పోలు గ్రామ కరణము బొడ్డుచర్ల తిమ్మనతో చదరంగ మాడువారట. రాయలపక్షమున నెందరాలోచించి ఎత్తులు వేయుచుండినను తిమ్మన ఒక్కడే ఎవరి ఆలోచనయు, ఎవరి సాయమును లేక ఎదురెత్తు వేసి ఆట గెల్చుకొని 'వేయార్లు' పందెము కొనుచుండువాడట. తిమ్మన ఆటనైపుణికి మెచ్చుకొని రాయలవారు కొప్పోలు గ్రామమునకు కృష్ణరాయపురమని పేరుపెట్టి

సర్వాగ్రహారముగా ధారవోసిరని ఐతిహ్యము. పూర్వపురాజులు యుద్ధమునకు పోకపూర్వము ఈ యాటను ఆడి 'ఎత్తు పై ఎత్తులు' ఆలోచించు కొనుచుండిరని చెప్పుదురు. పూర్వపు సంస్థానాధీశులకు ఈ యాటలోగల అభినివేశమును గురించి, ఆట యాడుటలోని నైపుణిని గురించి పూర్వపు తరములవారు చెప్పుకొనుచుండిన కథలు గాథలు చాల అంతరించిపోయినవి. ఇటీవల ఈ చదరంగము జాతీయములైన పందెపుటాటలలో ఒక్కటయినది. ఇప్పటికిని ముందు చెప్పి ఆట కట్టించగల ప్రజ్ఞావంతులు తెలుగుదేశములో అనేకులున్నారు.

పూర్వకాలములో వేడుకలు, వినోదములు ఎట్లు ఉండెడివో, పండుగ పబ్బములలో ప్రజలు ఎట్లు కాలము గడపుచు వచ్చిరో తెలిసికొనుటకు ఆధారములు లేవు. అయినను మన ప్రాచీన ప్రబంధముల ననుసరించి కొంత తెలిసికొనుటకు అవకాశము కలదు. ప్రాచీన కాలములో వసంతోత్సవ, శరదుత్సవ దినములు గొప్ప వేడుక దినములు. వసంతోత్సవము మనదేశములో ఇప్పటికి వేయిసంవత్సరములకు పూర్వమునుండి జరుగుచువచ్చినను కొండవీటిని పరిపాలించిన రెడ్డిరాజుల కాలమునుండి దానికి క్రొత్త యందమును, అపూర్వశోభయు వచ్చినది. వసంతోత్సవమునకు పిదప చెప్పదగిన ఉత్సవము శరదుత్సవము. శరదృతువులో జరుగు ఈ యుత్సవములకు మహాలక్ష్మి పండుగలని, దేవీ నవరాత్రములని పేరు. ఇంచుమించుగ మన పండుగలును, పర్వములును అన్నియు ఏదో ఒకరీతిని మతమునకు సంబంధించినవే. ఈ పండుగ దినములలో జనులు తమ తమ మతవిధులు నిర్వర్తించి, ఉన్నంతలో మంచి బట్టలు కట్టుకొని, అలంకరించుకొని వేడుకలు వినోదములతో కాలము గడపుదురు. గ్రామములలో నివసించు ప్రజలకు ఆ గ్రామములోని దేవుని కల్యాణోత్సవమును, గ్రామదేవత జాతరయు కూడ ఉత్సాహముతో పాల్గొనుటకు అవకాశమిచ్చు పండుగల వంటివే. సాధారణముగా ఈ పండుగ దినములలోను, ముఖ్యముగా స్వామి కల్యాణోత్సవ దినములలోను, వీథినాటకము లాడెడు భాగవతులు, తోలుబొమ్మలవాండ్రు, దొమ్మరవాండ్రు మొదలైనవారు వచ్చి ఆటల నాడి ప్రజలను ఆనందింప జేసి పోవుట ఆచారము. పూర్వము ప్రతిగ్రామము నందును 'గ్రామ సమూహి మాన్యము' అని యొక మాన్య ముండెడిది. ఆ మాన్యము గ్రామములోని ఏ యొక్కరిదియు కాదు. అది గ్రామస్థులందరికి చెందిన ఉమ్మడి మాన్యము. దానిమీద వచ్చు రాబడిని – ధాన్యరూప మయినదైననేమి, రొక్కము రూపమయినదైననేమి మొత్తముమీద గ్రామోపయోగకర కార్యముల నిమిత్తమును, గ్రామస్థులకు పైనచెప్పినయట్టి ప్రదర్శనములను ఇచ్చి ఆనందింపజేయు ఆటపాటలవాండ్ర నిమిత్తమును వినియోగించుచుండువారు. భాగవత మేళమునకు ఇంత, తోలుబొమ్మలవారి కింత అని యీవిధమున వేడుకలు వినోదములు జరుపువారికి వార్షికముగా నిచ్చు వర్తనలుండెడివి. వర్తనపదమే వాడుకలో 'వతన' అయినది. వేర్వేరు వృత్తులవారికి ఇచ్చునది వర్తన. విద్యావంతులు ఆట పాటలవారు మొదలయిన కళానిపుణులు ప్రతిసంవత్సరము గ్రామమునకు వచ్చి తమ ప్రదర్శనముల నిచ్చి వర్తనలను తీసికొని పోవుచుండిరి. ఈ ప్రదర్శనము

లన్నియు గ్రామీణులందరికి ఉచితమే. ఎవ్వరును ఏమియు చెల్లింప నక్కరలేదు. దీనివలన గ్రామస్థు లెవ్వరికిని ఏవిధమయిన నొప్పి కలుగకపోవుటవలన గ్రామములకు వచ్చు విద్యావంతులును గ్రామీణులును ఎంతయో అన్యోన్యము కలిగి, ఇంచు మించుగ ఆప్తమిత్రులవలె వ్యవహరించువారు. ఈ విద్యావంతుల కుటుంబములు వృద్ధిచెంది సంతానాభివృద్ధి కలిగినపుడు ఒక కుటుంబములోని అన్నదమ్ములు భూమిని పంచుకొన్నట్లే వారు గ్రామములను పంచుకొనువారు. ఈ కారణమున గ్రామములోని వారికిని, ఏటేట ఆయూరికి వచ్చుచుండు విద్యావంతుల కుటుంబముల వారికిని తరతరములనుండి అన్యోన్యము ఏర్పడి వావి వరుసలు పెట్టుకొని బంధుసరళిని ఆప్యాయముగ కలసి మెలసి వ్యవహరించు చుండువారు. భిక్షాటనమున జీవించు కొన్ని కొన్ని కులముల విషయమునను ఒక మాదిరిగ ఇటువంటి ఏర్పాటులే యుండెడివి, నేడు బిచ్చగాండ్రది ఒక సమస్యయైనది; కాని, పూర్వపు సాంఘికవ్యవస్థ అప్పటికి తగినట్లు దాని నొకరీతిగ పైవిధమున పరిష్కరించుకొన్నది.

వసంతోత్సవములు, శరదుత్సవములు, స్వామికల్యాణోత్సవము మొదలగు వానివలెనే మకరసంక్రమణము (సంక్రాంతి) కూడ గొప్ప పండుగ. దీనికి పెద్దపండుగ అని పేరు. అప్పటికి వరికోతలై ధాన్యలక్ష్మి ఇంటికి వచ్చు శుభదినములలో వచ్చు పండుగ ఇది. గ్రామములోని ప్రతి గృహమును పసుపు కుంకుమలతో, సున్నపుపూతలతో, రకరకములైన ముగ్గులతో కలకలలాడుచు నేత్రపర్వము కావించు పండుగ దినములవి – భోగి, పెద్దపండుగ, కనుమ అను మూడు దినములును. తెలుగుదేశము వ్యవసాయప్రధానమైన దగుటవలన ప్రజలజీవన మంతయు పాడిపంటలమీదను, పశుసంపద మీదను ఆధారపడి యుండెను. వ్యవసాయమునకు బలిష్ఠమైన మంచివృషభ జాతి ఆవశ్యకము. మేలుజాతి ఎద్దులను తయారుచేయుటకు తెలుగుదేశమున పూర్వము కొన్ని గ్రామాలలో గ్రామస్థులు ఒక మాన్యమును ఏర్పాటు చేసికొనినట్లు స్థానిక చరిత్రలవలన తెలియుచున్నది. ఈ మాన్యమునకు 'గెలుపెద్దుల మాన్య' మని పేరు. కనుమ పండుగనాడు పశు ప్రదర్శనమును, ఎద్దుల పందెములును జరుగును. పరుగు పందెమునకు ఇప్పటి గుర్రపుపందెములలో వలెనే ఒకకొంత దూరము నిర్ణీతమగును. ఈ పరుగుపందెములో ఎవనియెద్దు గెలుచునో 'గెలుపెద్దులమాన్య' మాయేటికి ఆ గెలుపెద్దు గల యజమానిది. మరుసటి సంవత్సరము మరొకరియెద్దు గెలిచినచో ఈ మాన్యము ఆ యాసామికి పోవును. ఆ మాన్యము ఇప్పటి పందెములలోని 'రోలింగ్ కప్' వంటిది. 'గెలుపెద్దులమాన్యములు' ప్రతి గ్రామమునందు లేకపోయినను పశువుల నలంకరించి తెచ్చుట, కనుమ నాడు వేడుకలు జరుపుకొనుటమాత్రము ఉండెడిది.

సంక్రాంతి పండుగలలో జరుపుకొను వేడుకలలో కోడి పందెముల ఆట యొకటి. గరువు ప్రదేశమున ఆ యాటలు జరుగుటచే కొన్ని గ్రామముల దగ్గర ఇప్పుడీయాటలు లేక పోయినను 'కోడిపందేల గరువు' అను పేర కొన్ని గ్రామములలో స్థలవ్యవహారమున్నది. 'కోడిపందెములు' మన దేశములో ఇప్పటికి వేయిసంవత్సరములకు పూర్వమునుండి వాడుకలో నుండినయాట. దీనిని పదునైదవశతాబ్దములో ప్రాగ్దేశములను దర్శింపవచ్చిన విదేశ యాత్రికులుకూడ వర్ణించియున్నారు. ఇది దక్షిణహిందూ దేశములోనే కాక జావా, సుమత్ర మొదలైన ప్రాగ్ద్వీపములలో

సయితము వాడుకలో ఉండినట్లు వారి వృత్తాంతములవల్ల తెలియుచున్నది. కోడిపోరు పూర్వపు సంస్థానాధీశులకు చాలప్రియమైన వేడుకలలో ఒకటి యని పెద్దాపురపు 'కోడిపుంజుల కథ' మొదలైన జానపద గేయముల వలన తెలియుచున్నది. కోడిపందెములు గొప్ప యుద్ధములకును కారణములయినవి. పలనాటి వీరయుద్ధమునకు గల కారణములలో కోడిపందెముల ఆట ఒకటి.

పూర్వము జనులు వినోదించు వేడుకలు, కోడిపోరువంటివి, ఇంకను పెక్కులున్నవి. ఇవి క్రీడాభిరామము, భోజరాజీయము మొదలైన గ్రంథములలో పేర్కొనబడినవి. వృషభములపోరు, మేషయుద్ధము, దున్నపోతుల పోరు, గజయుద్ధము, పొట్టేళ్ళపోరు మొదలైనవి ఇట్టి వానిలో కొన్ని. ఇవి మధ్యయుగములో, అనగా ఇప్పటికి తొమ్మిదివందల సంవత్సరములకు పూర్వము ప్రజలకు చాల ప్రీతిగల వినోదములేమో. కుంతలదేశాధీశ్వరుడైన భూలోకమల్ల సోమేశ్వరభూపతి తాను రచించిన 'అభిలషితార్థ చింతామణి' అను నామాంతరముగల 'మానసోల్లాస' మను విజ్ఞానకోశమున ఈ వినోదముల వర్ణనమునకు పూర్తిగా ఒక ప్రకరణమునే తీసికొనెను. ఆ ప్రకరణమున ఏకాంగవీరుల మల్ల యుద్ధములను గుఱించియేకాక, గజ యుద్ధములు, అశ్వయుద్ధములు, ఆబోతుల దున్నపోతుల పోరాటములు, పొట్టేళ్ల పోట్లాటలు, కోళ్ళపోట్లాటలు మొదలైన వానిని అభివర్ణించియున్నారు. ఈ యొక్కొక్క పోరాటమునకు ఉండవలసిన రంగస్థలము, దానిని తయారు చేయుపద్ధతి, పోరాటమునకు సంబంధించిన ఇతర విషయములు అన్నియు ఆ ప్రకరణములో చెప్పబడినవి. కొండవీటి రెడ్డిరాజుల కాలమునాటికి ఏనుగుల పోరాటములు, గుఱ్ఱముల పోరాటములు మోటయి ప్రాతబడి వాడుకలో లేనట్లు తోచును. పొట్టేళ్ల పోట్లాట, కోడిపందెములు మొదలైనవి నేటికిని తెలుగుదేశములోని కొన్ని కొన్ని చోట్ల కానవచ్చును. భూనాథులకు ప్రియమై పూర్వము వాడుకలో నుండిన మరియొక క్రీడ వేట. ఈ వేటలో పాదివేట, విడివేట, తెరవేట, దామెనవేట అని పలురకములు కలవు. ప్రబంధములోని అష్టాదశ వర్ణనలలో వేట యొకటి.

పైని చెప్పినవే పూర్వము తెలుగు దేశములో ముఖ్యముగా వాడుకలో నుండిన వేడుకలు, వినోదములును. దేశ పరిస్థితి, కాలము మారుటతో పూర్వము వాడుకలో నుండిన వేడుకలు, వినోదములు చాల అంతరించినవి.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. పూర్వపు తెలుగువారి ఆటలను గురించి వివరించండి.
2. పూర్వ కాలంలోని వేడుకలు, వినోదాల గురించి రాయండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. గెలుపెద్దుల మాన్యమును గురించి రాయండి.
2. ధనుర్విద్య, కత్తిసాము, గుఱ్ఱపుస్వారి మొదలైన వాటి గురించి తెల్పండి.

3. చదరంగం గురించి రాయండి.

4. గ్రామసమూహ మాన్యమును వివరించండి.

## III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'హిస్టరీ ఆఫ్ రెడ్డీ కింగ్‌డమ్స్' ఎవరు రాశారు?

2. విజయనగర రాజుల వరకు దక్షిణ హిందూ దేశంలో ఉన్న క్రీడ ఏది?

3. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో విజయనగరాన్ని సందర్శించిన విదేశీ యాత్రికుడెవరు?

4. గుర్రపు స్వారిలో ఉద్దండుడైన రెడ్డిరాజు ఎవరు?

5. ప్రపంచానికి చదరంగం ఆటను ప్రసాదించిన దేశం ఏది?

7. హంసవింశతి గ్రంథాన్ని ఎవరు రాశారు?

❖ ❖ ❖

# 2 అర్థ విపరిణామం



- స్ఫూర్తిశ్రీ

శాస్త్ర గ్రంథాలను సరళతరం చేసి, తెలుగు జాతికి అందించిన ప్రముఖులు స్ఫూర్తి శ్రీ. స్ఫూర్తిశ్రీ అనేది కలంపేరు. వీరి అసలు పేరు తోకల భాస్కరరావు. వీరు 05.01.1928 తేదీన కాకినాడలో జన్మించారు. తల్లి దండ్రులు వీరాయమ్మ, బుచ్చిరాజు. కాకినాడలోని పిఠాపురం రాజా వారి విద్యా సంస్థల్లో పాఠశాల, కళాశాలల విద్యను పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. ఆనర్స్ పట్టా పొందారు.

1953 లో స్ఫూర్తిశ్రీ గుంటూరు ఏ.సి. కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా చేరారు. 1988లో పదవీ విరమణ పొందారు. 1960 దశకంలో అందుబాటులో ఉన్న భాష, వ్యాకరణం వంటి శాస్త్ర గ్రంథాలేవి విద్యార్థులకు కొరుకుడు పడేవికావు. అధ్యాపకులుగా స్ఫూర్తిశ్రీ ఆ విషయాన్ని గమనించారు. ఆయా శాస్త్ర గ్రంథాలన్నీ విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ సులభంగా అర్థమయ్యేలా అందుబాటులోకి తీసుకురావాలనుకున్నారు. అందులో భాగంగా అనేక గ్రంథాల్ని ప్రకటించారు.

స్ఫూర్తిశ్రీ రచనల్లో ముఖ్యమైనవి: 1. భోజుడి సరస్వతీ కంఠాభరణానికి తెలుగు వ్యాఖ్యానం. ఇది మూడు భాగాలు. 2. జయదేవుడి చంద్రాలోక సమున్మేషణానికి తెలుగులో అర్థవివరణ 3. ఔచిత్య ప్రస్థానము చారిత్రక సమీక్ష. ఇది క్షేమేంద్రుని ఔచిత్య సిద్ధాంతాన్ని వివరించే గ్రంథం. 4. బాల ప్రౌఢ వ్యాకరణాల వ్యాఖ్య. 5. తెలుగు భాషా చరిత్ర – ఈ శాస్త్ర గ్రంథాలు కాక; 6. 'స్ఫూర్తిశ్రీ వ్యాసావళి' పేరుతో సాహిత్య వ్యాసాలు రెండు భాగాలుగా వెలువడ్డాయి. స్ఫూర్తిశ్రీ బహుముఖీన ప్రజ్ఞకు ఈ రచనలు నిలువుటద్దాలు. ఆ రోజుల్లో వీరి గ్రంథాలు చదవకుండా ఉన్నత విద్యావంతులైనవారు ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ ఉండరంటే అతిశయోక్తి కాదు. తెలుగు భాషకు, తెలుగుజాతికి ఇంతటి మహత్తర సేవలందించిన స్ఫూర్తిశ్రీ 19.11.2015 తేదీన దివంగతులయ్యారు.

ప్రస్తుత పాఠ్యభాగం 'అర్థ విపరిణామం' స్ఫూర్తిశ్రీ రచించిన 'తెలుగు భాషా చరిత్ర' లోని అర్థప్రకరణం నుంచి గ్రహించబడింది. అర్థ విపరిణామం అంటే అర్థాలలోని మార్పు అని అర్థం. పదాల అర్థాలలో మార్పులు ఎందుకు జరుగుతున్నాయి? ఏ విధంగా జరుగుతున్నాయి? అనే విషయాలు ఈ పాఠ్యభాగం ద్వారా విద్యార్థులు గ్రహించగలరు. ఎన్నో ఆసక్తికరమైన విషయాలు అందించడం ద్వారా, విద్యార్థులకు మాతృభాష పట్ల ఆసక్తినీ, అవగాహననూ మరికొంత పెంచడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

# పాఠ్యభాగం

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ"

అని కాళిదాసు పార్వతీపరమేశ్వరులను సంభావించెను. వాగర్థము లొకదాని నొకటి విడిచియుండవు. వాక్కు లేనిచో అర్థ మభివ్యక్తముకాదు. అర్థము లేని ధ్వనిని శబ్దమని యనరు. అర్థయుక్తమయిన ధ్వనిసమూహమునే శబ్దమని యందురు.

వృద్ధ వ్యవహారము, ప్రసిద్ధార్థపదసాన్నిధ్యము, ఆప్తోపదేశము మున్నగునవి అర్థ గ్రహణమునకు సాధనములై పనిచేయును. మాట లాడుటలో వక్త సౌలభ్యము నపేక్షించునట్లే వినుటలో శ్రోతయు లాఘవము నపేక్షించును. ఈ లాఘవాకాంక్ష శాబ్దికవిపరిణామము నందువలెనే ఆర్థికవిపరిణామమునందును అధికముగా పనిచేయును. ఒక శబ్దమును విని, దానిని తప్పుగా నర్థము చేసికొనుట సంభవింపవచ్చును. ఒక్కొకప్పుడు అనవధానతవలన సామ్యముగల మరే పదముయొక్క అర్థమునో దీనికి పట్టించుట జరుగవచ్చును. అటుకాక అవసరమునుబట్టి ఒక పదమును విస్తృతార్థములోనో, సంకుచితార్థములోనో ఉపయోగించుటయు జరుగుచుండును. ఈ విధముగా భిన్నభిన్నములగు కారణములు అర్థములలో భిన్నభిన్నములయిన మార్పులను గొనితెచ్చును. వానిలో కొన్నింటిని ప్రయోగవైరళ్యమునుబట్టి పరిహరించినను, కొన్నింటిని ప్రామాణికములుగా అంగీకరింపక తప్పదు. భాషాశాస్త్రజ్ఞులు ఈ మార్పులను ఐదువిధములుగా నిరూపించిరి.

**1. అర్థ సంకోచము:** సామాన్యార్థమును బోధించు శబ్దము క్రమముగా సంకుచితత్వము నొంది కేవల విశేషమునే బోధించుట అప్పుడప్పుడు కనిపించును. 'చీర' యను శబ్దమునకు 'వస్త్రము' అని మాత్రమే అర్థము ప్రారంభకాలముననున్నది. 'సీతారాము లిర్వురును నారచీరలు ధరించిరి' అనునపుడు 'చీర' సామాన్యవాచకము. నేటికాలమున స్త్రీలు ఉపయోగించు వస్త్రమునకు మాత్రమే 'చీర' యను వ్యవహారము గలదు.

'వ్యవసాయము' అని యనగా 'పని' యని మాత్రమే యర్థము. 'పాపవ్యవసాయమునందు బుద్ధి వదలక నిలిపెన్' అను ప్రయోగము నందు 'పాపకృత్యము' అను నర్థమే సంగతమగును. అయినను ఈనాడు ఈ పదము 'సేద్యము' అను అర్థమును బోధించుచు సంకోచము నొందినది. దీనితో సమానార్థకమైన 'కృషి'యను పదము కూడ ఇట్టి సంకుచితత్వమునకు కొంతగా లోనైనది. 'శ్రమపడుట' అను అర్థము గల ఈ మాట నేటికి 'వ్యవసాయము'గా మారినది. 'కృషిచేయువాడు' 'కృషికు'డై, గుణమునొంది 'కర్షకుడు' కూడనయ్యెను. 'ప్రయత్నము' అను నర్థము గల 'ఉద్యోగము' అను పదము ఆంగ్లములోని 'job' అను పదముతో సమానమైనది. ఉద్యోగ పర్వమునాటి 'ఉద్యోగము' నేటి వ్యవహారమున పొరపాటున కైనను కనిపించుట లేదు.

**2. అర్థ వ్యాకోచము:** వ్యుత్పత్తినిబట్టి యొక యర్థమున నేర్పడిన పదము విస్తృతముగా నుపయోగింపబడుట కూడ కలదు. 'తైలము' అను పదమునకు 'తిలలనుండి తీయబడినది' అని యర్థము. కావున కేవలము నువ్వులనూనెకు మాత్రమే యిది వాచకము కావలయును. కాని మందార తైలము, భృంగామలక తైలము, మాష తైలము మున్నగు వానియందు 'తైలము' విశేషార్థబోధకత్వమును గోల్పోయినది. ఇట్లే తెలుగునందలి 'నెయ్'అను పదము స్నిగ్ధతాబోధకము. కావున 'ఆవు నెయ్యి' మున్నగుచోట్ల ఆ వైశిష్ట్యమును నిలబెట్టుకొని యున్న దన వచ్చును. కాని 'నువ్వుల నేయి' యను నర్థమున 'నూనె' అని యైనది. కాని, యిది మరల వ్యాప్తినిపొంది నువ్వుల నూనె, అవిసె నూనె, వేరుసెనగ నూనె, కొబ్బరి నూనె మున్నగువిధముగా నైనది. 'నూనె' యనునప్పుడు 'సారభూత మగు స్నిగ్ధపదార్థము' అను నర్థము మాత్రమే మిగిలియున్నది.

'దీపపు సెమ్మె' యనుమాట తెలుగున వాడుకయందు గలదు. దీనికి 'దీపము పెట్టుకొను స్తంభము' అని యర్థము. పారశీకమునందు 'శమా' అనగా దీపమని యర్థము. అదియే తెలుగున 'సెమ్మె' అని మారినది. అచ్చట ఆధేయమునకు వాచకమైనది యిచ్చట ఆధార వాచకమైనది.

'మాఘము చదువుచుంటిని' 'భారవి పూర్తిచేసితిని' మున్నగు వాక్యములందు 'మాఘము' మాఘకవి రచనయైన శిశుపాలవధను నిర్దేశించును. 'భారవి' యనునప్పుడు కేవలము కవిని గాక కవికార్యమైన కిరాతార్జునీయకావ్యమును నిర్దేశించును. ఇట్టి యన్వయమును ఆంగ్లేయులు అలంకారముగా పరిగణించి Metonymy అని పిలుతురు. ఇచ్చటకూడ వ్యాప్తియే కనిపించును.

**3. గ్రామ్యత్వము:** తొలుత మంచి యర్థములో నుండి క్రమముగా అంతకంటె తక్కువ స్థితికి దిగజారిన పదములు ప్రతిభాషలో నుండును. తెలుగున 'కంపు' అను పదము అటువంటిది. ప్రారంభకాలములో వ్యాపించుట అను స్వభావమును బట్టి సౌగంధ్యమునకు వాచకమైనది. కాని క్రమముగా దుర్గంధమునందు రూఢిని సంపాదించుకొన్నది. ఈనాడు 'వాసన' యను పదముకూడ ఈ స్థితిలో నున్నది. సువాసన అని వాడినప్పుడే పరిమళము అను స్ఫురణము కలుగుచున్నది. అటుగాక 'వాసన' యని వాడునెడల దుర్గంధము అనునదే యెక్కువ వ్యాప్తిలో నున్న యర్థము.

'సంభావన' యనగా 'గౌరవము' అని యర్థము. గౌరవపూర్వకముగా ఇచ్చిన ద్రవ్యమునకు సంభావన వాచకమైనది. నేటికాలమున సంభావన యిచ్చుచోట్ల గౌరవ మదృశ్యమైనది. 'ఛాందసుడు' అని యనగా వేదవిద్య తెలిసినవాడని యర్థము. ఈనాడు 'మూర్ఖుడు' అను నర్థముతో వాడుకలో నున్నది.

'శుశ్రూష' అనగా వినవలయు నను కోరిక యని యర్థము. పూర్వము విద్యార్థులు శుశ్రూషతో గురువులను చేరెడివారు; గురుకుల సంప్రదాయానుసారము పరిచర్య చేసెడివారు. కావున అనుచితసంపర్కము (Wrong Association) వలన శుశ్రూష యనగా పరిచర్య యను నర్థమేర్పడినది. ఈవిధమగు మార్పును ఆంగ్లమున Degradation అని యందురు.

**4. సౌమ్యత్వము:** ఉత్తమమగు శబ్దము నుపయోగించి నాగరకులు అర్థమునందలి తక్కువదనమును తగ్గింపజూచుట సహజలక్షణము. ఒక విధమగు సౌకుమార్యము నాగరకుల చేతలందును, భాషయందును కనిపించును. 'చచ్చెను' అని చెప్పుటకు బదులుగా పరమపదించెను, పంచత్వము నొందెను, స్వర్గము నలంకరించెను, శివైక్యము నొందెను మున్నగువిధముగా పలుకుట సౌమ్యత్వము. 'బియ్యము అయిపోయినవి' అని చెప్పుటకు బదులుగా 'నిండుకొన్నవి' అనియు 'దీపము ఆరిపోయినది' అనుటకు బదులుగా 'కొండయెక్కినది' అనియు 'నల్లపూసలు తెగిపోయినవి' అనుటకు బదులుగా 'పెరిగినవి' అనియు పలికి, అమంగళ నిరాసము గావించుట ఆచారము. ఎక్కడకైనను వెళ్ళునపుడు 'వత్తును' అని కాని 'వెళ్ళి వత్తును' అని కాని అనుట ఈ విధమగు మనస్తత్త్వమునే నిరూపించును.

'పాకీవాడు' అను పదము తెలుగున విచిత్రమైనది. 'పాక్' అనగా ఉర్దూభాషలో 'పవిత్రమైన' అని యర్థము. దానిపైని తచ్ఛబము చేరి 'పవిత్రమైనవాడు' అనికాని, 'పవిత్రము చేయువాడు' అనికాని యర్థమగునట్లు 'పాకీవాడు' అను పద మేర్పడినది. హిందీలో కూడా ఈ విధమగు చరిత్రయే యిచట కనిపించును. 'పాకీవాడు' అనుటకు 'మహితర' అను పదము కలదు. ఇది 'మహత్తర' శబ్దభవము. దీనికి చాలా గొప్పవాడని యర్థము. వృత్తిలోని నైచ్యమును ఇట్టి సౌమ్యత్వము తగ్గించునని యూహ యేమో?

'దేవతలకు ఇష్టుడు' అను నర్థముగల 'దేవానాం ప్రియ' యను శబ్దము 'వట్టి మూర్ఖుడు' అను నర్థమును బోధించును. పైకి చూచి నప్పుడు గొప్పగా కనిపించుచు, విపరీతార్థమునిచ్చు ఈ పదములుకూడా సౌమ్యార్థమునకే సాక్ష్యములు. 'అగస్త్యభ్రాత' యనునప్పుడు 'అగస్త్యుడు' మహాతపస్వి కావున అతని సోదరుడు నంతటివాడే యైయుండు ననిపించును, కాని 'అగస్త్యభ్రాత' యనగా 'మూర్ఖుడు' అని యర్థము. ఈ విధమగు సౌమ్యత్వమును ఆంగ్లమున Euphemism అని యందురు.

**5. సంకేతము:** కొందరు కొన్ని సంకేతములను కల్పించుకొని మాటాడుకొనుచుందురు. ఇట్టి సంకేతములు వృత్తులనుబట్టి, కులములనుబట్టి కూడ ఏర్పడుచుండును. ఒక గుంపు జనము మాటాడు సాంకేతికములు రెండువగుంపువారికి పూర్తిగా ముసుగుమాటలుగా నుండును. వైదికుల పరిభాషలో 'యత్పుణ్యం' అని యనగా 'పావులా' అని యర్థము. 'ఇంద్రాణి' అని యనగా 'వితంతువు' అని యర్థము. తగవుల మారి స్వభావము గలవారికి 'చండిక' యని, విశ్వామిత్రుడని, దుర్వాసోమహర్షి అని పేరు పెట్టుట కలదు. తగవులు పెట్టుస్వభావము గల వారికి 'నారదుడు' అని పేరు పెట్టుచుందురు. స్వాతంత్ర్యమునకు పూర్వము రక్షకభటులకు ఎఱ్ఱటి టోపీలు ఉండెడివి. వానినిబట్టి వారికి 'ఎఱ్ఱఅగ్గిపుల్లలు' అను పేరుండెడిది. చండశాసనుడైన అధికారికి 'యముడు' అని, మంచివానికి 'ధర్మరాజు' అనిపేరు పెట్టుట కలదు. కొన్ని యెడల తద్విపరీతముగా కూడ వాడుట కనిపించవచ్చును. 'హరిశ్చంద్రుడు' అని అబద్ధములు చెప్పువానిని పిలుచుటయు కలదు. అట్లే బుద్ధిమంతుడు, తెలివైనవాడు మున్నగునవి తద్విపరీతులనుగూర్చి యుపయోగించుటయు కనిపించును.

గంగిగోవు, లేడిపిల్ల, తాబేలు మున్నగునవి స్వభావమును, చురుకుదనమును, నడకను బట్టి పెట్టెడి పేళ్ళు. ఎఱ్ఱతేలు, పచ్చిమిరపకాయ, సీమటపాకాయ మున్నగునవి లోపలి చురుకుదనమును గమనించి పెట్టెడి పేళ్ళు. వీనియందు రూపకల్పనమో, సాదృశ్యసంధానమో యేదో యొకటి యుండును.

ఈ విధముగా మానవుడు తన కందుబాటులో నున్నంత వరకు మాటలను మలుచుకొని యుపయోగించుకొనుచుండును. అర్థగ్రహణమునందలి అసమర్థతయే కాక, భంగ్యంతరమున వాడుటలోని ఆకర్షణయు ఆసక్తియు కూడ ఈ మార్పులకు కారణములు. మానవుని మనస్తత్వములోని వైశిష్ట్యమే భాషయందలి శాబ్దికార్థికవిపరిణామములకు ప్రధానమైన కారణమని భావింపవచ్చును. ఇతరములగు కారణములు దీనికి సహకారులై పనిచేయును. అర్థములందు గలుగు మార్పులను దెలుపు భాగమును శాస్త్రజ్ఞులు Semantics అని పిలుతురు. వేర్వేరు పదముల యర్థములను, అవి పొందిన మార్పులను, వాని కారణములను పరిశీలించుట ప్రత్యేక మొకగ్రంథము కాదగినంత విషయము.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. అర్థ సంకోచ, వ్యాకోచాల గురించి తెల్పండి.
2. అర్థ గ్రామ్యతను, సౌమ్యతలను వివరించండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. అర్థవిపరిణామంలో 'సంకోచము'ను గురించి రాయండి.
2. అర్థవిపరిణామంలో 'వ్యాకోచము'ను గురించి రాయండి.
3. అర్థవిపరిణామంలో సంకేతార్థం గురించి రాయండి.
4. స్ఫూర్తిశ్రీ సాహిత్య కృషిని తెల్పండి.

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. స్ఫూర్తిశ్రీ అసలు పేరేమిటి?
2. 'చీర' అను పదానికి పూర్వకాలంలో గల అర్థమేమిటి?
3. పూర్వ కాలంలో వ్యవసాయము అంటే అర్థమేమిటి?
4. భారవి రచించిన గ్రంథం పేరేమిటి?
5. మాఘకవి రచించిన గ్రంథం పేరేమిటి?
6. నేటికాలమున నారదుడు అంటే అర్థమేమిటి?

❖ ❖ ❖

3

# చాటువులు

- సి. నారాయణ రెడ్డి



## రచయిత పరిచయం

**మా**నవుణ్ణి తనకవిత్వానికి కేంద్ర బిందువుగా చేసుకొని, ప్రత్యక్షరంలోనూ మానవత్వాన్ని పరిమళింపచేసిన కవి, రచయిత, పరిశోధకుడు సినారె. సినారె అనేది సంక్షిప్తనామం. వీరి పూర్తి పేరు సింగిరెడ్డి నారాయణ రెడ్డి. వీరు 29.07.1931 తేదీన జన్మించారు. బుచ్చమ్మ, మల్లారెడ్డి వీరి తల్లిదండ్రులు. తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా, సిరిసిల్ల దగ్గరున్న హనుమాజీపేట సినారె స్వగ్రామం.

హనుమాజీపేటలో ప్రాథమిక విద్యలో ప్రారంభమైన నారాయణ రెడ్డి విద్యాభ్యాసం సిరిసిల్ల, కరీంనగర్ మీదుగా హైదరాబాదు నగరం చేరుకుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పొందిన సినారె సికిందరాబాదు ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలోనూ, నిజాం కళాశాలలోనూ అధ్యాపకులుగా పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పదవీవిరమణ పొందారు.

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాలకు నారాయణరెడ్డి ఉపాధ్యక్షులుగా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు.

వివిధ సాహిత్య ప్రక్రియల్లో సినారె రచనా వ్యాసంగం కొనసాగింది. సుమారు 70 కి పైగా గ్రంథాలను ప్రకటించారు. వీటిలో గేయకావ్యాలు, వచనకావ్యాలూ, గజళ్ళు, విమర్శనా వ్యాసాలూ, పరిశోధనా గ్రంథాలు వంటివి అనేకం ఉన్నాయి. విశ్వంభర, కర్పూర వసంత రాయలు, నాగార్జున సాగరం, మంటలూ మానవుడూ, మట్టి మనిషి ఆకాశం వంటివి నారాయణరెడ్డిని నిలువెత్తు కవిగా నిలబెట్టాయి. వీటిలో 'విశ్వంభర' వచన మహా కావ్యానికి జ్ఞానపీఠ అవార్డు లభించింది. 'మంటలూ మానవుడు' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమి బహుమతి సిద్ధించింది.

1962 లో సినారె సినిమా రంగంలోకి ప్రవేశించారు. సినిమా సాహిత్యానికి సాహిత్య గౌరవాన్ని మరికొంత పెంచారు. వీరు రచించిన అనేక చలనచిత్ర గేయాలు విశేష ప్రాచుర్యాన్ని పొందాయి. కవిగా నారాయణ రెడ్డి దృష్టి ఎంతటి తీక్షణమైందో; విమర్శకుడిగానూ, పరిశోధకుడిగానూ వీరి దృష్టి అంత లోతైంది. 'ఆధునికాంధ్ర

కవిత్వము – సంప్రదాయములు ప్రయోగములు' అనే సిద్ధాంత గ్రంథం అందుకొక నిదర్శనం. ఎందరో పరిశోధకులకు ఇది ఈ నాటికీ పరమ ప్రామాణిక గ్రంథం. సాహిత్య రచనలో ఏనాడూ అలసిపోని సినారె 12.06.2017 తేదీన తుదిశ్వాస విడిచారు.

సినారె రచనలన్నీ 'డా॥ సి. నారాయణ రెడ్డి సమగ్ర సాహిత్యం' పేరుతో 18 సంపుటాలలో ప్రచురించబడ్డాయి. ప్రస్తుత పాఠ్యభాగం 'చాటువులు' 18వ సంపుటంలో చోటు చేసుకుంది.

'చాటువులు' అంటే కవులు సరదాగా ఎప్పటికప్పుడు చెప్పుకొనే పద్యాలు. వీటిలో చమత్కారాలు, హాస్యాలు మాత్రమే కాదు జీవిత వాస్తవాలు కూడా ఉంటాయి. చాటువు అనేది సాహిత్యంలో ప్రత్యేకించి ఒక ప్రక్రియ కాకపోయినప్పటికీ కావ్యాలలో కంటే భిన్నమైన రుచి ఈ చాటువుల్లో ఉంటుంది. ఒకనాటి ఆ ప్రత్యేక రుచిని ఈ నాటి విద్యార్థులకు ఆస్వాదింపచేయడం, వారి దృష్టిని చరిత్ర పుటల్లోకి; సజీవ సంస్కృతి మీదకి మరల్చడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

చాటువు అంటే ప్రియమైన మాట. ఇది అచ్చమైన సంస్కృత శబ్దం. మనవాళ్లలో కొందరు ఈ శబ్దాన్ని చదర, చాప అన్న దోరణిలో ముచ్చటగా ఉచ్చరిస్తుంటారు. ఈ శబ్దం తెలుగు భాషలో ఎంత బాగా జీర్ణమైపోయిందో దీనిని బట్టి తెలుస్తుంది. ఇంతకూ చాటుపద్యమంటే కవి సరదాగా చెప్పిన పద్యమన్నమాట. ఒక భోగిచేత సీత్కరింపబడినప్పుడో, ఒక లోభిచేత సత్కరింపబడినప్పుడో, అందమైన దృశ్యం కనబడినప్పుడో, డెందం గాయపడినప్పుడో, అనిష్టం తొంగిచూసినప్పుడో, హాస్యం లాస్యం చేసినప్పుడో, అనేక సందర్భాల్లో చిత్రమైన చిత్తవృత్తుల్లో ఛందోరూపంలో జుమ్మని చిమ్ముకొనివచ్చే కవితారూపాలే ఈ చాటుపద్యాలు. ఆంధ్ర సాహిత్యంలో ఒకవైపు మందాకినీ సదృశమైన మహాకావ్యాలు వెలువడుతుంటే, మరోవైపు సెలయేళ్లలాంటి చాటుపద్యాలు గలగల ప్రవహించినవి. నైషధంలాంటి విద్వదౌషధాన్ని అందించిన శ్రీనాథకవిసార్వభౌముడే 'చిన్న చిన్న రాళ్లు చిల్లర దేవుళ్లు' వంటి చిట్టిపొట్టి చాటువులతో చిందులువేశాడు. తాటాకు మడతల్లో, వృద్ధుల నాల్కల్లో ఒదిగివున్న ఈ చాటువులకు తొలిసారిగా వెలుగు చూపిన వారు కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. ఇక కొన్ని చాటువులను తీసుకొని వాటిలో ప్రతిబింబించిన ప్రజా జీవనరేఖల్ని పరిశీలిద్దాం.

కొన్ని చాటుపద్యాలు జానపద గేయాల్లాగా కవిపేరు తెలియకుండా ఉండిపోయినవి. పిల్లల మొదటి వాచకంలో సాధారణంగా కనిపించే "చేత వెన్నముద్ద చెంగల్వ పూదండ" అనేది ఆబాలగోపాలానికి తెలిసిన చాటుపద్యం. దీని

కర్తయెవరో తెలియదు. అలాగే సామెతల్లాగా ఉపయోగించే పద్యాలు కొన్ని ఉన్నాయి. 'వాసనలేని పువ్వు, బుధవర్గము లేని గృహంబు' ఇదీ చాలా పేరుమోసిన పద్యమే. కవిపేరు స్పష్టంగా తెలియదు. అయినా ఈ పద్యాలు అక్షరాస్యుల నిత్యజీవితంలో అవినాభావంగా అల్లుకుపోయినవి.

చాటుపద్యాలు చెప్పిన ప్రాచీనాంధ్ర కవుల్లో వేములవాడ భీమకవి, శ్రీనాథుడు, తెనాలి రామకృష్ణుడు, అడిదము సూరకవిలాంటివారు గణనీయులు. చిత్రమేమిటంటే భీమకవి కేవలం చాటువులద్వారానే ఇంతకాలం బ్రతికివున్నాడు. భీమకవి పేర చలామణిలో ఉన్న చాటువుల్లో ఒక్కొక్కటి ఒక్కొక్క చారిత్రక వృత్తాంతానికి, ఒక గుప్త సత్యానికి గవాక్షాలు తెరుస్తుంది.

"గడియలోపల తాడిగడగి ముత్తునియగా
　　తిట్టిన మేధావిభట్టుకంటె
రెండుగడెల బ్రహ్మదండి ముండ్లన్నియు
　　దుల్లదిట్టిన కవిమల్లుకంటె
మూడు గడెలకు తామొనసి యెత్తినగండి
　　పగుల దిట్టిన కవిభానుకంటె
అరజాము లోపల చెఱువు నీళ్లింకంగ
　　దిట్టిన బడబాగ్నిభట్టుకంటె
ఉగ్రకోపి నేను నోపుదు శపియింప
గ్రమ్మరింప శక్తి గలదు నాకు
వట్టిమ్రాన చిగురు పుట్టింప గిట్టింప
బిరుదు వేములవాడ భీమకవిని"

ఈ పద్యంలో తిట్టుకవుల పట్టిక ఉంది. మేధావిభట్టు, కవిమల్లుడు, కవిభానుడు, బడబాగ్నిభట్టు – ఈ నలుగురూ ఒకరిని మించి ఒకరు తిట్టుకవుల్లో దిట్టలట. ఈ కవులనుగురించి పరిశోధించటానికి సాహిత్యచారిత్రకులకు కావలసిన మేత వేసిందీ పద్యం. భీమకవి ఇతర చాటువుల్లో పేర్కొన్న సాగిపోతరాజు, సాహిణిమారుడు, మైలమభీముడు, కళింగగంగు లాంటి వ్యక్తులుగూడ చారిత్రకులకు పరిశోధనాంశాలుగా మిగిలిపోయాయి.

అకర్తృకంగా ఉండిపోయిన పద్యాల్లో ఖడ్గతిక్కన నుద్దేశించి అతని భార్య, తల్లి పలికిన రెండు కావ్యాల గరిమను, గంభీరతను సంతరించుకొన్నవి. ఖడ్గతిక్కన మనుమసిద్ధి పక్షాన నిల్చి కాటమరాజు నెదిరించిన

మహావీరుడు. ఇతడు రణరంగంలో కొంతసేపు భీషణంగా పోరాడి, తన సేనలు చెల్లాచెదురై పారిపోగా పోరు విరమించుకొని ఇంటిముఖం పట్టాడట. ఇంట్లో భార్య నులకమంచం అడ్డునిలిపి, దాని మీద పసుపుముద్ద ఉంచి, ప్రక్కన నీళ్లచెంబు పెట్టిందట. ఇదేమిటని తిక్కన అడుగగా

"పగరకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకు లెందున్
ముగు రాడువార మైతిమి
వగ పేటికి జలకమాడ వచ్చిన చోటన్"

అని ఎత్తి పొడిచిందట. ఆ తర్వాత తల్లి అన్నంలో విరిగిన పాలు పోసిందట. ఇదేమిటని ప్రశ్నిస్తే–

అసదృశముగ అరివీరుల
మసిపుచ్చక విరిగి వచ్చు మగపందక్రియన్
కసవున్ మేయగ బోయిన
పసులున్ విరిగినవి తిక్క! పాలున్ విరిగెన్

అంటూ అధిక్షేపించిందట. ఈ పొడుపు మాటలకు లజ్జితుడై చివాలున లేచిపోయి ఖడ్గతిక్కన కదనరంగంలో శత్రువుల నెదిరించి వీరస్వర్గమలంకరించినాడు. ఈ చాటుపద్యాలు రెండూ సానలుదీరిన పద్యరచనకు, నిగ్గు దేరిన భావగరిమకు దృష్టాంతాలుగా నిలిచిపోయినవి. ఖండికలుగా కనిపించినా అఖండ సందేశాన్ని పొదుగుకున్నవి. తరతరాలుగా అనేకులచేత ఉదాహరింపబడుతూ ప్రజల్లో వీరతాస్ఫూర్తిని కలిగిస్తున్నవి.

చాటు పద్యాలలో ప్రజాజీవనాన్ని ముమ్మూర్తులా చిత్రించిన మొనగాడు శ్రీనాథుడు. ఈ కవీంద్రుడు ప్రౌఢదేవరాయలను దర్శించడానికి కర్ణాట రాజ్యానికి వెళ్లాడు. రాజ దర్శనం కోసం కాలయాపనం జరిగింది. కర్ణాట రాజ్యలక్ష్మిని ఇలా ప్రార్థించాడు.

కుల్లాయుంచితి కోక చుట్టితి మహాకూర్పాసమున్ తొడ్గితిన్
వెల్లుల్లిన్ తిలపిష్టమున్ మెసవితిన్ విశ్వస్త వడ్డింపగా
చల్లాయంబలి ద్రావితిన్ రుచుల దోసంబంచు పోనాడితిన్
తల్లీ కన్నడ రాజ్యలక్ష్మీ! దయలేదా నేను శ్రీనాథుడన్

నాటి కర్ణాటదేశీయుల వేషంతోపాటు భోజన విశేషంకూడా ఈ పద్యంలో బయటపడింది. అలాగే ఇతడు పలనాడు వెళ్ళినప్పుడు అక్కడ 'జొన్నకలి, జొన్నయంబలి, జొన్నన్నము, జొన్నపిసరు' తప్ప 'సన్నన్నము సున్న' అని స్పష్టంగా చెప్పాడు. పలనాటికి రంభ వెళ్లినా ఏకులే వడుకుతుందని, కుసుమాస్త్రుడు వెళ్లినా జొన్నకూడే కుడవక

తప్పదని నాటి పలనాటి జీవనాన్ని చమత్కారంగా చిత్రికపట్టాడు. సామాన్య గ్రామ పురోహితుని యింటిస్థితిని వర్ణిస్తూ-

దోసెడు కొంపలో పసుల త్రొక్కిడి, మంచము, దూడ రేణమున్
పాసిన వంటకంబు, పసి బాలుర శౌచము, విస్తరాకులున్
మాసిన కుండలున్...

అంటూ ఏకరువు పెట్టాడు. మసర రాజ్యంలో మనుషులెలా ఉంటారో బొమ్మగీసి చూపాడు. పడమటిసీమ వ్యాపారుల దస్త్రాలను, మసిబుర్రలను, కలములను, చింతంబళులను, చెమటబట్టిన నీర్కావులను, భయంకరమైన గడ్డాలను పట్టిక ఇవ్వడమే కాకుండా, 'వస్తూ చూస్తిమి రోస్తిమి' అంటూ అప్పటి యాసనుగూడా తమాషాగా అనుకరించాడు. మరి అప్పటి దక్షిణ దేశీయుల భోజన పదార్థాలను గురించి శ్రీనాథునికి కలిగిన వైముఖ్యం ఈ పద్యంలో బాగా కనిపిస్తుంది.

తొలుత నే వడ్డింత్రు దొడ్డమిర్యపు చారు
చెవులలో పొగవెళ్లి చిమ్మిరేగ
పలు తెఱంగులతోడ పచ్చళ్ళు చవిగొన్న
బ్రహ్మరంధ్రము దాక పారునావ
అవిసాకు వేఁచిన ఆర్నెల్లు ససిలేదు
పరిమళ మెంచిన పండ్లుసొగచు
వేపాకు నెండించివేసిన పొళ్లను
కంచాన గాంచిన క్రక్కువచ్చు

ఇలాగా ఆయా ప్రాంతాలకు వెళ్లినప్పుడు శ్రీనాథుడు అక్కడి ఆచారవ్యవహారాలను బహుచమత్కారంగా చిత్రించాడు. అంతటితో ఊరుకోలేదతడు. కులానికొక్క కుసుమాంగినేరి కులాసాగా వర్ణించాడు. ఎన్నో తెగల అన్నులమిన్నలు వారి వారి భూషావైవిధ్యంతో శ్రీనాథుని చాటువుల్లో సింగార మొలకుతూ కనిపిస్తారు. ఈ కవి సార్వభౌముడు తాను రత్నాంబరాలు ధరిస్తూహేమపాత్రాన్నం భుజిస్తూవున్న సందర్భంలో చెప్పిన చాటువుల్లోనే కాదు, అవసానదశలో గుండెలవిసిపోయేట్టు ఆలపించిన 'కవిరాజు కంఠంబు కౌగిలించెనుగదా' అన్న పద్యంలోగూడ నాటి ప్రజాజీవనరేఖ తళుక్కుమంటుంది. చేతికి వెదురుగొడియ తగిలించడం, నగరి వాకిటవుండే నల్లగుండు భుజంమీదికెక్కించడం నిర్బంధితునికి ఆ రోజుల్లో విధించే దండనల్లో కొన్ని అని ఈ పద్యంవల్ల తెలుస్తుంది.

కొన్ని కొన్ని చాటుపద్యాలు తులలేని చారిత్రక సత్యాలకు నిలువుటద్దాల్లాగా నిలిచిపోయినవి. అడిదము సూరకవి చెప్పిన ఈ పద్యం అందుకు మచ్చుతునక.

మెత్తనైయున్న అరటాకు మీదగాక
మంటమీదను చెల్లునే ముంటివాడి
బీదలైయున్న మా బోంట్ల మీదగాక
కలదె క్రొవ్వాడి బాదుల్లఖానుమీద

పూసపాటి విజయరామరాజు తమ ఆస్థానకవిగా ఉన్న అడిదము సూరకవిపై ఆగ్రహంపూని తొలగించడం, ఆ రాజుగారే ఒకమాటు బాదుల్లాఖానుతో యుద్ధం చేయబోయి పరాజితుడై తిరిగిరావడం, ఆ సందర్భంలో సూరకవి ఈ పద్యంద్వారా చురుకుపెట్టడం అనే చారిత్రక వృత్తాంతం ఈ పద్యం వల్ల స్పష్టమవుతుంది. అయితే విజయరామరాజు మొదట బాదుల్లాఖానును పారద్రోలిన ఉదంతాన్నిగూడా సూరకవి కీర్తించినట్లు 'ఢిల్లీలోపల గోలకొండపురి నిండన్ నీ ప్రశంసల్" అనే చాటువు చెబుతుంది.

ఇక పొగాకు, సన్నబియ్యంలాంటి పొడిపొడి విషయాలనుగూర్చి ఉన్న చాటువుల్ని పరిశీలిస్తే వాటిపట్ల ప్రజలకూ, కవులకూగల ఆసక్తి బయటపడుతుంది.

చమత్కారం చాలాదూరం పోయిందిగదూ! ఇది సరే. కవులే కవుల్ని ఈసడిస్తూ చెప్పిన పద్యాలూ ఎంతో ముచ్చటగా ఉన్నవి. 'గాడిద నీవు నున్ కవివి కాదుకదా' అనే శ్రీనాథుని పద్యం ప్రసిద్ధమైనదే. అకర్తృకమైన ఇంకొక పద్యం ఇలాంటిదే ఉంది.

దేవునాన మున్ను దేశాన కొకరుండ
ఇప్పు దూరనూర ఇంటనింట
ఏవు రార్వు రేడ్వు రెనమండ్రు తొమ్మండ్రు
పదువురైరి కవులు పద్మనాభ

ఈ అభిప్రాయం ఈ రోజుల్లోనే కాదు ఆ రోజుల్లోనూ ఉందనేది ఈ పద్యం వల్ల తేలింది.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. 'చాటువు' గురించి వివరించండి.
2. చాటు పద్యాల్లో ప్రజాజీవనాన్ని వివరించండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. వేములవాడ భీమకవి గురించి తెల్పండి.
2. ఖడ్గతిక్కనకు సంబంధించిన చాటువృత్తాంతాన్ని తెల్పండి.
2. అడిదము సూరకవి చాటుపద్యాన్ని వివరించండి.

## III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు; ప్రయోగములు' అనే పరిశోధనాగ్రంథ కర్త ఎవరు?
2. చాటువులను వెలుగులోకి తెచ్చిన వారెవరు?
3. ఖడ్గతిక్కన ఎవరి తరపున యుద్ధం చేశాడు?
4. శ్రీనాథుడు ఏ విజయనగర రాజును దర్శించాడు?
5. 'విద్వదౌషధం'గా పేరుగాంచిన గ్రంథమేది?
6. పూసపాటి విజయరామరాజు ఆస్థానకవి పేరేమిటి?
7. 'చాటువు' అంటే ఏమిటి?

❖ ❖ ❖

# 4 వేమన కవిత్వము

- రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ



## రచయిత పరిచయం

తెలుగు వారిలో గొప్ప సంగీతజ్ఞులున్నారు. అంతకంటే గొప్ప సాహితీ మూర్తులూ ఉన్నారు. ఈ రెంటి లోనూ సమ ప్రావీణ్యం ఉన్నవారు చాలా అరుదు. అటువంటి సవ్యసాచుల్లో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఒకరు. 23.01.1893 తేదీన రాళ్ళపల్లి జన్మించారు. అనంతపురం జిల్లా, కల్యాణదుర్గం దగ్గర ఉన్న రాళ్ళపల్లి అనే కుగ్రామం వీరి స్వగ్రామం. తల్లిదండ్రులు అలివేలు మంగమ్మ, కృష్ణమాచార్యులు. ఈ దంపతులు సరస్వతీ దేవి స్తనద్వయం లాంటివారు. ఒకరు సంగీతంలోనూ, మరొకరు సాహిత్యంలోనూ అభినివేశం ఉన్నవారు. తండ్రి నుంచి సాహిత్యాన్నీ, తల్లి నుంచి సంగీతాన్నీ చిన్ననాడే కడుపారాగ్రోలినవారు రాళ్ళపల్లి. అందువల్లనే అరుదైన సాహితీమూర్తిగా ఎదిగారు.

రాళ్ళపల్లికి తొలిగురువు తండ్రే. సంస్కృతాంధ్రాలను తండ్రి వద్దే నేర్చుకున్నారు. అనంతరం మైసూరులోని పరకాల మఠంలో ఉన్నత సంస్కృత విద్యను అభ్యసించారు. మైసూరు మహారాజా కళాశాలలో తెలుగు పండితులుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.

తెలుగులో సామాజిక విమర్శకు తొలినాటి మార్గదర్శకులు రాళ్ళపల్లి. అందుకు వీరు రచించిన నిగమశర్మ అక్క, నాచనసోముని నవీనగుణములు, తిక్కన తీర్చిదిద్దిన సీతమ్మ, రాయలనాటి రసికత వంటి వ్యాసాలు గొప్ప నిదర్శనం. ఇవన్నీ ఒక ఎత్తైతే, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 1928 లో రాళ్ళపల్లి వేమనపై వరుసగా ఏడు రోజులు ఇచ్చిన ఉపన్యాసాలు మరో ఎత్తు. ఇవి రాళ్ళపల్లిలోని నిశిత విమర్శనా దృష్టికి నిలువుటద్దాలు. రాళ్ళపల్లి విమర్శనా వ్యాసాలు 'సారస్వతాలోకము', 'నాటకోపన్యాసాలు' అనే పేరుతో ప్రచురించబడ్డాయి. ఇవికాక కాళిదాసు రఘువంశాన్ని ఆంధ్రీకరించారు. నృత్త రత్నావళి, శాలివాహన గాథాసప్తశతీ సారములను తెలుగులో అందించారు. తారాబాయి, మీరాబాయి వంటి ఖండకావ్యాలను కూడా రచించారు.

శాస్త్రీయ సంగీతాన్ని అధ్యయనం చేసిన రాళ్ళపల్లి సేవలను తిరుమల తిరుపతి దేవస్థానం వారు వినియోగించుకున్నారు. అన్నమయ్య సంకీర్తనలు కొన్నింటికి స్వరకల్పన చేశారు. వివిధ సంస్థల నుంచి 'గాన కళా సింధు', 'గాన కళానిధి', 'సంగీత కళారత్న' వంటి బిరుదులు పొందారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంవారు డి.లిట్ పట్టాను బహుకరించి రాళ్ళపల్లి బహుముఖ ప్రజ్ఞను గౌరవించారు. సంగీత, సాహిత్య ప్రియులు ఉభయులనూ అలరించిన రాళ్ళపల్లి 11.03.1979 తేదీన జీవిత రంగస్థలం నుంచి తెరమరుగయ్యారు.

ప్రస్తుత పాఠ్యభాగం వేమనపై రాళ్ళపల్లి చేసిన ఉపన్యాస వ్యాసాల పరంపరలో 'వేమన కవిత్వము, హాస్యము, నీతులు' అనే ఏడవ దానికి సంక్షిప్త రూపం. ఎవరూ అంతగా పట్టించుకోని వేమన శేముషిని తొలినాళ్ళలోనే తెలుగు వారికి పరిచయం చేసిన వ్యాసాలలో ఇదొకటి. నిరంతరం నూతన వెలుగులు వెదజల్లే వేమన కవిత్వం ద్వారా జీవితానికి కావలసిన శాస్త్రీయ దృక్పథాన్నీ, సామాజిక చింతననూ విద్యార్థులకు అందించడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాఠ్యభాగం

వేమన కవులని పేరు సంపాదింపని కవులలోఁ జేరిన వాఁడంటిని. పేరు వచ్చుటకు రెండు హేతువులు: ప్రజయొక్క యభిరుచి నెఱిఁగి వారికి తృప్తిగా వ్రాసినవానికి వచ్చును; కవియొక్క గొప్పతనము నెఱుఁగఁగల ప్రజ యున్నను వచ్చును. వేమన విషయమందీ రెండును లేకపోయినవి.

ఇతఁడు ఇతరులకు హితము గావలయునను నుద్దేశముతో వ్రాసెనే కాని, వారు తృప్తిపడవలయునని వ్రాసినవాఁడు కాఁడు. వారు తన్ను పొగడవలయునని యాశపడి కాని, తిరస్కరింతురని వెఱచి కాని, తన త్రోవను వదలినవాఁడు కాఁడు. మనలో చాలనాళ్ళనుండి 'కావ్యం యశసే అర్థకృతే' యను సిద్ధాంతము ముఖ్యముగా నెలకొన్నది. కావ్యములు వ్రాయుటకు మొదటి ఫలములు కీర్తి; ద్రవ్యము. కావున కీర్తినిచ్చు పండితులకును, ద్రవ్యమునిచ్చు రాజులకును ప్రీతిని గలిగించినచో కృతార్థుల మైతిమని యనేక కవులు తలఁచిరి. దానికిఁ దగినట్లు 'కవిసార్వభౌముఁడు' మొదలగు బిరుదులును, ఎకరాల కొలఁది యినాములును, అగ్రహారములును వారికి లభించుచుండెను. తమ మనసుకు తృప్తి గల్గించినవారి విషయమున ప్రాచీనులు చూపిన మర్యాద, ఔదార్యము అత్యద్భుతములు. కాని కవికి స్వాతంత్ర్యము పోయినది. ఇతఁడితరులచేతి బొమ్మయైపోయినాఁడు. కృష్ణదేవరాయలవంటి దొరయాజ్ఞను తిరస్కరించి, 'ఊరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే?' యని పెద్దనవలె ధీరముగాఁ జెప్పఁగల మగకవి లేకపోయినాఁడు. ఉన్న యభిరుచికి ఉదాహరణము లిచ్చువారే కాని, దానిని సరియైన త్రోవలో మార్చి దిద్దఁగలిగిన ధీరులు లేరైరి. క్రమముగా కవిత్వమునకు జీవనము సంపాదించుకొనుట యొక యానుషంగిక ఫలముగాఁ గాక, ప్రధాన ఫలముగా పరిణమించెను. ద్రవ్యము గలవారెవరే విషయమున పద్యములు వ్రాయుమని చెప్పినను 'సరే' యని కవి నడుము గట్టుకొని సిద్ధముగా నుండవలసి వచ్చెను.

ఇట్టి కవిత్వమును వ్రాసి ప్రఖ్యాతిని సంపాదించుట వేమనవంటి వారికి రుచించునా? చూచిన వస్తువులందెల్ల తప్పులుపట్టు స్వభావము గలవాఁడు, పట్టిన తప్పులను స్పష్టముగా మొగము ముందర చెప్పక యుండలేనివాఁడు, ఇతరులను కీర్తికొఱకో, ద్రవ్యముకొఱకో ఊరక యెట్లు పొగడఁగలఁడు?

వేమన తీవ్రములైన భావములు, అడ్డులేని నాలుక కలవాఁడు. కావుననే యతని రచనలలో భావము భాష యీ రెండును ఒకటితో నొకటి పందెము వేసికొని కుప్పించి యెగిరినట్లు, హృదయమునుండి పైకివచ్చుచున్నవి. ఈ వేగమును నిరోధించుటకు ఛందస్సు యతిప్రాసలు మొదలగు ఏ నిర్బంధములకును చేతఁగాదు. ఇవి వానికి లొంగి సర్దుకొనవలసినవే కాని యవి వీనికి లొంగి కుంటుచు నడువనేరవు. కావుననే యందఱికివలె నీ నిర్బంధములు సంకెళ్ళవలెనుండక, ఇతని కవితకు కడియము  లుంగరాలవలె అలంకారములైనవి.

ఇతని భావములెట్లు కృత్రిమములు కానివో యితని భాషయు నట్లే. ఇదే నిజమైన యచ్చ తెనుఁగు. ప్రాచీనులకు సంస్కృతమువలె, ఆధునికులకు ఇంగ్లీషు వలె, స్వభాషా స్వరూపమును జెఱచునట్టి రెండవ భాష యేదియు వేమన్న యెఱుఁగఁడు. కావుననే, యోగరహస్యములను దెలుపుచు, పారిభాషిక పదములతో నిండిన పద్యములు తప్ప, తక్కిన యేమాట చెప్పినను, తెలుఁగు మాటలాడ నేర్చినవాని కెవ్వనికిని ఇతని పద్యము లర్థము కానివి యుండవు. గొప్ప తత్త్వ విషయములు చెప్పినప్పుడును ఇతని ధార యిట్లే యుండును. 'ఈ సౌలభ్యమందే అనన్య సాధారణమయిన యతని కవితాశక్తి యడఁగి యున్నది.' తాను చెప్పు ప్రతి న్యాయమునకును ఒక యుపమానము తప్పక యుండును. ఆ యుపమానములు గూడ ఊహా కల్పితములు గాక, యింటిచుట్టు ముట్టుఁ గల వస్తువు లగుటచే, వాని సొగసును బిగువును అందఱనుభవించి యానందింతురు.

ఆ.    పసుల వన్నెవేఱు పాలేక వర్ణమౌ;
పుష్పజాతివేఱు పూజయొకటి;
దర్శనములు వేఱు దైవం బదొక్కటి...

ఇతని కవిత్వమునకు కొంత మెఱుగుఁబెట్టి దానిని దుర్వారబలముగల దానిని గాఁజేసినది హాస్యము. నవరసములలో హాస్యమునుగూడఁ జేర్చియున్నను ప్రాచీనుల హాస్యము అసహ్యములను, అసభ్యములను వర్ణించుట యందు మాత్రము చరితార్థమైనది. కావుననే హాస్యరస ప్రాధాన్యములగు ప్రాచీన ప్రహసనములను చదువుట కిప్పటి నాగరకత గలవారేవగింతురు. ప్రాచీన నాటకములలో కొంచెము నాగరకతగల హాస్యమును జూపుటకై యేర్పడిన పాత్రము విదూషకుఁడు. కాని వాని హాస్యము గూడ, ఎద్దు మొద్దుతనము, తిండిపోతుతనము – వీనిచే నేర్పడునట్టి అసహ్యపు నవ్వే.

నిజముగా తెనుఁగుభాషకు మొట్టమొదటి హాస్యరసము చవిచూపిన ధీరుఁడు గురజాడ అప్పారావుగారే. వారి 'కన్యాశుల్క' మందున్నంత హాస్యరస నైర్మల్యము తక్కిన యెవరి గ్రంథము లందును లేదనుట యతిశయోక్తి కాదు.

వేమన్నయు గొప్ప బోధకుఁడును, సంస్కర్తయుఁ గావున; అతని యందును హాస్యరసము కలుషితమై యున్నను, అందందు సహజముగా అసభ్యరచనలు చేసినను, తెగిన గాలిపటమువంటి స్వతంత్రబుద్ధి కలవాఁడు కావున, ఒక్కొక్క మాఱు తనపని తాను మఱచి స్వచ్ఛమైన హాస్యముతోఁ తృప్తి కలిగించు కొనును.

ఆ. "పాలసాగరమున పవ్వళ్ళించువాఁడు
గొల్లయిండ్ల పాలు కోరనేల?"

యను ప్రశ్నవచ్చినది. తక్కిన సమయములందు ఇవన్నియు "బూటక పురాణ కథలు" అని చెప్పియుండును. కాని యిప్పుడా యుద్రేకము లేదు. ఇప్పటి జవాబు వేఱు–

"ఎదుటివారి సొమ్ము లెల్లవారికి తీపు..."

ఇది విన్న వాఁడెంత కృష్ణభక్తుఁడైన నవ్వక యుండలేఁడు.

సామాన్యముగా ఇతరుల లోపములనెత్తి ఖండింపబూను కొన్నప్పుడు గూడ దాని కెంత గావలయునో యంతటితో తృప్తిఁబొందక, యితరులకు నవ్వు గలిగింప వలయునను నుద్దేశముచేతనే కొన్ని కొసరుమాటలు చేర్చి వ్రాయుట యితనిపద్ధతులలో నొక్కటి. లోభివాని నడుగుట నిష్ఫలము; గొడ్డుటావును బితికినట్లు; మేక మెడ చన్ను గుడిచినట్లు – అని చెప్పినఁజాలును గదా. ఇతని కంతటితో తృప్తిలేదు.

ఆ. గొడ్డుటావుఁ బితుకఁ గుండ గొంపోయిన
పండ్లు రాలఁదన్ను; పాలనీదు;
లోభివాని నడుగ లాభంబు లేదయా...

ఆ. మేక కుతికఁబట్టి మెడచన్ను గుడవఁగా
ఆఁకలేలమాను నాశ గాక,
లోభివాని నడుగ లాభంబు గలుగునా?...

ఇందు కుండఁగొంపోవుట, కుతికఁబట్టుట మొదలగునవి పాలు త్రాఁగఁబోవు వాని యాత్రమును స్పష్టముగాఁ జూపి, వాని యజ్ఞానమునకు మనల నవ్వించును.

పై కవితాధార, హాస్యము – వీనికి తోడు ఇతని నామము నాంధ్రదేశమున నాచంద్రార్క స్థాయిగాఁ జేసినవి ఇతనినీతులు. ఇహలోకమున ఇతరులకును, తనకును సౌఖ్యమును గలిగించునవి నీతులు. కావున ఇతని నీతులును స్వార్థములని, పరార్థములని రెండు తెగలగును. తత్త్వవాదములకువలె ఇతని నీతులకును అనుభవమే మూలముగాని పుస్తకములు కావు. కావుననే యవి యప్పుడును ఇప్పుడును అనేకులన్నట్లు, ఇతనికి పుస్తకములు వ్రాయుటకును ఇతరుల కుపన్యసించుటకును మాత్రము కావు. మంచి చెడ్డలను రెంటిని తాను జూసి యందలితత్త్వమును

చక్కఁగా నెఱిఁగి, యితరులకు బోధించినవాఁడగుటచే సామాన్య నీతిగ్రంథములలో లేని తీవ్రత యితని పద్యములలోఁ గలఁదు.

దానమున కెవఁడు పాత్రము అని నిర్ణయించు నప్పుడు ఇతనికి కులము, జాతి మొదలగు వానిమాట యట్లుండనిండు, గుణముగూడ నక్కరలేదు. ముఖ్యమైనది పేదఱికము. అదియున్న తక్కిన దేమున్నను లేకున్నను అతఁడు పాత్రమే...

ఆ. దోసకారియైన దూసరికాఁడైన
పగతుఁడైన వేదబాహ్యుఁడైన
వట్టిలేని పేదవాని కీఁదగు నీవి
ధనికునకు నొసంగఁదగదు వేమ

అన్నదానమును తరువాత కన్యాదానముపై నితని కభిమానమెక్కువ. స్త్రీ ప్రజ యిప్పటికంటె పూర్వ కాలమందు తక్కువయని కానవచ్చుచున్నది. కావుననే యా కాలమందు మగవారు పెండ్లికైపడు కష్టముల కథలు పూర్వకాలపు వారిప్పుడును వింతగా చెప్పుదురు. అప్పటి పెండ్లి కన్యాదానము. ఇప్పుడది వరదానముగా పరిణమించినది – వేమన కాలమందీస్థితి విపరీతముగా నుండెను. ఐశ్వర్యవంతులెట్లో తమయిండ్లకు భార్యలను కోడండ్రను తెచ్చుకొనుచుండిరి. కాని పేదలకు పెండ్లియగుట కష్టముగా నుండెను. కావుననే యీ దానముగూడ ధనవంతులకు చేయరాదనియు, పేదలకే చేయవలయుననియు వేమన శాసించెను. ఇట్లు చేయుట ధర్మమే కాదు ఇందుచే సుఖమును గలదు –

ఆ. కలిమిఁజూచి యియ్యఁగాయమిచ్చినట్లు
సమునకియ్య నదియు సరసతనము
పేదకిచ్చుమనువు పెనవేసినట్లుండు...

నిజముగా పరుల కుపకరింపవలెనను జ్ఞానమున్నవానికి పరులను పీడింపరాదను భావము వెంటనే యుండును. ఈ యహింసా వ్రతముపై వేమన్నకు చాలప్రీతి:

ఆ. జీవి జీవిఁజంప శివుని జంపుటె యగు
జీవుఁడరసి తెలియ శివుఁడె కాఁడె...

యజ్ఞములలోని హింస హింసకాదని చెప్పుకొనుచున్నారు. వేమన్నకీ హింసమాత్రమే కాదు, తన శత్రువును గూడ హింసించుట కిష్టము లేదు –

ఆ. చంపఁదగినయట్టి శత్రువు తనచేత
చిక్కెనేని కీడు చేయరాదు,
పొసఁగ మేలుచేసి పొమ్మనుటే చాలు...

నిజమే. శత్రుత్వము చావవలయునేకాని, శత్రువు చావవలయునని కోరుట యన్యాయము గదా? ప్రకృతము మనుష్యు లింతదూరము అహింసావ్రతమును పాలింపఁజాలరు కాని, యెవఁడిట్లు చెప్పెనో యతని పేరనే గొఱ్ఱెలు, బఱ్ఱెలు బలియిచ్చుటనైనను, నిలుపఁ బ్రయత్నించుట వేమనయందలి యభిమానము గలవారి కెల్ల ముఖ్యధర్మ మనుటలో సందేహము లేదుగదా!

ఇతని స్వార్థనీతులలో స్వానుభవము, వివేకము ఇంకను ఎక్కువగాఁ గాన వచ్చును. మనుష్యుల కీలోకమందు నెమ్మదిగా బ్రదుకుట కావశ్యకములగు ఓర్పు వివేకము మొదలగు గుణముల నివి బోధించుచు, నందఱికిని ప్రియములుగా నుండును. చూడుఁడు : శౌర్యము మంచిదే కాని, యిది సమానుల విషయమందు మాత్రము పనికివచ్చును. తనకంటె దుర్బలులైన వారియెడల శౌర్యమును జూపుట పేఁడితనమే యని యంద ఱంగీకరింతురు. తనకన్న బలవంతులయెడ బ్రయోగించి చెడినవానిని జూచి 'బలే' యని మెచ్చుకొనువారు కొందఱున్నను అది యవివేకమనువారే యెక్కువ. వేమనయు నీ వివేకుల గుంపులో చేరినవాఁడే –

ఆ. ఎదుటి తనబలంబు లెంచుకో నేరక
దీకొని చలముననెదిర్చె నేని
ఎలుగు దివిటిసేవ కేర్పడు చందంబు...

కావున –

ఆ. అనువుగానిచోట నధికులమనరాదు,
కొంచెముండు టెల్ల కొదువగాదు,
కొండ యద్దమందు కొంచెమైయుండదా?...

పై నీతులను సాక్షాత్తుగాఁ జెప్పుట యొక తీఱు. వాని నాచరించుటచేతను, విడుచుటచేతను గలుగు ప్రాపంచిక స్థితులను ఉన్నదున్నట్లుగాఁ జెప్పి, ఆ మూలముగా పై నీతులను వ్యంజింపఁజేయుట యంతకన్న బలవంతమైన కవితా మార్గము. వేమన కీమార్గమం దాశ యెక్కువ. శక్తియు నెక్కువ. చూడుఁడు:

ఆ. ఆలి మాటలు విని అన్నదమ్ముల రోసి
వేఱె పోవువాఁడు వెఱ్ఱివాఁడు
కుక్కతోఁకబట్టి గోదావరీఁదునా?...

అని స్పష్టముగాఁ జెప్పుట యొక విధము. ఈ క్రింది దంతకన్న బలవంతమైన ధ్వని మార్గము:

ఆ. ఆలివంకవారు ఆప్తబంధువులైరి
తల్లివంకవారు తగినపాటి
తండ్రివంకవారు దాయాది పగవారు...

ఇట్లే ప్రపంచమందు పలుకుబడి, మర్యాద సంపాదించుటకు తక్కిన యన్నిటి కన్న ద్రవ్యము ముఖ్యము గావున, దానిని సంపాదింపుఁడని స్పష్టముగాఁ జెప్పుట కన్న ఈ క్రింది పద్యమునందలి వస్తుస్థితికథనము ఎక్కువ ఫలకారి:

ఆ. కులము గలుగువారు గోత్రంబు గలవారు
విద్యచేత విఱ్ఱవీఁగువారు,
పసిఁడి గల్గువాని బానిసకొడుకులు

ఇట్లు ధర్మము, తత్త్వము, నీతి, పరమత ఖండనము మొదలగుననేక విషయములు చెప్పినను ఇతని పద్యములందు అనన్య సాధారణమైన సారళ్యము, ధారాళత, చెక్కడపు పని, నిర్లక్ష్యము మొదలగు కవితాగుణములు నిండి యుండును. ఇతని యే పద్యమును విన్నను నిలిచి తటాలున ఆ ప్రక్క తిరిగి యొకమాటైన చూడకుండుటకు తెలుఁగు మాటలాడువాని కెవ్వనికిని సాధ్యముగాదు. ఈ యాకర్షణశక్తి యితనియం దున్నంత తక్కినవారెవరియందును గానరాదు.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. వేమన పద్యాల్లోని హాస్యాన్ని వివరించండి.
2. వేమన నీతులను వివరించండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. వేమన కవిత్వంలోని భాషను వివరించండి.
2. లోభివాని స్వభావాన్ని తెలపండి.
3. అహింస గురించి వేమన అభిప్రాయం ఏమిటి?
4. వేమన తెల్పిన దాన గుణాన్ని వివరించండి.

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. 'సారస్వతాలోకము' ఎవరు రాశారు?
2. 'రఘువంశం' తెలుగులో ఎవరు రాశారు?
3. వేమన పద్యాలలోని ఛందస్సు ఏది?
4. ప్రాచీన నాటకాలలోని హాస్యపాత్ర ఏది?
5. 'దానమునకెవడు పాత్రము'?
7. రాళ్ళపల్లి ఎవరి కీర్తనలకు స్వరకల్పన చేశారు?

❖ ❖ ❖

# 5 నా జీవిత యాత్ర



- రావూరి భరద్వాజ

## రచయిత పరిచయం

**తా**డిత, పీడిత జన జీవనసమరాన్ని తన అక్షరాల్లో ఆవిష్కరించిన రచయిత డా॥ రావూరి భరద్వాజ. మోగులూరు అవిభక్త హైదరాబాదు సంస్థానంలోని పరిటాల జాగీరుకు చెందిన గ్రామం. కృష్ణాజిల్లా, నందిగామ దగ్గరున్న మోగులూరు గ్రామంలో 05.07.1927 న భరద్వాజ జన్మించారు. మల్లికాంబ, కోటయ్య వీరి తల్లిదండ్రులు. గుంటూరు జిల్లా తాడికొండలో 7వ తరగతి వరకు భరద్వాజ చదువుకున్నారు. 8వ తరగతి చదువుతుండగా వారి విద్య ఆగిపోయింది.

పేదరికం మూలంగా భరద్వాజకు పై చదువులు సాగలేదు. జీవిక కోసం అనేక పనులు చేశారు. ఏ పని చేయడానికైనా ఏనాడూ చిన్నబుచ్చుకోలేదు. ప్రతి పనినీ గౌరవించారు. జీవితం నేర్పిన ఈ పాఠాలు 17 సంవత్సరాలు వయసునాటికే భరద్వాజను రచయితగా తీర్చిదిద్దాయి. భరద్వాజ జీవితాన్ని మలుపు తిప్పాయి.

మిలటరీలో సాంకేతిక నిపుణుడిగా కొంతకాలం పనిచేసిన భరద్వాజకు పత్రికల్లో పనిచేసే అవకాశం లభించింది. జమీన్ రైతు, దీన బంధు, జ్యోతి, సమీక్ష, యువ వంటి పత్రికల్లో వివిధ హోదాలలో పనిచేశారు. తరువాత చాలాకాలం ఆకాశవాణిలో 'జూనియర్ స్క్రిప్టు రైటర్'గా, తెలుగు ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా వ్యవహరించారు. సమాజం నుంచి నేర్చుకున్న పాఠాలకు ఈ అనుభవాలు తోడయ్యాయి. భరద్వాజను గొప్ప రచయితగా లోకానికి పరిచయం చేశాయి.

భరద్వాజ తన జీవిత కాలంలో 140 దాకా రచనలు చేశారు. వాటిలో వివిధ సాహిత్య ప్రక్రియలున్నాయి. 400 పైగా కథలు రాశారు. భరద్వాజ రచించిన అసంఖ్యాకమైన నవలల్లో పాకుడురాళ్ళు, కాదంబరి, ఇదం జగత్, కరిమింగిన వెలగపండు వంటివి బాగా ప్రాచుర్యం పొందాయి.

రావూరి భరద్వాజ ఎన్ని రచనలు చేసినా ప్రతి రచనలోనూ మనకు తెలిసిన అంశాలే ఉంటాయి. మనం చూసిన దృశ్యాలే కన్పిస్తాయి. అయితే వాటిని మనం పట్టించుకోము. రచయితగా భరద్వాజ వాటిని కొత్తకోణంలో గుర్తించారు. తన రచనల్లో సజీవంగా చిత్రించారు. వాటిని చదివినపుడు మాత్రం పాఠకులుగా మనం గొప్పకుదుపుకు గురవుతాము.

మనకు తెలిసిన రంగురంగుల సినిమా ప్రపంచం వెనుక మనకు తెలియని దృశ్యాలు ఎన్నో ఉంటాయి. వాటిని సజీవంగా చిత్రించిన నవల 'పాకుడురాళ్ళు'. ఈ నవల భరద్వాజను జ్ఞానపీఠ అవార్డుతో సత్కరింప చేసింది. రాష్ట్రంలోని కొన్ని విశ్వవిద్యాలయాలు పోటీలు పడి భరద్వాజను గౌరవ డాక్టరేటులతో గౌరవించాయి. భరద్వాజ జ్ఞానపీఠ అవార్డు అందుకున్నాక, ఆ మెమోంటోను కళ్ళారా చూసుకోక ముందే, వారం రోజులు తిరగకుండానే 18.10.2013న మరణించడం పెద్ద విషాదం.

ప్రస్తుత పాఠ్యభాగం 'నా జీవిత యాత్ర' భరద్వాజ రాసుకున్న 'నాగురించి నాలుగు మాటలు' అనే వ్యాసానికి సంక్షిప్త రూపం. జీవితంలోని కష్టాల్నీ, కొన్ని కన్నీళ్ళనీ, మరికొన్ని విషాదాలనీ కలగలిపి తయారు చేసిన ఈ వాస్తవ జీవిత కషాయం విద్యార్థులకు గొప్ప స్ఫూర్తినిస్తుంది. జీవితంలో ఎదురయ్యే విఘాతాలను ఎలా ఎదుర్కోవాలో నేర్పుతుంది. జీవితాన్ని ఎలా జీవించాలో తెలియచేస్తుంది. శోకాల మరుగున దాగిన సుఖాన్ని గుర్తుచేస్తుంది. ఊహించని విజయాలకు చేరుస్తుంది.

## పాఠ్యభాగం

కొంత మంది అదృష్టవంతులుంటారు. తమను గురించీ, తమ పూర్వీకులను గురించీ, గర్వంగా చెప్పుకోదగిన అంశాలు వారికి చాలా ఉంటాయి.

ఇంకొంతమంది దురదృష్టవంతులుంటారు. తమను గురించీ, తమ పూర్వీకులను గురించీ, గొప్పగా చెప్పుకోదగిన అంశాలంటూ ఉండవు సరేగదా, మామూలుగా చెప్పుకోదగిన అంశాలుకూడా ఉండవు.

మాకు 20 ఎకరాల పొలం ఉండేది. కొంత పొలం, నీరుకొండ దగ్గర ఉండేది. ఇంకొంత పొలం తాడికొండ నుండి నంబూరు వెళ్ళే డొంక దగ్గర ఉండేది. మరీ భాగ్యవంతులం కాదుగాని, కూటికీ గుడ్డకూ లోపం ఉండేది కాదు.

మాకున్న 20 ఎకరాల పొలంలోనూ, 17 ఎకరాల పొలం దుబారా కింద ఖర్చు చేశాడు మా నాన్న. నాటకాలు, భజనలు, సంఘసేవ, చిన్న చిన్న ఉద్యమాలవంటి వాటిల్లో తిరగడం వల్ల, భూముల్ని అమ్ముకొని బతకవలసి వచ్చింది.

నాకు అయిదవ ఏటనే అక్షరాభ్యాసం చేశారు. ఆ చేసినవారి పేరు కొల్లిపర కోటయ్యగారు. మా పెదనాన్నకూ, మా నాన్నకూ కూడా ఆయనగారే అక్షరాభ్యాసం చేశారు. ఎందుకనోగానీ మా కెవ్వరికీ "చదువు" అబ్బలేదు.

1942 నాటికే, నేను చదువు మానేశాను. అలా మానేయడానికి ప్రత్యక్షకారణం మా స్కూలు హెడ్మాస్టరుగారయితే, పరోక్షకారణం మా కుటుంబాన్ని ముసిరిన దరిద్రం.

స్కూల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీకి వచ్చిన రోజున కూడా నేను చిరిగిన లాగు, చిరిగిన చొక్కా తొడుక్కున్నానన్న కారణంతో మా హెడ్మాస్టరుగారు ముందుగా నన్ను నుంచో బెట్టారు. తరువాత వంగో బెట్టారు. ఆ తరువాత గొడ్డును బాదినట్టు బాదారు. ఆ దెబ్బలను భరించలేక పోయాను. మాస్టరుచేతిలోని బెత్తాన్ని విరిచేశాను. పుస్తకాల సంచిని ఆయన మీదికి గిరివాటు వేశాను. బండ బూతులు తిడుతూ పారిపోయాను. వేణుగోపాల స్వామివారి రథంలోనూ, గాలి గోపురం సందులోనూ, చెరువు కట్టల మీదా, కొండమీది గుడిమెట్ల మీదా దాక్కొన్నాను. చాలాకాలం తరువాతగానీ, ఇంటికి రాలేదు.

తిండి కోసం – పిడికెడు మెతుకుల కోసం – నేను వ్యవసాయ కూలీగా పనిచేశాను. పశువుల కాపరిగా పనిచేశాను. ఒక కో ఆపరేటివ్ స్టోర్స్‌లో సరుకులందించే కుర్రాడిగా పనిచేశాను. పొగాకు బారన్‌లో బొగ్గు వేసే కూలీగా పనిచేశాను. ఒక కలప అడితీలో రంపంలాగే కూలీగా పనిచేశాను. ఒక కమ్మరి దగ్గర తిత్తు లూదడానికీ, సమ్మెట వేయడానికీ కుదిరాను. కొంతకాలం పేపర్ బాయ్‌గా కూడా పనిచేశాను.

నా కసలు చదువు రాదు. కానీ ఒకానొక అవమానం నన్ను చదువు వైపు మళ్ళించింది. నా కన్నా వయసులో చిన్నవాడయిన ఓ కుర్రాడు మనుచరిత్రలో ఉండే ఓ పద్యం అప్పగించాడు, మా వూరి లైబ్రరీ అరుగుల మీద అందరూ ఆ కుర్రాణ్ణి మెచ్చుకొన్నారు. శేషయ్యగారనే మా నాన్న స్నేహితుడు, ఆ కుర్రాడితో నన్ను పోలుస్తూ తిట్టాడు. చుట్టూ ఉన్న వారందరూ నవ్వారు. ఆ నవ్వు నన్ను గాయపరిచింది. ఆ గాయం నాలో ఓ పట్టుదలను రెచ్చగొట్టింది. పగలంతా కూలిపని నాలిపని చేసుకొనే వాణ్ని. రాత్రిపూట మా వూరి శివాలయంలోని ప్రమిద వెలుతురులో చదువుకొనే వాణ్ని. బాలభారతి గ్రంథాలయంలో చాలా పుస్తకాలుండేవి గానీ, వాటిని చందా దారులకు మాత్రమే ఇంటికిస్తారు. సంవత్సరం చందా మూడు రూపాయలు. ఆ చందాను చెల్లించి తనపేర పుస్తకాలు తీసుకొని చదువుకొనే అవకాశాన్ని కొల్లూరు వెంకటేశ్వర్లు గారన్న మహాదాత నాకు కలిగించారు.

ఆయన ఋణం తీర్చుకోవడం కోసం 1965 వ సంవత్సరంలో “పాకుడు రాళ్ళు” నవలను వారికి అంకిత మిచ్చాను.

ముందుగా పద్యాలు రాశాను. అందులో గణ, యతి ప్రాసలు తప్ప కవిత్వం ఉండేది కాదు. జీషన్ ప్రభాత్ అన్న ఒక కథకుని ప్రోత్సాహంతో కొవ్వలి వారి నవలలు, చలంగారి పుస్తకాలు, కుటుంబరావు పుస్తకాలు, గోపీచంద్ పుస్తకాలు చదవడం ప్రారంభించాను.

వారిలాగే కథలు రాయడం ప్రారంభించాను. వాక్యం తరువాత వాక్యం వచ్చేది కాదు. దృశ్యాన్ని అక్షరబద్ధం ఎలాచేయాలో బోధపడేది కాదు. అయినా రాసి పత్రికలకు పంపుతుండేవాణ్ని. కొన్ని తిరిగొచ్చాయి. కొన్ని ఏమయి పోయాయో తెలీదు.

ఈ రాతకోతలకు కావలసిన ఒక వైలెట్ పెన్సిల్‌ను, ఒక దస్తా కాగితాలను త్రిపురనేని శివరామకృష్ణయ్యగారన్న స్నేహితుడు నాకోసారి కొనిపెట్టాడు. ఆ ఋణం తీర్చుకోవడం కోసం "ఇదం జగత్" అన్న నవలను, అతనికీ, వారి ధర్మపత్ని శ్రీహరమ్మగారికీ కలిపి అంకిత మిచ్చాను ఆ తరువాత.

అచ్చయిన నా తొలి కథ పేరు "విమల". అది 1946 ఆగస్టు 26 వ తేదీ నాటి "ప్రజామిత్ర" వారపత్రికలో అచ్చయింది. ఆ తరువాత చాలా కథలు చాలా పత్రికలలో వచ్చాయి.

మా నాన్నగారికి, ఆచార్య రంగాగారితో ఉన్న పరిచయం కారణంగా, నా గురించి నెల్లూరు వెంకట్రామా నాయుడుగారికి సిఫార్సు చేసి "జమీన్ రైతు" వారపత్రికలో, నాకో చిన్న ఉద్యోగం ఇప్పించారు రంగాగారు. అంతక్రితం ఆ ఉద్యోగాన్ని ఆచార్య ఆత్రేయ చేస్తూ ఉండేవాడు. నాటకాలమీద అభిమానంతో, ఆత్రేయ ఆ ఉద్యోగాన్ని మానేశాడు. నేనా ఉద్యోగంలో చేరాను.

1947 ఆగస్టు 15 వ తేదీనాడు "సుప్రభాతం" అన్న పుస్తకాన్ని వీధి వీధి తిరిగి, అమ్మగా వచ్చిన డబ్బులన్నీ ప్రచురణ కర్తకిచ్చి, పెన్నానదిలోని నీళ్ళు తాగి, ఆ పొద్దునే, కాలే కడుపుతో నిద్రపోయాను.

వెంకట్రామా నాయుడు గారొకసారి, ఫలానా వారికి వ్యతిరేకంగా రాయమన్నారు. 'నేను రాయ' నన్నాను. 'అయితే ఉద్యోగం మానెయ్య' మన్నారు. "సరే" నని మానేశాను. పెళ్ళకూరు గోపాల కృష్ణారెడ్డిగారు, పొగతోట ప్రాంతంలో "దీనబంధు" వారపత్రికను ప్రారంభించేదాకా నరకం అనుభవించాను.

నా ఈడు వాళ్ళందరకూ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఒకరిద్దరు బిడ్డల తండ్రులు కూడా అయ్యారు. సాధ్యమయినంత తొందరగా పెళ్ళి చేయాలని, మా అమ్మనాన్నల అభిప్రాయం. నాలుగయిదు సంబంధాలు చూశారు. నాకు కులాల పట్టింపు లేదనీ, ఎక్కడబడితే అక్కడే తింటాననీ, ఆస్తిపాస్తులేమీ లేవనీ, ఏ ఉద్యోగమూ లేదనీ, ఏ పనీ చేతకాదనీ – వంటి కారణాలతో, పిల్లనివ్వడానికెవరూ ముందుకు రాలేదు. రాకపోవడమే మంచి దనిపించింది.

సరిగ్గా అదే సమయంలో కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా, తోటరావులపాడు గ్రామవాసి, మేదూరి మల్లయ్యగారు తాడికొండ వచ్చారు. మమ్మల్ని చూశారు. మా విషయాలన్నీ వాకబు చేశారు. తన కూతురును చూసుకోవడానికి, ఫలానా తేదీనాటికి రమ్మన్నారు.

తోటరావులపాడుకూ, మా మేనమామగారి ఊరయిన మోగులూరుకూ మధ్య నాలుగయిదు మైళ్ళ దూరముంది. నేను, మా అమ్మ, నాన్న, మా మేనమామ శేషయ్యగారు కలిసి, మల్లయ్యగారు రమ్మన్న సమయానికి తోటరావులపాడు చేరుకొన్నాం. నాకు పెళ్ళి కాదేమో నన్న భయంతో, మా మేనమామగారు నా గురించి, మా ఆస్తిపాస్తులను గురించి, చాలా ఉబికించి చెప్పాడు. నేను స్కూలు ఫైనల్ దాకా చదివాననీ, తెలుగులో ఒక్క మార్కు తక్కువ రావడంవల్ల పరీక్ష తప్పాననీ, నెల్లూరులో ఉద్యోగం చేస్తున్నాననీ, నెలకు 60 రూపాయల జీతమనీ, మూడెకరాల పొలమూ, రెండు ఇళ్ళు ఉన్నాయనీ చెప్పాడు.

మల్లయ్యగారూ, నేనూ ఊరికి దగ్గరగా ఉన్న మామిడి తోపులో కూచున్నప్పుడు అసలు సంగతి చెప్పాను. "నాకు పెళ్ళికాదని మా మేనమామగారి భయం. అందుకే చాలా అబద్ధాలు చెప్పాడు. నేను 7 వ తరగతి పాసయ్యాను. నెల్లూరులో నేనిప్పుడు ఉద్యోగం చేయడం లేదు. చేసినప్పుడు కూడా నా జీతం 20 రూపాయలు మాత్రమే! మూడెకరాల పొలం లేదు. రెండిళ్ళున్నాయి. ఒకటేమాది, మరొకటి మా తాతగారిది" అన్నాను.

"ఈ సంగతులన్నీ నాకు తెలుసు ముని మాణిక్యం వారు చెప్పారు. ఆయన నాకు మంచి స్నేహితుడు. నా రెండవ కూతురు పేరు కాంతం. ఆయన కథలు చదివాకే, ఆ పేరు మా అమ్మాయికి పెట్టుకొన్నాను. నేనూ పేదవాణ్ణే! దాచుకోకుండా మీరు నిజం చెప్పారు. నిజం చెప్పిన వారికి పిడికెడు మెతుకులు దొరుకుతాయన్న నమ్మకం నాకున్నది. మీకో పిడికెడు అన్నం దొరికితే, సగం నా బిడ్డకు పెట్టి, మిగిలిన సగం మీరు తింటారన్న నమ్మకం నాకున్నది. అందుకనే, మా అమ్మాయిని మీ కిద్దా మనుకొంటున్నాను." అన్నారాయన.

ఇంటికొచ్చాం. పిల్లను చూడమన్నారు. నేను చూడనన్నాను. 1948 మే 28వ తేది రాత్రి, పెళ్ళిపీటల మీద కూచుని, జీలకర్ర, బెల్లం కలిపి, నెత్తిమీద పెడుతున్నప్పుడు మాత్రమే నేను పెళ్ళికూతుర్ని చూశాను. పెళ్ళయింది. అమ్మానాన్నల బరువు తీరింది గానీ, నా బరువు పెరిగింది. నా కేమో ఉద్యోగం లేదు. చేయడానికయినా ఏ పనీ చేతకాదు.

కాపురానికొచ్చిన తొలిరోజుల్లో, వంటినిండా నగలతో లక్ష్మీదేవిలా ఉండేది కాంతం. కానీ ఏం లాభం? మూడు సంవత్సరాలు గడవకముందే ఆమె నిరాభరణ సుందరిలాగా మారిపోయింది. ఎక్కడెక్కడి చుట్టాలో వచ్చి మాసాల కొద్దీ ఉండేవారు. వెళ్ళమని చెప్పలేను. ఉంచుకొని పోషించనూ లేను.

1956 జనవరి మొదటి వారంలో నేను మద్రాసులో కాలు మోపాను.

ఈ ప్రపంచం చాలా విశాలమయింది. చాలా విచిత్రమయింది కూడా. మద్రాసు మహానగరం నుండి, అక్కడి మనుషుల నుండి, అక్కడి వాతావరణం నుండి నేను చాలా పాఠాలు నేర్చుకొన్నాను.

వందల మంది రచయితలతో, కవులతో, పత్రికా సిబ్బందితో, సినిమా వారితో పరిచయాలయ్యాయి. ఊహకు కూడా అందని సందర్భాలను నేను చవి చూశాను. వీటిని ఆధారం చేసుకొని, నేను "పాకుడు రాళ్ళు" నవలను రాశాను. ఆ నవలలోని అన్ని పాత్రలూ నాకు బాగా తెలిసిన వారి ప్రతిరూపాలే! ఆ నవలలోని అన్ని సంఘటనలూ, నాకు తెలిసినవారి జీవితాలలోంచి ఏరుకొన్నవే!!

సొంతవూరును వదిలేశాను. తెలిసిన తెనాలినీ వదిలేశాను. అమ్ముకోవడానికి కూడా ఏమీ లేవు. అయిన వారెవ్వరూ సాయం చేయరు.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో నాకు తెలిసిన వారు చాలా మంది పనిచేస్తున్నారు. గోపీచంద్, బుచ్చిబాబు, భాస్కరభట్ల, మునిమాణిక్యం, స్థానం, కృష్ణశాస్త్రి, శ్రీవాత్సవ, జనమంచి, నండూరి విఠల్ – వారందరూ, విజయవాడ రేడియోకేంద్రంలోనూ, మద్రాసు రేడియో కేంద్రంలోనూ పని చేసిన వారే!

హైదరాబాదు రేడియో కేంద్రంలో స్క్రిప్టురైటర్ ఉద్యోగం ఖాళీగా ఉన్నదని, తొలిసారిగా నాకు చెప్పినవారు విఠల్‌గారు. నేనా ఉద్యోగం కోసం ప్రయత్నించాను. త్రిపురనేని సుబ్బారావు, నర్రా కోటయ్య, నా గురించి గోపీచంద్‌గారికి గట్టిగా సిఫార్సు చేశారు. అప్పటి స్టేషన్ డైరెక్టర్ జి.పి.యస్. నాయర్‌గారికి నాగురించి బాగా చెప్పారు అయ్యదేవర కాళేశ్వర రావుగారు. ఈ కాళేశ్వర రావుగారు మా నాన్నగారికి బాగా తెలిసిన వారు.

1959 నవంబరు 25వ తేదీన, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో, గ్రామస్థుల కార్యక్రమ విభాగంలో, స్క్రిప్టురైటర్‌గా ప్రవేశించాను. జీతం 180 రూపాయలు. 27 సంవత్సరాలపాటు ఆకాశవాణిలో పనిచేశాక, 1987 జూలై 4 వ తేదీన ప్రసంగ కార్యక్రమాల ప్రయోక్తగా ఉద్యోగ విరమణ చేశాను.

ఆకాశవాణి నుండి నేను చాలా నేర్చుకొన్నాను. మనుషుల్లో – ఎలాంటి ఉత్తములుంటారో, ఎలాంటి అధమాధములుంటారో, ఆకాశవాణి నాకు సోదాహరణంగా వివరించింది.

నా తొలి కథ 1946లో అచ్చయిందన్నాను కదూ? నా తొలిపుస్తకం 1950 లో అచ్చయింది. దాని పేరు "రాగిణి". ఆ కథా సంపుటానికి చలంగారు పరిచయం రాశారు. నా రెండో పుస్తకం కూడా 1950లోనే అచ్చయింది. దాని పేరు "కొత్త చిగుళ్ళు". ఈ పుస్తకాన్ని చలంగారికి అంకితమిచ్చాను. విజయవాడలోని ఆదర్శ గ్రంథ మండలివారు, మచిలీపట్నంలోని తెలుగు విద్యార్థి ప్రచురణలవారు నా పుస్తకాలలో ఎక్కువ భాగం ప్రచురించారు.

ఇంత వరకూ అచ్చయిన పుస్తకాలు 140. కొన్ని కథలు, దాదాపుగా అన్ని భారతీయ భాషలలోనూ వచ్చాయి. కొన్ని పుస్తకాలు ఇంగ్లీషు, హిందీ, గుజరాతి, కన్నడం, తమిళం, మలయాళ భాషలలోనికి అనువాద మయ్యాయి.

తొలి అవార్డు 1956లో. "జ్యోతి" పాఠకులు ఎన్నిక చేసిన కథకు స్వర్ణపతకం లభించింది. 1968 "విజయ విలాసం" అన్న కథా సంపుటానికి ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీవారి అవార్డు లభించింది. 1983లో "జీవన సమరం" పుస్తకానికి, రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీల అవార్డులు లభించాయి. ఆ తరువాత ఇంకా ఇంకా చాలా ఉన్నాయనుకోండి.

1980లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1987లో జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం, 1991లో నాగార్జున విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌లను నాకు ప్రసాదించాయి. 1984లోనూ, 1987లోనూ, సోవియట్ రష్యాలో పర్యటించాను.

1986 ఆగస్టు 1వ తేదీన, నా జీవిత భాగస్వామిని, నా వెలుగును, నా మార్గదర్శిని నేను పోగొట్టుకొన్నాను. కాంతమ్మ గారి నిర్గమనం నా జీవితగమనాన్నే మార్చి వేసింది. "శ్రీమతి రావూరి కాంతమ్మ భరద్వాజ ట్రస్టు" పేరిట ఒక సంస్థను రిజిష్టరు చేయించాను. సమాజ సంక్షేమానికి ఉపకరించ గల కార్యక్రమాలను, ఈ ట్రస్టు పేరిట నిర్వహించుదామని నేను అనుకొంటున్నాను.

నా పెద్ద కొడుకు పేరు రవీంద్రనాథ్. నాకు తొలిసారిగా, తెనాలిలో ఉద్యోగమిచ్చిన ఆలపాటి రవీంద్రనాథ్‌గారికి కృతజ్ఞతా సూచికగా ఈ పేరు పెట్టుకొన్నాను. అతని భార్యపేరు ఇందిర. రెండవ కొడుకు పేరు గోపీచంద్. ఆకాశవాణిలో నాకు ఉద్యోగం రావడానికి కారణభూతులయిన త్రిపురనేని గోపీచంద్‌గారి జ్ఞాపకార్థం ఈ పేరు పెట్టుకొన్నాను. అతని భార్య పేరు సుశీల. మూడవ కొడుకు పేరు బాలాజీ, నేను మద్రాసులో ఉన్న మూడున్నర సంవత్సర కాలంలోనూ ఉచితంగా వైద్యం చేసిన డాక్టర్ గాలి బాలసుందరరావు గారి జ్ఞాపకార్థం ఈ పేరు పెట్టుకొన్నాను. భార్య పేరు నాగ సుభద్ర. నాలుగవ కొడుకు పేరు వెంకటకోటేశ్వర రావు. నాకింత నీడను ప్రసాదించిన ఆలపాటి వెంకట్రామయ్య పేరునూ, మా నాన్న పేరునూ కలిపి, మా నాలుగో వాడికి పెట్టుకొన్నాను. భార్యపేరు లక్ష్మీకుమారి. నా కూతురు పేరు పద్మావతి – పద్మ. 1943 లో, అన్నం లేక స్పృహ తప్పి పడిపోయినప్పుడు, నన్ను పిలిచి ఆప్యాయంగా ఇంత అన్నం తినిపించిన మాల పద్దక్క జ్ఞాపకార్థం కూతురుకు ఆ పేరు పెట్టుకొన్నాను. భర్త పేరు మాధవరావు.

నాకు ఆకలి తెలుసు. అవిద్య తెలుసు. అవమానం తెలుసు. నిరుద్యోగం తెలుసు. అన్యాయం తెలుసు. అక్రమం తెలుసు. అధర్మం తెలుసు. వీటిని నేను పుష్కలంగా అనుభవించాను కాబట్టి – ఇవిలేని సమాజం కావాలని నేను కోరుకొంటున్నాను.

"సర్వ ప్రాణులు, సుఖపడాలి. ఆరోగ్యంగా ఉండాలి. అందరికీ అనునిత్యం శుభమే కలగాలి. జగత్తులో ఎవ్వరూ దుఃఖ బాధితులు కాకూడదు."

ఇదీ నా ఆశయం!

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. రావూరి భరద్వాజ బాల్యాన్ని గురించి తెల్పండి.
2. రావూరి భరద్వాజ రచనా వ్యాసంగాన్ని వివరించండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. రావూరి భరద్వాజకు చదువు పట్ల ఆసక్తిని కలిగించిన సంఘటనను తెల్పండి.
2. రావూరి భరద్వాజ పెళ్ళి సంబంధ వృత్తాంతాన్ని తెల్పండి.
3. పాకుడు రాళ్ళు నవల గురించి రాయండి.

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. పాకుడురాళ్ళు నవలా రచయిత ఎవరు?
2. రావూరి భరద్వాజ భార్య పేరేమిటి?
3. రావూరి భరద్వాజ రచించిన మొదటి కథ ఏది?
4. రావూరి భరద్వాజ 'కొత్త చిగుళ్ళు' ఎవరికి అంకితమిచ్చాడు?
5. పాకుడురాళ్ళు నవలకు వచ్చిన అత్యున్నత పురస్కారమేది?

❖ ❖ ❖

# 6 జాతీయోద్యమ కవిత్వం

**- త్రిపురనేని మధుసూదనరావు**



## రచయిత పరిచయం

**ప**దునైన సాహిత్య విమర్శకు నిలువెత్తు రూపం త్రిపురనేని మధుసూదనరావు. ప్రముఖ హేతువాద కవి త్రిపురనేని రామస్వామి చౌదరికి మనుమడైన మధుసూదనరావు కృష్ణాజిల్లా, అంగలూరులో 14.01.1937 తేదీన జన్మించారు. తల్లిదండ్రులు నాగభూషణమ్మ, చలమయ్య. గుడివాడలో ఉన్నత పాఠశాల విద్యనూ, కళాశాల విద్యనూ ముగించిన మధుసూదనరావు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. ఆనర్స్ డిగ్రీని అందుకున్నారు.

త్రిపురనేని మధుసూదనరావు కొద్దికాలం కాకినాడ పి.ఆర్. కళాశాలలో ట్యూటర్‌గా పనిచేశారు. ఆ తరువాత తిరుపతిలో ఎస్.వి. ఆర్ట్స్ కళాశాలలో కొంతకాలం; ఎస్.జి.ఎస్. కళాశాలలో సుదీర్ఘకాలం అధ్యాపకులుగా పనిచేశారు. ఉపన్యాసాన్ని ఒక కళగా అభివృద్ధి చేశారు.

మార్క్సిస్టు తత్త్వశాస్త్రంలో లోతైన అభినివేశం ఉన్న త్రిపురనేని ఎన్నో విలువైన రచనలు అందించారు. కవిత్వం - చైతన్యం, సాహిత్యంలో వస్తు శిల్పాలు, మార్క్సిజం సాహిత్య విమర్శ, గతితార్కిక మానవతా వాదం వంటివి వాటిలో ప్రముఖమైనవి. వీరి, రచనలన్నీ ఇటీవల 'త్రిపురనేని మధుసూదనరావు సాహిత్య సర్వస్వం' పేరుతో మూడు సంపుటాలుగా వెలువడ్డాయి.

తన రచనల ద్వారానేకాక, తన ఉపన్యాసాల ద్వార కూడా లక్షలాది పాఠకులనూ ప్రజానీకాన్నీ ప్రభావితం చేసిన త్రిపురనేని 08.10.2004 తేదీన మరణించారు. ప్రస్తుత పాఠ్యభాగం తెలుగులో జాతీయోద్యమ కవిత్వం 'సాహిత్యంలో వస్తు శిల్పాలు' గ్రంథంలోని వ్యాసానికి సంక్షిప్త రూపం. చరిత్ర, దేశం, సాహిత్యం వంటి విషయాల పట్ల విద్యార్థుల్లో మక్కువను, శాస్త్రీయ అవగాహనను పెంచడం ఈ పాఠ్యభాగం ప్రధాన ఉద్దేశం.

## పాఠ్యభాగం

సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని జాతీయోద్యమం అంటారు. ఆధునిక ప్రపంచ చరిత్రలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు అనేక రూపాలలో జరిగాయి. సామ్రాజ్యవాదమూ జాతీయవాదమూ రెండూ ఆధునిక భావనలే.

1857లో సిపాయిలు తిరుగుబాటు చేశారు. బ్రిటీషువాళ్ళు సంస్థానాధీశుల అధికారాల్ని రద్దుచేశారు. సిక్కుల రాజ్యాన్ని బలప్రయోగం ద్వారా కలుపుకున్నారు. అనేకమంది బ్రిటీషు అధికారులు భారతీయ సంస్కృతిని నీచంగా నిందించారు. సైనికులలో సుబేదార్ స్థాయికంటే తక్కువ ఉద్యోగాల్ని మాత్రమే భారతీయులకు ఇచ్చేవారు. ఆవు కొవ్వునీ పంది కొవ్వునీ తూటాలకి ఉపయోగించారు. బ్రిటీషు సైనికాధికారులు భారతీయసిపాయిల్ని కుక్కల్లాగా చూసేవారు. ఈ స్థితిని భరించలేక సిపాయిలు తిరుగుబాటు చేశారు. బర్హంపూరు, బారక్‌పూరు, మీరట్, ఢిల్లీ, కాన్పూరులు ఈ తిరుగుబాటుకి ప్రధాన కేంద్రాలయ్యాయి. దేశంలో అనేక ప్రాంతాలలోని రైతులు సిపాయిల తిరుగుబాటుకి మద్దతును ఇచ్చారు. ఢిల్లీ బహదూర్‌షానీ, నానాసాహెబ్‌నీ, ఝాన్సీ లక్ష్మీబాయినీ నాయకులుగా చేసుకున్నారు. ఝాన్సీ, నానాసాహెబ్‌లు వీరోచితంగా పోరాటం చేశారు.

భారతదేశాన్ని ఒక మార్కెట్టుగా చేసే క్రమంలో, భారతదేశంలోని ముడిపదార్థాలవంటి సంపదను కొల్లగొట్టటానికి సామ్రాజ్యవాదులు చేసిన ఆధునికీకరణంతో దేశంలో జాతీయభావం వ్యాపించింది. ఉద్యోగాలనూ, పారిశ్రామిక సౌకర్యాలనూ, నీటిపారుదల సౌకర్యాలనూ కల్పించడంలోనూ సామ్రాజ్యవాద ప్రయోజనాలకు ఆనుగుణ్యమైన పద్ధతులు భారతీయ మేధావుల్ని కలవరపరిచాయి. గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యం దుర్భర స్థాయికి చేరుకుంది. ఎన్నో ప్రాంతాలలో కరువు కాటకాలు సంభవించాయి. సంస్కరణవాదులైన మహారాష్ట్ర. బెంగాలీ మేధావులు దేశానికి జరుగుతున్న అన్యాయాల్ని గురించి బాహాటంగా చెప్పడం ప్రారంభించారు. పత్రికలు మంచి ప్రచారసాధనాలుగా దేశ పరిస్థితుల్ని గురించి ఎంతో కొంత మేరకి బహిర్గతం చేశాయి. 1876లో సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనందమోహన్ బోస్‌లు 'ఇండియన్ అసోసియేషన్' అనే అఖిలభారత సంస్థ స్థాపించారు. ఐ.సి.ఎస్. పరీక్షకి హాజరయ్యే వయస్సుని 21 నుంచీ 19 సంవత్సరాలకి తగ్గించడంవల్లా, ఈ పరీక్ష లండన్‌కి వెళ్ళి రాయవలసి రావడంవల్లా భారతీయ యువకులకు ఉన్నతోద్యోగ అవకాశాలు తగ్గిపోయాయి. ఈ సమస్యమీద సురేంద్రనాథ్ బెనర్జీ బెనారస్, అలహాబాద్, లక్నో, అలీఘర్, ఢిల్లీ, మీరట్, లాహోర్ వంటి నగరాలకి వెళ్ళి విద్యావంతుల్ని చైతన్యం చేశాడు. అనేక ప్రాంతాలలో సంస్థలు స్థాపించడం జరిగింది. ప్రభుత్వం చేసే అనేక చట్టాల మీద దేశవ్యాప్తంగా అసంతృప్తి అనేక రూపాల్లో వ్యక్తమవుతుండేది. ఈ వాతావరణంలో ఎ.ఓ. హ్యూమ్ అనే బ్రిటీషు ఉద్యోగి ప్రయత్నాల్తో, ప్రజలకి ప్రభుత్వానికి మధ్య సంబంధాల్ని సమకూర్చే రాజకీయ వేదికగా 1885లో ఇండియన్ నేషనల్ కాంగ్రెసు అనే వేదిక స్థాపించబడింది. ఇది బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకమైన వేదిక కాదు. ప్రజల్లో పెరుగుతున్న అశాంతికి ఉపశమనంగా పనిచెయ్యడం కోసం బ్రిటీష్ సామ్రాజ్యాన్ని సుస్థిరం

చేయడం కోసం ఈ వేదికను స్థాపించడం జరిగిందని ఆనాటి నాయకులే అన్నారు. ఇది ఇంగ్లీషువాళ్ళు, భారతీయులూ కలసి స్థాపించుకున్న వలస స్వభావంగల వేదికే. ఈ వేదికే మొత్తం జాతీయోద్యమానికి కేంద్రంగా పనిచేసింది.

1885-1905 మధ్యకాలంలో ఈ వేదికలో జరిగిన కార్యకలాపాల్ని మితవాద రాజకీయాలనీ, టీపార్టీ రాజకీయాలనీ, భిక్షాటన రాజకీయాలనీ కొంతమంది ఆధునిక చరిత్రకారులు అంటారు. దాదాభాయి నౌరోజీ, పి.యం. మెహతా, డి.ఇ.వాచా, డబ్ల్యూ.సి. బెనర్జీ, సురేంద్రనాధ్ బెనర్జీ వంటి సంపన్న తరగతులనుంచి వచ్చిన మేధావులు ఈ దశలో బ్రిటీషు ప్రభుత్వంతో వ్యవహరించారు. వీళ్ళొక శిష్టబృందంగా పనిచేశారు. సామ్రాజ్యవాదుల చట్టబద్ధ, రాజ్యాంగబద్ధ పరిమితుల్లో, బూర్జువా వర్గ వర్తక పెట్టుబడి దారుల ప్రయోజనాల పరిమితుల్లో భారతదేశ ఆర్థిక పరిస్థితుల్ని సంస్కరించి అభివృద్ధి చేయవలసిందిగా బ్రిటీషువాళ్ళ మీద విజ్ఞప్తి పూర్వక ఒత్తిడి తెచ్చారు. దేశ ప్రధాన సమస్య ఆర్థిక సమస్య అని వాళ్ళులోతుగానే గుర్తించారు. అయితే రాజకీయాలతో నిమిత్తంలేకుండా ఆర్థిక సమస్య పరిష్కారం కాదనీ, కేంద్రీకృత ఆర్థిక సమస్యలే రాజకీయ సమస్యలనీ గుర్తించలేకపోయారు.

బ్రిటీషు సామ్రాజ్యవాద కాంక్ష ఇంకా బలంగా పెరిగింది. ఆదివాసుల నుంచీ పెట్టుబడిదారుల వరకూ దేశంలోని అన్ని వర్గాలలో పెరుగుతున్న అసంతృప్తిని సాయుధంగానూ, క్రూరమైన చట్టాలద్వారానూ అణచివెయ్యడం ప్రారంభించారు. శాంతిభద్రతల్ని సంరక్షించడం పేరుతో తమ రాజ్యాధికారాన్నీ, దోపిడిని యథేచ్ఛగా కొనసాగించడానికి ఉరితాళ్ల వంటి చట్టాల్ని చేశారు. ఇతర ప్రాంతాల కంటే బెంగాల్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేకత బలం పుంజుకుంది. దీన్ని అణచి వెయ్యడానికే పరిపాలనా సౌకర్యం పేరుతో కర్జన్ 1905లో బెంగాల్‌ని విభజించాడు.

బెంగాల్ విభజన బెంగాల్, మహారాష్ట్రలలో తీవ్రంగానూ ఇతర ప్రాంతాలలో ఒక సంచలన రూపంలోనూ ఆందోళనను లేవదీసింది. సమావేశాల్తోనూ విజ్ఞప్తుల్తోనూ ప్రారంభమైన బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం వందేమాతరం ఉద్యమంగా ఉద్ధృతం అయింది. అనేక వేలమంది విద్యార్థులు ఈ ఉద్యమంలో ప్రవేశించారు. బ్రిటీషువాళ్ళు వందేమాతరం ఉద్యమాన్ని అణిచివెయ్యడానికి క్రూరమైన హింసావిధానాన్ని అనుసరించారు.

మొత్తం మీద వందేమాతరం ఉద్యమ నాయకులు స్వరాజ్యభావాన్నీ, స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1911లో బెంగాల్ విభజన రద్దు అయిపోయింది. 1912 నుంచీ బ్రిటీషువాళ్ళు ఢిల్లీని రాజధానిగా చేసుకున్నారు. వందేమాతరం ఉద్యమం వలన జాతీయభావం విస్తృతంగా పరిచయమయింది. మధ్య తరగతి ప్రజలలో ప్రతిఘటనాశక్తి పెరిగింది. బ్రిటీషు సామ్రాజ్యానికి విధేయంగానే ఉంటూ ఎన్నుకున్న ప్రతినిధుల్తో కూడిన పార్లమెంటుకి ఆంతరంగిక వ్యవహారాలలో అధికారం సాధించడమనే హోంరూల్ ఉద్యమాన్ని అనిబిసెంట్, తిలక్‌లు నడిపారు.

బ్రిటీషువాళ్ళు చేసిన ప్రజావ్యతిరేక, జాతి వ్యతిరేక చట్టాలకి వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమం ఇది. ఈ ఉద్యమం కాంగ్రెసులోని మితవాద జాతీయవాదుల్ని, హిందూ ముస్లింలనూ ఐక్యం చేసింది. స్వపరిపాలన పట్ల ప్రజలలో అభిమానం పెంచగలిగింది.

వందేమాతరం ఉద్యమ ప్రచారానికి బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర ప్రాంతానికి వచ్చాడు. ఆయన ఇంగ్లీషు ఉపన్యాసాలకి తెలుగు అనువాదం చేసిన చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆశువుగా ఈ పద్యం చెప్పినట్టు పరిశోధకులు అంటున్నారు.

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగయగట్టి"

ఇది వందేమాతరం ఉద్యమ ప్రధాన నినాదాల మీద రాసింది కాదు. కానీ బ్రిటీష్‌వాళ్ళ దోపిడీని సరళంగా జనానికి అర్థమయ్యే ఉపమానాన్ని తీసుకుని చెప్పారు. చిలకమర్తే ప్రభుత్వం విధించిన పన్నుల బాధని కూడా ఇలా చెప్పారు.

"నేల దున్నుదమన్న జాలతరము పన్ను
నీరు గావలెనన్న నీటిపన్ను
వాణిజ్య మొనరింప వచ్చుబడికి పన్ను
సరకు లమ్ముదమన్న సంతపన్ను
కఱ్ఱ లమ్ముదమన్న గలప కింకొక పన్ను

పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారిపోవుదమన్న బండి హాసీల్ పన్ను
కొంపమ్ముకున్నచో స్టాంపుపన్ను
ఉన్నమట్టుకు తినకుండ నుప్పుపన్ను
ననెడి పన్ను వెదగదీసె జనుల నెల్ల"

చిలకమర్తి – కవితల ప్రేరణచే సామ్రాజ్యవాదుల దోపిడీమీదా, భారత ప్రజల దారిద్ర్య బాధలమీద చాలామంది కవులు పద్యాలు రాసారు. చన్నాప్రగడ భానుమూర్తి (1906) డ్రెయిను సిద్ధాంతము గురించి యిలా రాశారు.

"ప్రొద్దున లేవంగ పోయి రాజవలెనన్న
నగ్నిహోత్రము స్వేడ నంపవలసె
నాబాల గోపాల మఖిలంబునకును మాం
చెష్టరు పుట్టములేయవలసె
మునుమాపు వ్యాయామమునకు కందుకములు
లండను పంపుచు నుండవలసె
వ్రాతకు లేఖిని పత్రము ల్వలయుచో
నాస్ట్రియా జర్మను లంపవలసె

చిన్నబిడ్డలు ద్రావంగ క్షీరములును
భాగ్యవంతుల పాలకు పంచదార
యూరిపేద గంజికి ముప్పుగల్లు
నన్యదేశంబు లంపంగ నయ్యెనకట

వందేమాతరం ఉద్యమంలో స్వదేశీ ఉద్యమం కూడా ఈ పద్యానికి ప్రేరణ. ఉద్యమంలో పాల్గొని భానుమూర్తి కవిత్వం రాసాడు.

"మనవి యర్జీల తోడనె తృప్తి వొందుచు
నూరక యుర్వ్రిళు లూరుకొనుచు" –

అని చిదంబరరావు మితవాద రాజకీయాల్ని నిరసించాడు. పద్యాలు మాత్రమే కాదు ఈ ఉద్యమం గేయాల్లో కూడా పాడింది.

"మేలుకొనుమీ భరత పుత్రుడ
మేలుకొనుమీ సుజన పుత్రుడ
మేలుకొనుమీ సచ్చరిత్రుడ
మేలుకొనవయ్యా వత్సా; మేలుకో
వేడుకను జాతీయతను వేగుచుక్క పొడిచె నదుగో
కూడి వందే మాతరమ్మను కుక్కుటము అరచెన్" (1909)

ఇలా మితవాద దశమీదా, వందేమాతరం హోంరూలు ఉద్యమం మీదా కవులు పద్యాలూ, గేయాలూ, కీర్తనలూ రాసారు. ఈ దశలో కవిత్వం రాయడమే కాక కవులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

"వందన మిదె గైగొనుమీ – భారత జననీ
భారత జననీ మా పాలిట రాణీ
సాత్త్విక నిరోధమునకు – జన్మ శాఖవు
జన్మశాఖవు, పటుజన సమేతవు
... ... ... ...
స్వరాజ్య దీక్ష గొనిన – సత్యమూర్తివి
సత్యమూర్తివీ – అసహాయ వర్తివీ" –

అని వందేమాతరం ఉద్యమం దశలో వచ్చిన 'భారతమాత' భావాన్నీ సాత్త్విక నిరోధ పోరాట రూపాన్నీ, స్వరాజ్య నినాదాన్నీ ఈ పాటలో గరిమెళ్ల బోధించారు.

"కార్మికులకే – కర్షకులకే
వర్తకులకే – భూపతులకే
వర్గపతిగా వ్యవహరింపబడు
వరుస ముప్పది యైదు కోటులు
భారతీయుల ప్రాణమాతడు
గాంధికంటెను సామ్యవాదులు
కలరె లోకములో" –

అని చుక్కబొట్ల సత్యనారాయణమూర్తి రాసాడు.

సత్యాగ్రహం, సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లంఘనం వంటి గాంధీ పోరాట రూపాలన్నింటికీ వందేమాతరం ఉద్యమంలో పునాదులు ఉన్నాయి. వేషభాషలలో విలక్షణత, జనంతో సన్నిహితంగా ఉండడం, పట్టుదల వంటివి గాంధీని ప్రముఖుడుగా చేసాయి.

చంపారణ్ సత్యాగ్రహం, రౌలట్ సత్యాగ్రహం, ఖిలాఫత్ ఉద్యమం, జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ, చౌరీచౌరా హింసాకాండ కవిత్వంమీద తీవ్రంగా ప్రభావం వేశాయి.

"పాంచాల దేశీయభక్తహంతకులైన
చెడుగు ధూర్తులను శిక్షించువరకు
ఇస్లాం సహోదరాభీష్టానుగుణముగా
నిలఖిలాఫతు నిర్ణయించు వరకు
దేశీయ గౌరవాదేశ నాశకమైన
ఘోర రౌలటుచట్ట మారువరకు
జాతీయతా బహిష్కార సూత్రతములౌ
చిలిపి చట్టములు నశించువరకు
ఇవియు నవియని లెక్కింపనేల మనకు
ధన్య సంపూర్ణ నిర్నిరోధ స్వరాజ్య
పీఠికాను ప్రతిష్ఠ లభించు వఱకు
తగునె నిద్రింప భరతపుత్రున కిపుడు" –

అని బలిజేపల్లి చైతన్యగీతిక ఆలపించాడు.

"వడకు నూలు వలువలు నేసి
చేతివృత్తులు లేవదీసి
కల్లు సారా లెల్లరోసి
జైళ్ళలోని కెళ్ళివద్దాం
పాఠశాలలు పాడుబెట్టి
కోర్టులన్నీ కూలద్రోసి
సీమగుడ్డలు చింపివేసి
జైళ్ళ కెళ్ళి జై జై అందాం"

రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిర్మాణ కార్యక్రమం మీదా బహిష్కరణ కార్యక్రమం మీదా ఖిలాఫత్ ఉద్యమం మీద రాశులకొద్దీ కవిత్వాన్ని కవులు చాలా ఆవేశంతో రాసారు. రాట్నంమీదా విదేశ వస్తు బహిష్కరణ మీదా, మద్యపాన నిషేధం మీదా ఎందరెందరో కవులు పద్యాలు రాసారు, ప్రచారం చేశారు. జైళ్ళ మీద భయం పోగొట్టారు. విద్యార్థుల్ని పాఠశాలల్ని వదలి పికిటింగ్ చెయ్యమన్నారు.

"దయ్యమునకు నిముడు

అలడయ్యరను నథముడు

ఆంగ్లసీమ కెల్ల వాడయ్యెను

ప్రియతముడు" –

అని గరిమెళ్ళ గళమెత్తాడు.

జలియన్ వాలాబాగ్‌లో సామూహిక హత్య జరిపిన డయ్యరును ఇంగ్లీషు వాళ్ళు అభినందించినప్పుడు రాసిన నిరసన గేయం చూడండి.

"పశుబలమునకు భక్తుండొకడు బడాయి ఓ డయరు

ప్రొద్దున లేచి ఫిరంగిదేవుని కొలిచి దండం పెడతాడూ

ముప్పదికోటుల పప్పుసుద్దలని ఎప్పుడు అతడూ నవ్వేడూ

... ... ... ... ... ... ...

పంజాబునంతా గుఱ్ఱంచేసి పైన సవారి అన్నాడూ

కాలు కదిపితే ఖైదన్నాడు మైకలు ఓ డయరూ

... ... ... ... ... ...

ప్రజలమీదనె గురిపించాడు గుండ్లవర్షం

పరుగిడు జనుల పైపై గుప్పె బారుల బారులూ" –

అని చిల్లరిగె శ్రీనివాసరావు దుయ్యబట్టాడు.

స్త్రీలను అవమానించడం, విద్యార్థుల్ని దిగంబరులుగా చేసి బహిరంగంగా కొరడాల్తో కొట్టడం, అనేకమందిచేత పొట్టపాకుడు చేయించడం వంటి దారుణ కృత్యాలన్నింటినీ తెలుగు కవులు నిరసిస్తూ కవిత్వం రాసారు.

ఇక ఉప్పు సత్యాగ్రహంమీదా, శాసనసభా రాజకీయాలమీదా, క్రిప్స్ రాయబారం మీదా, క్విట్ ఇండియా ఉద్యమం మీదా, ఆగస్టు విప్లవంమీదా, జాతీయ జెండామీదా ఎన్నో కావ్యాలూ, ఖండకావ్యాలూ, పద్యాలూ, గీతాలూ, పదాలూ, సుద్దులూ తెలుగు కవులు రాసారు. గురజాడ నుంచీ 1947 దాకా జాతీయోద్యమ సాహిత్యమే తెలుగు సాహిత్య ప్రధానచరిత్ర. 1947 తర్వాతకూడ జాతీయోద్యమంలో దశల్ని తీసుకొని కానీ, నాయకుల్ని తీసుకొనికానీ చాలా సాహిత్యం వచ్చింది. జాతీయోద్యమ ఆశయాల్నీ, కార్యక్రమాల్నీ కవిత్వంలోకి అనువదించారు. గరిమెళ్ళ సత్యనారాయణ "మా కొద్దీ తెల్ల దొరతనము" అనే పాట ప్రజలమీద ఎంతో ప్రభావం చూపింది.

ఈయనతో జాతీయ కవిత్వం రాసిన అనేక మంది కవులు ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. లాఠీ దెబ్బలు తిన్నవాళ్ళూ, జైళ్ళకి వెళ్ళినవాళ్ళూ ఉన్నారు. జాతీయోద్యమంలో వచ్చిన అనేక కావ్యాల్నీ, కవితా సంకలనాల్నీ, పాటల్నీ ప్రభుత్వం నిషేధించింది. కొంతమంది కవులు కోర్టులలోనూ, బ్రిటీషు ఆఫీసర్ల ముందుకూడా నిర్భయంగా కంచుకంఠంతో జాతీయగీతాలు పాడారు. కవిత్వానికీ రాజకీయాలకీ సంబంధం ఉండకూడదనీ; కవులు రాజకీయ ఉద్యమాలలో పాల్గొనకూడదనీ జాతీయోద్యమ కవులు ఎవరూ అనుకోలేదు. 1947 తో జాతీయోద్యమ కవిత్వం సహజంగానే ఆగిపోయింది. ఆగష్టు 15న స్వాతంత్ర్యం వచ్చినపుడు వారు ఎన్నో గేయాలు రాసారు. గాంధీ హత్యగావింపబడినప్పుడు 'ఎలిజీ' లు రాసారు. కొంతమంది గాంధీ చరిత్రను పద్య కావ్యాలుగా మలిచారు. దండకాలు రాసారు. అయితే వీటిని చారిత్రక కావ్యాలుగా మాత్రమే పరిగణించాలి.

## అభ్యాసం

### I. వ్యాస రూప సమాధాన ప్రశ్నలు

1. జాతీయోద్యమం అనగానేమిటి? ఇది భారతదేశంలో ఏ విధంగా వ్యాపించింది?
2. తెలుగులో వచ్చిన జాతీయోద్యమ కవిత్వాన్ని వివరించండి.

### II. సంక్షిప్త రూప సమాధాన ప్రశ్నలు

1. చిలకమర్తి తెలిపిన ఆనాటి పన్నులను పేర్కొనండి.
2. బలిజేపల్లి వారి స్వరాజ్య కాంక్షను తెల్పండి.
3. దయ్యరును తెలుగు కవులు ఎలా నిరసించారు?
4. గరిమెళ్ళ సత్యనారాయణ ప్రజల్లో ఎలా స్వాతంత్ర్య చైతన్యాన్ని కలిగించారు?

### III. ఏక వాక్య / పద రూప సమాధాన ప్రశ్నలు

1. ఇండియన్ అసోసియేషన్ సంస్థను ఎవరు స్థాపించారు?
2. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌ను ఎప్పుడు స్థాపించారు?
3. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలను తెలుగులో అనువదించిందెవరు?
4. 'మా కొద్దీ తెల్లదొరతనం' గీతం ఎవరు రాశారు?
5. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమమేది?

❖ ❖ ❖

# వ్యాకరణాంశాలు - నైపుణ్యాలు


1. భాషాభాగాలు 89 - 91

2. వాక్య విజ్ఞానం 92 - 94

3. ఛందస్సు 95 - 103

4. అలంకారాలు 104 - 110

5. సంక్షిప్తీకరణ 111 - 113

# 1 భాషా భాగాలు

**భా**షలోని భాగాలనే భాషాభాగాలు అంటారు. ఇవి అన్నిభాషలలోనూ ఉన్నాయి. తెలుగులో భాషా భాగాలను తెలుసుకుందాం. తెలుగు భాషలో భాషాభాగాలు ప్రధానంగా ఐదు రకాలు.

1. నామవాచకం
2. సర్వనామం
3. విశేషణం
4. క్రియ
5. అవ్యయం

## I. నామవాచకం :

నామవాచకం అంటే పేర్లను తెలియజేసేది అని అర్థం. అది వ్యక్తి పేరు, ఊరు పేరు, పర్వతం పేరు, దేశంపేరు... ఇలా ఏ పేరైనా సూచిస్తే దాన్ని నామవాచకం అంటాం.

ఉదా:- రవి, లత, అమరావతి, విశాఖపట్టణం, హిమాలయాలు, భారతదేశం మొదలైనవి.

**వాక్యాల్లో నామవాచకాన్ని గుర్తించడం:**

1. **సునీత** పాటలు పాడుతుంది.
2. **అమరావతి** ఆంధ్ర ప్రదేశ్ రాజధాని.
3. **ఎవరెస్ట్** ప్రపంచంలో కెల్లా ఎత్తైన శిఖరం.
4. వేదభూమి **భారతదేశం.**
5. **నైలునది** ప్రపంచంలో పొడవైన నది.

## II. సర్వనామం :

నామవాచకానికి బదులుగా వాడేపదాన్ని సర్వనామం అంటారు. అంటే పేర్లకు బదులుగా వాడేపదాలు.

నేను, ఆమె, అతడు, అది, వారు, ఇది, అవి మొదలైనవి.

**వాక్యాల్లో సర్వనామాన్ని గుర్తించడం:**

1. **ఆయనే** మా తెలుగు మాస్టారు.
2. **వాళ్ళందరూ** డిగ్రీ పూర్తి చేశారు.
3. **మీరు** మంచి విద్యార్థులు.
4. **మా** అమ్మ దేవత.
5. **ఆమె** భారత దేశ ప్రధాన మంత్రి.

## III. విశేషణం :

నామవాచకం లేదా సర్వనామం యొక్క గుణాలను తెలిపే పదాన్ని విశేషణం అంటారు.

తెలుపు, అందమైన, పొట్టి, తియ్యని, తెలివితక్కువ, పేదవాడు మొదలైనవి.

**వాక్యాలలో విశేషణాన్ని గుర్తించడం:**

1. ఆ పెళ్ళికొడుకు **తెల్లగా** ఉన్నాడు.
2. గులాబీ **అందమైన** పువ్వు.
3. పద్మావతి మా తరగతిలో **సమర్థవంతమైన** నాయకురాలు.
4. తిరుపతి **గొప్ప** యాత్రాస్థలం.
5. రాణి **మంచి** తెలివిగల అమ్మాయి.

## IV. క్రియ :

ఏ కాలంలో నైనా జరిగిన పనిని సూచించేది క్రియ.

చదువుకొను, నిద్రించు, వచ్చు, పరుగెత్తు, వండు మొదలైనవి.

**వాక్యాలలో క్రియను గుర్తించడం :**

1. నేను బాగా **చదువుతాను.**
2. ఎవరైనా ప్రశాంతంగా **నిద్రపోవాలి.**
3. పోలీసును చూసి దొంగ **పరుగెత్తాడు.**
4. భారతదేశంలో పేదరికాన్ని **రూపుమాపాలి.**
5. దేవదత్తుడు **వంటచేశాడు.**

### IV. అవ్యయం :

లింగ, వచన, విభక్తులు లేని పదాలను అవ్యయాలంటారు. వీటికి స్త్రీ, పురుష భేదం ఉండదు. ఏక బహు వచనాలు ఉండవు. డు, ము, వు, లు, యొక్క, చేత, కొఱకు, వలన మొదలైన విభక్తి ప్రత్యయాలు చేరవు.

యథా, తథా, ఎక్కడ, మీద, క్రింద, ప్రక్కన, నుండి, మరియు, కూడా, ఓహో, అయ్యయ్యో మొదలైనవి.

**వాక్యాల్లో అవ్యయాన్ని గుర్తించడం**

1. **ఆహా!** తెలుగు భాష ఎంత బాగుందో!
2. **ఎక్కడ** పేదవారు ఉండరో అదే సంపన్న రాజ్యం
3. పొయ్యి **మీద** పిల్లి కూర్చుంది.
4. **అయ్యయ్యో!** ఆ సంబంధం తప్పి పోయిందా?
5. వాడు తెలివైనవాడే **కానీ** పొగరు ఎక్కువ.

## అభ్యాసం

### I. ఏక వాక్య / పదరూప సమాధాన ప్రశ్నలు

1. నైలు నది ప్రపంచంలో పొడవైన నది – దీనిలోని నామవాచకాన్ని గుర్తించండి.
2. సర్వనామం అంటే ఏమిటి?
3. తిరుపతి గొప్ప యాత్రాస్థలం – విశేషణాన్ని గుర్తించండి.
4. భారతదేశంలో పేదరికాన్ని రూపుమాపాలి – క్రియ ఏది?
5. అవ్యయం అంటే ఏమిటి?
6. దేవదత్తుడు వంట చేశాడు – దీనిలో క్రియ ఏది?
7. విశేషణానికి ఉదాహరణ రాయండి.
8. తెలుగులో భాషాభాగాలు ఎన్ని రకాలు?
9. నామవాచకం అంటే ఏమిటి?
10. క్రియ అంటే ఏమిటి?
11. విశేషణం అంటే ఏమిటి?
12. అవ్యయానికి ఉదాహరణ రాయండి.
13. గులాబి అందమైన పువ్వు – దీనిలో విశేషణమేది?
14. మీరు మంచి విద్యార్థులు – దీనిలో సర్వనామమేది?
15. ఆహా! తెలుగు భాష ఎంత బాగుందో! – దీనిలో అవ్యయమేది?

# 2 వాక్య విజ్ఞానం

ఒక విషయాన్ని బోధించే పదాల సమాహారమే వాక్యం. అంటే, ఒక విషయాన్ని ఇతరులకు చెప్పడానికి నిర్దిష్ట క్రమంలో పదాల చేరిక ఉంటే దాన్ని వాక్యం అని పిలువ వచ్చు.

ఉదాహరణకు –

'పాఠం మాస్టారు చెప్పారు బాగా' – ఇది పదాల సమాహారమే. కానీ వాక్యం కాదు. ఎందుకంటే పదాలు నిర్దిష్ట క్రమంలో లేవు. దాన్ని సరిచేసి – 'మాస్టారు పాఠం బాగా చెప్పారు' అంటే అది మాత్రమే వాక్యం అవుతుంది.

వాక్యానికి మూడు నిబంధనలు ఉన్నాయి. అవి –

1. యోగ్యత 2. ఆకాంక్ష 3. ఆసత్తి

**1. యోగ్యత**

'వాడు మంటల్ని నిప్పుచేత ఆర్పుతున్నాడు'. ఈ వాక్యంలో యోగ్యత లోపించింది. మంటలను నీటిచేత ఆర్పుతారుగానీ, నిప్పుచేత కాదు కదా. కాబట్టి ఇందులో యోగ్యత లేదు. ఇది వాక్యం కాదు. 'వాడు మంటల్ని నీటితో ఆర్పుతున్నాడు' అన్నది వాక్యం అవుతుంది. కాబట్టి యోగ్యత అనగా వాక్యానికి సరైన అర్థం ఉండడం.

**2. ఆకాంక్ష**

'ఇండియా క్రికెట్ మాచ్ లో' అని చెప్తే అది వాక్యం కాదు. 'గెలిచిందా? ఓడిందా?' అనే సందేహం వినే వాడికి కలుగుతుంది. దాన్నే 'ఆకాంక్ష' అంటారు. ఈ వాక్యంలో వినేవాడి ఆకాంక్ష తీరలేదు కాబట్టి ఇది వాక్యం కాదు. 'ఇండియా క్రికెట్ మాచ్ లో గెలిచింది' అంటే వినేవాడికి ఆకాంక్ష తీరుతుంది. కాబట్టి వాక్యం అవుతుంది.

**3. ఆసత్తి**

వాక్యంలో పదాలు ఒక నిర్దిష్ట క్రమంలో వెనువెంటనే వస్తే అది ఆసత్తి. రాధ అనే ఆమె, 'లక్ష్మి' అని ఒక సారి చెప్పి, కాసేపటి తరువాతా 'నన్ను' అని చెప్పి, ఇంకోరోజు 'మరచిపోయింది' అని చెప్తే; అది వాక్యం కాదు. 'లక్ష్మి నన్ను మరచిపోయింది' అని ఆమె స్నేహితురాలు రాధ ఒకేసారి చెపితే అది వాక్యం అవుతుంది. ఈ గుణాన్నే ఆసత్తి అంటారు.

**వాక్యాలలో రకాలు**: వాక్యాలు స్థూలంగా మూడు రకాలు

1. సామాన్య వాక్యం
2. సంశ్లిష్ట వాక్యం
3. సంయుక్త వాక్యం

**1. సామాన్య వాక్యం**

ఒక సమాపక క్రియ మాత్రమే కలిగి ఉంటే అది సామాన్య వాక్యం.

**ఉదాహరణ:**

'అంబేద్కర్ మన రాజ్యాంగాన్ని రచించాడు' (ఇందులో రచించాడు అన్న క్రియ ఉంది)

క్రియ లేకుండా కూడా సామాన్య వాక్యాలు ఉంటాయి. ఆమె ఉపాధ్యాయురాలు. ఆయన పెద్దవాడు.

వీటిలో క్రియ లేదు. అయినా పూర్తి అర్థాన్ని ఇస్తున్నాయి. కాబట్టి ఇవీ సామాన్య వాక్యాలే.

వీటిని క్రియా రహిత వాక్యాలు అంటారు.

**2. సంశ్లిష్ట వాక్యం**

కొన్ని అప్రధాన వాక్యాలు ఒక ప్రధాన వాక్యంతో కలిసి ఏర్పడేది సంశ్లిష్ట వాక్యం. సంశ్లిష్ట వాక్యం అంటే ఒకటి అంతకంటే ఎక్కువ అసమాపక క్రియలు చివర ఒక సమాపక క్రియను కలిగి ఉంటుంది.

'నేను ఉదయాన్నే లేచి ఒక గంటసేపు చదువుతాను'.

ఇందులో 'లేచి' అనేది అసమాపక క్రియ. 'చదువుతాను' అనేది సమాపక క్రియ. కాబట్టి ఇది సంశ్లిష్ట వాక్యం.

మరికొన్ని ఉదాహరణలు :

'సుజాత టీవీ చూస్తూ, మాట్లాడుతూ భోజనం చేస్తుంది'.

'రైలు వచ్చినా చుట్టాలు రాలేదు'.

'అరుణ్ ఇంటికి వెళ్ళి వంటచేశాడు'.

**3. సంయుక్త వాక్యం**

సమ ప్రాధాన్యంగల రెండు, అంతకంటె ఎక్కువ వాక్యాలు కలసి ఒక వాక్యంగా ఏర్పడితే అది సంయుక్త వాక్యం అవుతుంది. దీనిలో అసమాపక క్రియలుండవు. అన్నీ సమాపక క్రియలే ఉంటాయి.

ఉదాహరణ:

వెంకటాచలం వేషాలు వేస్తాడు.

వెంకటాచలం ఉపన్యాసాలిస్తాడు.

ఈ రెండు సామాన్య వాక్యాలని కలిపితే 'వెంకటాచలం వేషాలు వేస్తాడు, ఉపన్యాసాలిస్తాడు' అవుతుంది. ఇది సంయుక్త వాక్యం. మరికొన్ని ఉదాహరణలు:

ఆ పెళ్ళికి నేనో, మా ఆవిడో వెళ్తాం.

పాపాలరావు అవినీతిపరుడు, కానీ నీతి గురించి మాట్లాడతాడు.

రాముడు, సీత, లక్ష్మణుడు అడవికి వెళ్ళారు.

## అభ్యాసం

### I. ఏక వాక్య / పదరూప సమాధాన ప్రశ్నలు

1. వాక్యానికి ఉండే లక్షణాలేమిటి?
2. వాక్యాలు స్థూలంగా ఎన్ని రకాలు?
3. సామాన్య వాక్యం అంటే ఏమిటి?
4. కొన్ని అప్రధాన వాక్యాలు ఒక ప్రధాన వాక్యంతో కలసి ఏర్పడే వాక్యమేది?
5. నేను ఉదయాన్నే లేచి ఒక గంటసేపు చదువుతాను – ఇది ఏ రకమైన వాక్యం?
6. పాపాలరావు అవినీతిపరుడు. పాపాలరావు నీతి గురించి మాట్లాడతాడు – సంయుక్త వాక్యం రాయండి.
7. అరుణ్ ఇంటికి వెళ్ళి వంట చేశాడు – ఇది ఏ రకమైన వాక్యం?
8. వాక్యం అంటే ఏమిటి?
9. సామాన్య వాక్యానికి ఉదాహరణ ఇవ్వండి.
10. 'వాడు మంటల్ని నిప్పుచేత ఆర్పుతున్నాడు' – దీనిలో దోషమేది?
11. రెండు సమప్రాధాన్యం గల వాక్యాలు కలసి ఒక వాక్యంగా ఏర్పడితే అది ఏ వాక్యం?
12. యోగ్యత అంటే ఏమిటి?
13. రైలు వచ్చినా చుట్టాలు రాలేదు – ఇది ఏ రకమైన వాక్యం?
14. ఆసత్తి అంటే ఏమిటి?
15. క్రియా రహిత వాక్యానికి ఉదాహరణ రాయండి.

❖ ❖ ❖

# 3 ఛందస్సు

ఛందస్సు అంటే పద్యలక్షణాలను వివరించే శాస్త్రం. ఛందస్సులో లయ ప్రాధాన్యం అంతర్గతంగా ఉంటుంది. గణాలు గురు లఘువులతో కలసి ఉంటాయి. నిర్ణీతమైన గణాల కూర్పుతో పద్య పాదాలు ఏర్పడతాయి. పద్యాలలో యతి, ప్రాసలు ఉంటాయి.

### లఘువు

ఒక మాత్ర కాలంలో ఉచ్చరించేది లఘువు. మాత్ర అనగా రెప్పపాటు కాలం లేదా చిటికె వేసినంత కాలం లేదా క్షణంలో నాల్గవ భాగం అని అర్థం. దీనిని అక్షరం పై భాగంలో I గుర్తుతో సూచిస్తారు. "ల" అంటే "లఘువు."

### గురువు

రెండు మాత్రల కాలంలో ఉచ్చరించేది గురువు. దీనిని అక్షర పై భాగంలో 'U' గుర్తుతో సూచిస్తారు. 'గ' అంటే 'గురువు.'

### గణాలు

కొన్ని గురు, లఘువులు కలసి గణాలు ఏర్పడతాయి. ఈ గణాలలో ప్రధాన గణాలనీ, ఉప గణాలనీ ఉన్నాయి. సూర్య గణాలు, ఇంద్ర గణాలు, చంద్ర గణాలు ఉప గణాల కోవలోకి వస్తాయి.

### ప్రధాన గణాలు

1. మ గణం - UUU
2. భ గణం - UII
3. జ గణం - IUI
4. స గణం - IIU
5. న గణం - I I I
6. య గణం - IUU
7. ర గణం - UIU
8. త గణం - UUI

**సూర్య గణాలు - 2**

1. న గణం - III
2. హ గణం - దీనిని గలం అని కూడా అంటారు - UI

**ఇంద్ర గణాలు - 6**

1. నల - IIII
2. నగ - IIIU
3. సల - IIUI
4. భ గణం - UII
5. ర గణం - UIU
6. త గణం - UUI

ఇవి కాక మరో రెండు గణాలు ఉన్నాయి.

1. వ గణం దీనిని లగం అని కూడా అంటారు - IU
2. గగ - UU

**యతి**

పద్య పాదంలో మొదటి అక్షరాన్ని యతి అంటారు. యతిని వళి, వడి, విరతి, విశ్రాంతి, విరామం అనే పేర్లతో కూడా పిలుస్తారు. పద్య పాదంలో మొదటి అక్షరానికీ, నియమిత స్థానంలో ఉండే అక్షరానికీ ఉండే మైత్రిని యతిమైత్రి అంటారు. యతిమైత్రి అచ్చులతోను, హల్లులతోను కలసి ఉంటుంది.

**ప్రాస**

పద్య పాదంలో రెండో అక్షర స్థానాన్ని 'ప్రాస' లేక 'ప్రాసము' అంటారు. పద్యంలోని అన్ని పాదాలలో ఉండే ప్రాస స్థానాలలో, అంటే రెండో అక్షర స్థానాలలో ఒకే హల్లును ప్రయోగిస్తే దానిని 'ప్రాస నియమం' అంటారు.

**ప్రాసయతి**

పద్య పాదంలో ప్రాసాక్షరానికి అంటే రెండో స్థానంలో ఉండే అక్షరానికి, నియమిత యతి స్థానం తరువాత అక్షరానికి జరిగే మైత్రిని ప్రాసయతి అంటారు. ఉపజాతి పద్యాల్లో ప్రాస ఉండదు. ప్రాసయతి ఉంటుంది.

పద్యాలు ప్రధానంగా మూడు రకాలు

1. వృత్తాలు
2. జాతులు
3. ఉపజాతులు

# 1. వృత్తాలు

## 1. ఉత్పలమాల

ఉత్పలమాల అంటే కలువపూల మాల అని అర్థం. ఈ పద్యం నడక అంత సుకుమారంగా ఉంటుందని దీనికి ఆ పేరు పెట్టారు.

### లక్షణాలు

ఈ పద్యంలో నాలుగు పాదాలు ఉంటాయి. (నాలుగు పాదాల కంటె ఎక్కువ పాదాలు రాస్తే దానిని 'ఉత్పలమాలిక' అంటారు). ప్రతి పాదంలోను వరుసగా 'భ,ర,న,భ,భ,ర,వ' అనే గణాలుంటాయి. ప్రతి పాదంలోను మొత్తం ఇరవై అక్షరాలు ఉంటాయి. ప్రతి పాదంలో మొదటి అక్షరానికీ, 10 వ అక్షరానికీ యతి మైత్రి ఉంటుంది. ప్రాస నియమం ఉంటుంది. అంటే నాలుగుపాదాల ప్రాసాక్షరాలలో ఒకే హల్లు ఉంటుంది.

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| విద్యని / | గూఢగు / | ప్తమగు / | విత్తము / | రూపము / | పూరుషా / | ళికిన్ |

యతిమైత్రి : 1 - 10 అక్షరాలైన 'వి - వి' లకు యతి పాటించబడింది.

ప్రాసాక్షరం : 'ద్య' అనే సంయుక్తాక్షరం ప్రాసగా ఉంది.

## 2. చంపకమాల

చంపకమాల అంటే సంపెంగపూల మాల అని అర్థం. ఈ పద్యం అంత హృదయంగమంగా ఉంటుందని దీనికి ఆ పేరు పెట్టారు.

### లక్షణాలు

ఈ పద్యంలో నాలుగు పాదాలు ఉంటాయి. (నాలుగు పాదాల కంటె ఎక్కువ పాదాలు రాస్తే దానిని చంపకమాలిక అంటారు) ప్రతి పాదంలోను వరుసగా 'న,జ,భ,జ,జ,జ,ర' అనే గణాలుంటాయి. ప్రతి పాదంలోను మొత్తం 21 అక్షరాలు ఉంటాయి. ప్రతి పాదంలో మొదటి అక్షరానికీ, 11 వ అక్షరానికీ యతిమైత్రి ఉంటుంది. ప్రాస నియమం ఉంటుంది. అంటే అన్ని పాదాల ప్రాసాక్షరాలలో ఒకే హల్లు ఉంటుంది.

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| జనులు / | నుతింప / | గా సుకృ / | త సంప / | దఁజేసి / | యమర్త్య / | భావముం |

యతి మైత్రి: 1 - 11 అక్షరాలైన 'జ' లోని అ కు - 'స' లోని అ కు యతి పాటించారు.

ప్రాసాక్షరం: 'న' అనే హల్లు ప్రాసగా ఉంటుంది.

### 3. శార్దూలం

శార్దూలాన్ని 'శార్దూల విక్రీడితం' అని కూడా అంటారు. శార్దూలం అంటే పెద్దపులి అని అర్థం. ఈ ఛందస్సు నడక పెద్ద పులి అరుపులాగా రౌద్రంగా ఉంటుంది. అందువల్ల దీనికాపేరు పెట్టారు. దీనిలో నాలుగు పాదాలు ఉంటాయి. ప్రతి పాదంలోను వరుసగా 'మ,స,జ,స,త,త,గ' అనే గణాలుంటాయి. ప్రతిపాదంలో మొత్తం 19 అక్షరాలు ఉంటాయి. యతి మైత్రి 1 – 13 అక్షరాలకు ఉంటుంది. ప్రాసనియమం ఉంటుంది.

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ఎన్నోయేం | డ్ల గతిం | చి పోయి | నవి గా | నీ యాశ్మ | శాన స్థ | లిన్ |

యతి మైత్రి: 1 వ అక్షరం 'ఎ' అనే అచ్చుకు, 13 వ అక్షరం 'నీ' లో గల 'ఈ' అనే అచ్చుకు చెల్లింది. దీనిని స్వరమైత్రి అంటారు.

ప్రాసాక్షరం: 'న్న' అనే అక్షరం. ద్విత్వ నకారం ప్రాసగా ఉంది.

### 4. మత్తేభం

మత్తేభాన్ని 'మత్తేభ విక్రీడితం' అని కూడా అంటారు. మత్తేభం అంటే మదించిన ఏనుగు అని అర్థం. దీనిలో నాలుగు పాదాలు ఉంటాయి. ప్రతి పాదంలోను వరుసగా 'స,భ,ర,న,మ,య,వ' అనే గణాలుంటాయి. ప్రతిపాదంలో మొత్తం 20 అక్షరాలు ఉంటాయి. యతి మైత్రి 1 – 14 అక్షరాలకు ఉంటుంది. ప్రాస నియమం ఉంటుంది.

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| కడుఁ గో | పించి ద | శాననుం | డతని | వక్షఃపీ | ఠమున్ జొ | చ్చి పో |

యతి మైత్రి: 1వ అక్షరమైన 'క' లోని అ కు 14వ అక్షరమైన 'క్ష' లోని క కు యతి చెల్లింది.

ప్రాసాక్షరం: 'డ' కారం ప్రాసగా ఉంది.

## II. జాతులు

### 1. కందం

కందం చిన్న పద్యమైనా ఎక్కువ లక్షణాలు గలది. అందుకే 'కందం రాసినవాడే కవి' అనే నానుడి వచ్చింది. ఈ పద్యంలో నాలుగు పాదాలుంటాయి. ఒకటి, మూడు పాదాలకు మూడేసి గణాలు, రెండు నాలుగు పాదాలకు ఐదేసి గణాలు ఉంటాయి. మొదటి రెండు పాదాలను ఒక భాగం గాను, మూడు నాలుగు పాదాలను ఒక భాగంగాను పేర్కొంటారు. కంద పద్యంలో "భ,జ,స,నల,గగ' అనే చతుర్మాత్రా గణాలు

మాత్రమే వాడాలి. బేసి సంఖ్య గల గణాలలో (1,3,5,7 గణాలలో) 'జ' గణం రాకూడదు. ఆరవ గణం 'జ' గణం కానీ 'నల' కానీ ఉండాలి. యతి మైత్రి రెండు, నాలుగు పాదాలలో 1 – 4 గణాల మొదటి అక్షరాలకు ఉంటుంది. ప్రాస నియమం ఉంటుంది. రెండు, నాలుగు పాదాల చివరి అక్షరం విధిగా గురువై ఉండాలి. మొదటి పాదం గురువుతో ప్రారంభమైతే, మిగిలిన పాదాలన్నీ గురువుతోనే ప్రారంభం కావాలి. లేదా మొదటి పాదం లఘువుతో ప్రారంభమైతే, మిగిలిన పాదాలన్నీ లఘువుతోనే ప్రారంభం కావాలి.

భ స స
**U I I I I U I I U**
చుక్కలు / తలపూ / వులుగా

భ స జ భ గగ
**U I I I I U I U I U I I UU**
**న**క్కజ / ముగమే / ను వెంచి / **య**ంబర / వీథిన్

యతి మైత్రి: రెండో పాదంలో 'న' అనే అక్షరం లో సంధిగతంగా ఉన్న 'అ' కారానికీ,

నాలుగో గణంలో సంధిగతంగా ఉన్న 'య' లోని 'అ' కారానికీ చెల్లింది.

ప్రాసాక్షరం: 'క్క' అనే అక్షరం అంటే ద్విత్వ కకారం ప్రాసగా ఉంది.

## 2. ద్విపద

ద్విపద ఛందస్సు దేశి కవిత్వానికి చెందినది. 'ద్వి–పద' అంటే రెండు పాదాలు అని అర్థం. అంటే దీనిలో రెండు పాదాలు మాత్రమే ఉంటాయి. ప్రతి పాదంలో మూడు ఇంద్ర గణాలు, తరువాత ఒక సూర్యగణం ఉంటాయి. 1–3 గణాల మొదటి అక్షరాలకు యతి మైత్రి ఉంటుంది. ప్రాస నియమం ఉంటుంది. ప్రాస నియమం లేని ద్విపదను మంజరీద్విపద అని అంటారు. శ్రీనాథుడు పల్నాటివీరచరిత్రను 'మంజరీ ద్విపద' లో రాశాడు.

సల త సల న
**I I U I U U I I I U I I I I**
**తు**రగంబు పై నెక్కి **దు**మికించి కొనుచు

ర సల భ హ
**U I U I I U I U I I UI**
**వ**చ్చికొ ల్వునుజేరి **వా**జిని డిగ్గి

యతి మైత్రి: మొదటి పాదంలో 'తు – దు' లకు పాటించబడింది.

రెండో పాదంలో 'వ–వా' లకు పాటించబడింది.

## III. ఉపజాతులు

### 1. ఆటవెలది:

ఆటవెలది ఉపజాతి పద్యం. ఈ పద్యంలో నాలుగు పాదాలుంటాయి. 1,3 పాదాలలో వరుసగా 3 సూర్య గణాలు, 2 ఇంద్ర గణాలు ఉంటాయి. 2, 4 పాదాలలో 5 సూర్య గణాలు ఉంటాయి. ప్రతి పాదంలోను 1-4 గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి చెల్లుతుంది. ప్రాసనియమం లేదు. ప్రాసయతిని పాటింపవచ్చును.

హ హ హ ర సల
UI UI UI UIU II UI
**ఉ**ప్పు కప్పు రంబు **నొ**క్క పో లికనుండు

హ హ న హ హ
UI UI III UI UI
చూ**డ** చూడ రుచుల జా**డ** వేరు

పై ఉదాహరణలో మొదటి పాదంలో మొదట 3 సూర్య గణాలూ, తరువాత రెండు ఇంద్ర గణాలూ వచ్చాయి. రెండో పాదంలో ఐదూ సూర్య గణాతలు వచ్చాయి. కాబట్టి ఇది ఆటవెలది పద్యం.

యతిమైత్రి మొదటి పాదంలో 'ఉ' అనే అచ్చుకు, నాలుగో గణం మొదటి అక్షరం 'నొ' లో గల 'ఒ' అనే అచ్చుకు చెల్లింది. రెండో పాదంలో 1-4 గణాల మొదటి అక్షరాలకు యతి మైత్రి చెల్ల లేదు కాబట్టి ప్రాసయతిని కవి పాటించాడు. 1 వ గణం ప్రాసాక్షరమైన 'డ', నాలుగో గణం ప్రాసాక్షరమైన 'డ' లకు ప్రాసయతి సరిపోయింది. (చూడ - జాడ)

### 2. తేటగీతి

తేటగీతి ఉపజాతి పద్యం. ఈ పద్యంలో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదంలో వరుసగా ఒక సూర్యగణం, రెండు ఇంద్ర గణాలు, రెండు సూర్య గణాలు ఉండాలి. ప్రతి పాదంలోను 1 - 4 గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి ఉంటుంది. ప్రాసనియమం లేదు. ప్రాసయతి పాటింప వచ్చును.

న భ త హ న
III UII UUI UI III
**ప**లుకు నప్పుడు నున్నాడ **బా**ద పమున

యతి మైత్రి: 1 - 4 గణాలు మొదటి అక్షరాలైన 'ప', 'బా' లకు సరిపోయింది.

### 3. సీసం

సీసం ఉపజాతి పద్యం. ఈ పద్యంలో నాలుగు పాదాలుంటాయి. ప్రతి పాదానికి వరుసగా ఆరు ఇంద్ర గణాలు, రెండు సూర్య గణాలు ఉంటాయి. పఠన సౌలభ్యం కోసం ప్రతి పాదాన్ని రెండు చిన్న పాదాలుగా విభజించారు. అంటే పద్యంలో మొత్తం 8 అర్ధ పాదాలు ఉంటాయి. ప్రతి అర్ధపాదంలోనూ, 1-3 గణాల మొదటి అక్షరాలకు యతిమైత్రి ఉంటుంది. ప్రాస నియమం లేదు. ప్రాస యతిని పాటింపవచ్చును. సీస పద్యం ముగిసిన తరువాత అనుబంధంగా తేటగీతి పద్యం కాని, ఆటవెలది పద్యం కానీ విధిగా ఉండాలి. దీనిని ఎత్తు గీతి అంటారు.

| ర | త | ర | సల |
|---|---|---|---|
| UIU | UUI | UIUII | UI |
| **నీ**లమే | ఘచ్ఛాయ | **బో**లుదే | హమువాడు |

| స | ర | న | హ |
|---|---|---|---|
| IIUI | UIU | III | UI |
| **ధ**వళాబ్జ | పత్రనే | **త్ర**ముల | వాcడు |

మొదటి పాదంలో 'ల-లు'లకు ప్రాసయతి పాటించబడింది.

రెండో పాదంలో 'ధ'లోని 'అ'కు, 'త్ర'లోని 'అ'కు స్వరమైత్రి పాటించబడింది.

## ముత్యాలసరం

గురజాడ అప్పారావు 1910 లో ముత్యాలసరాలు అనే ఖండికను 'ముత్యాల సరాలు' అనే ఛందస్సులో రాశాడు. ఒక ఫారసీ గజల్ విని స్ఫూర్తిపొంది ముత్యాలసరాలు ఛందస్సును కూర్చినట్టు గురజాడ చెప్పుకున్నారు. వృషభగతి రగడ, భామినీ షట్పది వంటి ఛందస్సులలోనూ ముత్యాలసరాలకు మూలాలు కన్పిస్తున్నాయి. ముత్యాల సరాలు మాత్రా ఛందస్సుతో కూడిన గేయ ప్రక్రియ.

**లక్షణాలు**

1. ఇది మాత్రా గణాలతో ఏర్పడుతుంది.
2. ఇందులో నాలుగు పాదాలుంటాయి.
3. ప్రతి పాదంలోనూ 3+4; 3+4 క్రమంలో మొత్తం 14 మాత్రలుంటాయి.
4. 4 వ పాదంలో మాత్రం 7 నుంచి 14 మాత్రలుదాకా ఉండవచ్చు.

5. నాల్గవ పాదంతో భావం పూర్తి కావాలి.

6. నాలుగు పాదాలలో భావం పూర్తికానపుడు ఒకొక్కసారి ఐదవ పాదం దాకా పెరుగుతుంది. దీనిని తోక 'ముత్యాల సరము' అని వ్యవహరిస్తారు. 'కన్యక' ఖండికలోనూ ఈ తోక ముత్యాలసరాలు కొన్ని ఉన్నాయి. గమనించవచ్చు.

**ఉదాహరణ:** ముత్యాల సరం

U I U U U I U I I (14 మాత్రలు)
పట్ట మేలే రాజు పోయెను,

U I I I I I U I U I I (14 మాత్రలు)
మట్టి కలిసెను కోట పేటలు,

I U U U U I I I I I (14 మాత్రలు)
పదం పద్యం పట్టి నిలిచెను

U I I I U U (9 మాత్రలు)
కీర్తులపకీర్తుల్.

**ఉదాహరణ:** తోక ముత్యాలసరం

I I I I I I I U I I I I I (14 మాత్రలు)
పసిడి కడవల పాలు పెరుగులు

U I U I I U I U I I (14 మాత్రలు)
పళ్ళెరమ్ముల పళ్ళు పువ్వులు

U I U I I I I I U I I (14 మాత్రలు)
మోము లందున మొలక నవ్వులు

I I I I I U U (9 మాత్రలు)
చెలగ చెలికత్తెల్

U I I I I I (7 మాత్రలు)
వెంట నడిచిరి.

## అభ్యాసం

**I. ఏక వాక్య / పదరూప సమాధాన ప్రశ్నలు**

1. ఛందస్సు అంటే ఏమిటి?
2. 'చంపకమాల' లోని గణాలు ఏవి?
3. 'మత్తేభం' లో యతిస్థానం ఏది?
4. కంద పద్యంలో బేసి స్థానంలో ఏ గణం ఉండకూడదు?
5. ఉపజాతుల్లో ఏ నియమం ఉండదు?
6. ముత్యాలసరం నాల్గవ పాదంలో ఎన్ని మాత్రలుంటాయి?
7. మత్తేభంలోని గణాలు ఏవి?
8. ఉత్పలమాల పద్యంలో ఎన్నో అక్షరానికి యతిస్థానం ఉంటుంది?
9. ఇంద్ర గణాలేవి?
10. సీస పద్యానికి అనుబంధంగా ఏ పద్యం రాస్తారు?
11. ప్రాస అంటే ఏమిటి?
12. కంద పద్యంలో వాడే గణాలేవి?
13. తేటగీతిలోని గణాలేవి?
14. ఉత్పలమాలలోని గణాలేవి?
15. శార్దూలంలోని గణాలేవి?

**అధ్యాపకులకు సూచన :**

పై నిర్వచనాలను, లక్షణాలను బోధించేటపుడు బోర్డు మీద ఒక పద్యాన్ని రాసి వివరిస్తే విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారు.

❖ ❖ ❖

# 4 అలంకారాలు

'అలంకరోతి ఇతి అలంకారః' అని అలంకార శబ్దానికి సంస్కృతంలో వ్యుత్పత్తి. అంటే అలంకరించేది అని అర్థం. కావ్యాన్ని కన్యకతో పోలుస్తారు. కన్యకు సొమ్ములు ఏ విధంగా అందాన్ని ద్విగుణీకృతం చేస్తాయో, కావ్యంలో అలంకారాలు కూడా కావ్యం సొగసుని రెట్టింపు చేస్తాయి. కావ్యంలో అలంకారాలకు రెండు ముఖ్య ప్రయోజనాలున్నాయి. 1. కావ్య సౌందర్యాన్ని ఇనుమడింపజేయడం 2. భావాన్ని సులభంగా అర్థం అయ్యేటట్లు చేయడం. అలంకారాలు రెండు రకాలు.

1. శబ్దాలంకారాలు - ఇవి శబ్దం ప్రధానంగా కలవి.
2. అర్థాలంకారాలు - ఇవి అర్థాన్ని ఆశ్రయించి ఉంటాయి.

## I. శబ్దాలంకారాలు

శబ్దాలంకారాలు ప్రధానంగా మూడు విధాలు.

1. అనుప్రాసాలంకారం
2. యమకం
3. ముక్త పద గ్రస్తం.

### అనుప్రాసాలంకారం

అనుప్రాస అంటే హల్లుల పునరుక్తి. అంటే వచ్చిన హల్లే మళ్ళీ మళ్ళీ రావడం. ఇది వీనుల విందైన శబ్దాన్ని అందిస్తుంది. ఈ అనుప్రాస **నాలుగు విధాలు**. ఇవి -

### 1. వృత్త్యనుప్రాస

ఒకే హల్లు పలుమార్లు వచ్చినట్లైతే అది వృత్త్యనుప్రాసాలంకారం.
ఇలా ఒకే హల్లు పలుమార్లు రావడాన్ని 'ఆవృత్తి' అంటారు.

ఉదాహరణ:

'విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణు కృష్ణు'

ఇందులో **'ష్ణు'** అనే సంయుక్తాక్షరం ఆవృత్తి అయ్యింది. కాబట్టి ఇది వృత్త్యనుప్రాస. అలాగే

ఉదాహరణలు

1. 'కాలువలన్నియు గలగల పారెను' (ల అనే హల్లు ఆవృత్తి అయ్యింది)

2. 'చిటపట చినుకులు పటపట కురిసెను'! – 'ట' అనే హల్లు పలు మార్లు వచ్చింది.

## 2. ఛేకానుప్రాస

రెండు హల్లులు లేదా హల్లుల జంట వెంట వెంటనే వస్తూ అర్థభేదంకలిగి ఉంటే దాన్ని ఛేకాను ప్రాసాలంకారం అంటారు.

ఉదాహరణ:

'కం**దర్ప** **దర్ప** హర సుం**దర** **దర**హాస రుచులు'

ఇందులో 'దర్ప' అనే హల్లుల జంట, 'దర' అనే హల్లుల జంట అవ్యవధానంగా, అంటే వెంట వెంటనే వచ్చాయి. కాబట్టి ఇది ఛేకానుప్రాస.

ఉదాహరణలు

1. సర్వదా విచారింపని పని చేయరాదు.

2. నందనందన నీకు వంద వందనాలు.

## 3. అంత్యానుప్రాస

'అంత్య' అంటే చివర అని అర్థం. పాదం చివరలో లేదా పదం చివరలో అనుప్రాస ఉన్నట్లైతే దాన్ని అంత్యాను ప్రాసాలంకారం అంటారు.

1. ఆ లలన గట్టె ఱోలన్
లీలన్, నవనీత చౌర్య లీలున్, ప్రియ వా
గ్జాలున్ బరి విస్మిత గో
పాలున్, ముక్తా లలామ ఫాలున్, బాలున్

పై పద్యంలో అంత్యాను ప్రాసను గమనించవచ్చు.

2. పొలాల **నన్నీ**
హలాల **దున్నీ**
ఇలా తలంలో హేమం **పిండగ**
జగానికంతా సౌఖ్యం **నిండగ**...

ఈ పాఠ్య పుస్తకంలోని శ్రీనాథుడు రచించిన ద్విపదలో అంత్యానుప్రాస చోటుచేసుకుంది గమనించగలరు.

అరుగు భూపతి **పుత్ర**
అంచిత **గాత్ర**
వీరకామ **నరేంద్ర**
విభవ **దేవేంద్ర**

### 4. లాటానుప్రాస

అర్థభేదం లేకుండా, తాత్పర్య భేదం కలిగిన పదాలు వెనువెంటనే వస్తే అది లాటానుప్రాసాలంకారం. అర్థం అంటే పదానికి ఉన్న సామాన్యమైన అర్థం. తాత్పర్యం అంటే ఆ పదానికి సందర్భానుసారంగా మనం విశేషంగా తీసుకొనే అర్థం. ఈ క్రింది ఉదాహరణలను చూడండి.

'అమ్మ చూపించే ప్రేమ ప్రేమ!'

మొదటి వాక్యంలో 'ప్రేమ' అనే మాట రెండు సార్లు వచ్చినప్పటికీ, మొదటిసారి వచ్చిన ప్రేమ అనే మాటకు 'ప్రేమ, వాత్సల్యం' అనీ అర్థాలు. అదే పదం వెనువెంటనే వచ్చినప్పటికీ, దాన్ని మనం 'నిజమైన ప్రేమ' అనే తాత్పర్యాన్ని తీసుకుంటాం. ఇక్కడ ప్రేమ అనే మాటకు అర్థం వేరు, తాత్పర్యం వేరు. దీన్నే మనం లాటానుప్రాసం అని పిలుస్తున్నాం.

**మరికొన్ని ఉదాహరణలు:**

కమలాక్షు నర్చించు **కరములు కరములు**
శ్రీనాథు వర్ణించు **జిహ్వ జిహ్వ**
... ... ... ... ...
దేవదేవుని చింతించు **దినము దినము**
చక్రహస్తుని ప్రకటించు **చదువు చదువు**
కుంభినీధవు చెప్పెడి **గురుడు గురుడు**
తండ్రి! హరిఁ జేరుమనియెడి **తండ్రి తండ్రి!**

## II. అర్థాలంకారాలు

అర్థాన్ని ఆశ్రయించి ఉండే ఈ అర్థాలంకారాల సంఖ్యను అనేక మంది ఆలంకారికులు అనేక రకాలుగా పేర్కొన్నారు. అడిదం సూరకవి తన చంద్రాలోకంలో 100 అర్థాలంకారాలను పేర్కొనగా, కువలయానంద కవి గరిష్ఠంగా 124 అర్థాలంకారాలను పేర్కొన్నాడు.

## 1. ఉపమాలంకారం

ఉపమాలంకారాన్ని ఉపమానాలంకారం అని కూడా అంటారు. ఉపమ అంటే సామ్యం లేదా పోలిక అని అర్థం. ఉపమేయానికి ఉపమానానికి మనోహరమైన పోలిక చెపితే అది ఉపమాలంకారం. ఒక వస్తువును మరొక వస్తువుతో మనోహరంగా పోల్చడం. ఇందులో నాలుగు భాగాలుంటాయి.

1. ఉపమేయం : మనం దేన్నయితే వర్ణిద్దామనుకుంటామో ఆ వస్తువు. అంటే వర్ణించబడే వస్తువు.
2. ఉపమానం : ఉపమేయాన్ని వర్ణించడానికి దేన్నయితే పోలికగా తీసుకొస్తామో అది ఉపమానం.
3. సమానధర్మం : పై రెండింటిలో అంటే ఉపమేయ ఉపమానాల్లో సమానంగా ఉండే ధర్మం లేదా గుణం సమాన ధర్మం.
4. ఉపమావాచకం : ఉపమేయ ఉపమానాల ధర్మ సామ్యాన్ని కలిపే అవ్యయ పదం.

   ఉదాహరణ: వలె, పోలె, పట్టె, కైవడి, కరణి, భంగి, చూవె, క్రియన్, లా/లాగ మొదలైనవి.

   'మా అమ్మ భూదేవిలా గొప్ప సహనవంతురాలు'

ఈ వాక్యంలో అమ్మ గురించి చెపుతున్నాం కాబట్టి అమ్మ ఉపమేయం. అమ్మని భూదేవితో పోలుస్తున్నాం కాబట్టి భూదేవి ఉపమానం. సహనం అనే విషయంలో చెప్తున్నాం కాబట్టి అది సమాన ధర్మం. (అమ్మలోనూ, భూదేవిలోనూ – ఇద్దరిలోనూ సహనం ఉంది కాబట్టి). ఉపమేయాన్ని, ఉపమానాన్ని అనుసంధానించడానికి వాడిన పదం – లా, ఇది ఉపమా వాచకం. కాబట్టి ఇది ఉపమాలంకారం.

ఈ పాఠ్యపుస్తకంలోని సత్య ప్రాశస్త్యములో ఈ క్రింది పద్యాలలో ఉపమాలంకారం ఉంది.

1. 'విను గార్హపత్యమను నయ్యనలము...'
2. 'తాన తననీడ నీళ్ళలలో నేర్పడc జూచునట్లు...'

## 2. ఉత్ప్రేక్షాలంకారం

ఊహ ప్రధానంగా గలది ఉత్ప్రేక్ష. ధర్మ సామ్యాన్ని బట్టి ఉపమేయాన్ని ఉపమానంగా ఊహించినట్లైతే అది ఉత్ప్రేక్షాలంకారం అవుతుంది.

**ఉదాహరణ:**

1. ఈ చీకటిని చక్రవాక పక్షుల విరహాగ్ని నుండి వెలువడిన ధూమమని తలచెదను.

ఇక్కడ చీకటి నలుపు. దృష్టి నిరోధకం. పొగ నలుపు. దృష్టి నిరోధకం. కాబట్టి ఈ సమాన ధర్మాలవల్ల కవి చీకటిని పొగ లాగా ఊహించుకొన్నాడు. కాబట్టి ఇది ఉత్ప్రేక్షాలంకారం.

2. ఆ ఏనుగు నడగొండయో అన్నట్లుంది.

3. ఆమె ముఖము పద్మమేమో - అను వాటిల్లో కూడా ఉత్ప్రేక్షాలంకారం ఉంది.

### 3. రూపకం

ఉపమేయానికీ ఉపమానానికీ అభేదం చెప్పినట్లయితే, అంటే భేదం లేదని చెప్పినట్లయితే అది రూపకాలంకారం.

'అతడు చేసిన తప్పుకి పశ్చాత్తాపాగ్నిలో కాలిపోతున్నాడు'

ఈ ఉదాహరణలో, అతడు తప్పుచేసి, చేసిన తప్పును తెలిసికొని, పశ్చాత్తాపం అనే అగ్నిలో కాలిపోతున్నాడు. ఇక్కడ పశ్చాత్తాపాగ్ని అనే సమాసంలో, పశ్చాత్తాపము అనేది ఉపమేయం. అగ్ని అనేది ఉపమానం. రెండిటికీ భేదం లేదని చెప్పడం వల్ల ఇది రూపకాలంకారం.

1. రుద్రమ్మ చండీశ్వరీ దేవి.

2. సంసార సాగరం.

### 4. స్వభావోక్తి

జాతి గుణ క్రియాదుల చేత ఒక వస్తువును ఉన్నది ఉన్నట్లుగా వర్ణిస్తే అది స్వభావోక్తి అలంకారం.

'ఒడలందెల్ల విభూతిపూత, పులితోలొడ్డాణ, మల్లాడు కెం
జడ, లాత్మైక విచార నిశ్చల దృగబ్జాతంబు, లచ్చైన క
చ్ఛడ మంసంబున, రుండమాల, గళదేశ స్థాణువుం గ్రాలగా...'

పై పద్యంలో పరమశివుని రూపం యథాతథంగా వర్ణించబడింది. కాబట్టి ఇది స్వభావోక్తి అలంకారం.

ఈ పాఠ్యపుస్తకంలోని పాఠ్యభాగాల్లో ఈ క్రింది పద్యాలలో గల స్వభావోక్తులను గమనించండి.

1. 'నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాడు - ధవళాబ్జ పత్ర నేత్రములవాడు...'

ఈ పద్యం లో కవయిత్రి మొల్ల శ్రీరాముని అత్యంత సహజంగా అద్భుతంగా వర్ణించింది.

2. 'నిడుద పెన్నెరి వేణి జడలుగా సవరించి - మలిన జీర్ణాంబరంబొలియగట్టి...'

ఈ పద్యంలో సీతా దేవి స్థితి అత్యంత సహజంగా చిత్రించబడింది.

## 5. అతిశయోక్తి

ఒక వస్తువు యొక్క స్థితిని, గుణాన్ని లేదా స్వభావాన్ని ఉన్నదాని కంటె ఎక్కువగా వర్ణిస్తే అది అతిశయోక్తి అలంకారం.

ఉదాహరణ:

ఈ పాఠ్యపుస్తకంలోని పాఠ్యభాగంలో కవయిత్రి మొల్ల ఒక చక్కని అతిశయోక్తిని ప్రయోగించింది. సీతాదేవి కోరిక మేరకు హనుమంతుడు తన చిన్న వానర దేహాన్ని విపరీతంగా పెంచిన సందర్భంలోనిది ఈ పద్యం.

చుక్కలు తలపూవులుగా
నక్కజముగ మేను పెంచి యంబరవీథిన్
వెక్కసమై చూపట్టిన
నక్కోమలి ముదమునొందె నాత్మ స్థితికిన్

నక్షత్రాలే తన తలపూవులగునట్లుగా, ఆకాశవీధిలో ఆశ్చర్యంగొలిపే విధంగా తన శరీరాన్ని పెద్దది చేసి సీతాదేవికి ఆనందం కలుగజేశాడు హనుమంతుడు. ఇది అతిశయోక్తి అలంకారం.

1. ఆలయగోపురాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.
2. మా వీధిలో ఒకాయన తాటిచెట్టంత పొడవు.

## 6. అర్థాంతరన్యాసం

సామాన్యాన్ని విశేషంతో గాని, విశేషాన్ని సామాన్యంతో గాని సమర్థించి చెప్పినట్లయితే అది అర్థాంతరన్యాసాలంకారం. ఉదాహరణకు –

'హనుమంతుడు సముద్రమును దాటెను. మహాత్ములకు సాధ్యం కానిది లేదు' ఈ వాక్యాన్ని పరిశీలించండి.

హనుమంతుడు సహజంగా వానరం. అతడు సముద్రాన్ని లంఘించడం ఆశ్చర్యంగొలిపే విషయం. కాబట్టి ఇది విశేషం. మహాత్ములకు సాధ్యం కానిది లేదు – ఈ వాక్యాన్ని అందరూ అంగీకరిస్తారు. ఇది సామాన్యం.

పైన తెలిపిన విశేషాన్ని సామాన్య వాక్యం చేత సమర్థిస్తే అది అర్థాంతరన్యాసాలంకారం.

మరో ఉదాహరణ చూద్దాం.

ఈ పాఠ్య పుస్తకంలోని నన్నయ పాఠ్యభాగంలో క్రింది పద్యాన్ని గమనించండి.

ఏల యెఱుకలేని యితరుల యట్ల నీ
వెఱుగ ననుచుఁ బలికె దెఱిఁగి యెఱిఁగి
యేనకాని దీని నెఱుఁగరిన్ దొరులని
తప్పఁ బలుకనగునె ధార్మికులకు

శకుంతల దుష్యంతునితో అంటున్నది-'అన్నీ బాగా తెలిసి కూడా నేనెవరో తెలియదని ఇతరుల వలె ఎందుకు మాట్లాడుతావు? ఇతరులకు తెలియదనే మిషతో ధర్మాత్ములైనవారు అసత్యం పలుకవచ్చునా?' ఇక్కడ గొప్పవాడైన దుష్యంతుడు శకుంతల ఎవరో తెలియదని అబద్ధమాడడం విశేషం. ధర్మాత్ములు అబద్ధాలు ఆడకూడదు - అనేది సాధారణ లోక ధర్మం. ఇది సామాన్యం.

## అభ్యాసం

### I. ఏక వాక్య / పదరూప సమాధాన ప్రశ్నలు

1. ఉపమేయం అంటే ఏమిటి?
2. చుక్కలు తలపూవులుగా... పద్యంలో ఉన్న అలంకారమేది?
3. సామాన్యాన్ని విశేషంచేత, విశేషాన్ని సామాన్యం చేత సమర్థించే అలంకారమేది?
4. అలంకారాల ప్రయోజనమేమిటి?
5. విష్ణురోచిష్ణుజిష్ణు సహిష్ణుకృష్ణు - లోని అలంకారమేది?
6. రెండు హల్లులు వెంట వెంటనే వస్తూ అర్థ భేదం కలిగి ఉండే అలంకారమేది?
7. అమ్మ చూపించే ప్రేమ ప్రేమ - ఇందులోని అలంకారమేది?
8. అంత్యాను ప్రాసకు ఒక ఉదాహరణ రాయండి?
9. ఆలయ గోపురాలు ఆకాశాన్ని తాకుతున్నాయి - దీనిలోని అలంకారమేది?
10. శబ్దాలంకారం అంటే ఏమిటి?
11. వలె, పోలె, అట్లు, లాగ - ఈ పదాలను ఏమంటారు?
12. అలంకారాలు ఎన్ని రకాలు? అవి ఏవి?
13. ఊహ ప్రధానంగా ఉండే అలంకారమేది?
14. సంసార సాగరం - దీనిలోని అలంకారమేది?
15. 'నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాడు' - ఈ పద్యంలోని అలంకారమేది?

# 5 సంక్షిప్తీకరణ

ఇచ్చిన గద్యాన్ని బాగా చదివి, అర్థం చేసుకొని, దానిలోని సారాంశాన్ని మూడో వంతుకు కుదించి రాస్తే దాన్ని 'సంక్షిప్తీకరణ' అంటారు. భాషా సామర్థ్యాలను పెంచే అంశాలలో 'సంక్షిప్తీకరణ' కూడా ఒకటి. భావ వ్యక్తీకరణలో అనవసరమైన మాటలకు తావులేకుండా, చెప్పవలసిన అంశాన్ని సూటిగా చెప్పడానికి ఈ సంక్షిప్తీకరణ తోడ్పడుతుంది. తక్కువ సమయంలో మొత్తం అంశం యొక్క సారాంశాన్ని చెప్పే నైపుణ్యం దీనివలన వస్తుంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే వివిధ పోటీ పరీక్షలలో ఈ సంక్షిప్తీకరణపై ప్రశ్న ఉంటుంది. దాన్ని విద్యార్థులకు పరిచయం చేయడానికి ఈ సంక్షిప్తీకరణ అంశం చేర్చడం జరిగింది.

**సంక్షిప్తీకరణ చేసేటపుడు విద్యార్థులు ఈ క్రింది విషయాలను గుర్తుంచుకోవాలి:**

1. సంక్షిప్తీకరణ స్పష్టంగా ఉండాలి.
2. ఇచ్చిన గద్యంలో కొన్ని పదాలను తొలగించి మిగిలిన పదాలను రాయడం సంక్షిప్తీకరణ కాదు.
3. వ్యర్థ పదాలను, పునరుక్తులను తొలగించాలి.
4. ఆలంకారిక పదాలను, కొటేషన్లను పరిహరించాలి.
5. విపరీత గణాంకాలకు చోటు లేకుండా చూసుకోవాలి.
6. కీలక పదాలను దృష్టిలో పెట్టుకొని, గద్యంలోని సారాంశాన్ని మాత్రమే రాయాలి.
7. వాస్తవ సమాచారాన్ని మాత్రమే రాయాలి.
8. విద్యార్థి తన సొంత భావాలను చొప్పించడం చేయరాదు.
9. సంక్షిప్తీకరణ చేసిన దానికి సంబంధించిన ఒక మంచి శీర్షికను ముందుగా రాయాలి.

**ఉదాహరణ:**

గోదావరి జిల్లాల్లో నిత్యాన్నదాతగానూ, అన్నపూర్ణగానూ ప్రసిద్ధిగాంచిన వ్యక్తి డొక్కా సీతమ్మ. ఈమె తూర్పు గోదావరిజిల్లా, రామచంద్రాపురం తాలూకా మండపేట గ్రామంలో క్రీ.శ. 1841 లో జన్మించింది. ఈమె తండ్రి అనుపిండి భవానీ శంకరం, తల్లి నరసమ్మ. ఆరోజుల్లో స్త్రీ విద్యకు అవకాశాలు తక్కువగా ఉండటంతో ఈమె చదువుకోలేదు. గోదావరీ పరివాహక ప్రాంతంలోని లంకల గన్నవరానికి చెందిన డొక్కా జోగన్న పంతులు అనే

ధనవంతునితో సీతమ్మకు వివాహమైంది. జోగన్న, సీతమ్మ గార్లది అన్యోన్య దాంపత్యం. శుచి, శుభ్రతలతో పాటు ఆప్యాయతాదరణలకు వారిల్లు పెట్టింది పేరు. ఎవరు ఏ వేళలో వచ్చి భోజన మడిగినా లేదనకుండా వండి వడ్డించిన అన్నపూర్ణ ఆమె. సీతమ్మ కేవలం అన్నదానమేకాదు, ఎన్నో పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకు చేయూతనందించిన వితరణశీలి. డొక్కా సీతమ్మ కీర్తి ప్రతిష్ఠలు భారతదేశంలోనే కాక ఇంగ్లాండు దేశం వరకూ వ్యాపించాయి.

**దీనికి సంక్షిప్తీకరణ**

**శీర్షిక:** అన్నదాత డొక్కా సీతమ్మ

సీతమ్మ తూర్పుగోదావరి జిల్లాలోని మండపేట గ్రామంలో జన్మించింది. లంకల గన్నవరానికి చెందిన డొక్కా జోగన్న అనే ధనవంతునితో సీతమ్మకు వివాహమైంది. ఎవరు, ఏవేళలో వచ్చినా లేదనకుండా వండి వడ్డించేది. ఈమె ఇంకా ఎన్నో శుభకార్యాలకు తోడ్పడింది. నిత్యాన్నదాతగా ప్రసిద్ధిగాంచిన డొక్కాసీతమ్మ ఖ్యాతి ఇంగ్లండు వరకూ వ్యాపించింది.

## అభ్యాసం

1. భారత జాతికి జీవగఱ్ఱలైన రామాయణ, మహాభారతాలలో ఆంధ్రుల ప్రసక్తి ఉంది. మెగస్తనీసు, మార్కోపోలో, పేయస్ వంటి అనేక మంది విదేశీయాత్రికులు తెలుగువారి గొప్పదనాన్ని ప్రశంసించారు. ఆంధ్రదేశాన్ని పాలించిన తొలి తెలుగు రాజులు శాతవాహనులు. వీరి తరువాత ఇక్ష్వాకులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డి రాజులు, విజయనగర రాజులు, కుతుబ్‌షాహీలు, నిజాం పాలకులు వరుసగా తెలుగుదేశాన్ని పాలించారు. రుద్రమదేవి, శ్రీకృష్ణదేవరాయలు వంటి గొప్ప పాలకులు; నన్నయ, తిక్కన, ఎర్రన, శ్రీనాథుడు, పోతన, పెద్దన, వేమన లాంటి కవులు ఆంధ్రదేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టారు. అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు వంటి మహనీయ సంగీతజ్ఞులు తెలుగువారి సొత్తు. గోదావరి, కృష్ణా వంటి గొప్ప జీవనదులతో, సారవంతమైన భూములతో పునీతమైన తెలుగునేలలో జన్మించడం మన అదృష్టం.

2. ఆదిమ కాలం నుంచి తమ సంస్కృతిని పరిరక్షించుకుంటూ, కొండకోనల్లో, అడవుల్లో నివసిస్తూ ఆదిమ సంస్కృతిని పాటించేవారు గిరిజనులు. గోండులు, కోయలు, సవరలు, జాతాపులు, చెంచులు, తొదలు, భగతలు మొదలైన వారు మన దేశంలో నివసిస్తున్న కొన్ని గిరిజన సమూహాలు. గిరులపై జీవిస్తున్నందు వల్ల వీరిని గిరిజనులు అని పిలుస్తారు. వీరిని హిందీలో 'ఆదివాసి' లేదా 'జన్ జాతి' అనీ, ఆంగ్లంలో 'ట్రైబ్' అని పిలుస్తారు. సాధారణంగా వీరు నాగరకులకు దూరంగా నివసిస్తుంటారు. లిపిలేని భాషను మాట్లాడుతారు. వీరు పోడు వ్యవసాయం చేస్తూ, అటవీ ఉత్పత్తుల్ని సేకరించి జీవనాన్ని సాగిస్తారు. ఆదివాసీల జీవితంలో మరొక ప్రధానవృత్తి

వేట. గిరిజనుల జీవన విధానంలో నమ్మకాలు, జంతుబలులు ప్రధానపాత్ర వహిస్తాయి. ఆటలు, పాటలు, సామూహిక నృత్యాలు వీరి జీవితంలో ఒక భాగం.

3. రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా, నైతికంగా అణచివేతకు గురయింది స్త్రీ. మహిళల ఆవేదనను, ఆక్రోశాన్ని, ఆగ్రహాన్ని సాహిత్యం ద్వారా అక్షరీకరిస్తే దాన్ని 'స్త్రీవాద సాహిత్యం' అంటారు. తమ తల్లిదండ్రులే తమను చిన్న చూపు చూడటం, సోదరులు తమ మీద పెత్తనం చెలాయించడం, సమాజం విధించే ఆంక్షలు, అత్తవారింటికి పంపాలనే తల్లిదండ్రుల ఆరాటం, అత్తింట్లో అవమానాలు, ఇంటి చాకిరీ, పిల్లల ఆలనా పాలనా, భర్త వేధింపులు, అత్తమామల సాధింపులు, ఆడబిడ్డల ఆరళ్ళు; చివరకు తమ పిల్లలు కూడా తమను పనికి రాని వారిగా జమకట్టడం స్త్రీల జీవితాన్ని దుర్భరం చేశాయి. మన దేశంలో ఆంగ్లేయుల పాలన వల్ల వచ్చిన కొన్ని పరిణామాలు, కొంత మంది భారతీయ సంఘ సంస్కర్తల కృషి వల్ల భారతీయ మహిళల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. తమ సమస్యలకు తామే పరిష్కారాలు వెతుక్కోగల స్థైర్యం, పురుషాధిపత్య భావజాలాన్ని ధిక్కరించే ధైర్యం స్త్రీలకు కొంత అలవడింది.

4. భారతదేశం అణ్వస్త్ర దేశంగా ఎదగడానికి మూలకారకుడు డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్. భారత రత్నగా, భారత క్షిపణి పితామహుడుగా, దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని అలంకరించిన అబ్దుల్ కలామ్ విద్యార్థి దశలో సగటు విద్యార్థి. మంచి అలవాట్లతో, కచ్చితమైన క్రమశిక్షణను పాటించడం వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించాడు. తల్లిదండ్రులనే కాక, స్త్రీలను, గురువులను ఇతర పెద్దలను గౌరవించాడు. తాను ముస్లిం మతానికి చెందిన వాడైనా హిందూ, క్రైస్తవ, సిక్కు వంటి సర్వమతాలను ఆదరించిన లౌకికవాది. పుస్తకాలను అమితంగా ఇష్టపడే అబ్దుల్ కలామ్ ఎన్నోగ్రంథాలను రచించాడు. ప్రతి విద్యార్థి కలలు కని, వాటిని సాకారం చేసుకోవాలని; చిన్న చిన్న లక్ష్యాలు నేరమని విద్యార్థులకు సందేశమిచ్చాడు. వీరి జన్మదినమైన అక్టోబరు 15వ తేదీని 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం'గా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.

5. ఆధునిక ప్రపంచంలో చాలా దేశాలు ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రజాస్వామ్య మనుగడకు ఎన్నికల నిర్వహణ అత్యంత ఆవశ్యకం. ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తనకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకోవడానికి కావలసిన హక్కును ప్రతి ప్రజాస్వామ్యదేశం తన పౌరులకు కల్పిస్తున్నది. ఈ హక్కునే 'ఓటు హక్కు' అంటారు. మన దేశంలో ఓటు హక్కు పొందడానికి కావలసిన కనీసవయస్సు 18 సం.లు. మద్యము, కులము, మతము, ప్రాంతము వంటి వైయక్తిక అంశాలకూ; డబ్బు, బహుమానాలు లాంటి ఎన్నికల తాయిలాలకు లొంగి పోయి తన ఓటును అమ్ముకోకూడదు. సమర్థుడు, నీతి మంతుడు, కుల మతాలకు అతీతంగా అందరికీ అందుబాటులో ఉన్న అభ్యర్థిని గెలిపించడానికి తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలి. ఒక వేళ అభ్యర్థులెవరూ నచ్చకపోతే 'నోటా' మీటను నొక్కి రావాలి. అంతే గాని ఎన్నికల ప్రక్రియకు మన దేశపౌరులు దూరంగా ఉండరాదు.

# నందిని

## ఉపవాచకం


| | | |
|---|---|---|
| | పరిచయం | 115 - 116 |
| 1. | గవేషణ | 117 - 127 |
| 2. | తెరచిన కళ్ళు | 128 - 139 |
| 3. | ఆశఖరీదు అణా | 140 - 155 |

# నందిని
## ఉపవాచకం

## పరిచయం :

కావ్యాలు ప్రధానంగా దృశ్యకావ్యాలనీ, శ్రవ్యకావ్యాలనీ రెండు రకాలు. ఈ దృశ్యకావ్యాన్నే రూపకం అనీ, నాటకం అనీ అంటున్నాం. 'కావ్యేషు నాటకమ్ రమ్యమ్' అనీ, 'నాటకాంతమపి సాహిత్యమ్' అనీ నాటక ప్రక్రియ గురించి మన పెద్దలు వ్యాఖ్యానించారు. అంటే నాటకమే సాహిత్య ప్రక్రియలన్నింటికీ పరాకాష్ఠ అని అర్థం. చూసి ఆనందించి, రసానందం పొందగలిగే అవకాశం ఒక్క నాటకం వల్లనే సిద్ధిస్తుంది.

'నాటిక' కూడా నాటకం వంటిదే. ఇది కూడా దృశ్యకావ్యమే. నాటకంలో నిడివి ఎక్కువ. నాటికలో నిడివి తక్కువ. నాటకం, నాటిక ఈ రెండు ప్రక్రియలూ ప్రాచీన కాలంనుండీ ఉన్నవే. పూర్వం లాక్షణికులు చెప్పిన దశరూపకాలలో ఈ రెండు ప్రక్రియలూ ఉన్నాయి. అవి ఈనాటికీ కొనసాగుతున్నాయి.

కాలంమారుతూ ఉంది. జీవితం వేగవంతం అవుతూఉంది. గంటల తరబడి రంగస్థలం ముందు కూర్చొని నాటకాన్ని తిలకించే తీరుబాటు ప్రజలకు కొరవడింది. అందువల్ల ఆధునిక కాలంలో నాటక ప్రక్రియను అధిగమించి, 'నాటిక' ముందు కొచ్చింది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానఫలాలు అందుబాటులోకి వచ్చాక ప్రజాజీవితంలోకి రేడియో ప్రవేశించింది. ప్రజల జీవితాల మీదే కాక, సాహిత్య ప్రక్రియల మీద కూడా రేడియో ప్రభావం చూపించింది. అప్పటి దాకా రంగస్థలం మీద మాత్రమే ప్రదర్శించబడుతున్న నాటకం, నాటిక అనే ఈ రూపక ప్రక్రియలు రేడియోలోనూ ప్రసారం అవుతూ వచ్చాయి.

నాటకాన్నీ లేదా నాటికనూ రేడియోలో ప్రసారం చేయడానికి కొన్ని సందర్భాలలో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతాయి. వాటిని అధిగమించడానికి, కేవలం రేడియోలో ప్రసారం చేయడం కోసమే ప్రత్యేకంగా రూపకాలు రచించబడ్డాయి. వీటిని శ్రవ్య రూపకాలు లేదా శ్రవ్య నాటకం, లేదా శ్రవ్య నాటిక అని వ్యవహరిస్తారు. నిర్మాణ విషయంలో శ్రవ్యరూపకానికీ, దృశ్య రూపకానికీ కొన్ని భేదాలున్నాయి. ప్రదర్శన సమయంలోనూ, లేదా ప్రసార సమయంలోనూ ఆ వ్యత్యాసాన్ని మనం గమనించగలం. ఇతివృత్తం ఒక దృశ్యం నుంచి మరోదృశ్యానికి మారేటప్పుడు దృశ్యరూపకంలో అయితే రంగస్థలం మీద లైటు ఆర్పుతారు. ఆ చీకటిలో తరువాత దృశ్యానికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకుంటారు. అవి పూర్తయిన తరువాత లైటు వేసి, ప్రదర్శన కొనసాగిస్తారు.

అదే శ్రవ్యరూపకం లేదా రేడియో రూపకం అయితే; ఒక దృశ్యం నుంచి మరోదృశ్యానికి ఇతివృత్తం మారుతున్నప్పుడు జంత్ర వాద్యాన్ని వినిపిస్తారు. దృశ్యరూపకంలో దృశ్యమానం అవుతున్న ఇతివృత్తాన్ని, శ్రవ్య రూపకంలో వాచ్యం చేస్తారు. ఈ లైట్లు ఆర్పడాన్నీ, వెలిగించడాన్నీ, లేదా జంత్ర సంగీతం వినిపించడాన్ని సాంకేతిక పరిభాషలో ఫేడౌట్, ఫేడిన్ అని వ్యవహరిస్తారు. దృశ్య, శ్రవ్య రూపకాలమధ్య ఇలాంటివే మరికొన్ని భేదాలు లేక పోలేదు.

శ్రవ్యరూపకాలలో నాటకం కంటే నాటికకు శ్రోతల ఆదరణ ఎక్కువ. నిడివి తక్కువకావడం ప్రధానకారణం. తక్కువ సమయంలో దైనందిన జీవితానికి సంబంధించిన ఏదైనా ఒక ప్రధాన సమస్యను శక్తిమంతంగా అందించడానికి శ్రవ్యనాటిక గొప్పగా ఉపయోగపడుతుంది.

సమాజంలో నేడు ఎన్నో సమస్యలున్నాయి. స్వార్థం, బలవంతుల దౌర్జన్యాలు, అధికారం వల్ల కలిగే విపరీత ధోరణులు, అధికారుల తప్పిదాలు, పొరపాట్లు, వాటివల్ల సామాన్యుడు బలికావడం, జీవితం మీద విరక్తి, ఆవేదన, నిరాశ, నిస్పృహలు... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నెన్నో... వాటిని కళ్ళకు కట్టినట్లు ప్రదర్శిస్తూ, ఆ సమస్యల పరిష్కారానికి దారిని చూపిస్తూ వచ్చిన అనేక నాటికలు తెలుగులో వెలువడ్డాయి. వాటిలో దృశ్యనాటికలూ, శ్రవ్యనాటికలూ, ఉభయ లక్షణాలు కలిగిన నాటికలూ ఉన్నాయి. ఆ నాటికల్లోంచి మూడింటిని ఈ పాఠ్య పుస్తకంలోని ఉపవాచక విభాగం కోసం ఎంపిక చేయడమైంది. కేవలం ఈ నాటికలను చదవడమే కాకుండా, విద్యార్థులు ఏదైనా ఒక నాటికను ప్రదర్శించడమో, లేదా ఏదో ఒక ఇతివృత్తాన్ని తీసుకొని నాటికా రచనకు పూనుకోవడమో చేస్తారని ఆకాంక్షిస్తున్నాం. మీ మంచి ప్రయత్నాలకు అధ్యాపకుల అండదండలు ఎప్పుడూ ఉంటాయి.

ప్రస్తుతం మనం రంగస్థలాన్ని చేరుకుందాం... 'నందిని' మనకు స్వాగతం పలుకుతూ ఉంది.

❖ ఈ పరిచయం నుంచి పరీక్షల్లో ప్రశ్నలు ఉండవు.

# 1 గవేషణ



\- శ్రీశ్రీ

## రచయిత పరిచయం

**క**ష్టజీవికి ఇరువైపులా నిలబడ్డ తెలుగు కవి శ్రీశ్రీ. శ్రీశ్రీ పూర్తి పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. 30.04.1910 న విశాఖపట్టణంలో జన్మించారు. తల్లిదండ్రులు అప్పల కొండ, పూడిపెద్ది వెంకట రమణయ్య. నిజానికి శ్రీశ్రీ ఇంటిపేరు శ్రీరంగం కాదు. శ్రీశ్రీ తండ్రి శ్రీరంగం వారింటికి దత్తత వెళ్ళాడు. అందువల్ల శ్రీశ్రీ ఇంటిపేరు శ్రీరంగం అయింది.

విశాఖపట్టణంలోని శివరామయ్య వీథిబడిలో శ్రీశ్రీ ప్రాథమిక విద్య ప్రారంభమైంది. ఎ.వి.ఎన్. కాలేజీలో కళాశాల విద్యను పూర్తి చేసి మద్రాసు క్రిష్టియన్ కాలేజి నుంచి బి.ఎ. పట్టా పొందారు. విశాఖ ఎ.వి.ఎన్. కాలేజిలో కొంత కాలం డిమానుస్ట్రేటర్‌గా పనిచేసిన శ్రీశ్రీ ఆ తరువాత ఆంధ్రప్రభలోనూ, ఆకాశవాణిలోనూ కూడా ఉద్యోగం చేశారు. తన ఏడాదిన్నర వయసులోనే తల్లిని కోల్పోయిన శ్రీశ్రీ ఎనిమిదేళ్ళ వయస్సు నాటికి కందపద్యం రాసే ప్రయత్నంచేశారు. చెన్నపట్నంలోని సాహితీమిత్రుల పరిచయాలు శ్రీశ్రీ లోని చిన్నప్పటి సృజనాత్మక శక్తిని మేల్కొలిపాయి. భారతి మాసపత్రికలో రచనలు చేసే స్థాయికి పెంచాయి.

'ప్రభవ' కావ్య రచనతో భావ కవిగా శ్రీశ్రీ రచనా ప్రస్థానం మొదలైంది. 'మహాప్రస్థానం' కావ్య రచన శ్రీశ్రీని అభ్యుదయ కవిగా మలచింది. మహాకవిని చేసింది. సామ్యవాద ప్రపంచ నిర్మాణం కోసం ఈ కావ్యంలో శ్రీశ్రీ గొప్ప కలగన్నారు. సోషలిస్టు వ్యవస్థ సాధనకోసం తన కలాన్నీ గళాన్నీ కళాత్మకంగా ప్రదర్శించారు. ఎందరో యువకవులకు శ్రీశ్రీ ఒక వేగుచుక్క అయ్యారు. 'మహాప్రస్థానం' తరువాత ఖడ్గసృష్టి, మరో ప్రస్థానం, మరో ప్రపంచం (నాటికలు), చరమరాత్రి (కథలు) వంటి అనేక రచనలు చేశారు. అయినా మహాప్రస్థాన కావ్యమే అప్పలకొండ బిడ్డకు ఒక కొండ గుర్తుగా స్థిరపడింది.

1948 లో చలన చిత్ర రంగంలో ప్రవేశించిన శ్రీశ్రీ అక్కడ కూడా తనదైన ముద్రవేశారు. శ్రీశ్రీ ప్రవేశం తరువాతనే తెలుగు సినిమా పాట, మాట ఎరుపెక్కింది. భూమిని పట్టించుకోకుండా ఆకాశంలో హడావిడిగా వెళ్ళి పోతున్న తెలుగు కవిత్వాన్ని భూమార్గం పట్టించిన కవి శ్రీశ్రీ. తన రచనా ప్రస్థానం ద్వారా పతితులకూ, భ్రష్టులకూ, బాధా సర్ప దష్టులకూ ఏడవకండే దవకండని చెప్పి, వారి కన్నీళ్ళు తుడిచిన శ్రీశ్రీ 15.06.1983 న మహాప్రస్థానం చెందారు. మరో ప్రపంచం చేరారు.

పీడిత పక్షాన నిలబడి, పీడక వర్గంపై అక్షర యుద్ధాన్ని ప్రకటించిన శ్రీశ్రీలో వైరుధ్యం లేని విభిన్న పార్శ్వాలు కూడా కన్పిస్తాయి. కావ్యేతర ప్రక్రియల్లో వాటిని గమనించగలం. గవేషణ అంటే వెదకుట అని అర్థం. దేవతల పొరబాటు వల్ల శరీరాన్ని కోల్పోయిన ఆత్మ తిరిగి కావలసిన శరీరం కోసం, అందుకోసం న్యాయమూర్తితో, ధర్మదేవతతో వాదించి తిరిగి మానవశరీరాన్ని పొందడం ఈ పాఠ్యభాగ సారాంశం. ప్రస్తుత పాఠ్యభాగం 'గవేషణ' నాటికలో శ్రీశ్రీ లోని తాత్త్విక చింతనను మనం గమనించగలం. యమధర్మరాజు నేపథ్యంలో వెలువడిన కొన్ని తెలుగు చలన చిత్రాలకు ఈ నాటిక మాతృక అనిపిస్తుంది. అయితే ఈ నాటికలోని తాత్త్వికత మనల్ని అలౌకిక ప్రపంచంలోకి నెట్టి వేయదు. పౌరాణిక స్పర్శ కొంత ఉన్నట్టుగా అనిపించినా అది భౌతిక జీవితాన్నే ఆవిష్కరిస్తుంది. శ్రీశ్రీలోని అభ్యుదయ చింతనకు తాత్త్వికతను అంటు కట్టిన రూపం ఈ నాటిక. లాక్షణికులు చెప్పిన 'ధ్వని'కీ, సున్నితమైన హాస్యానికీ సామాజిక వాస్తవికతకూ, మానవుని బలాల, బలహీనతల ఆవిష్కరణకూ ఈ పాఠ్యభాగం ఒక చక్కటి చిరునామా.

సమాజంలో ఉన్న అవినీతి, లంచగొండితనం వంటివి మనిషిని ఒకొక్కసారి సంకట పరిస్థితుల్లోకి నెడతాయి. అలాంటి పరిస్థితుల్లో కార్య సాధకులైన వారు వాటిని ఎదుర్కొని ఎలా నెగ్గుకురావాలో విద్యార్థులకు తెలియ చేయడం ఈ పాఠ్య భాగం ఉద్దేశం.

## పాత్రలు

| | | |
|---|---|---|
| మానవుడు | - | ఆయుష్షు తీరకుండా మరణించిన మనిషి |
| నవ్విన వ్యక్తి (ఆనందం) | - | యమలోకపు అదృశ్యభటుడు |
| అమ్మాయి | - | ప్రసవించిన స్త్రీ |

1 వ మృత్యుదూత, 2 వ మృత్యుదూత, న్యాయమూర్తి, డాక్టరు

# పాఠ్యభాగం

(మిలటరీ మార్చి రికార్డు వినబడుతూ ఉంటుంది)

## ప్రకటన

భూలోకంలో ఒక మానవుడు తన ముప్ఫయి అయిదో ఏట చచ్చిపోయాడు. అతని ఆత్మని మృత్యుదూతలు మిలిటరీ పహరాతో మరో ప్రపంచానికి తీసుకుపోతున్నారు. ఆ లోకంలో అతని ఆత్మని ఒకానొక న్యాయస్థానంలో అప్పగించవలసిందిగా మృత్యుదూతలకి ఉత్తరువు. దారిలో హఠాత్తుగా మానవుడు మేలు కొంటాడు. తానింకా బతికి ఉన్నానని మృత్యు దూతలతో వాదిస్తాడు.

(ఫేడౌట్ - మిలటరీ మార్చి)

(ఫేడిన్ - మానవుని గొంతుక)

**మానవుడు :** ఇదేమిటి? మీరంతా ఎవరు? ఎక్కడికి తీసుకుపోతున్నారు నన్ను? మాట్లాడరేం? మాటలురావూ మీకు?

**ఒక మృత్యుదూత :** మాట్లాడకుండా నడవవయ్యా మానవుడా.

**ఇంకొక మృత్యుదూత :** ఈ మనిషి చచ్చిపోయాడు కదా ఎలా మాటలాడ గలుగుతున్నాడు? ఎప్పుడూ ఎరగని విడ్డూరం.

**మాన :** నేను చచ్చిపోయానా? మీకేం మతిపోయిందా? మనిషంత మనిషిని నేను కనబడలేదూ నీకు?

**2వ మృ :** నిన్ను చూడనక్కరలేదు, నీకు శరీరం లేదు. నువ్వు చచ్చిపోయావు. నీ కళేబరం ఇప్పుడు మీ పల్లెటూరి వల్లకాట్లో ఉంది.

**మాన :** నేను బతికే ఉన్నాను. నన్ను వదలిపెట్టండి. నా లోకానికి పోతాను. నా ఇంటికి నేను పోతాను. నన్ను వదలిపెట్టండి.

**1వ మృ :** నిన్ను వదలిపెట్టడానికి ఉత్తరువు లేదు. న్యాయమూర్తి ముందు నువ్వు నిలబడబోతున్నావు. నిన్నక్కడ విచారణ చేస్తారు.

**మాన :** నేనేం పాపం చేశాను?

**1వ మృ :** ఏమో, మమ్మల్ని అడగవద్దు, మాట్లాడకుండా రా.

**2వ మృ :** ఈ మానవుడు చచ్చిపోయాడు కదా ఎలా మాటలాడుతున్నాడు?

**మాన :** మళ్ళీ అదే మాటా? నేను బతికే ఉన్నాను.

**1వ మృ :** అది మాకు అనవసరం, మా ఉత్తరువు ప్రకారం మేము నడుచుకోవాలి.

**మాన :** ఆ ఉత్తరువిచ్చిన అధికారి ఎవరు?

**1వ మృ :** అధికంగా మాటలాడకు, ఆజ్ఞలను ఉల్లంఘించకు.

**మాన :** అతని దగ్గరకా నన్ను తీసుకొని వెళ్ళుతున్నారు?

**1వ మృ :** అబ్బో అతని దర్శనం అంత సులభం కాదోయ్ మానవుడా, చచ్చిపోయిన వెంటనే విచారణ జరిగే మొదటి న్యాయశాలకి తీసుకువెళ్ళుతున్నాం నిన్ను.

**2వ మృ :** ఈ చచ్చిపోయిన మనిషి ఎలా మాట్లాడుతున్నాడో? ఏదో పొరపాటు జరిగినట్టుంది.

**మాన :** అవును. నన్ను వదలిపెట్టండి. నేను బతికే వున్నాను. మీరు నమ్మరూ నన్ను?

**1వ మృ :** మేము నమ్మినా, నమ్మకపోయినా నీకేం ప్రయోజనం లేదు, నిన్ను వదలిపెట్టగల స్థితిలో మేం లేము. బహుశా నువ్వు బతికే వున్నావేమో కాని–

మాన : బహుశా అంటావేమిటి? నిశ్చయంగా నేను బతికే ఉన్నాను.

2వ మృ : ఎక్కడో పెద్ద పొరపాటు జరిగింది.

1వ మృ : ఈ లోకంలో ఎన్నడూ పొరపాట్లు జరగవు.

మాన : ఏం ఇదేం స్వర్గమా?

1వ మృ : స్వర్గమనీ, నరకమనీ వేరే వేరే లోకాలు లేవు నీ పాపం నీ నరకం. నీ పుణ్యం నీ స్వర్గం.

మాన : ఏది పుణ్యం? ఏది పాపం? స్వర్గ నరకాలు వేరు వేరుగా లేకపోతే పుణ్య పాపాలు కూడా వేరు వేరుగా లేవు.

2వ మృ : చచ్చిపోయినవాడివి, చచ్చినట్టుండక చట్టవిరుద్ధంగా మాటలాడడం పాపం.

1వ మృ : ఊరుకో. ఊరుకో. ఇతణ్ణి విచారణ చేసే అధికారం మనకి లేదు.

2వ మృ : అయితే ఈ మానవుణ్ణి మాటలాడవద్దను. వీడు మాటలాడుతూ వుంటే నా కెందుకో భయం వేస్తోంది.

1వ మృ : మనమేదో తప్పుపని చేస్తున్నట్టు నా అంతఃకరణకి స్ఫురిస్తోంది. చచ్చిపోకముందే మనం ఇతణ్ణి తీసుకుపోతున్నామేమో?

2వ మృ : ఇందులో మన తప్పేం ఉంది. మనకిచ్చిన ఉత్తరువు ప్రకారం మనం నడుస్తున్నాం.

1వ మృ : ఈ మానవుడు బతికే ఉన్నాడు. ఇతణ్ణి న్యాయమూర్తి ఎదుట నిలబెట్టడానికి వీలులేదు.

2వ మృ : ఉత్తరువును ఉల్లంఘించవలసిందేనా?

1వ మృ : ఎంత సంకటం వచ్చిపడింది మనకి. ఎక్కడో తప్పు జరిగింది. దాని ఫలితం మనం అనుభవిస్తున్నాం.

2వ మృ : ఊరుకో, ఊరుకో, తప్పు జరిగిందని నిశ్చయంగా నీకేం తెలుసు? తెలియందే ఎవళ్ళమీదనైనా ఎలా నేరం ఆరోపించగలవు?

1వ మృ : ఈ మానవుడు బతికి వుండడమే ఇందుకు నిదర్శనం.

2వ మృ : మానవుడు మాటలాడలేదు.

1వ మృ : మానవుడు మరణించాడు.

2వ మృ : మరింతసేపూ మాటలాడాడే? ఇది సంభవమా?

1వ మృ : ఇంతసేపూ ఏదో భ్రాంతిలో పడ్డాం మనం.

2వ మృ : మరి మనకంత భయం వేసిందేం? ఎన్నడూ భయమంటే ఏమిటో ఎరగమే మనం. ఒక మానవమాత్రుడు ఎంత హడలు కొట్టించాడు మనల్ని. ఏదో తప్పుచేసినట్లు ఎంత వణికిపోయాం ఇంతసేపూ?

**1వ మృ :** ఈ లోకంలో ఎప్పుడూ తప్పు జరగదు. ఇదివరకెప్పుడూ మనం బతికున్నవాళ్ళ జోలికి పోలేదు.

**మాన :** ఇప్పుడు మీరు నాకు అన్యాయం చేస్తున్నారు. నా ప్రాణాలు తీసేస్తున్నారు. నన్ను నరకబాధ పెడుతున్నారు. నేనేం తప్పుచేశానని? బతికుండగానే నన్నిలా కాల్చేస్తున్నారేమిటి? తీసుకెళ్ళండి? నన్ను మీ న్యాయమూర్తి దగ్గరికి తీసు కెళ్ళండి. అతణ్ణే ప్రశ్నిస్తాను. కానియ్యండి. మీ ధర్మం మీరు నిర్వహించండి. ఆ న్యాయమూర్తి ఎవరో నాకు చూపించండి. బహుశా అతడు భగవంతుడు కాడనుకుంటాను. అతనికన్నా తక్కువ హోదాలో ఉన్న క్షుద్రదేవత అనుకుంటాను. మా భూలోకంలో ఇలాంటి అధికారులు చాలామంది ఉన్నారు. ఇక్కడ కూడా ఉన్నారన్నమాట. అన్యాయాధికారులు.

**1వ మృ :** ఊరుకో, ఊరుకో. ఇదుగో న్యాయశాల సమీపించాం. మానవుడా? మమ్మల్ని చీవాట్లుపెట్టకు. నీ మరణానికి మేము కారణం కాం. నువ్వసలు చచ్చిపోయావో బతికున్నావో కూడా మాకు తెలియదు. ఆజ్ఞమేరకు నిన్నిక్కడికి తీసుకొచ్చాం అంతే.

**2వ మృ :** ఇక మేం వెళ్ళిపోతున్నాం. ఇక్కడి రక్షక భటులకి నిన్నప్పగించి మేం సెలవు తీసుకుంటాం. మానవుడా! నీ రౌద్రాకారాన్ని చూస్తే మాకు భయం వేస్తోంది. విచారణలో నువ్వు గెలవాలని త్రికరణశుద్ధిగా కోరుతున్నాం. దేవతలు కూడా పొరపాటు చేస్తారని నీ జీవితంలో ఋజువుచేశావు. నువ్వు జీవించే ఉన్నావనడానికి మాకేమీ సందేహం లేదు. మానవుడా, జీవించు.

**1వ మృ :** మరి మాకు సెలవు

(పావు నిమిషం సేపు జంత్ర సంగీతం)

**ప్రకటన :** (మృత్యుదూతలు మానవుని ఆత్మని మరో ప్రపంచపు న్యాయస్థానానికి చెందిన రక్షక భటులకి అప్పగించి వెళ్ళిపోయారు. రక్షక భటులు ధర్మాసనంమీద కూర్చున్న న్యాయమూర్తి సమక్షంలో మానవుణ్ణి హాజరుపెట్టారు. ఈ న్యాయమూర్తి వయస్సులేని, నేత్రాలులేని ఒక స్త్రీమూర్తి).

**న్యాయమూర్తి:** మానవుడా! ఎన్నడూ జరగని పొరపాటొకటి ఈ లోకంలో జరిగింది. ఇప్పుడే నీ కాగితాలన్నీ తెప్పించి పరిశీలించాను. నాకు కళ్ళు లేవు గాని, చూడ గలను. భూలోకంలో నీకింకా అయిదు సంవత్సరాల ఆయుస్సు ఉండగా ఈ కార్యాలయంలోని ఒక చిన్న వుద్యోగి తప్పు లెక్క వల్ల మృత్యు దూతలు నిన్నిక్కడికి తెచ్చేశారు. నువ్వు చనిపోయావని నిజంగానే వాళ్ళనుకున్నారు.

**మాన :** మీరు ధర్మస్వరూపులు. దేవతల పొరపాటువల్ల ఈ మానవుడు బాధ పడుతున్నాడు. నన్ను కూడా ఇప్పుడు సందేహం బాధిస్తోంది. నేను బతికున్నట్టా? చచ్చిపోయినట్టా?

**న్యాయ :** మృత్యు రాజ్యపు చట్టంప్రకారం నువ్వు చనిపోయినట్టుగానే ఉత్తరువు పడిపోయింది. తక్షణమే మృత్యు దూతలు నీ శరీరం నుంచి నీ ఆత్మని తొలగించివేశారు. నీ కాగితాలు తెప్పించి పై అధికారులతో

నీ విషయమై ఎంతో వాదించాను. ఇక్కడి వ్యవస్థలో ఎప్పుడూ పొరపాటు జరగదనే అందరూ అనుకుంటున్నారు. కాని నీ పట్ల మాత్రం పొరపాటు జరిగింది. నీకన్యాయం జరిగింది. నక్షత్రాల సాక్ష్యం ప్రకారం నీకింకా అయిదేళ్ళ ఆయువుందని నేను స్థిరంగా నిర్ధారణ చేశాను.

**మాన :** ధర్మ దేవతా! కృతజ్ఞుణ్ణి.

**న్యాయ :** నువ్వింక భూలోకానికి పోవచ్చు. నీ ఆత్మని దేవదూతలు మర్యాదగా మీ పల్లెటూళ్ళో వదలిపెడతారు. మా పొరపాటువల్ల అన్యాయం జరిగినందుకు మేమందరమూ సిగ్గుతో తలవంచుకుంటున్నాము. భగవంతుడు కూడా, ఆయన్ని నే నెప్పుడూ చూడలేదుగాని, ఈ జరిగినదానికెంతో బాధ పడుతూ వుంటాడు.

**మాన :** ధర్మదేవతా! భగవంతుణ్ణి మీరు చూడలేదా ఎప్పుడూ?

**న్యాయ :** భగవంతుడు ధర్మానికి కూడా అతీతుడు. ఈ చర్చలిప్పుడు వద్దు. ఇక నేను సభ చాలిస్తున్నాను. నువ్వు భూలోకానికి వెళ్ళు.

(అరనిమిషంసేపు జంత్ర సంగీతం)

**ప్రకటన :**

దేవదూతలు మానవుని ఆత్మను అతని పల్లెటూళ్ళో దిగవిడిచి పోయారు. కాని అప్పటికే అతని శరీరాన్ని బంధువులంతా దహనం చేసివేశారు. ఇంకా అయిదేళ్ళ జీవితం వున్న మనుష్యుడి ఆత్మ నివసించడానికి శరీరం లేదు. తన శరీరాన్ని వెతుక్కుంటూ ఆత్మ ఆ రాత్రంతా ఎంతో అల్లాడింది. మళ్ళీ ధర్మదేవత దర్శనం చేసుకుంటే బాగుండుననుకుంది. కాని ఈ లోకంలోని ఉన్నతాధికారుల దర్శనం చేసుకోవాలంటేనే ఎందర్నో ఆశ్రయించి ఎన్నెన్నో తిప్పలు పడాలే. ఆ లోకంలోని అధికారిని దర్శించడం అంటే మాటలా? నిన్న తన ప్రయత్నం లేకుండానే ధర్మదేవత కనబడింది. ఈ రోజు ఎక్కడుందోకూడా తెలియదు. అయినా తన ప్రయత్నాన్ని ఆత్మ వదిలిపెట్ట దలుచుకోలేదు. సమస్త దేశ కాలావధులలో స్వతంత్రంగా నిరాఘాటంగా సంచరించ గలుగుతోంది ఆత్మ. కాని పంచభూతాలలో కలిసిపోయిన తన శరీరం మాత్రం ఎంత వెదికినా మళ్ళీ కనిపించదు. ఇదేమిటీ ఉపద్రవం? ఎక్కడో ఎవ్వరో చేసిన పొరపాటుకి తానెందుకింత బాధ పడాలి? మళ్ళీ తాను మరో ప్రపంచానికి వెళ్ళి ఎలాగైనా తన శరీరాన్ని తన కిప్పించవలసిందని న్యాయమూర్తి ఎదుట ఫిర్యాదు చెయ్యడానికి మరణ జీవితాలమధ్య అల్లాడుతున్న మానవుని ఆత్మ నిశ్చయించింది.

(మరో ప్రపంచపు న్యాయస్థానం వెలుపల పెద్ద పెద్ద సొరంగాలవంటి వరండాలు. కీచురాళ్ళ చప్పుడు. ప్రవేశం – ఆత్మరూపంలో మానవుడు.)

**మాన :** ధర్మదేవతా! ధర్మదేవతా!

(ఎవరూ పలకరు. కాలావధుల కొసనుంచి అతని జాలి కేకకు అదే జవాబుగా ప్రతిధ్వని. చీకటి గుహల్లోంచి నదులు ప్రవహించే చప్పుడు.)

**మాన :** న్యాయమూర్తీ! న్యాయమూర్తీ!

(ఎవరూ పలకరు, ప్రతిధ్వని తప్ప. తర్వాత గాజు పెంకులు పగిలిపోయినట్లు నవ్వు.)

**నవ్విన వ్యక్తి:** ఈ భగవంతుని న్యాయస్థానంలో ఎవరయ్యా నువ్వు?

**మాన :** నేనో మానవుణ్ణి. నాకింకా అయిదేళ్ళ ఆయుర్దాయం ఉంది. (నవ్వు) ఎందుకలా నవ్వుతావు? ఎవరివి నువ్వు?

**న.వ్య :** ఎవరినైతేనేం? ఆనందం అనుకో నన్ను మాటవరసకి. ఏకం నా సంఖ్య. ఎప్పుడూ ఇక్కడే నా ఉద్యోగం. నీకు ప్రస్తుతం సాయం చెయ్యడానికి వచ్చాను.

**మాన :** సంతోషం. నిజంగా ఇది స్వర్గలోకంలా ఉంది

**న.వ్య :** ఇక్కడ ఉద్యోగుల్ని కొందర్ని చూస్తే ఇదే నరకం అనుకుంటావు నువ్వు. వాళ్ళ దాహం నువ్వు తీర్చలేవు. మాటవరసకి నాలోనే మరో దుర్మార్గపు వేపుంది. మాటవరసకి నీకు నేను న్యాయమూర్తి దర్శనం చేయిస్తాననుకో. నాకే మాత్రం లంచం చదివించుకోగలవు?

**మాన :** ఇంకా సందేహమా? ఇది నరకం.

**న.వ్య :** అన్నీ నీ మనస్సులో నువ్వే కల్పించుకొంటున్నావు. నిష్కల్మషంగా నీకు సహాయపడాలని వచ్చాను. మాటవరసకి నువ్వు కోరిన వరం ఇస్తాను. నేను కోరే హవిస్సులతో నన్ను సంతోషపెట్టు.

**మాన :** ఆనందానికి ఆనందం కలిగించాలా నేను? నన్ను నేను హోమం చేసుకుంటున్నాను. ఇది చాలదా నీ తృప్తికి. నిన్ను నూట ఎనిమిది పేర్లతో పిలిచి స్తోత్రం చేస్తాను. నీకు జాలి గలగదూ? ధర్మదేవతని చూపించవూ?

**న.వ్య :** ధర్మదేవతా దర్శనం – అదంత సులభమనుకున్నావా మానవుడా. మాటవరసకి అందుకెంత తపస్సు కావాలో ఆలోచించావా?

**మాన :** నేను కోరకుండానే నిన్న ఆవిడ నాకు దర్శనమిచ్చింది.

**న.వ్య :** నువ్వు భూలోకపు కాలపరిమితులలో మాట్లాడడం మాని వెయ్యాలి. మాటవరసకి నిన్న చూశావో, కొన్ని యుగాల క్రిందట చూశావో, ఎవరికి తెలుసు? ఇంతకీ నువ్వెందుకు ఆవిడను చూడాలి?

**మాన :** నీకు తెలియదా మహానుభావా! నా నోటంట చెప్పించాలా?

**న.వ్య :** నువ్వేదో దావాలో గెలిచావటకాదూ?

మాన : గెలిచానో, ఓడానో! ఈ ప్రాణానికేమీ సుఖం లేదు. నా శరీరం నాకు దొరకితే బాగుండును.

న.వ్య : ఏమైంది నీ శరీరం? ఎక్కడ పారేసుకున్నావు?

మాన : నేనేమీ పారేసుకోలేదు. మీ న్యాయస్థానంలో ఒక వుద్యోగి చేసిన పొరపాటువల్ల నాకు మరణం సంభవించింది.

న.వ్య : అలాగనా పాపం.

మాన : ధర్మదేవత నా జీవితాన్ని నాకు మళ్ళీ ప్రసాదించింది. కాని మా వాళ్ళు నా శరీరాన్ని దహనంచేసి వేశారు. నిన్న రాత్రంతా నేనెంతో యాతన పడ్డాను. ఒక చచ్చిపోయిన గబ్బిలం శరీరంలో ప్రవేశించాను. గబ్బిలంగా బతకడం ఎంతకష్టం? చాలాసేపు ఒక చెట్టు కొమ్మని పట్టుకొని వేలాడేను. నూతిలో ఒక కప్ప చచ్చిపోయి వుంది. పోనీ అని దాని ఒంట్లో దూరేను. కప్పబతుకు, అందులోకీ నూతిలోని కప్ప బతుకు. అదీ ఉక్కిరి బిక్కిరిగానే వుంది. నాకు మిగిలిన అయిదేళ్ళూ నా బతుకు నేను బతకక, ఇంకో జంతువుని ఎందుకు కావాలి నేను?

న.వ్య : పోనీ మనిషిగానే బతకలేకపోయావూ? మాటవరసకి భూలోకంలో మనుష్య కళేబరాలకేం తక్కువ? అనుక్షణం ఎందరు మరణించడంలేదు? కాశ్మీరంలో, మలయాలో, జావాలో–

మాన : ముప్ఫయి అయిదేళ్ళు నేను నేనుగా జీవించాను. నా శరీరంతో సమాధానపడ్డాను. అది మాని, ఇంకొకరి బతుకు నేనెలా బతగ్గలను చెప్పూ? వాడి అలవాట్లు, వాడి ఆలోచనలు అన్నీ వాడివే. పోనీ ఎలాగో కష్టపడి వాటినే అవలంబిస్తాననుకో, అప్పటికీ నాది అబద్ధం బతుకే అవుతుంది.

న.వ్య : ఎక్కడో జరిగిన ఒక తప్పువల్ల ఎంత ఇబ్బందిలో పడ్డావు నువ్వు? నీకు సాయపడాలని వుంది నాకు. నువ్వు నాకేలంచాలూ ఇవ్వనక్కరలేదులే. నీకేం సహాయం కావాలో చెప్పు. నీ శరీరాన్ని మాత్రం చూపించమనకు.

మాన : ధర్మదేవతని చూపించు.

న.వ్య : ఆవిడ మాత్రం ఏం చెయ్యగలదు? ఆవిడే కాదు, ఎవ్వరూ యిక నీ శరీరాన్ని నీకివ్వలేరు.

మాన : దేవతలకి కూడా అసాధ్యమైన కార్యాలున్నాయా?

న.వ్య : మానవుడివి కాబట్టి నీకు దేవతలశక్తి మీద విపరీతమైన విశ్వాసం వుండడం సహజమే. కాని దేవాధిదేవులు కూడా పురోగమనశీలమైన కాలాన్ని వెనక్కి మళ్ళించలేరు. కావాలంటే నీకు ధర్మదేవత దర్శనం యిప్పిస్తాను లేదా ఇంకేదేనా సహాయం కావాలంటావా చెప్పు, చేస్తాను.

**మాన :** అఖ్ఖర్లేదు. ఆవిడని చూపిస్తే చాలు. ఆవిడ నాకేదో దారి చూపిస్తుంది. ధర్మదేవత ఏం చెయ్యమంటే అది చేస్తాను.

**న.వ్య :** అయితే పద

(పావు నిమిషం జంత్ర సంగీతం)

**ప్రకటన :**

(నవ్విన వ్యక్తి అనగా ఆనందం తన వాగ్దానం ప్రకారం శరీరం లేని మనిషిని న్యాయమూర్తి సమక్షానికి తీసుకెళ్ళాడు)

**మాన :** ధర్మదేవతా! నిన్ను సందర్శించడానికి నేను ప్రచండమైన తపస్సు చేశాను. వర్ణనాతీతం నేను పడుతున్న క్షోభ.

**న్యాయ :** మళ్ళీ వచ్చావెందుకు మానవుడా? ఈ మారు నువ్వు తెచ్చిన అభియోగం ఏమిటి?

**మాన :** నా శరీరం దగ్ధమైపోయింది. నేను నిలవడానికి నీడలేదు. మీరిచ్చిన అయిదేళ్ళూ తీసుకున్నా తీసుకోండి గాని, నిరాశ్రయంగా నన్నీ అనంత విశ్వంలో పరిభ్రమించ నివ్వకండి.

**న్యాయ :** మొదటి సంగతి, ఆ అయిదేళ్ళూ నేనిచ్చినవి కావు. రెండోది, వాటిని తీసుకొనే శక్తి గాని, అధికారం గాని నాకు లేవు.

**మాన :** మరి నన్నిప్పుడేం చెయ్యమన్నారో మీరే చెప్పండి. జీవితం నుంచి నేనొక కాందిశీకుణ్ణయిపోయాను. ఇంకొకడి బతుకు నేను బతకలేను. ఎందుకు నాకీ అయిదేళ్ళు?

**న్యాయ :** పోనీ, ఇది చెప్పూ. ఇంకో కొత్తబతుకు ప్రారంభిస్తావూ?

**మాన :** అంటే? నాకు బోధపడలేదు. ఈ అయిదేళ్ళ కాలంలో ఇంకో కొత్త బతుకు ఎలా సాధ్యమవుతుంది నాకు?

**న్యాయ :** అయిదేళ్ళే అన్న పరిమితి తొలగిస్తాను. నీ యిష్టం వచ్చిన శరీరంలో నువ్వు ప్రవేశించు.

**మాన :** వద్దు తల్లీ వద్దు. నన్నీ జన్మదుఃఖపుచెరనుండి విడిపించు.

**న్యాయ :** జన్మరాహిత్యమే? అదిమాత్రం నన్నడక్కు. ఆ వరం నే నివ్వలేను. నీకో జీవితాన్నివ్వగలను. నీకో శరీరాన్ని చూపించగలను. అంతేగాని, జన్మరాహిత్యాన్ని ప్రసాదించే శక్తి నాకు లేదు.

**మాన :** దేవతలు తమ అశక్తిని నా దగ్గర చెప్పుకుంటున్నారంటే నవ్వాలో ఏడవాలో నాకు తెలియలేదు. కానియ్యండి. జరిగిన పొరపాటేదో జరిగిపోయింది. నేను భూలోకానికి పోతున్నాను. ఏదో ఒక

శరీరంలో దూరుతాను. ఏదో ఒక బతుకు, ఎలాగో ఒకలాగ బతుకుతాను. ఎప్పుడు మీరు పిలిపించుకుంటే అప్పుడు వస్తాను. ఇప్పుడు నాకు బోధపడింది. నేను మీచేతిలో ఎలా ఆట వస్తువునో, ఇంకొకడి చేతిలో మీరు అలా ఆటవస్తువులు. ఆ ఇంకొకడు మరొకడి చేతిలో, ఆ మరొకడు వేరొకడి చేతిలో... ఇలాగ ఇది అనంతం.

**న్యాయ :** సృష్టి రహస్యం అంతా ఇంతే. ఇక చెప్పు మానవుడా, ఏ శరీరంలో ప్రవేశిస్తావు?

**మాన :** అన్ని శరీరాలూ ఇప్పుడు నా కొకటే, దేవతల్లోనూ మానవుల్లోనూ కూడా నాకు నమ్మకం పోతోంది.

**న్యాయ:** ఓయి మానవుడా, నువ్వు దేవతలని నమ్మకపోతే పోయావుగాని మానవత్వం మీద విశ్వాసాన్ని మాత్రం విసర్జించకు. నిజమే, నీకు దేవతలవల్ల అన్యాయం జరిగింది. ధర్మదేవతని నేను క్షమించమని కోరుతున్నాను. మానవుడా! దేవతలు నీ క్షమాపణ కోరుకుంటున్నారు. క్షమించవూ?

**మాన :** ఎంత మాటన్నావు తల్లీ. ఇదిగో చేతులు జోడించి మొక్కుతున్నాను. ఈ అల్పమానవుడా దేవతలను క్షమించవలసినవాడు. అంతమాట అనకు తల్లీ! నాకు సెలవిప్పించు, నేను భూలోకానికి పోతాను.

**ధర్మ దేవత :** ఇందుచేతనే దేవతలు మానవుని ప్రేమిస్తారు. ఈ హృదయ వైశాల్యాన్ని చూచి! ఓ నరుడా నీకు వరమిస్తున్నాను. నీకు ఎవరిలాగ బతకాలని వుందో కోరుకో.

**మాన :** నాకు నాలాగతప్ప ఇంకోవిధంగా బతకాలని లేదు. అది అసాధ్యమని తేలిపోయింది. ఇక ఏ బతుకైతేనేం? ఎలాగూ కొత్త జీవితం ప్రారంభించాలి. కాబట్టి సరికొత్త జీవితమే మొదలు పెడతాను. నన్నో అమ్మ కడుపులో పారెయ్యి తల్లీ. అదే నేను కోరే వరం.

**ధర్మ :** అదిగో మళ్ళీ నాకు లేనిశక్తి సామర్థ్యాలని నాకాపాదిస్తున్నావు. నిన్ను తిరిగి నేను సృష్టించలేను. శిశువుగా జీవితాన్ని ప్రారంభిస్తానన్నావు. కనుక ఇదుగో విను. నీకు పూర్ణాయుర్దాయం ఇస్తున్నాను. ఈ క్షణంలో భూలోకంలో ఒక అమ్మాయి ప్రసవిస్తోంది. కాని ప్రాణంలేని శిశువు అది. అతికష్టం మీద వైద్యుడు ఆ శిశువుని పైకి తీశాడు. ఆ బిడ్డ శరీరంలో నువ్వు ప్రవేశించి బ్రతుకుని ప్రారంభించు.

**మాన :** మహాప్రసాదం దేవీ.

(అరనిమిషం జంత్ర సంగీతం)

**ప్రకటన :**

భూలోకంలో, ఆంధ్రదేశంలో, ఒక ప్రసూతి వైద్యశాలలో ఆపరేషన్ గది. ఒక అమ్మాయి మృత శిశువును ప్రసవించింది. క్లోరోఫారం నిద్రనించి మేలుకుంటోంది. చిన్న మూలుగు. పక్క పెద్ద డాక్టరు నిలుచున్నాడు. మిగిలినవాళ్ళు కొంచెం దూరంగా ఉన్నారు.)

**డాక్టరు :** భయం లేదమ్మా. నీకేం ప్రమాదం లేదమ్మా. అంతా అయిపోయింది.

**అమ్మాయి :** (నీరసంగా) ఏమయింది డాక్టరుగారూ! నా బిడ్డను చూపించరా!

**డాక్టరు :** చూదువుగానిలే అమ్మా ! మొదట నీవు విశ్రాంతి తీసుకో.

**అమ్మాయి :** ఇది చెప్పండి డాక్టరుగారూ! ఏంపిల్ల? మొగాడా, ఆడదా?

**డాక్టరు :** పిల్లదేనమ్మా, కళ్లు మూసుకో, అటు చూడకు.

**అమ్మాయి :** అబ్బాయి కదలడేమండీ! ఏడుపు వినబడదేం?

**డాక్టరు :** ఏం చెప్పమంటావమ్మా? నువ్వు ధైర్యంగా వుండాలి.

**అమ్మాయి :** చెప్పండీ, ఫరవా లేదు, చెప్పండీ, అబ్బాయి చచ్చిపోయాడు. అంతేనా?

**డాక్టరు :** ఇంకా ఆశ లేకపోలేదు. మా ప్రయత్నాలు మేం చేస్తాం. కళ్ళు మూసుకుని పడుకో అమ్మా. మాట్లాడొద్దు కదలవద్దు మెదలవద్దు.

**అమ్మాయి :** (దుఃఖంగా) నాకు తెలుసు. చచ్చిపోయాడు. లాభం లేదు, చచ్చి పోయాడు.

**మానవుని గొంతుక :** నేను చచ్చిపోలేదు. నమ్మండి. నేను బతికే ఉన్నాను.

(శిశువు రోదనధ్వని కెవ్వుమని వినిపించి క్రమంగా ఫేడౌట్.)

## అభ్యాసం

**I.** ప్రశ్నలు

1. 'గవేషణ' నాటిక సారాంశాన్ని తెల్పండి.
2. 'గవేషణ' నాటికలో మరణించిన వ్యక్తి ఆవేదనను తెల్పండి.

❖ ❖ ❖

# 2 తెరచిన కళ్ళు

**- ఆత్రేయ**



## రచయిత పరిచయం

**మ**నసు కవి, మన సుకవి ఆచార్య ఆత్రేయ. 07.05.1921 వ తేదీన నెల్లూరు జిల్లా, సూళ్ళూరుపేట దగ్గరున్న మంగళంపాడులో ఆత్రేయ జన్మించారు. తల్లిదండ్రులు సీతమ్మ, కృష్ణమాచార్యులు. ఉచ్చూరు వీరి స్వగ్రామం. ఆచార్య ఆత్రేయ అసలు పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. ఆత్రేయ అనేది వీరి గోత్రం పేరు. తన పేరులోని ఆచార్య పదానికి గోత్రం పేరును జతచేసి "ఆచార్య ఆత్రేయ' అనే పదబంధాన్ని కలంపేరుగా మార్చుకున్నారు. తరువాత కాలంలో అదే అసలు పేరుగా స్థిరపడింది.

చిత్తూరులోని ఉన్నత పాఠశాలలో, రాయవేలూరులోని కళాశాలలో ఆత్రేయ విద్యనభ్యసించారు. ఆత్రేయకు చిన్నప్పటి నుంచీ నాటకాల పిచ్చి. తన 15 వ ఏటనే రంగస్థల నటుడుగా రంగమెక్కారు. ఈ నాటకాల వ్యామోహం వల్ల ఆత్రేయ చదువు కొనసాగలేదు.

బతుకు తెరువుకోసం ఆత్రేయ చిన్న చిన్న ఉద్యోగాలు చాలా చేశారు. నెల్లూరులోని జిల్లా మున్సఫ్ కోర్టులోనూ, తిరుత్తణి సెటిల్‌మెంట్ ఆఫీసులోనూ క్లర్కుగా పనిచేశారు. నెల్లూరు నుంచి వెలువడే 'జమీన్‌రైతు' పత్రికకు సహాయ సంపాదకుడిగానూ, ఆంధ్ర నాటక కళా పరిషత్తులో వేతన కార్యదర్శిగానూ కూడా ఆత్రేయ బాధ్యతలు నిర్వహించారు.

ప్రతిమనిషినీ తన చుట్టూ ఉన్న సమాజం ఏదో ఒక రూపంలో ప్రభావితం చేస్తుంది. ఇందులో భాగంగా ఆత్రేయ నటుడుగానే కాక, గొప్ప రచయితగా కూడా ఎదిగారు. అనేక రచనలు చేశారు. వీటిలో పద్యకావ్యాలూ, వచన కవితలూ, గేయాలూ, నాటకాలూ, నాటికలూ వంటి అనేక ప్రక్రియలున్నాయి. ఆత్రేయ నాటకాలు ఎన్.జి.ఒ., పరివర్తన వంటివి నాటక కళా పరిషత్తు బహుమతులు పొందాయి. 'కప్పలు' అనే నాటకం వందల సంఖ్యలో ప్రదర్శించబడింది. సినిమా రంగంలోనూ ప్రవేశించిన ఆత్రేయ అక్కడ కూడా తన బలమైన ముద్రను వేశారు. మంచి కథలను అందించారు. ఆత్రేయ మాటలు, పాటలు చలన చిత్ర ప్రేక్షకులను కేరింతలు కొట్టించాయి. కళ్ళ నీళ్ళూ పెట్టించాయి.

ఆత్రేయ 'మనసు' కవిగా ముద్ర పడ్డాడు గాని, తన రచనల్లో ఇతరేతర భౌతిక విషయాలు అనేకం ఉన్నాయి. రాయలసీమ ప్రాంతంలో నెలకొన్న క్షామం, స్వాతంత్ర్యానంతరం దేశంలో చెలరేగిన మతపరమైన హింసాకాండలూ, వాటి విషాదాలు; విశ్వశాంతి నెలకొనాలన్న ఆకాంక్ష వంటివి ఆత్రేయ రచనల్లో ఆవిష్కరించబడిన

అంశాలు. తెలుగు సాహిత్య రంగంలోనూ, చలనచిత్ర రంగంలోనూ తనదైన ముద్ర బలంగా వేసిన ఆత్రేయ 09-09-1989 తేదీన భౌతికంగా మనకు దూరమయ్యారు.

ప్రస్తుత పాఠ్యభాగం 'తెరచిన కళ్ళు' నాటిక విద్య, జ్ఞానం వంటి విషయాలకు సంబంధించి మన కళ్ళు తెరిపించే రచన. విద్య, జ్ఞానం వంటివి బంగారం లాంటివి. మెరుగు పెట్టేకొద్దీ అవి మరింత ప్రకాశిస్తాయి. అవి దాచిపెట్టకూడనివి. పదిమందికీ పంచవలసినవి. ఆ పని చేయకపోతే అవి కళా విహీనం అవుతాయి. ఈ సత్యాన్ని ఈ నాటిక చాటి చెపుతుంది.

విద్యారంగంలో కార్పొరేటీకరణ సంస్కృతి పెరిగిపోయాక; వికసించవలసిన విద్యార్థుల మనసులు కుంచించుకు పోతున్నాయి. స్వార్థ చింతన పెరిగి పోతూ ఉంది. నేటి విద్యార్థులే రేపటి పౌరులు. కాబట్టి, ఈనాటి విద్యార్థులు ఈ ప్రమాదంలో మరింత కూరుకు పోకుండా ఉండటం కోసం, భవిష్యత్తులో మానవీయ విలువలతో కూడిన మంచి సమాజ నిర్మాణం కోసం వారి కళ్ళు తెరిపించడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

## పాత్రలు

| | | |
|---|---|---|
| డాక్టరు సుదర్శన్ | : | కళ్ళ డాక్టరు |
| సత్యం | : | డాక్టరు సహాయకుడు (జూనియర్ డాక్టర్) |
| పిల్లవాడు | : | 1 వ రోగి |
| తల్లి | : | పిల్లవాడి తల్లి |
| భర్త | : | 2 వ రోగి |
| భార్య | : | 2 వ రోగి భార్య |

నర్సు, బిచ్చగాడు, డాక్టరు భార్య

## పాఠ్యభాగం

**బిచ్చగాడు :** బాబూ, గుడ్డోణ్ణి బాబూ, కళ్ళులేని కబోదిని నాయనా దయ సూపండి.

చూపుంటేనే లోకం
అది లేకుంటే శోకం
అందంలో ఆనందం వుంది
ఆ అందం కన్నేదంటుంది
చూపుంటే సృష్టే స్వర్గం
లేకుంటే నికృష్టపు నరకం
కళ్ళులేని కబోదులు కొందరు
కళ్ళుండీ కనజాలరు ఎందరో

లోపలి చూపే జ్ఞాన సమస్తం
లేకుంటే బ్రతుకంతా వ్యర్థం

క్రమంగా ఫేడౌట్.

ఫేడిన్, మూలుగులు – పసిపాప క్యారు క్యారుమని ఏడ్పు.

**నర్సు :** మొగపిల్లోడమ్మా.

**స్త్రీ :** (ఆనందంతో) ఆఁ మొగపిల్లోడే – ఎలాగున్నాడమ్మా, బాగున్నాడా?

**నర్సు :** వరాల కృష్ణమ్మ, అచ్చం తండ్రిపోలిక... కాని...

**స్త్రీ :** (అసహనంతో) కానేమిటమ్మా?

**నర్సు :** కాని.... ..... బిడ్డ పుట్టుగుడ్డమ్మా.

**స్త్రీ :** ఆఁ పుట్టుగుడ్డా. నా బాబు పుట్టుగుడ్డా? బాబూ, నీకోసం ఎన్ని వ్రతాలు చేశాను? ఎన్ని పూజలు చేశాను. ఎన్ని నోములు పట్టాను. చివరకు నాకు దేవుడిచ్చిన వరం యిదా? నీ కోసం యింత తపించిన తల్లిని, కళ్ళారా చూసి, నోరారా అమ్మా అని ఒక్కసారి పిలిచే భాగ్యం లేకుండా చేశాడా భగవంతుడు. నేనేం పాపం చేశానో, నా పాపం నీకు తగిలింది తండ్రీ.

(ఫేడౌట్ – ఫేడిన్)

సన్నాయి మేళం. పెళ్ళి సంబరం, మంత్రాలు, ఉన్నట్టుండి 'హా' అని ఒక మగ గొంతు కేక. అల్లకల్లోలం.

**1 గొంతు :** ఏమైంది బాబూ ఏమైంది?

**2 గొంతు :** పాపం పెళ్ళికొడుక్కు కళ్ళు పోయాయటమ్మా. బాణసంచా కాలుస్తూ ఉంటే అక్కడ గదిలో సూరేకారం నుండి ఒక్కసారి మంట పై కెగసి కంటికి తగిలిందట.

**1 గొంతు:** పాపం... ....పెళ్ళికూతురు. చక్కని చుక్క, రత్నాల కుప్ప ... చిలకా గోరింకల్లా వుంటారనుకున్నాం – పాపం – ఆ అమ్మాయి బ్రతుకు అడవి గాచిన వెన్నెలైంది.

(ఫేడౌట్ – ఫేడిన్)

**భార్య :** (సన్నగా ఏడుస్తున్నది).

**భర్త :** నిన్ను చూశాను, వలచాను. నా తపస్సు ఫలించిందని తలచాను. మన దాంపత్యాన్ని ఆదర్శంగా, ఆనందంగా గడపవచ్చని మురిశాను. కాని విధి మన పట్ల వైరం వూనింది. నాకీశిక్ష విధించి, నీకు అన్యాయం చేసింది. కళ్ళు లేని నా జీవితం అంధకారమేగా, సరూ, ఒక్కమాట చెపుతావా.

**భార్య :** ఏమిటండి?

**భర్త :** నీవు వేరే పెళ్ళి చేసుకో.

**భార్య :** ఏమిటండి. ఏమిటామాటలు?

**భర్త :** గుడ్డివాణ్ణి, నాతో ఎలాగ కాపురం చేస్తావు? నిన్ను తలచుకుంటే నా గుండెలు బ్రద్దలవుతున్నాయి.

**భార్య :** ఛ.... అలా మాట్లాడకండి... నాకు మీరే సర్వస్వం... మీకు కళ్ళు తప్పకుండా వస్తాయి. కళ్ళు లేకపోతేనేం – మీతో కాపురం చేయడానికేం? మీతోనే నాకు స్వర్గం.

**భర్త :** (ఆశతో) ఏమిటో అంటావ్.

**భార్య :** ఏమండోయ్ చూశారా? ఈ పేపర్లో...

**భర్త :** నేనూ చూడటం... నీ పిచ్చిగాని, – ఏమిటది చదువు.

**భార్య :** ఎవరో డాక్టర్ సుదర్శన్ అట. కళ్ళు లేని వాళ్ళకు కళ్ళిస్తున్నాడట. ఎంత మందికో నయం చేశాడట – పుట్టుగ్రుడ్డులు కూడా పూర్ణదృష్టిని పొందు తున్నారట – మనమూ వెళ్దాం.

**భర్త :** నిజంగానా – నాకు దృష్టి వస్తుందా, నీ పిచ్చిగాని.

**భార్య :** తప్పక వస్తుంది. నా మాట వినండి... మనమూ వెళ్దాం.

(ఫేడౌట్ – ఫేడిన్)

**తల్లి :** ఏమండీ. యీయనెవరో డాక్టరు సుదర్శనం ఆట. అందరికీ కళ్ళు తెస్తున్నాడట – మన పాపాయిని కూడా తీసుకెళ్దామండి.

**భర్త :** పుట్టు గుడ్డికి కళ్ళు రావటమేంటే నీ పిచ్చిగాని.

**తల్లి :** అదేమిటండి, మన అదృష్టం ఏలాగుందో, నా మాట వినండి, పోదాం పదండి.

**భర్త :** సరే పద... ...

**ఆడగొంతు :** డాక్టర్ సుదర్శన్‌గారి ఇల్లు ఇదేనా అండి.

**సత్యం :** ఆఁ ఆఁ ఇదే ఇదే. మీరందరూ తొందర పడకండి. ప్రశాంతంగా కూర్చోండి – డాక్టరుగారు అందర్నీ చూస్తారు. నువ్వు పదమ్మా పద.

**డా॥ సుదర్శన్ :** ఆఁ రామ్మా రా...

**తల్లి :** డాక్టరుగారూ, ఒక్కగాని ఒక్క బిడ్డ .... లేకలేక పుట్టాడు. గొడ్రాలిగా వున్నా సంతోషించే దాన్ని, కాని ఈ పుట్టుగుడ్డి బిడ్డకు తల్లినయ్యాను. ఎట్టాగన్నా కాపాడండి డాక్టరుగారూ.

**డాక్ట :** ఎందుకమ్మా ఏడుస్తున్నావు. ఊరుకో . అసలు సంగతి చెప్పు. ఎప్పటి నుంచి ఇలా వున్నాడు?

**తల్లి :** పుట్టటమే గుడ్డివాడుగా పుట్టాడు బాబూ.

**డాక్ట :** ఊఁ అలాగా, ఏదీ అబ్బాయ్. ఇలా చూడు ఈ దీపం కన్పిస్తుందా నీకు?

**తల్లి :** చెప్పుబాబూ, కన్పిస్తుందా?

**పిల్లవాడు :** ఏమీ కనపడటంలేదమ్మా, అంతా చీకటిగా వుంది. డాక్టరుగారూ, మా అమ్మని చూడాలి. నాకు కళ్ళిప్పించండి.

**డాక్ట :** అలాగే బాబూ, అలాగే, మీరాగదిలో కూర్చోండి. సత్యం – నెక్స్ట్.

**సత్యం :** మీరెళ్ళండమ్మా.

**డాక్ట :** ఎవరికమ్మా

**భార్య :** వీరికేనండి.

**డాక్ట :** ఈయన నీకేమౌతాడు?

**భార్య :** నా భర్త.

**డాక్ట :** భర్తా?

**భర్త :** భర్తనుకాదు బాబూ. దాని పాలిటి నిర్భాగ్య దైవాన్ని.

**డాక్ట :** ఏవమ్మా, ఇలా వుండగానే పెళ్ళిచేసుకున్నావా నీవు?

**భర్త :** లేదు డాక్టరుగారూ, కళ్ళుండగానే పెళ్ళిచేసుకున్నా. పెళ్ళినాడే కళ్ళు పోయాయి. అందాల రాశిని పెళ్ళిచేసుకుంటున్నాననే ఆనందంతో బాణసంచా కాలుస్తున్నాను. మందు కంటికి తగిలి అంతా చీకటి అయిపోయింది. ఆ అందాన్ని చూసుకొనే అదృష్టమే లేకుండా పోయింది.

**డాక్ట :** ఏం పర్వాలేదు బాబూ. బాధపడకు. అసిస్టెంట్... ...

**సత్యం :** సార్.

**డాక్ట :** చూడు, ఆ కుర్రాడికి, యితనికి రేపు ఆపరేషన్ చేయబోతున్నాను. అంతా సిద్ధంచేయ్. చూడమ్మాయి. నీ భర్తకు రేపు ఆపరేషను చేస్తున్నాం. వారం రోజులు కట్టువిప్పకుండా వుండాలి. అంతవరకూ నువ్వు కంగారు పడకుండా అతన్నీ కంగారు పెట్టకుండా వుండు. ఆ తర్వాత నీ అదృష్టం.

**డాక్టర్ భార్య:** ఏమండీ. మీకు ఇరవై నాలుగ్గంటలూ ఆసుపత్రేనా, ఇంటికొచ్చేదంటూ ఏమైనా వుందా. మీకోసం చూసి చూసి కళ్ళు కాయలు కాచిపోతున్నాయి.

**డాక్ట :** కళ్ళు కాయలు కాచినా, పూలు పూచినా ఏం పర్వాలేదులే. ఇంత పెద్ద కళ్ళ డాక్టరు భార్యవు నీకేంటి. కలువరేకుల్లాంటి కళ్ళు తెప్పిస్తా.

**డా.భార్య :** అంటారేగాని, తీరా కర్మజాలక అలాంటిది వస్తే సొంతానికి తీరికుంటుందా?

**డాక్ట :** ఏం చేయమంటావు చెప్పు. వేలకొద్దీ జనం వస్తున్నారు. అందరికీ ఏదో ఆశ, నమ్మకం నా మీద – కాదంటే బాధపడతారు. నాలుగు రోజులు ముందు రెండు కేసులొచ్చాయి. వాళ్ళకి కళ్ళు తెప్పించటమనేది బ్రహ్మదేవుడి వల్లా సాధ్యంకాదు. భగవంతునిమీద భారంవేసి ఎక్స్‌పెరిమెంట్ చేశాను. ఇంత వరకూ ఏ డాక్టరూ తెగించి చేయనిపని చేశాను. పాపకు పాపవేసి కుట్టాను. ఇది గనక ఫలించిందా...

**డా.భార్య :** అయ్యగారు మాకింక అందుబాట్లో వుండరు. హిమాలయ శిఖరంమీద వుంటారు. ఔనా.

**డాక్ట :** ఏమో, రేపు కట్టు విప్పుతున్నాం. వాళ్ళ అదృష్టం ఎలావుందో.

❖ ❖ ❖

**పిల్లవాడి తల్లి :** బాబుకి కట్టిప్పుతున్నారేమో, ఒక్కసారి వెళ్ళి చూడనివ్వండి బాబూ.

**సత్యం :** వీల్లేదమ్మా, డాక్టరుగారికి నీడలావుండే మమ్మల్నే ఆ జాడలకు రానివ్వరు. నువ్వెలా వెళ్తావు?

**భార్య :** ఏమండీ, చూపు తప్పకుండా వస్తుందంటారా.

**సత్యం :** వస్తే అదృష్టం, రాకుంటే దురదృష్టం, మనమేం చేస్తాం అమ్మా.

**భర్త :** సరూ...

**కుర్రాడు :** అమ్మా....

**భర్త :** సరూ...

**భార్య :** ఏమండీ...

**కుర్రాడు :** అమ్మా...

**తల్లి :** బాబూ. బాబూ, కళ్ళొచ్చాయా, కనపడుతున్నాయా? నేను కనపడుతున్నానా బాబూ.

**కుర్రాడు :** బాగా కనపడుతున్నాయమ్మా. అమ్మా బాగా కనపడుతున్నాయమ్మా.

**భర్త :** సరూ, సరూ, ఎంత అందంగా వున్నావు. నిన్న విన్నాను. ఈనాడు కన్నాను.

**భార్య :** నేను చెప్పలా మీకు చూపొస్తుందని.

**భర్త :** ఔను సరూ, నీవాక్కు ఫలించింది.

**భార్య :** కాదు, నా పూజ ఫలించింది.

**సత్యం :** డాక్టరుగారు, డాక్టరుగారు వస్తున్నారు.

**అందరు :** డాక్టరుగారూ!

**డాక్ట :** ఆం ఏమిటమ్మా ఏమిటమ్మా యిదంతా మీ పిచ్చిగాని.

**తల్లి :** ప్రత్యక్ష దైవం మీరు... మీ కాళ్ళకి ఎంత మొక్కినా ఋణం తీరుతుందా?

**డాక్ట :** నాదేముందమ్మా? నా ధర్మం నేను చేశాను.

**భర్త :** డాక్టరు గారూ, మీకు ఆజన్మాంతం ఋణపడి వున్నాం. మీరు మా కాపురంలో దీపం వెలిగించారు.

**డాక్ట :** నిజమే నాయనా, ఇంత అందమైన భార్య వుండి చూడ్డానికి కళ్ళు లేకపోవడం దురదృష్టమే. కాని కళ్ళు వచ్చిన తర్వాత ఇంతకంటె అందాలు కనిపిస్తుంటాయి. వాటి వెంబడి పడి ఆవిడని అన్యాయం చేయకు.

**భార్య :** వారు అలాంటి వారు కారులెండి డాక్టరుగారూ.

**డాక్ట :** శుభం.

**సత్యం :** డాక్టరుగారూ–

**డాక్ట :** ఏం సత్యం?

**సత్యం :** పదేళ్ళుగా మీ దగ్గర పనిచేస్తున్నాను.

**డాక్ట :** అవును – అయితే.

**సత్యం :** మీరు ప్రపంచ విఖ్యాతి పొందారు. నేత్ర చికిత్సలో కొత్త కొత్త పరిశోధనలు చేశారు. విజయం పొందారు. వేలకు వేలు జనానికి చూపు యిప్పించారు. ప్రత్యక్ష దైవంగా ప్రజలు కొలుచుకుంటున్నారు. ఇంకా ఎందరో మీపై ఆశలు పెట్టుకొని ఉన్నారు.

**డాక్ట :** (నవ్వి) అయితే ఏమంటావ్. ఇదంతా నా అదృష్టమంటావా?

**సత్యం :** అదృష్టం అనను. అంత మూర్ఖుణ్ణి కాను. ఇది ఒక శాస్త్రం, విద్య, అదంతా అదృష్టం అనుకుంటే బాధలేదు. అలా అనుకోలేకనే బాధపడుతున్నాను.

**డాక్ట :** ఎందుకు సత్యం నీకు బాధ?

**సత్యం :** ఈ విద్య, ఈ ప్రతిభ ఇంతటితో పోవలసిందేనా?

**డాక్ట :** సత్యం ఏమిటీ నీవనేది?

**సత్యం :** మన్నించండి. వ్యక్తి శాశ్వతం గాదు. విద్యే శాశ్వతంగా వుంటుంది. ఉండాలి. ఈ విద్యంతా మీతోనే అంతరిస్తే ప్రపంచానికి ఎంత నష్టమో ఆలోచించండి. డాక్టరుగారూ – ఎన్నో ఏళ్ళుగా మిమ్మల్ని బ్రతిమాలాను. ప్రాధేయపడ్డాను – మీ పాదసేవ చేశాను. మీరు కాదన్నారు. కనీసం ఆపరేషన్ థియేటర్‌వైపు కన్నెత్తయినా చూడనివ్వలేదు. బయటే ఉంచారు. కానీ ఇంకా ఆశతోటే వున్నాను. ఎందుకోసం? నాకోసంకాదు – ప్రపంచం కోసం. ఈ విద్యంతా మీతోనే అంతరించకూడదు. పుట్టబోయే వాళ్ళకు గూడా దారి చూపించే వెలుగు ఉండాలి అనే ఆదర్శంకోసం – విద్యకోసం – డాక్టరు గారూ, మీకు తెలియంది కాదు. జీవితం క్షణభంగురం – ఏనాడేమౌతుందో!

**డాక్ట :** సత్యం, ఇదేనా నీవు నన్ను కోరేది?

**సత్యం :** నేను కోరడంలేదు డాక్టరుగారూ, మీరు వెయ్యేళ్ళు చల్లగా వర్ధిల్లాలని ప్రార్థిస్తా – కాని కాలగర్భంలో కలవని మహాత్ముడెవడున్నాడు?

**డాక్ట :** ఏమైనా సరే సత్యం, ఈ విద్య నేనింకొకరికి నేర్పటానికి వీలుపడదు. వీలు లేదు – అసలు నేర్పితే వచ్చేదా ఇది. స్వయం ప్రతిభ వుండాలిగాని.

**సత్యం :** డాక్టరుగారూ, ప్రతిభగలవాడ్నని మీరే నన్నెన్నోసార్లు మెచ్చుకున్నారు. నా ప్రార్థనలో ఏమాత్రం స్వార్థం లేదు డాక్టరుగారూ. ఈ విద్య మీతోనే అంతరించ నివ్వకండి.

**డాక్ట :** ఏం లాభంలేదు సత్యం.

**సత్యం :** అంతేనా,

**డాక్ట :** అంతే.

❖ ❖ ❖

**డా.భార్య :** ఏమండీ అలా వున్నారు?

**డాక్ట :** ఏమీలేదు. ఈ విద్యంతా నాతో అంతరించాల్సిందేనా అని బాధగా వుంది.

**డా.భార్య :** ఎందుకు అంతరించాలి?

**డాక్ట :** అంతరించకుండా ఏమౌతుంది. మన కడుపున ఓ కాయపుడితే వాడికి నేర్పుదామనుకున్నా, ఆ అదృష్టమే మనకు లేనట్టుంది.

**డా.భార్య :** చాల్లేండి. ఇలారండి చెప్తా – అబ్బ దగ్గరగా రండి. చెవిలో చెప్పాలి...

**డాక్ట :** ఆc చిన్న డాక్టరుని ఎత్తుకోబోతా.

❖ ❖ ❖

**డాక్ట :** సత్యం, సత్యం –

**సత్యం :** ఏమండి?

**డాక్ట :** జయపురం రాజావారికి రేపు ఆపరేషన్ చెయ్యాలి. వెంటనే మనం బయలు దేరి వెళ్ళాలి.

**సత్యం :** ఆపరేషన్ అక్కడేనా అండి –

**డాక్ట :** ఆc అక్కడే. రాజావారికి బంగళాలోనే అన్ని ఏర్పాట్లు చేశారు – పద. బండికి టైమైంది.–

**సత్యం :** చూడండి, డాక్టరుగారూ, నాకు గాకపోతే పోయింది. ఏ ఒక్కరికన్నా మీరీ విద్య నేర్పి వుంటే ఈ సమయంలో ఎంతో అండగా వుండేదిగదా –

**డాక్ట :** సత్యం, ఇంకెప్పుడూ ఆ మాట ఎత్తకు – ఈ విద్యను నేర్పటం వీలుకాని పని. బయల్దేరు – బండి టైమైంది.

**డాక్ట :** సత్యం, ఈ కిటికీ తెరువు, గాలాడడం లేదు –

**సత్యం :** వద్దండి – కిటికీ తెరిస్తే నిప్పురవ్వలు పడుతున్నాయి –

**డాక్ట :** ఏం పర్వాలా, తెరువు.

(కిటికీ తెరిచిన ధ్వని)

**సత్యం :** డాక్టరుగారూ, ఒక్క మనవి – అంతా కాకపోతే పోయింది; చిన్న కేసులన్నా చేయటానికి చాలిన విద్య చెప్పండి. అందరూ మీ పేరు చెప్పుకుంటారు.

**డాక్ట :** సత్యం, ఈ విద్య మా వంశంలో వారసత్వంగా రావాల్సిందే.

**సత్యం :** వారసత్వంగానా!

**డాక్ట :** ఆc, ఏం? నాకు బిడ్డలు లేరనేగా ... (నవ్వి) ఇంకో ఆర్నెల్లకి మాస్టర్ సుదర్శన్‌ను చూస్తావు. (నవ్వుతూ నవ్వుతూ మధ్య...కేవ్...మని కేక వేస్తాడు) అబ్బ?

**సత్యం :** ఏమిటండి, ఏమిటి?

**డాక్ట :** కంట్లో ఏదో పడ్డదోయ్ – మండిపోతున్నది. అబ్బ... ఏదీ ఆ బ్యాగ్ ఇలా తీసుకో – తీసుకోవోయ్–

**సత్యం :** ఇదిగోనండి డాక్టరుగారూ – ఇదిగో.

**డాక్ట :** ఆ నల్లసీసా...

**సత్యం :** చిన్నదాండీ –

**డాక్ట :** ఆఁ చిన్నదే... ఏదీ రెండు చుక్కలు వేయ్... రెండే రెండు చుక్కలు... ఆ.... ఆ....

**సత్యం :** ఏమండీ, ఎలా వుంది?

**డాక్ట :** (వెర్రికేక) సత్యం...

**సత్యం :** డాక్టరుగారూ,

**డాక్ట :** (గట్టి కంఠంతో) సత్యం – సత్యం – సత్యం.

**సత్యం :** ఏమండీ, ఏమండీ, ఏమైంది?

**డాక్ట :** భగవంతుడు బాగా శిక్షించాడోయ్ నన్ను – నా అహంభావానికి, అహంకారానికి సరైన శిక్ష విధించాడు. నన్ను గుడ్డివాణ్ణి చేశాడు.

**సత్యం :** డాక్టరుగారూ...

**డాక్ట :** విద్యంతా నా సొత్తని విర్రవీగాను. కళ్ళుండీ గుడ్డివాడిగా ప్రవర్తించాను... ఇప్పుడు నా విద్యంతా ఏం కావాలి? ఎవరికి ప్రయోజనం – ఎవరి సొత్తు. నాకే ప్రయోజనం లేదు. నా కళ్ళు నేను తెచ్చుకోలేను – నేను శాశ్వతంగా గుడ్డివాణ్ణి.

(ఫేడౌట్ – ఫేడిన్)

(ఇంట్లో)

**డా. భార్య :** (ఏడ్చి) ఏమండీ – ఏమండీ – ఇంతేనా, మీరిలా కళ్ళు లేకుండా వుండి పోవాల్సిందేనా? లక్షల జనానికి చూపిచ్చారే, మీకే చూపు లేకుండా చేశాడా భగవంతుడు?

**జనం :** డాక్టరుగారూ, డాక్టరుగారూ... ....

**తల్లి :** డాక్టరుగారూ ఎంత అన్యాయం జరిగిందండి... ... భగవంతుడు ఎంత ఓర్వలేకపోయాడు. మీరు మా కష్టాలు తీర్చారుగాని, మీకు మేం ఏం చేయగలం డాక్టరుగారూ, ఏం చేయగలం?

**భర్త :** డాక్టరు గారూ, చీకట్లో వున్న జీవితాలకు వెలుగు చూపించారు ఆనాడు. కాని యీనాడు మీకే అంతా చీకటైపోయింది. డాక్టరుగారూ యివిగో, ఇవి మీరిచ్చిన కళ్ళు, మీకు మళ్ళా కళ్ళు రాగల్గితే వీటిని తీసుకోండి. ఆనందంగా యిచ్చేస్తాం తీసుకోండి. మీకు కళ్ళొస్తే ప్రపంచానికంతా కళ్ళొస్తాయి. తీసుకోండి డాక్టరుగారూ.

**డాక్ట :** బాబూ, ఎవ్వరు బాధపడీ ఏం లాభం లేదు. ఇది నా స్వయంకృతం. విద్యను దాచాను. ఇతరుల కివ్వటానికి నిరాకరించాను. ఫలితం అనుభవిస్తున్నాను. ఎన్నో సంవత్సరాలుగా ప్రాధేయపడుతున్నాడు సత్యం విద్య నేర్పమని. నేర్పి వుంటే ఇప్పుడు నా కీ అవస్థ ఉండేది కాదు సత్యం – సత్యం...

**సత్యం :** డాక్టరుగారూ!

**డాక్ట :** క్షమించు నాయనా – నా అజ్ఞానాన్ని క్షమించు. విజ్ఞానాన్ని గుత్తకు తీసుకోవాలనుకున్న ఈ అవివేకిని మన్నించు.

**సత్యం :** అలా అనకండి డాక్టరుగారు. మీకేం భయం లేదు నేనున్నాను, మీకు ఆపరేషన్ చేస్తాను.

**డాక్ట :** నువ్వా?

**సత్యం :** ఔను, డాక్టరుగారూ. భయపడకండి. భగవంతుడున్నాడు; మీ ఆశీర్వాద ముంటే చాలు ప్రయత్నిస్తాను. అనుమతించండి –

**డాక్ట :** సరే నాయనా.

❖ ❖ ❖

**డా.భార్య :** బాబూ సత్యం. ఈ రోజు కట్లు విప్పుతావా?

**సత్యం :** అవునమ్మా! ఆశీర్వదించండి?

**డా.భార్య :** శుభం నాయనా.

❖ ❖ ❖

**సత్యం :** ఆఁ డాక్టరుగారూ! ఏదీ, కళ్ళు తెరవండి – ఆఁ, తెరవండి ఫర్వాలేదు –

**డాక్ట :** సత్యం – సత్యం.

**సత్యం :** కన్పిస్తుందా డాక్టరుగారూ?

**డాక్ట :** సత్యం, సత్యం – నాయనా, నా పేరు నిలబెట్టావు. ప్రపంచాని కంతా చూపిచ్చిన డాక్టరుకు కళ్ళిచ్చిన గౌరవం నీకు దక్కింది. చెప్పు నాయనా, ఎలా నేర్చుకున్నావు యిదంతా?

**సత్యం :** డాక్టరుగారూ మన్నిస్తానంటే చెపుతాను.

**డాక్ట :** చెప్పు బాబూ, ఇంక నిన్ను నేను మన్నించట మేమిటి?

**సత్యం :** మీరు వ్రాసుకున్న నోట్సంతా దొంగతనంగా చదివాను. ఆపరేషన్ థియేటర్‌లోకి రావద్దంటే, అవతల నిలబడి కంత చేసుకొని అంతా చూచి నేర్చుకున్నాను. ఒక్కొక్కసారి నర్స్ డ్రెస్ వేసుకొని మీ పక్కనే నిలబడి మిమ్మల్నే మోసం చేశాను. వీటన్నిటికి క్షమించండి డాక్టరుగారూ –

**డాక్ట :** నాయనా సత్యం... నువ్వు ధన్యుడివి. నీబోటి ప్రజాసేవకులవద్ద విద్య సార్థకమౌతుంది. నీవు నాకు ఈ కళ్ళే కాదు నాయనా, మనోనేత్రాల్ని గూడా తెరిచావు.

## అభ్యాసం

### I. ప్రశ్నలు

1. 'తెరచిన కళ్ళు' నాటికలో డాక్టరు కళ్ళను సత్యం తెరపించిన విధానం వివరించండి.
2. 'తెరచిన కళ్ళు' నాటికలో డాక్టరు పాత్ర స్వభావాన్ని తెలియచేయండి.

# 3 ఆశ ఖరీదు అణా



**- గోరా శాస్త్రి**

## రచయిత పరిచయం

**తె**లుగు పత్రికా రచయితల్లో ప్రముఖులు గోరాశాస్త్రి. అంతేకాదు, శ్రవ్యనాటికా కర్తల్లో విశిష్టులు కూడా. గోరాశాస్త్రిగా ప్రసిద్ధులైన వీరి పూర్తి పేరు గోవిందుని రామశాస్త్రి. ఒరిస్సాలోని గంజాం జిల్లా, గుణుపురం వీరి స్వగ్రామం. 03.10.1919 తేదీన గోరాశాస్త్రి జన్మించారు. సుందరి, నరసింహం వీరి తల్లిదండ్రులు.

ఆంగ్ల స్వతంత్ర పత్రికలో ఉప సంపాదకులుగా గోరాశాస్త్రి ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. అనతి కాలంలోనే 'తెలుగు స్వతంత్ర' పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు చేపట్టారు. తరువాత కాలంలో ఆంధ్రభూమి, డక్కన్ క్రానికల్ పత్రికలకు కూడా సంపాదకులుగా వ్యవహరించారు.

పత్రికా రచయితగా ప్రాచుర్యం పొందక ముందే గోరాశాస్త్రి శ్రవ్యనాటిక కర్తగా గుర్తింపు పొందారు. నూరుకుపైగా నాటికలు రచించారు. ప్రముఖ నాటికల సంకలనాలన్నింటిలోనూ గోరాశాస్త్రి నాటిక ఏదో ఒకటి ఉంటుంది. వివిధ పోటీలలో గోరాశాస్త్రి నాటకాలు, నాటికలు కొన్ని ఉత్తమ రచనలుగా బహుమతులు పొందాయి. సగటు మనిషి నిత్యజీవితంలోని వివిధ పార్శ్వాలను సున్నితంగా, శాస్త్రీయంగా వ్యాఖ్యానించడం గోరాశాస్త్రి నాటికల ప్రత్యేకత. బాగా ప్రాచుర్యం పొందిన వీరి నాటికల్లో ఆనంద నిలయం, సెలవుల్లో దూరతీరాలు, ఆశఖరీదు అణా.. వంటివి పేర్కోదగినవి.

గోరాశాస్త్రి నాటికలు కొన్ని 'ఆశఖరీదు అణా', 'గోరాశాస్త్రి నాటికలు' అనే రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. ప్రస్తుత పాఠ్యభాగం ఆశ ఖరీదు అణా సంపుటం లోనిది. 'ప్రసిద్ధ తెలుగు నాటికలు' సంపుటం లోనూ ఇది చోటు చేసుకుంది. ఈ సంపాదకులు ఈ నాటిక గురించి ఇలా వివరించారు.

"కష్టాలు, కన్నీళ్లు, సమస్యలతో నిత్యం సతమతమయ్యే మధ్యతరగతి బడుగు జీవులకు జీవితం వడ్డించిన విస్తరి కాదు. అందరూ దగా పడ్డ తమ్ముళ్ళూ, చెల్లెళ్ళే! బతకడం అంటే భయపడే వాళ్ళే. చాలీ చాలని ఆదాయంతో బతుకుల్ని కనాకష్టంగా ఈడ్చుకొస్తున్నవాళ్ళే. అంత మాత్రాన జీవితాన్ని అసహ్యించుకుంటూ, చావే తగిన పరిష్కారమనుకుంటామా? నిరాశతో క్రుంగిపోతున్న వాళ్ళకు జీవితం పట్ల ఇంత ఆశనూ, ధైర్యాన్నీ అందించటంతో

పాటు జీవితోత్సాహాన్ని చిగురింప చేసేది ఈ నాటిక. ఆకాశవాణి ప్రసారం చేసిన అత్యుత్తమమైన శ్రవ్య నాటికలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది". 1982 మే డే నాడు మరణించేంత వరకూ గోరా శాస్త్రి తెలుగు సాహిత్య రంగానికి సేవ చేస్తూనే ఉన్నారు.

చిన్న చిన్న విషయాలకే భావావేశాలకూ, బలహీనతలకూ లొంగిపోతూ; అనుచితమైన నిర్ణయాలు తీసుకుంటున్న ఈ నాటి విద్యార్థి లోకానికి జీవితం పట్ల ఆశనూ, భరోసానూ కల్పించడం ఈ పాఠ్యభాగం ఉద్దేశం.

### పాత్రలు

| | | |
|---|---|---|
| యువకుడు | – | నిరుద్యోగి, ఒంటరి |
| తాత | – | పదవీ విరమణ చెందిన ఉద్యోగి |
| ఇందిర, ఆనందలక్ష్మి | – | అక్కాచెల్లెళ్లు |
| కృష్ణమూర్తి | – | బ్యాంకు ఉద్యోగి |
| కృష్ణవేణి (ఉద్యోగిని) | – | ఇందిర, ఆనందలక్ష్మిల స్నేహితురాలు |

కృష్ణవేణి అన్న; ఇందిర, ఆనందలక్ష్మిల అన్న

## పాఠ్యభాగం

(మహానగరంలో ఒక గల్లీలో జనసమ్మర్దం ఎక్కువగా ఉన్నట్లు సూచించే ధ్వనులు. మోటార్లు, గుర్రం బళ్ళు, సైకిళ్ళు, రకరకాల వాహనాల ధ్వనులు. ఇంకొంచెం దూరంలో – గాలిలో తేలివస్తున్నట్లు చర్చి గంటలూ, దేవాలయం గంటలూ వినిపిస్తాయి. ఇవన్నీ కలిసి ఏదో అవ్యక్తమైన బెంగా, భయమూ సూచిస్తాయి.)

**ఒక యువకుడి కంఠం:–**

హాయిగా ఉంది యీ సాయంత్రం. రాత్రి పడినకొద్దీ యింకా హాయిగా ఉంటుంది. దీపాలు వెలుగుతాయి; పాపాయిలు నిద్రపోతారు; వాళ్ళ తల్లులు కిటికీలదగ్గర నిలిచి, వాళ్ళ తండ్రుల కోసం ఎదురు చూస్తారు – అంతా హాయిగా ఉంటుంది. ఈ మంచి మహానగరంలో ఈ వీథి మరీ మంచిది. నా కెలా తెలుసునంటారా, నిన్నటినించీ యీ వీథిలోనేగా ఉంటూంట! ఇదే మా మేడ! చివరి అంతస్తుమీది చివరిగది నాదే! మొత్తం మేడలో యిరవై రెండు కుటుంబాలు కాపురం ఉన్నారు – నన్ను మినహాయిస్తే! అదిగో – ఆ మెట్లదగ్గర కాపరం ఉన్నారే – ఆ తాతగారు ఉద్యోగంచేసి పింఛనీ పుచ్చుకున్నారు. నిన్న సాయంత్రమే ఆయనతో కొంచెం బాతాఖానీ వేశాను. ఆయన అన్నారూ–

**తాత** : ఏమంటావు నాయనా – నే చేసింది ఏం ఉద్యోగమంటావా? ఏదయితేనేం – సర్కారు నౌఖరీ చేశాను; ముప్పయిమూడు సంవత్సరాలు చేశాను. తొమ్మండుగురు పిల్లల్ని కన్నాను. ఇప్పుడు పింఛనీ యిచ్చేశారు.

**యువ** : మంచిదే గదా తాతగారూ! హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు!

**తాత** : ఆ విశ్రాంతే దొరకడం లేదు అబ్బాయ్! ఇంకా నలుగురు కూతుళ్లకి పెళ్ళి అవాలి. పెళ్లయిన యిద్దరు కొడుకులకి ఉద్యోగాల్లేవు – మిగిలినవాళ్ల చదువులకి డబ్బు లేదు. ఇంకెక్కడి విశ్రాంతి నాయనా? అంచేత ఏం తోచక అప్పుడప్పుడు పాటలు పాడుకుంటాను... పాటలంటే నీకిష్టమేనా అబ్బాయ్?

**యువ** : అందమయిన ఆడవాళ్లు పాడితే చాలాయిష్టంగా వింటానండి.

**తాత** : బుద్ధి మంతుడివి నాయనా! మీ యింటావిడ అందగత్తేనా?

**యువ** : తప్పకుండా అందగత్తే అయుండాలి మరి – ఎంచేతంటే నాకింకా పెళ్ళి కాలేదు...మంచిది తాతగారూ, మళ్ళీ కలుసుకుందాం. అదిగో, ఎక్కడో రేడియోలోంచి మంచి సంగీతం వినబడుతూంది. వస్తానండి!

**తాత** : మంచిది నాయనా! వెళ్ళి రా!

(క్షణమాత్రం శ్రావ్యంగా జంత్ర సమ్మేళనం వినబడుతుంది.)

**యువ** : విన్నారా, అదీ సంగతి, తాతగారితో అట్టేసేపు మాటాడలేంగాని, ఆయన్ని తలచుకుంటే సంతోషంగా ఉంటుంది. ఆయనా, భార్యా, తొమ్మండుగురు సంతానం – అందరూ హాయిగా రెండుగదుల్లో కాలక్షేపం చెయ్యడం, ఒకళ్ళ నొకళ్ళు ఆప్యాయంగా సావిత్రీ, మీనాక్షీ, సుబ్బయ్యా, గోపాలం, కృష్ణవేణీ, పెద్దన్నయ్యా – యిలా పిలుచుకోవడం అంతా బాగాలేదూ? కృష్ణవేణి అంటే జ్ఞాపకం వస్తోంది – మా మేడలోనే పెరటిభాగం గదిలో ఓ అమ్మాయి కాపరం ఉంది. తల్లీ, అన్నయ్యా – లేక తమ్ముడో మరి! – ఉన్నట్టున్నారు. ఎక్కడో ఉద్యోగం చేస్తోంది. పేరు కృష్ణవేణి కాదుగాని – అయితే బాగుండును! అంత చక్కటి తలకట్టు – మోకాళ్ళదాకా వేలాడే జడ! అదిగో – ఆ అమ్మాయే కాబోలు – వస్తోంది!

('హలో! హలో! హలో!' అనుకుంటూ అమ్మాయి దూరంనుంచి దగ్గిరగా వస్తుంది)

**యువ** : ఏమంటావు

**అమ్మా** : హలో! మీరేనా మేడగదిలోకి కొత్తగా వచ్చింది?

**యువ** : అవునండి, నిన్న సాయంత్రమే దిగాను.

**అమ్మా** : మరేట. మా ఇందిర చెప్పింది. రాత్రల్లా గది గోడలకి మేకులు కొడుతూనే ఉన్నారు. ఆ చప్పుడుతో రాత్రల్లా తనకి నిద్రపట్టలేదు. కాని కొంచెం జాగ్రత్తగా ఉండండి. గోడలకి మేకులు కొడితే ఇంటాయన ఊరుకోడు.

**యువ** : ఏం?

**అమ్మా** : (నవ్వుతూ) ఏ వేంవిటి? బంగారు గోడలు చెడిపోవూ? మీరు గోడకి కొట్టే ప్రతి మేకూ తన వీపుమీద కొట్టినట్టే అతను బాధపడతాడు. అబ్బా! బాగా చీకటయి పోయిందే – మబ్బులు కూడా ముంచుకొస్తున్నాయి. మార్గశిరమాసపు గాలీ; యీదర గాలీ – బాగుంది గదూ! ఇలాంటప్పుడు నడిచి వెళ్ళి, హాయిగా రెండో ఆట సినిమా చూసి, తిరిగి ఇంటికి నడిచి రావాలనిపిస్తుంది.

**యువ** : సినిమాలో మనం విన్న ఆఖరిపాట లోపల లోపల పాడుకుంటూ – ఏం?

**అమ్మా** : సరిగ్గా నేననుకుంటున్నదే చెప్పారు. మీకు పాటలంటే యిష్టమేనా?

**యువ** : పాడేవాళ్లు బాగుంటే పాటా బాగుంటుంది.

**అమ్మా** : (నవ్వుతూ) అయితే మా ఇందిరపాట ఎప్పుడేనా వినిపిస్తానుండండి... సరే! వస్తానండీ! అమ్మయ్యో ఏవిఁటా బాజాలు?

(చావుబాజాలు దూరం నుండి దగ్గిరగా వస్తాయి)

**యువ** : ఎవరో మహారాజు కైలాసానికి వెళ్ళిపోతున్నాడు...

**అమ్మా** : నేనింట్లోకి పోతాను బాబూ! అలాంటివంటే నాకు భయం!

(బాజాలు తీవ్రంగా వినిపిస్తాయి. బాజాలు అలా అలా దూరం అయిపోయి, మళ్లీ గల్లీలో వాహనాల చప్పుళ్లూ, జననమ్మర్దం అవీ వినబడతాయి.)

**యువ** : వెళ్లిపోయింది అమ్మాయి. పేరు అడుగుదామనుకున్నాను. భయంవేసింది. ఎందుకో! మన భయాలన్నీ యిలాగే ఉంటాయి. ముక్కూ మొహం ఎరగని నాతో నిర్భయంగా జంకూ గొంకూ లేకుండా మాటాడింది. బాజా విని హడలిపోయి తుర్రుమని లోపలికి పారిపోయింది. కొందరికి చావంటే భయం. కొందరికి బతుకంటే భయం... ఎక్కడికో యీ మనుషులంతా? ఎన్ని కార్లు! ఎన్ని కార్లు! వాటిల్లో అందమైన ఆడవాళ్ళు, ఖరీదైన మగాళ్లూ – ఎవళ్ళో వాళ్ళంతా? ఎక్కడికి వెడుతున్నారు. అంత హడావిడిగా? రంగు రంగుల పానీయాల మెత్తందనాల్లోకి – తాంబూలాల సువాసనల్లోకి – అగరుధూపాల అరమోడ్పు కన్నుల అవతలి గట్టులకి.

(సైకిల్ బెల్ చప్పుడు)

**ఒక పడుచువాడు** : హలో! కొంచెం దారి యిస్తారా? సైకిల్ గుమ్మంగట్టు దాటించి లోపలికి తీసుకుపోతాను. లోపలి వాటాలో ఉంటున్నాం లెండి!

యువ : తప్పకుండా.

పడుచు : థాంక్స్... మీరేనా మేడగదిలోకి కొత్తగా వచ్చింది?... పొద్దున్న యథాలాపంగా చూశాను. మీరే అనుకున్నాను. కుటుంబంతోనే వచ్చారా?

యువ : లేదండి, ఇంకా పెళ్ళి కాలేదు.

పడుచు : ఓహో... వస్తానండీ, మావాళ్ళు కనిపెట్టుకుంటారు. కనిపిస్తూనే ఉంటాలెండి, నేను బాంకులో పని చేస్తున్నాను, మీ ఎకౌంటు ఏ బాంకిలో ఉంది?

యువ : నా ఎకౌంటండీ – నా జేబులోనే ఉంటుందండి. పైగా అది ఖాళీగా ఉండే సమయాలే ఎక్కువ.

పడుచు : బాగా చెప్పారు!

(కాస్త దూరంనుంచి 'లోపలికి రావేంరా నాయనా' అని ఒక ప్రౌఢస్త్రీ కంఠం).

పడుచు : వస్తానండీ! మా అమ్మ పిలుస్తోంది. మా ఆవిడ కూడా కనిపెట్టుకుంటుందీ...

(దూరం నుండి రేడియోలో జంత్ర సమ్మేళనం సన్నగా వినబడుతుంది)

పడుచు : మా పైవాటాలోవాళ్లు లెండి... కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చెయ్యరుగాని, యిరవై నాలుగ్గంటలూ గ్రామఫోను పెట్టుక్కూర్చుంటారు... ఇందిరా, ఆనందలక్ష్మీ... ఆహా... పేరు గొప్పా ఊరు దిబ్బా అన్నారు.

(జంత్ర సమ్మేళనం తీవ్రంగా వినబడుతుంది.)

యువ : ఇందిరా, ఆనందలక్ష్మీ! ఎంత మంచిపేర్లు! ఎందుకో మరి యీ సైకిల్ యోధుడికి నచ్చలేదు. పెళ్ళిగాని అమ్మాయిలూ, బ్యాంక్ ఎకౌంట్ లేని నాలాంటి వాళ్లూ అతనికి నచ్చరు. అలా నచ్చనివన్నీ ఏరి పారేయగా అతనికి మిగిలింది చాలా చిన్నలోకం అయుండాలి. తనూ, తన కుటుంబం, ఉద్యోగం, ఇంక్రిమెంటూ, తమ్ముడి ఉద్యోగం, చెల్లెలి పెళ్ళీ – అంత చిన్న లోకాన్ని పదిలంగా రూపాయి కాగితంలో పొట్లం గట్టి మర్యాదగా బ్యాంకులో డిపాజిట్ చేసేసి ఉంటాడు... ఇందిరా – ఆనందలక్ష్మీ! వాళ్ళ గురించి కొంచెం తెలిస్తే బాగుండును! నేను గోడలకి మేకులు కొడితే ఆ ఇందిరకి నిద్రాభంగం! ఇప్పుడేం చేస్తున్నారో వాళ్ళు!

* * * *

లక్ష్మి : ఇందిరా! ఇందిరా!

ఇంది : (ప్రవేశిస్తూ) ఏం లక్ష్మీ!

లక్ష్మి : అన్నయ్యింకా రాలేదేమే? ఇంత రాత్రయింది! నా కెందుకో భయం వేస్తోంది.

ఇంది : వస్తాడు. జేబులో కాణీ కూడా లేదాయె. ఎక్కణ్ణించి నడుచుకుంటూ రావాలో!

లక్ష్మి : అమ్మకి కాస్త కునుకుపట్టినట్టుంది. నువ్వెళ్ళి భోజనం చెయ్యరాదూ? వెళ్లు. నేను కూర్చుంటాను అమ్మ దగ్గిర... తరవాత మళ్ళీ బార్లీ నీళ్ళూ అవీ కలపాలా!

**ఇంది** : నాకేవిఁటో ఆకలిగాలేదు లక్ష్మీ! అక్కడ నాన్నకి జెయిల్లో గంజి నీళ్ళూ – ఇక్కడ అమ్మకి జబ్బు. మంచం మీద బార్లీ నీళ్ళూ.

**లక్ష్మి** : ఆపేశావేం? అన్నయ్యకి ఉద్యోగం లేదు, మనకి పెళ్లిలేదు – లిస్టు చాలా ఉంది.

**ఇంది** : అదికాదు లక్ష్మీ, తలుచుకుంటే నవ్వాలో ఏడవాలో తెలియడం లేదు. ఉన్న ధైర్యం ఏవిఁటంటే, ఇంతకన్న అట్టడుక్కి వెళ్లడానికి యింకేం వుందని!

**లక్ష్మి** : అలా అనకు, దిగిన కొద్దీ సముద్రం లోతు, ఎక్కినకొద్దీ ఆకసం ఎత్తూ – అలా ఉంటూనే ఉంటాయి. వెళ్ళి భోంచేసి రావూ?

**ఇంది** : ఏం భోజనమే! ఆకల్లేదు. అలా పడుకోవాలని ఉంది. మెలుకువకంటె నిద్రనయం. మంచి కలలైనా వస్తాయి.

**లక్ష్మి** : ఏమిటి హామీ? తీరాచేసి పీడకలలు వస్తే?

**ఇంది** : చంపేశావు! మేలుకుంటే నీడ, నిద్రపోతే పీడ! ఏం దారి మరి?

**లక్ష్మి** : రెండింటికీ మధ్య ఏదో మగతగా బతికేస్తే సరి!

**ఇంది** : అంతేనంటావ్! సరేలే... ఇప్పుడు చేస్తున్నదీ అంతే... హాయిగా ఎవరైనా పాడితే బాగుండును! ఏదైనా ఒక పాట – మైమరపించేది, హాయనిపించేది...

**లక్ష్మి** : పాడిన కాస్సేపూ బాగుంటుంది. ఆ తరవాత?

**ఇంది** : కాస్సేపు బాగున్నా చాలు... పోనీలే... నాన్న యీ నిముషాన జైల్లో ఏం చేస్తున్నాడో?

**లక్ష్మి** : నిద్రపోవడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు.

* * * *

**యువ** : నిద్ర రావటం లేదు ఎంత ప్రయత్నించినా! ఎంచేతో తెలియదు! నిజంగా తెలీదా? పొద్దున్నించీ కడుపు మాడి పోతుంటే నిద్ర ఎలావస్తుంది? ఉంగరం అమ్మేస్తే వచ్చిన డబ్బు గదిఅద్దె ఎడ్వాన్సుకే చాలలేదు. మిగిలింది నేనూ, నా బొమ్మలూ! వాటి నెవడూ కొనడు. పిచ్చి బొమ్మలు. గోడమేకులకి అలా వేలాడ వలసిందే! ఎటొచ్చీ మేకులు కొడితే ఇందిర నిద్ర పోయింది. బొమ్మలు చూస్తే కృష్ణవేణి హడలి పోతుందనుకుంటాను. వియోగం, దుఃఖం, గులాబీతోటలో కాలసర్పం – ఇలాంటి బొమ్మలే ఎందుకు వేస్తాను చెప్మా?... ఎలాగైనా కృష్ణవేణికి ఆ బొమ్మలు చూపించాలి. మళ్ళీ కృష్ణవేణి అంటున్నాను! – ఆ అమ్మాయి పేరేమిటో?...

* * * *

**కృష్ణ** : ఆ అబ్బాయి పేరేమిటో? – ఏవిఁరా అన్నయ్యా – ఆయన పేరేవిఁటి?

**అన్న** : ఎవరి పేరే?

**కృష్ణ** : అదేరా – పై మేడ చివరి గదిలో కొత్తగా దిగాడే...

**అన్న** : ఎవడో సుబ్బారాయుడు! మనకెందుకొచ్చిన గొడవ, పడుకుందూ – అర్ధరాత్రి కావస్తోందీ

**కృష్ణ** : (నవ్వుతూ) భలేవాడివిరా, సాయంత్రం ఎనిమిదింటికే చీకటంటావేవింట్రా ఖర్మ! కాస్సేపు కూర్చుని ఏవేనా కబుర్లు చెప్పరాదూ! అమ్మకప్పుడే మూడో ఝామునిద్ర.

**అన్న** : చెప్పడానికి నాకేం కబుర్లుంటాయి – బెంగెట్టుకు ఛస్తుంటేను! ఎందుకూ పనికిరాని చవటవాజెమ్మని... కాణీ ఆర్జించలేనివాణ్ణి!

**కృష్ణ** : పోనీలేరా... ఆ గొడవంతాదేనికిప్పుడూ... ఎవరార్జిస్తేనేం? ఏదో యిలా బతుకొస్తున్నాం. సంతోషించకూడదూ?

**అన్న** : నీకేం చెపుతావు...నీ మట్టుకు నీకేదో గొప్పగా ఉన్నట్టుంది కాని... నీ చేత ఉద్యోగం చేయించవలసిన ఖర్మ పట్టిందంటే – అమ్మకి ఎంత రంపపుకోత – నాకెంత అవమానం –

**కృష్ణ** : మొదలెట్టావా పురాణం! ఈ నాలుగు ఘడియలైనా నన్ను కాస్త తృప్తిగా ఊపిరి పీల్చుకోనియ్యవ్. తెల్లారగట్ల లేచి వంట పని. పగలల్లా ఆఫీసులో బండ చాకిరీ. ఇంటి కొచ్చాక మళ్ళీ వంట.

**అన్న** : ఆ తరవాత తీరిగ్గా కూర్చుని అల్లా అబ్బాయి పేరేమిటీ, ఇల్లీ అబ్బాయి పేరేమిటీ అని ఆలోచన్లు, దేవుడి ధర్మమా అని నాకు ఉద్యోగమే దొరికితే–

**కృష్ణ** : తక్షణం నన్ను ఉద్యోగం మానిపించి యింట్లో కూచోబెడతావు. అంతేనా? అక్కడికి కాని నీకు మనశ్శాంతి ఉండదు. ఏం మనుషులంరా మనం? సగం చచ్చిన మనుషుల్ని గాని ప్రేమించలేం; నా బ్రతుకులో ఏ మారుమూలైనా కాస్త సంతృప్తి మిగిలిపోతే, దాన్ని విసిరి అవతల పారేసేదాకా నీకు తోచదు. నన్ను నువ్వు ఇంతగా అభిమానించకపోయినా బాగుండును! కాస్తయినా సుఖపడేదాన్ని!

* * * *

**యువ** : అప్పుడే సందడి తగ్గిపోతూంది. మేడలో దీపాలు ఒక్కొక్కటే ఆరిపోతున్నాయి. పాపాయిలు నిద్రపోయారు; వాళ్ళ తల్లులూ నిద్రపోయారు హాయిగా... ఒంటరితనం ఎంత భయంకరం! చేతిలో కాణీ లేదు. అయినా రేపు ఎలా గడుస్తుందన్న భయం లేదు. తిండి లేకపోయినా అంత బాధ లేదు. ఎంత ఆకలి రాత్రయినా తెల్లారక తీరదు. అలాగే శాశ్వతంగా కన్నుమూస్తే, మరి చింతే లేదు. కాని యీ ఒంటరితనం! ప్రపంచంలో 'నా' అన్నవాడు ఒక్కరు – ఒక్క ప్రాణి – లేకపోతే ఏం దారి? ఏవింటో భాగారంలో శేషంలా నేనొక్కణ్ణీ యిలా మిగిలి పోయాను! – తిండికోసం వెతుక్కుంటూ... పింఛను తాతగారల్లే ఉందే? ముసలాయనకి నిద్రపట్టడం లేదు కాబోలు!

**తాత** : ఏం నాయనా! ఇంకా నిద్రపోలేదూ!!! మేడముందు పచార్లు చేస్తున్నావ్!

**యువ** : లేదు తాతగారూ! ఏవిటో నిద్రపోవాలనిపించడం లేదు! రోడ్డుమీది వింతల్ని చూస్తూ – పిచ్చిగా ఆలోచిస్తూ –

తాత : నిద్రపో నాయనా! నిద్రపో! మేలుకుంటే ఏవుందీ – బెంగలూ భయాలూ తప్ప!

యువ : మరి మీరు నిద్రపోలేదే తాతగారూ?

తాత : నిద్ర! నాకు ఏకంగా ఒక్కసారే నిద్ర! పెద్దకోడలు ప్రసవ వేదనలో ఉంది. చిన్న కోడలికి జ్వరం! ఆ తీవ్రంలో ఒకటే పలవరింతలు! చేతిలో కాణీ లేదు. అవునా! ఇలాంటప్పుడు నా కెందుకో నవ్వొస్తుంది! నేన్నవ్వితే మా ధర్మపత్నికి కోపం. మనందరం అసలు ఎందుకు పుట్టామా అన్న ప్రశ్న యిప్పుడు తేల్చమంటుంది – యీ అర్ధరాత్రి! ఎలాగుందంటావ్?

యువ : దివ్యంగా ఉంది! పోనీ కాస్సేపు యిక్కడ కూర్చొని కబుర్లు చెప్పుకుందాం.

తాత : అలా అన్నావు బాగుంది. ఉండు, ఓ చుట్ట వెలిగించి నీకు నా అనుభవాలన్నీ చెపుతాను. చూడూ, మీ అమ్మా, నాన్నా ఏవూళ్లో ఉన్నారు నాయనా?

యువ : స్వర్గంలో!

తాత : మంచిది, ఎక్కడో అక్కడ ఉండడం కావలసింది... సరే, యిల్లాలు లేదని నిన్ననే చెప్పావు. పోనీ ఏదైనా ఉద్యోగం చేసుకుంటున్నావా?

యువ : అదీ లేదండి! ఇచ్చే దాతెవ్వడూ కనబడ్డం లేదు.

తాత : ఇంకేం! సుఖపడ్డావ్. వీలయిన కాడికి ఉద్యోగాలు చెయ్యకండా బతకడానికి ప్రయత్నించు. ఇదంతా ఉత్తమాయ నాయనా! నేను చేసి చూశాను – ముప్పయి మూడు సంవత్సరాలు – చివరికి ఏం మిగిలింది?

యువ : ఏం మిగిలిందండి?

తాత : చెప్పానుగా! శరీరంలో రకరకాల జబ్బులూ, తొమ్మండుగురు పిల్లలూ, వాళ్లకి నామీదుండే వొల్లమాలిన అభిమానం. ఇదీ నా ఆర్జన!

యువ : జరిగిందానికంతకీ యిప్పుడు విచారిస్తే ఏం లాభం చెప్పండీ!

తాత : ఛాఛా! ఎంతమాటన్నావు! విచారమా! అది నా జన్మలో లేదు. జరిగింది చెప్పానంతే. లాటరీ వేశాం. ఓడిపోయాం! ఇంకోరకం లాటరీ ఉందేమో ప్రయత్నించి చూడమంటున్నాను.

యువ : కనీసం ఇదంతా లాటరీ అని మీ నమ్మకం?

తాత : అది నా అనుభవం, సిద్ధాంతం కాదు. చూడబ్బాయ్! నా తత్వానికి సరిపడని విషయాలు నాచేత పేలిస్తున్నావు. మామూలు విషయాలేమైనా చెప్పు... భోజనం అయిందా?

యువ : ఎప్పుడో అయిందండి. మళ్లీ ఎప్పుడో తెలీదు.

తాత : చాలా విషయాలు అలా తెలియకుండా వుంటేనే మంచిది. ప్రతిదీ తెలిసిపోతే ఆరోగ్యం బాగుండదు... ఎవరదీ ఆ చీకట్లో? (గట్టిగా) ఎవరక్కడా?

కృ.మూ. : (సమీపిస్తూ) నేనండీ – కృష్ణమూర్తిని – ఎరగరూ – బాంకులోపని.

యువ : ఓహో – ఇందాకా సైకిల్ తీసుకెళ్లారు మీరేనా?

కృ.మూ. : మరేనండి! కొత్తసైకిలు - కొని యింకా నెలకాలేదు... అది సరేకానండి, యిప్పుడెక్కడేనా దుకాణాలుంటాయా, దుకాణాలు?

తాత : ఎందుకు నాయనా ఆ కంగారూ? ఏఁవొచ్చింది? ఏం దుకాణం కావాలి?

కృ.మూ. : మా ఆవిడండి, ఇందాకా భోంచేసేవరకూ హాయిగానే ఉంది. ఉన్నట్టుండి వచ్చేశాయండి బాబూ! చంపేస్తోంది!

యువ : ఏఁవొచ్చేశాయి?

కృ.మూ. : మెల్లిగా అంటారేవిటండీ బాబూ!- చస్తూంటేనూ! తుమ్ములండీ తుమ్ములు! ఏక తుమ్ములు! దానిమీద జలుబూ! ఊపిరాట్టం లేదనుకోండీ! ఏం చెయ్యమంటారు తాతగారూ?

తాత : ఓ అరగంట ఊపిరి పీల్చడం మానెయ్యమనండి - అదే తగ్గుతుంది!

కృ.మూ. : అదెలా కుదురుతుందండీ! చెప్పండీ! దుకాణాలు ఉంటాయా?

యువ : ఉంటే ఏం చేస్తారు?

కృ.మూ. : ఏదైనా మందు కొనుక్కొస్తాను. వెంటనే మందుపడితే మంచిది చూడండి!

యువ : ముందు తక్షణం ఏంచేశారు?

కృ.మూ. : ఏం చెయ్యనూ? స్వెట్టరు తొడుక్కోమన్నాను. తలకి మఫ్లరు చుట్టుకోమన్నాను.

తాత : అబ్బే! అలా అశ్రద్ధ చేయకండి.

కృ.మూ. : అయితే ఇంకేం చెయ్యమంటారు?

తాత : కిటికీ తలుపులన్నీ వేసెయ్యండి. ఒక్క పిసరు గాలి తగిలినా ప్రమాదం

కృ.మూ. : అవునండి - అసలే అర్భకురాలు.

తాత : నాకు తెలియదుటయ్యా! రోజూ చూస్తున్నానుగా, అవునా - గదినిండా సాంబ్రాణి పొగవేసి దీపాలన్నీ వెలిగించెయ్! ఆ తరవాత మందులషాపునుండి మందు కొనుక్కెళ్ళు!

కృ.మూ. : అలాగేనండి! వెళ్లొస్తాను మరి!

యువ : చూడండి! ఇంకో చిన్న జాగ్రత్త తీసుకుంటే ఇంకా మంచిది. మీ యింట్లో గరుడపురాణం వుందా?

తాత : ఇప్పుడప్పుడే కాదులే ఇది - నే చెప్తాగా - ముందు నువ్వు వెళ్ళిరా నాయనా!

కృ.మూ. : ఒస్తానండి మరి!

యువ : అభిమానం అంటే అలాగుండాలి తాతగారూ! నాకే గనక యిలాంటి నాన్నుంటేనా?

తాత : ఉంటే?

యువ : బతుకు యింత కంటె యింకొంచెం రుచిగా ఉండేదేమో!... మానాన్న ఏంచేసేవాడో తెలుసా తాతగారూ! ఇంట్లో ఎవరికైనా కాస్త జబ్బుగా ఉంటే, వెళ్ళి వీధరుగుమీద కూర్చునేవాడు. అమ్మకి జ్వరం వొస్తే కోరి తెచ్చుకున్నావని పట్టుకు తన్నేవాడు.

తాత : సబబుగానే వుంది. జబ్బు తెచ్చుకోవడం నేరం-నేరానికి శిక్ష వేసేవాడు-తప్పేం?

యువ : బాగా చెప్పారు. ఈ ధర్మసూక్ష్మం నాకిన్నాళ్లూ తెలియ లేదు.

తాత : సరే – ఒక్కసారి లోపలికి వెళ్లి పరిస్థితి ఎలా ఉందో చూసొస్తాను, ఇంక వెళ్లి పండుకుంటావా?

యువ : నిద్ర రావడం లేదు. మీరు వెళ్లిరండి. బహుశా మీరు తిరిగి వచ్చేవరకూ యిక్కడే ఉంటానను కుంటాను... చెప్పలేను.

తాత : సరేలే – నిద్రపో! దాన్ని మించిన సుఖంలేదు.

* * * *

యువ : అంటాడు తాతగారు. కాని నిద్ర రావద్దూ! ఆ అమ్మాయి – కృష్ణవేణి – చెప్పినట్లు యిలాంటప్పుడు రెండో ఆటో, లేకుంటే మూడో ఆటో సినిమా చూసి, నడిచి యింటికి వస్తే ఎంతహాయిగా ఉంటుంది! సినిమాకి డబ్బులే ఉంటేనా! ఊ అంతపనీ చేసుండేవాణ్ణి. ఇన్ని కబుర్లూ చెప్పి యీపాటికి గుర్రుపెట్టి నిద్రపోతూ ఉండుంటుంది. ఆ ఇందిర ఎవరోగాని ఆవిడకీ యివాళ నిద్రాభంగం ఉండకూడదు మరి!

* * * *

కృష్ణ : ఇందిరా?

ఇందీ : ఏం కృష్ణవేణీ! రా, లోపలికి రా! ఇంత రాత్రి వేళ వచ్చావేం? ఏదైనా కావాలా?

కృష్ణ : అబ్బే – ఏం తోచకవచ్చాను, నిద్రపోతున్నారా? అమ్మ వంట్లో ఎలా వుందీ?

ఇందీ : అలాగే ఉంది. ఆయాసం పొద్దున్నకంటే ఎక్కువైంది.

కృష్ణ : అయ్యో పాపం! లక్ష్మేదీ?

ఇందీ : అమ్మగదిలో ఉంది. పిలవనా?

లక్ష్మీ : (ప్రవేశిస్తూ) ఏం కృష్ణవేణీ! ఇంకా నిద్రపోలేదేం? పగలల్లా ఆఫీసులో కష్టపడి – మళ్లీ సాయంత్రం అందరికీ వండి వార్చి –

కృష్ణ : ఏవుందీ! మాములు గొడవే! రానురాను బతుకంటే అసహ్యం వేస్తోంది.

లక్ష్మీ : కొత్తగా ఇప్పుడేం వొచ్చిందీ? అన్నయ్య పురాణమేనా?

కృష్ణ : అదే, వాడు సరిగ్గా రెండువందలయేళ్ల క్రితం పుట్టవలసినవాడు. ఆ పొరపాటుకి శిక్ష అనుభవిస్తున్నది నేను. అమ్మ సరేసరి – తన పక్షవాతం జబ్బు తలచుకొని మురిసిపోతూ మంచంమీద ఉంటుంది. మరో ప్రపంచ యుద్ధం ఒస్తేగాని అన్నయ్యకి ఉద్యోగం దొరికేటట్టు లేదు. అంచేత వాడికెందుకో నామీద కసి. నా జీతం అంటే మళ్ళీ అభిమానమే.

ఇందీ : ఊరుకుందూ – వింటాడేమో!

కృష్ణ : లేదులే, పెట్టవలసిన శాపాలన్నీ పెట్టేసి యిప్పుడే నిద్రపోయాడు. మళ్లీ పొద్దున్న కాఫీ వేళకిగాని లేవడు.

లక్ష్మీ : దేనిమీదొచ్చినదీ రభస?

కృష్ణ : ఆఁ– మేడగదిలో ఎవరో ఆయన కొత్తగా దిగలేదూ? ఆయన ప్రసంగం తీసుకొచ్చేసరికి వచ్చింది దుమారం. వాడిగొడవ నాకెందుకంటాడు. అని మళ్ళీ మా పురాణం అంతా ఏకరువు పెట్టి తను సంసారాన్ని పోషించగలిగిన ఉత్తర క్షణం నన్ను ఉద్యోగం మానిపించేస్తానంటాడు.

ఇంది : పోనీ, అప్పటి సంగతి అప్పుడే చూసుకుందాం అనలేక పోయావా?

కృష్ణ : (కోపంగా) అంటానంటాను. అనను మరీ! ఆడవాళ్ళకి సహగమనం మాన్పించారే అని విచారించే మనిషి వాడు... (కంఠం మార్చి)... అంతే ఇందిరా... మనం ఎంత అభిమానంగా చేతులు చాస్తామో అంత స్వార్థంగా వెనక్కు నెట్టేస్తారంతా.

లక్ష్మీ : ఎప్పుడూ యిలాంటి విషయాలు లెక్కచేయకుండా నిబ్బరంగా తిరిగే దానివికదా, యివాళేం యింత బాధపడిపోతున్నావు?

ఇంది : కృష్ణవేణికి ముసలితనం వచ్చేసింది.

కృష్ణ : ఎంత కాలమని పోట్లాడుకురాను చెప్పు లక్ష్మీ! ఏనాటికైనా వాళ్లు నన్ను అర్థం చేసుకోకపోతారా అన్న ఆశతో యిన్నాళ్ళూ నెట్టుకొచ్చాను. అవస్థలు పడుతూనే. కాని, ఇందాకటితో వెన్నెముక విరిగిపోయింది.

ఇంది : అన్నీ మరిచిపోయి హాయిగా నిద్రపోదూ! తెల్లారేసరికి మళ్లీ హాయిగా వుంటావు.

కృష్ణ : ఆశ పూర్తిగా పోయింది. వీళ్లు నా కేమేనా అదృష్టం ఉంటే దాన్ని పెంచుకోనివ్వరు. దురదృష్టాన్ని తుంచుకోనివ్వరు; సగం చచ్చిన నల్లిలా యిలా బతకమంటారు. పై పెచ్చు కుటుంబంకోసం ఆ మాత్రం త్యాగం చెయ్యలేవా అంటారు. ఎవరికి త్యాగం? దేనికి త్యాగం? జల్లెడలో పోసిన నీరు లాగ ఆ త్యాగం గాలిలో హరించి పోతుందిగాని – ఎవరికీ తులమెత్తు లాభం చెయ్యదు.

లక్ష్మీ : ఇందిరా! అమ్మకి నిద్రపట్టిందా?

ఇంది : ఆఁ, కాస్త కన్ను మూసి నిద్రపోయింది.

లక్ష్మీ : అన్నయ్యింకా రాలేదు – ఎంచేతో!

కృష్ణ : అదేఁవిటీ? ఇంత రాత్రయినా రాక పోవడమేమిటీ?

లక్ష్మీ : ఏం చెప్పను! వాడిధోరణి అంతా అదోమాదిరి. ఇంకా మేఁవేనయం. వాడు బొత్తిగా పిరికి. అడుగడుగునా మేమే ధైర్యం చెపుతూ ఉండాలి. నాన్నని తలుచుకొని, అన్యాయంగా జైలు కెళ్లిపోయాడే అని ఏడుస్తాడు. అమ్మని తలుచుకొని బాధపడతాడు. ఇటు మమ్మల్నిద్దరినీ చూసి కన్నీళ్లు కారుస్తాడు. ఎక్కడైనా కాస్త టెంపరరీ ఉద్యోగమైనా దొరుకుతుందేమోనని అలా తిరుగుతున్నాడు.

కృష్ణ : పాపం! ఇంత రాత్రయిందికదా, భోజనం లేకుండా ఎక్కడ తిరుగుతున్నాడో!

ఇంది : లక్ష్మీ! నేను కాస్త వీధి దాకా వెళ్లి చూసిరానా?

లక్ష్మీ : చూసిరా! కాస్త బయటి ప్రపంచమేనా కనబడుతుంది. నేను అమ్మ దగ్గర ఉంటాను.

కృష్ణ : పద ఇందిరా! నేనూ వస్తానూ!

ఇంది : మీ అన్నయ్య కోప్పడరూ?

కృష్ణ : ఏడిశాడు, పద, అంతగా అయితే పీక పిసికేస్తాడు. ఆ పైన ఏమీ చెయ్యలేడుగదా! అదే హాయి. ఈ క్షణాన్న నేను కోరుకుంటున్నదీ అదే.

ఇంది : ఆ లెక్కన నేను ఏనాడో రైలుకింద పడిపోయి ఉండవలసినది. ఇటువంటి వాటికి నేను విరుగుడు కనిపెట్టాను. నువ్వూ అది నేర్చుకో.

కృష్ణ : ఏఁవిటది?

ఇంది : కష్టాలు మరీ ఎక్కువైపోయి, భరించలేనంత దుఃఖంవస్తే – వెంటనే కళ్లు మూసుకొని నిద్రపో; మళ్లీ నువ్వు మేలుకొనేసరికి.

కృష్ణ : కష్టాలు కరిగిపోతాయి?

ఇంది : అలా అనలేదు. కాని, మనస్సు కొంచెం తేరుకుంటుంది. కష్టాన్ని భరించేశక్తి కొంచెం కోలుకుంటుంది.

కృష్ణ : పద – కాస్త బయటి ప్రపంచం యీ రాత్రి ఎలా ఉందో చూద్దాం... మీ అన్నయ్య ఎక్కడ తిరుగుతున్నాడో సుమా.

* * * *

యువ : వీధి యించుమించు నిర్మానుష్యంగా ఉంది. అంతటా ఒంటరితనం, నిస్సహాయం. వీథిలాంతర్లు కూడా భయంగా, జాలిగా వెలుగుతున్నాయి. ఏమిరాత్రి యిది! 'గాలిలో కనరాని గడుసు దెయ్యాలు– భూ దివమ్ముల మధ్య యీదుతున్నాయి' అన్నాడట ఎవరో; అలాగే ఉంది... ఆఖరిసారి భోంచేసి ఎన్నాళ్లయింది చెప్మా! రెండురోజులయుంటుంది. ఇలా ఎన్నాళ్లు గడుస్తుంది?... ఏమో ఎవరికి తెలుసు? ఎవరో నన్ను ఓడించేశారు. మరి నెగ్గడం అసంభవం. చేతులు జోడించి నమస్కరించి, చల్లగా తప్పుకోవడమే మంచిది.

తాత : ఇంకా ఇక్కడ పచార్లు చేస్తున్నావా నాయనా?... ఏం అలా ఉలిక్కిపడ్డావ్?

యువ : మీరా? ఏఁవిటో పరాగ్గా ఉన్నాను. రండి తాతగారూ – రండి, ఎలా ఉంది యింట్లో?

తాత : బయట ఎలా ఉందో యింట్లోనూ అచ్చు అలాగే ఉంది. నువ్వు వినలేదా?

యువ : లేదే! ఏమిటీ?

తాత : (వ్యంగ్యంగా) ఏఁవిటేఁవిటి వెర్రివాడా! కొత్తసృష్టి నవజీవన చైతన్యం! మా కోడలు ప్రసవించింది. ఆడపిల్ల. ఏడుపు వినలేదూ? మేడ పునాదులు కదలిపోయేటట్టు ఏడుస్తోంది నాయనా!

యువ : ఎంత ఆశ్చర్యం!

తాత : ఏఁవిటాశ్చర్యం?

యువ : మేడలో జనాభా ఉన్నట్టుండి హఠాత్తుగా పెరిగిందన్నమాట!

తాత : మరేఁ... ఎవరా చీకట్లో?

ఇంది : నేనండీ తాతగారూ! ఇందిరని... నేనూ, కృష్ణవేణీనీ...

కృష్ణ : జనాభా అంటున్నారేఁవిటి?

యువ : తాతగారికి మనఁవరాలు పుట్టిందట... మీ పేరు నిజంగా కృష్ణవేణేనా!

కృష్ణ : నిజమే. అదే నా పేరు – ఏం?

ఇంది : మా అన్నయ్యగాని కనబడ్డాడా తాతగారూ?

తాత : లేదమ్మా! ఇంకా యింటికి రాలే?

ఇంది : రాలేదండి!... పొద్దున్ననగా యిల్లు విడిచి వెళ్లాడు. ఏఁవిటో, కంగారుగా ఉంది.

తాత : భయపడకమ్మా! వస్తాడులే!

యువ : ఎలాగుంటాడండీ మీ అన్నయ్య?

ఇంది : సన్నగా పొడుగ్గా ఉంటాడు – కళ్లలో ఎప్పుడూ భయం పెట్టుకుని ఏం?

యువ : ఆఁ, ఏం లేదు. చూస్తే పోల్చుకుందికి అడిగాను.

ఇంది : మీరేనాండి మేడగది అద్దెకి తీసుకుంది?

యువ : అవునండి.

ఇంది : మీ గది గోడల నిండా బొమ్మలు వేలాడ దీశారే? అవన్నీ మీరు రాసినవేనా?

యువ : అవన్నీ నేను సృష్టించిన పాపాలేనండి.అందుకే యిప్పుడు విచారిస్తున్నాను.

కృష్ణ : విచారం దేనికి?

యువ : బొమ్మలు రాయడం బదులు పకోడీల దుకాణం పెట్టుకున్నా బాగుండిపోవునని. ఇంతకన్నా హాయిగా బతికి ఉందును.

కృష్ణ : ఓహో! అయితే మీరూ మా ముఠాలో వాళ్లేనన్నమాట. కాదనుకున్నాను.

యువ : ఎంచేత అనుకున్నారూ?

కృష్ణ : ఏమో – కారణం చెప్పలేను. అన్నిటికీ కారణాలు చెప్పగలమా?... మీరు బొమ్మలు ఎందుకు వేస్తారో చెప్పగలరా?

యువ : ఆఁ. ఈ ప్రపంచంలో ఏది చూచినా నాకు బాధాకరంగానే కనిపిస్తుంది. ఆ బాధ నలుగురూ పంచుకుంటే అందరం కలిసి ఏమైనా చెయ్యగల మేమోనని ఆశ. అవన్నీ బొమ్మలు వేసి చూపిస్తాను అందుకే.

తాత : వెర్రినాయనవి. అలాంటివి మానెయ్. అందరూ ఝుడుసుకుంటారు. మనుషుల్లోని మంచినీ, లోకంలోని ఆనందాన్నీ బొమ్మలు వేసి చూపించు – చేతనయితే.

ఇంది : ఆయన బొమ్మలు కిటికీలోంచి తొంగిచూస్తే నాకు అలాగే అనిపించింది... ఆర్టిస్టుగారూ! మరిచిపోయిన ఆశల్ని నూతనంగా జ్ఞాపకంచేసే బొమ్మల్ని వేయగలరా?

యువ : అందుకు నాలో కొన్ని ఆశలుండాలిగదా!

**ఇంది** : మీలో ఏ ఆశలూ లేవా?

**యువ** : లేవు. ఈ రాత్రితో అన్ని ఆశలూ హరించుకు పోయాయి. ఇక నిలబడే శక్తి లేదు. వెళ్ళి పోవాలని ఉంది.

**తాత** : ఎక్కడికి?

**యువ** : అవతలిగట్టుకి.

**కృష్ణ** : నాకూ అలాగే అనిపిస్తోంది. ఎవరైనా సహాయం చేస్తే బాగుండును.

**తాత** : ఇక్కడికి యిద్దరయారు. నువ్వు ఇందిరా?

**ఇంది** : అన్నయ్య రాగానే నాకు నిద్రపోవాలని ఉంది.

**యువ** : తాతగారూ! ఆ... అటు చూడండి... ఎదురుగా ఆ లాంతరు స్తంభంపక్క నీడలా!

**తాత** : నీడ అయుంటుంది!

**యువ** : నీడవెనుక వస్తువుండాలి కదా! గంట నించీ చూస్తున్నాను. నాకేమిటో చిత్రంగా వుంది. అదేమిటో వెళ్లి చూద్దాంవా?

(మోటారుకారు అకస్మాత్తుగా బ్రేక్ వేసి ఆగిన చప్పుడు.)

**యువ**
**ఇంది** : అరె! అరె! ఏంవిటది!
**కృష్ణ**

**తాత** : ఏక్సిడెంటులా ఉంది! వెళదాం పదండి!

(పదండి! పదండి! పాపం! ఎంతపని!' అనుకుంటూ వెళతారు.)

**తాత** : ఎవరదీ! కారువాడు పారిపోయాడే!

**ఇంది** : అయ్యో! అయ్యో! మా అన్నయ్య తాతగారూ!

**కృష్ణ** : మీ అన్నయ్యా?

**యువ** : ఎంతపనీ!

**ఇంది** : అన్నయ్యా! మాటాడవేం అన్నయ్యా! (గట్టిగా, భయంగా) అన్నయ్యా!

**తాత** : భయం లేదమ్మా! ఉండు. ఏం నాయనా?

**అన్న** : (నెమ్మదిగా) భయం లేదు ఇందిరా. దెబ్బ తగలలేదులే. నడుం బెణికింది, అంతే. కారుకి తగలలేదు. ఇవతలే పడిపోయాను.

**తాత** : నెమ్మదిగా లేచి రెండడుగులు వెయ్యి, నాయనా!... నువ్వు కొంచెం చెయ్యి అందించు... ఇక్కడ యీ పచ్చికమీద కాస్సేపు కూర్చుందాం రండి!

**ఇంది** : ఏంవిటన్నయ్యా యిదంతా?

**అన్న** : చెడిపోయింది. అంతా చెడిపోయింది. ఆ కారుకింద పడి హాయిగా చచ్చిపోదాం అనుకున్నాను. ఫలించలేదు. వెంట్రుకవాసిలో తప్పిపోయింది... ఇంకోమారు ప్రయత్నించి చూస్తాను.

**తాత** : ఉద్ధరిస్తావ్.

**కృష్ణ** : అక్కడికి మీతో యిద్దరం అవుతాం. నేనూ అలాంటి పని చేద్దామనే వీధిలోకి వచ్చాను.

**యువ** : ఇద్దరు కాదు ముగ్గురం – ఇందాకటినుంచి నా ప్రయత్నమూ అదే.

**తాత** : పరమేశ్వరా! ఏఁవి మేళం యిది! ఏఁవొచ్చింది యీ రాత్రి మీ అందరికీ?

**అన్న** : ఇంకా ఏం రావాలి తాతగారూ? మా కుటుంబం సంగతి తెలీదా మీకు?

**కృష్ణ** : తాతగారికి నా సంగతి తెలుసు.

**యువ** : నా సంగతి ఎవరికీ తెలీకపోయినా, నాకు బాగా తెలుసు.

**తాత** : తెలుసు నాయనా తెలుసు, మీ అందరి సంగతీ తెలుసు. ఈ నాలుగుముక్కలూ వినండి. మీరంతా జీవితంలో దగాపడ్డ తమ్ముళ్ళూ చెల్లెళ్లున్నూ. బతకడం అంటే మీకు భయంగా ఉంది. మనవన్నీ చల్లారి పోయిన సంసారాలు. అవును. అంతమాత్రం చేత?

**అన్న** : పరిస్థితులన్నీ ఒక్కసారి చీకటయిపోతే ఏం చెయ్యాలి తాతగారూ?

**తాత** : వెర్రివాడా, చావడానికి లక్ష కారణాలుంటే బతకడానికి కోటి కారణాలుంటాయి. నా సంగతే తీసుకోండి. గంపెడు సంసారం. అందరూ మూర్ఖులు, స్వార్థపరులూ, జబ్బులు, అన్నీ సమస్యలే. కాని – కాని– ఏది ఏమైనా బతకడంలో ఎంతో మాధుర్యం ఉంది నాయనా! లోకాన్ని పోల్చుకోండి. మీలోని జీవన వాంఛని పోల్చుకోండి. ముందు మీకందరికీ కావలసింది ధైర్యం. మనలో ఏ వొక్కరి కుటుంబం తీసుకొన్నా నికృష్టంగానే ఉంది. అంతమాత్రాన మనల్ని మనమే అసహ్యించుకుంటామా? జీవితంలోని ఆనందాన్ని పోల్చుకుందుకీ, దుఃఖాన్ని సానుభూతితో చూడడానికీ ప్రయత్నించండి. నిస్సహాయతని అసహ్యించుకొనే మనుషులున్నారు లోకంలో. మీరూ అలాగే అయిపోకండి. బిచ్చగాడిని వాడి దారిద్ర్యానికీ, పిల్లవాడిని వాడి తల్లి తండ్రుల మూర్ఖత్వానికీ నిందించకండి.

**కృష్ణ** : అయితే బతికి చూడమంటారు.

**తాత** : విధిగా! – కుర్రవాళ్లు – పడుచు తనంలో ఉన్నారు.

**అన్న** : మీరు యిన్నేళ్లు బతికారుగదా! మీరు అనుభవించిన ఆనందం ఏమిటి?

**తాత** : బోలెడంత! – వర్షాకాలం గొడుగేసుకుంటే ఆనందం. ఎండాకాలం చన్నీళ్లు స్నానంచేస్తే ఆనందం. శీతాకాలం దుప్పటి కప్పుకుంటే ఆనందం. బతకండి నాయనా!... అబ్బాయీ, నువ్వు బొమ్మలు వేస్తావుకదూ? వెయ్యి. లోకంలో నువ్వు చూసిన ఆనందాన్ని, సుఖాన్ని, మనిషిలోని మంచినీ – బొమ్మలుగా చిత్రించు. కృష్ణవేణీ! ఇందిరా! మీరిద్దరూ మీలోని స్త్రీత్వానికి సాఫల్యాన్ని కలిగించుకోండి. ఎవరికీ, దేనికీ భయపడకండి. మీరు వినవలసిన పాటలు ఇంకెన్నున్నాయో చూడండి.

**కృష్ణ** : నిజమేనండి.

**తాత** : అవును మీకందరికీ బతకడం నేర్పుతా నుండండి.

('కాఫీ, కాఫీ' అంటూ గంట వాయించుకుంటూ మనిషి)

**తాత** : ఏయ్ అబ్బీ! కాఫీ ఎంత?

**అబ్బీ** : అణా బాబూ.

**తాత** : అందరికీ తలకో గ్లాసు ఇయ్యి... తాగండి అందరూ - తాగారా? ఇప్పుడెలా ఉంది?

**కృష్ణ** : ఇలా తెల్లారు ఝామున రోడ్డుమీద లాంతరు కాఫీ ఎప్పుడూ తాగలేదు! ఎంత బాగుంది! నీళ్ళ కాఫీయే అనుకోండి, అయితేనేం - ఇలా తాగడం బాగుంది.

**ఇంది** : మరే! ఎందుకో ప్రాణం లేచి వచ్చింది. మీరు గొప్పవాళ్లు తాతగారూ.

**తాత** : చూశారా మరి! మనిషికొక్క అణాతో అందరికీ మళ్లీ ఎంత ఆశ వచ్చిందో!

**కృష్ణ** : మరిచిపోయిన ఆశలు మళ్ళీ జ్ఞాపకం వొస్తున్నాయి... తెల్లవారుతోంది.

**యువ** : ఇంకో కొత్త ప్రభాతం

## అభ్యాసం

### I. ప్రశ్నలు

1. 'ఆశఖరీదు అణా' నాటిక సారాంశాన్ని రాయండి.
2. 'ఆశఖరీదు అణా' లో తాత పాత్ర స్వభావం వివరించండి.
3. 'ఆశఖరీదు అణా' లో కృష్ణవేణి పాత్ర స్వభావాన్ని విశ్లేషించండి.

**కార్యాచరణ:**

జీవించడంలో ఉండే ఆనందం గురించి ఈ నాటకంలోని తాత కొన్ని విషయాలను ప్రస్తావించాడు. అవికాక, అధ్యాపకులు విద్యార్థుల నుండి మరికొన్ని అంశాలనుకూడా చెప్పించగలరు.

❖ ❖ ❖

# ఇంటర్మీడియట్ - రెండవ సంవత్సరం

## ద్వితీయ భాష - భాగం 2

## తెలుగు - మాదిరి ప్రశ్న పత్రం

సమయం : 3 గంటలు | మార్కులు : 100

**గమనిక : ప్రశ్న పత్రం ప్రకారం సమాధానాలను వరుస క్రమంలో రాయాలి.**

**I.** ఈ క్రింది పద్యాలలో ఒక దానికి ప్రతిపదార్థ, తాత్పర్యాలను రాయండి — 1x8=8

1. నుతజల పూరితంబులగు నూతులు నూఱిటి కంటె సూనృత
వ్రత! యొక బావి మేలు; మఱి బావులు నూఱిటికంటె నొక్క స
త్క్రతువది మేలు; తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు; త
త్సుత శతంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్

2. ఉన్నాఁడు లెస్స రాఘవుఁ
డున్నాఁడిదె కపులఁగూడి, యురుగతి రానై
యున్నాడు, నిన్ను గొని పో
నున్నాఁడిది నిజము నమ్ము ముర్వీతనయా!

**II.** క్రింది ప్రశ్నలలో ఒక దానికి 20 పంక్తులలో సమాధానం రాయండి — 1x6=6

1. 'శాంతి కాంక్ష' పాఠ్యభాగ సారాంశాన్ని వివరించండి.
2. సమాజంలో వచ్చిన మార్పుల పట్ల అద్దేపల్లికి కలిగిన ఆవేదనను తెల్పండి.

**III.** క్రింది ప్రశ్నలలో ఒక దానికి 20 పంక్తులలో సమాధానం రాయండి — 1x6=6

1. పూర్వపు తెలుగు వారి ఆటలను వివరించండి.
2. అర్థ సంకోచ, అర్థ వ్యాకోచాల గురించి తెల్పండి.

**IV.** క్రింది ప్రశ్నలలో రెండింటికి 15 పంక్తులలో సమాధానం రాయండి — 2x5=10

1. 'గవేషణ' నాటిక సారాంశాన్ని తెల్పండి
3. 'ఆశ ఖరీదు అణా' నాటిక సారాంశాన్ని రాయండి.
2. 'తెరచిన కళ్ళు' నాటికలో డాక్టరు పాత్ర స్వభావాన్ని తెలియ చేయండి.
4. 'ఆశ ఖరీదు అణా' లో కృష్ణవేణి పాత్ర స్వభావాన్ని విశ్లేషించండి.

**V.** క్రింది వానిలో రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి — 2x3=6

1. దొంగిలి కొనిపోవదగునె దొరలకు నెందున్
2. పోరు మంచిది గాదు భూమినెక్కడను
3. కోకిల మేధం సాగుతున్నది
4. రాజునేలే దైవముండడొ?

**VI. క్రింది ప్రశ్నలలో <u>రెండింటికి</u> సంక్షిప్త సమాధానాలు రాయండి** 2x3=6

1. స్వాతంత్ర్య హీనులు ఎలా ఉంటారని భట్టు తెలిపాడు?
2. కన్యక ప్రజలకిచ్చిన సందేశమేమిటి?
3. సత్యవాక్యం వేటికంటే గొప్పది?
4. మనిషి జీవితం వస్తువులా ఎలా మారిపోతూఉంది?

**VII. క్రింది ప్రశ్నలలో <u>రెండింటికి</u> సంక్షిప్త సమాధానాలు రాయండి** 2x3=6

1. ఖడ్గ తిక్కనకు సంబంధించిన చాటు వృత్తాంతాన్ని తెల్పండి.
2. చిలకమర్తి తెలిపిన ఆనాటి పన్నులను పేర్కొనండి.
3. చదరంగం గురించి రాయండి.
4. రావూరి భరద్వాజకు చదువు పట్ల ఆసక్తిని కల్గించిన సంఘటనను తెల్పండి.

**VIII. క్రింది ప్రశ్నలన్నింటికి ఒక్కొక్క వాక్యంలో సమాధానం రాయండి** 6x1=6

1. బ్రహ్మనాయుడు ఎవరి మంత్రి?
2. గురజాడ రచించిన ప్రసిద్ధ నాటకం పేరేమిటి?
3. శకుంతలను పెంచిన తండ్రి ఎవరు?
4. కర్మభూమిలో పూసిన ఓ పువ్వా! పాట రచయిత ఎవరు?
5. అమ్మతనం ముందు ఏది ఓడిపోతుంది?

**IX. క్రింది ప్రశ్నలన్నింటికి ఒక్కొక్క వాక్యంలో సమాధానాలు రాయండి?** 1x6=6

1. ప్రాచీన నాటకాలలోని హాస్య పాత్ర ఏది?
2. చాటువులను వెలుగులోనికి తెచ్చిన వారెవరు?
3. గుర్రపు స్వారిలో ఉద్దండుడైన రెడ్డి రాజు ఎవరు?
4. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా వచ్చిన ఉద్యమమేది?
5. స్ఫూర్తిశ్రీ అసలు పేరేమిటి?
6. 'పాకుడురాళ్లు' నవలా రచయిత ఎవరు?

**X. క్రింది ప్రశ్నలన్నింటికి ఒక్కొక్క వాక్యంలో సమాధానాలు రాయండి** 5x1=5

1. నైలునది ప్రపంచంలో పొడవైన నది – దీనిలోని నామవాచకాన్ని గుర్తించండి?
2. అవ్యయం అంటే ఏమిటి?
3. దేవదత్తుడు వంట చేశాడు – ఇందులో క్రియ ఏది?
4. విశేషణానికి ఉదాహరణ రాయండి?
5. సర్వనామం అంటే ఏమిటి?

**XI. క్రింది ప్రశ్నలన్నింటికి ఒక్కొక్క వాక్యంలో సమాధానాలు రాయండి?** 5x1=5

1. వాక్యాలు స్థూలంగా ఎన్ని రకాలు?
2. అరుణ్ ఇంటికి వెళ్ళి వంట చేశాడు – ఇది ఏ రకమైన వాక్యం?

3. సామాన్య వాక్యానికి ఉదాహరణ ఇవ్వండి?

4. రెండు సమ ప్రాధాన్యం గల వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడితే అది ఏ వాక్యం?

5. వాక్యానికి ఉండే లక్షణాలేమిటి?

**XII. క్రింది వానిలో ఒక దానికి లక్షణాలు తెలిపి ఉదాహరణతో సమన్వయించండి?** 1x6=6

1. చంపకమాల 2. ముత్యాలసరం 3. తేటగీతి

**XIII. క్రింది ప్రశ్నలన్నింటికి ఒక్కొక్క వాక్యంలో సమాధానాలు రాయండి?** 6x1=6

1. మత్తేభంలోని గణాలు ఏవి?

2. ఉత్పలమాల పద్యంలో ఎన్నో అక్షరానికి యతి స్థానం ఉంటుంది?

3. సీస పద్యానికి అనుబంధంగా ఏ పద్యం రాస్తారు?

4. కంద పద్యంలో వాడే గణాలేవి?

5. ఇంద్ర గణాలేవి?

6. ప్రాస అంటే ఏమిటి?

**XIV. క్రింది వానిలో ఒక దానికి లక్షణాలు తెలిపి, ఉదాహరణతో సమన్వయించండి** 1x6=6

1. వృత్త్యనుప్రాస 2. అర్థాంతరన్యాసం 3. ఉపమ

**XV. క్రింది ప్రశ్నలన్నింటికి ఒక్కొక్క వాక్యంలో సమాధానం రాయండి** 6x1=6

1. అమ్మ చూపించే ప్రేమ ప్రేమ – ఇందులోని అలంకారమేది?

2. ఉపమేయం అంటే ఏమిటి?

3. అంత్యానుప్రాసకు ఒక ఉదాహరణ రాయండి.

4. శబ్దాలంకారం అంటే ఏమిటి?

5. ఆలయ గోపురాలు ఆకాశాన్ని తాకుతున్నాయి – దీనిలోని అలంకారమేది?

6. వలె, పోలె, అట్లు, లాగ – ఈ పదాలను ఏమంటారు?

**XVI. క్రింది గద్యాన్ని 1/3 వంతుకు సంక్షిప్తీకరించండి.** 1x6=6

భారతదేశం అణ్వస్త్ర దేశంగా ఎదగడానికి మూలకారకుడు డా|| ఎ.పి.జె. అబ్దుల్ కలామ్. భారత రత్నగా, భారత క్షిపణి పితామహుడుగా, దేశంలో అత్యున్నతమైన రాష్ట్రపతి పదవిని అలంకరించిన అబ్దుల్ కలామ్ విద్యార్థి దశలో సగటు విద్యార్థి. మంచి అలవాట్లతో, కచ్చితమైన క్రమశిక్షణను పాటించడం వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించాడు. తల్లిదండ్రులనే కాక స్త్రీలను, గురువులను, ఇతర పెద్దలను గౌరవించాడు. తాను ముస్లిం మతానికి చెందినవాడైనా; హిందూ, క్రైస్తవ, సిక్కు వంటి సర్వమతాలను ఆదరించిన లౌకికవాది. పుస్తకాలను అమితంగా ఇష్టపడే అబ్దుల్ కలామ్ ఎన్నోగ్రంథాలను రచించాడు. ప్రతి విద్యార్థి కలలు కని, వాటిని సాకారం చేసుకోవాలని; చిన్న చిన్న లక్ష్యాలు నేరమని విద్యార్థులకు సందేశమిచ్చాడు. వీరి జన్మదినమైన అక్టోబరు 15వ తేదీని 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం'గా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.

❖ ❖ ❖